RNI No. APTEL/2003/12253

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 18 Issue No. 1 Monthly January 2021 ISSN No. : 2456-4702 Rs. : 15/-



ఆచార్య చల్లా రాధాకృష్ణశర్మ

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 18 - Issue. 1 - January 2021 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

ఆచార్య చల్లా రాధాకృష్ణ శర్మ

తెలుగు సాహిత్యంలో అనేకమంది కవులు, రచయితలు ఉన్నారు. వారందరిలో చల్లా రాధాకృష్ణశర్మ ఉత్తములు. ఈయన కృష్ణా జిల్లా సోమవరప్పాడు గ్రామ వాస్తవ్యులైన చల్లా లక్ష్మీనారాయణశర్మ, యశోదమ్మ దంపతులకు 06.01.1929వ సంవత్సరంలో జన్మించారు. అనేక ప్రాంతాలలో ఉపాధ్యాయ వృత్తి చేపట్టి మధురై కామరాజు విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా పనిచేశారు. అనువాద సాహిత్యంలో అపారమైన అనుభవం కలిగి ఉండటం వలన చల్లా రాధాకృష్ణశర్మ గారికి 'ద్రావిడ సాహిత్య సేతువు' అనే బిరుదు వచ్చింది. ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలో చల్లా రాధాకృష్ణశర్మ గారు రచించిన ప్రక్రియలేదని చెప్పవచ్చు. ఈయన తెలుగు సాహిత్యాన్ని తమిళులకి, తమిళ సాహిత్యాన్ని తెలుగు వారికి అందించి ఈ రెండు భాషల మధ్య వారధిగా నిలిచారు.

చల్లా రాధాకృష్ణశర్మ గారికి కన్నడ, మలయాళ భాషలలో కూడా ప్రవేశం ఉంది. శర్మ గారు బాల్య వయస్సు నుండి రచనలు చేయటం ప్రారంభించి మరణించేంత వరకు రచనలు సాగించారు. రచనలు చేయకుండా జీవించలేని మానవుని వేదనను శర్మగారిలో మనం చూడవచ్చు. శర్మ గారి రచనలలో సాంఘికాభివృద్ధి స్వేచ్ఛ, సమానత్వాలు ప్రధాన విషయాలుగా ఉంటాయి. శర్మ గారు రచించిన "ఆర్తి గీతాలు" కవిత్వంలో మానవతా దృష్టి గల 28 తాత్విక గీతాలు అద్భుతంగా రచించారు. 'శ్రమలో స్వర్గము' అనే కవితా సంపుటిలో సామాన్య మానవుల కష్టసుఖాలు, వారి జీవన విధానశైలి గురించి కళ్ళకు కట్టే విధంగా చిత్రీకరించారు. తమిళ పంచకావ్యాలలో ముఖ్యమైనది 'మణికుంభం' దీనిని ఎందరో పండితులు తెలుగు భాషలోకి అనువదించారు. అయినప్పటికి శర్మ గారు అనువదించిన 'మణికుంభం' మాత్రమే తగిన ప్రాచుర్యాన్ని సంతరించుకున్నది. వివిధ ప్రధాన భాషలలో ఉండే రామాయణ విషయాలను ఎన్నుకుని తులనాత్మక పరిశీలన గావించి అద్భుతంగా రామాయణ వ్యాసాలు రచించారు. తెలుగు తమిళ భాషల మధ్య తారతమ్యాలను వివరిస్తూ చల్లా రాధాకృష్ణ శర్మ గారు సాహిత్య సమారాధన చేశారు.

ఈ విధంగా చల్లా రాధాకృష్ణశర్మ గారు 105 గ్రంథాలను వెలువరించినప్పటికీ నేటికి కొన్ని గ్రంథాలు అందుబాటులో లేవు. శర్మ గారి గ్రంథాలు ఏ ప్రాంతంలోనైనా లభ్యమైతే భావవీణ మాస పత్రిక నిర్వాహకులైన డాక్టర్ బి. వెంకటస్వామి గారికి సమాచారం ఇవ్వవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

- సంపాదకవర్గం

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

Contents (విషయ సూచిక)

1. మెదక్ జిల్లా కవుల సంస్కృతి సాహిత్యాల విశిష్టత	- బి.చంద్రశేఖర శర్మ	5
2. జాతర్లలో ప్రదర్శించే యక్షగాన రామాయణాలు	- బాలమణి	12
3. తెలుగు దళిత సాహిత్యంలో నిజమైన సందేశకుడు జి.కే.	- చిలుక భాస్కర్	16
4. తెలుగు సాహిత్యంలో హేతువాద ఛాయలు	- డా॥. బశెట్టి ఉపేంద్ర	20
5. ఎం.ఆర్.అరుణ కుమారి గారి కథలలో స్త్రీ చైతన్యం	- డా॥. ఇ. కోనప్రభ	23
6. జాతి గర్వించదగ్గ కవి "తుమ్మల"	- డా॥. కె.లక్ష్మీనారాయణ	27
7. మహాత్మ కథ	- కొప్పోలురెడ్డి శేఖర్‌రెడ్డి	30
8. తెలుగు చలన చిత్రాల్లో దళిత కథలు, పాత్రలు, కథనం	- కృష్ణ శంకర్ కుసుమ	33
9. రాయలసీమ కథా పరిణామం - పరిశీలన	- డాక్టర్ ఎం. హరికృష్ణ	38
10. అనుభూతి వాదిగా తిలక్	- ఎరుగుపల్లి బలరామ్	45
11. సామెతల్లో వ్యవసాయక సంస్కృతి	- డా॥. కొప్ప సుభాష్ చంద్రబోస్	48
12. గురజాడ అప్పారావు రచనల్లో సంఘ సంస్కరణలు-అంతర్లీనత	- డా॥. డి. సహదేవుడు	51
13. చిత్తూరు జిల్లా జానపదుల దైవ సంబంధ నమ్మకాలు	- కె. మహేష్	55
14. బోయ జంగయ్య రచనలు - అభ్యుదయ భావాలు	- కళ్యాణం అన్నపూర్ణ	59
15. 'ఆమె వితంతువు కాదు' నవల - సామాజిక చిత్రణ	- కటుకం శారద	66
16. పరిశోధనలకు దశ-దిశల్ని నిర్దేశించిన ఖండవల్లి లక్ష్మీరంజనం	- కిరణ్మాయి	71
17. తెలుగు నవల్లలో గిరిజన సాంస్కృతిక అంశాలు	- యం. మహేంద్రనాయక్	76
18. తెలంగాణ జాతీయాలు - భాష	- రాగుల సుధాకర్	79
19. గిరిజన కథలు - జన జీవన చిత్రణ	- రాసుకచ్చుల రమాదేవి	83
20. అయ్యగారి శ్రీనివాసరావు గారి కథలు - సామాజిక విశ్లేషణ	- సేపేని రామస్వామి	89
21. దాశరథి రంగాచార్య నవలలు - వామపక్షభావాలు	- పి. రమేష్	92
22. ధార్మికకేంద్రాలు - దేవాలయాలు	- వి. వింధ్యవాసినీ దేవి	97
23. బోయి జంగయ్య రచనల్లో - తాత్విక దృక్పథం	- మమతా కురెళ్ల	99
24. సురభి చరిత్ర - సాంప్రదాయ ప్రదర్శకులు	- గుంతేటి నవీన్	104
25. జానపద కళారూపాలు - ప్రార్థన గీతాలు	- డా॥. శ్రీమంతుల దామోదర్	110
26. అట్టాడ అప్పల్నాయుడు ఉత్తరాంధ్ర కథా సాహిత్యం	- మునకాల ధనలక్ష్మి	112
27. గ్రామ దేవత కలికిరి ఎల్లమ్మ తిరునాళ్ళు	- డా॥. పి. కుమారి నీరజ	116
28. క్రీడాభిరామం - సమకాలీన సాంఘిక జీవనం	- డా॥. వి. పళని	123
29. ఆదివాసీల ఆహారపు పానీయాలు	- డా॥. పెండ్యాల లావణ్య & - డా॥. పి. శాంతి	128
30. కాళోజీ కవిత్వం - సామాజిక దృక్పథం	- డా॥. భూక్య తిరుపతి	136
31. Econamic and Political Conditions of Backward Classes	- Dr. Ramu Lagishetti	141
32. Performativity and performance and complexities	- Pattepu Sailu	146

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావ వీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మెదక్ జిల్లా కవుల సంస్కృతి సాహిత్యాల విశిష్టత

- ఐ.చంద్రశేఖర శర్మ

'కోటి రతనాలవీణ' గా పేరొందిన తెలంగాణములోని జిల్లాలలో మెదకు జిల్లాకు సాంఘిక, సాంస్కృతిక, చారిత్రక, రాజకీయ, విద్యారంగాలలో విశిష్ట స్థానముంది. ఇతరమైన జిల్లాలతో ప్రత్యక్షసామీప్య సంబంధము కలిగి, భౌగోళికంగా తెలంగాణా నేలనొకటిగా కలుపుతున్న జిల్లా 'మెదక్' మాత్రమే తప్ప మరొకటి లేదు. అన్ని జాతుల వారికి, విభిన్న మతసంస్కృతులకు, భాషా సంప్రదాయాలకు, ఆటపట్టై మేటికలయికగా రూపుదిద్దుకొన్నది. ఈనాటికి మెదకు జిల్లా పాలిమేరలలో త్రిభాషా సమ్మిళితమగు భాష వాడుక భాషగానున్నది. సహజ సిద్ధమగు ప్రకృతి వనరులతో స్వయంసమృద్ధి, గలిగి నాలుగు జిల్లాల వారికి త్రాగు నీటిని, తినుతిండిని సమకూరుస్తూ 'మెతుకు సీమగా' పేరుగాంచింది.

గతము లేకుంటే వర్తమానానికి చోటుండదు. భవిష్యత్తును భూతంగా మార్చేశక్తి వర్తమానానికే వుంది. అదే శాశ్వత భవిష్యత్తుకు మూల బీజమౌతుంది. అంటే గత చరిత్రకు ఎంత ప్రాముఖ్యతగలదో తెలుస్తోంది. మెదక్ జిల్లాకు ఉత్తరాన నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలు, తూర్పున వరంగల్, నల్లగొండ జిల్లాలు, దక్షిణాన హైదరాబాద్, పశ్చిమంలో కర్ణాటక రాష్ట్రంలోనే బీదర్ జిల్లా సరిహద్దులుగా ఉన్నాయి. జిల్లా వైశాల్యం 9699 చదరపు కిలో మీటర్లు. ఇవి రాష్ట్ర వైశాల్యంలో 3.48 శాతం. మెదక్ జిల్లా జనాభా రాష్ట్ర జనాభాలో 2.16 శాతం ఉంటుంది. ఈనాటి మెదక్ జిల్లా ఆకృతి వెనుక ఎన్నో మలుపులు ఉన్నాయి. 1901 లో జిల్లాలో ఆరు తాలూకాలే ఉండేవి. అవి మెదక్, రామాయం పేట, భగట్, కలబ్ గర్, అందోలు, టేకుమాల. అటు తర్వాత మార్పు చేర్పుల్లో సిద్ధిపేట కొత్తగా చేరింది. హైదరాబాద్ జిల్లాను ఏర్పర్చడంతో ఆ మార్పుల ప్రభావం మెదక్ జిల్లా పై కూడా పడి నర్సాపూర్, గజ్వేల్ తాలూకాలేర్పడ్డాయి. 1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరిగినపడు జహీరాబాద్, నారాయణ ఖేడ్ తాలూకాలను కర్ణాటక నుండి కలిపారు. దీని వల్ల సంగారెడ్డి కేంద్రంగా మెదక్, గజ్వేల్, నర్సాపూర్. సిద్ధిపేట, ఆందోల్, నారాయణ్ ఖేడ్, జహీరాబాద్ తాలుకాలతో మెదక్ జిల్లాకు ఒక రూపం ఏర్పడింది. తాలూకాలను రద్దు చేసి మండలాల వ్యవస్థను ప్రవేశ పెట్టడంతో అంతో ఇంతో పెద్ద ఊళ్ళన్నీ మండలాలుగా ఎదిగి పోయారు. ప్రస్తుతం జిల్లాలో 45 మండల కేంద్రాలు పాలనా యంత్రాంగంతో ముడిపడి ఉన్నాయి. అవి కంగ్టి, కల్హేర్, నారాయణ ఖేడ్, మనూర్, రేగోడ్, శంకరం పేట, వెల్దుర్తి, చేగుంట, మిడిదొడ్డి, దుబ్బాక, సిద్ధిపేట, చిన్నకోడూరు, నంగునూరు, కొండపాక, జగదేవ్ పూర్, గజ్వేల్, దౌల్తాబాద్, వర్గల్, ములుగు, తూఫ్రాన్, శివంపేట, జిన్నారం, నర్సాపూర్ కౌడిపల్లి, హత్నూర, రామచంద్రాపురం, సంగారెడ్డి, కొండాపూర్, సదాశివపేట, మునిపల్లి, కోహీర్, జహీరాబాద్, రాయికోడ్, న్యాలకల్ మొదలైనవి.

ప్రధానిని పార్లమెంట్ కు పంపిన ఘనత మెదక్ జిల్లాదే. 1980 లోక్ సభ సార్వత్రిక ఎన్నికల్లో స్వర్గీయ ఇందిరాగాంధీ మెదక్ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యారు. కేవల్ కిషన్ వంటి కమ్యూనిష్టు నాయకులు మెదక్ జిల్లాలోనే గతంలో ఎదిగారు. 'అపరచాణిక్య' అని ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీర్తి సాధించిన బి.వి రాజు సిద్ధిపేట నుండి శాసనసభకు ఎన్నికయ్యారు. వరుసగా శాసన సభకు ఎన్నికకావడంలో మెదక్ ఎం.పి శ్రీ బాగారెడ్డి గత రికార్డుల్ని బద్ధలు కొట్టారు. టంగుటూరు అంజయ్య రామాయంపేట, నుండి ఎన్నికై ముఖ్యమంత్రి పదవి నిర్వహించారు. ఇంకా శ్రీ నంది ఎల్లయ్య, ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు, రామచంద్రారెడ్డి, విఠల్ రెడ్డి వంటి వారే

ఈనాడు రాష్ట్ర రాజకీయాల్లో వివిధ పార్టీల్లో ప్రముఖంగా ఉన్నారు.

వర్తమానం ఎలా ఉన్నప్పటికి మెతుకు సీమ గతంలోకి వెళితే ఎంతో ఉంటుంది. కాళిదాసు రచనకు కరదీపిక వంటి మల్లినాథసూరి మహా పండితులు ఈ జిల్లా వాడేనంటే ఎంతో ఆనందం కలుగుతుంది. అతనికి తగ్గ వారసులు కుమార స్వామి సోమపీఠి ఆనాడే శాతవాహన కాలంలో అద్భుతమైన కథా సాగరాన్ని సృష్టించిన గుణాఢ్య పండితుడు తన బృహత్కథ కొండాపురంలో సృజించాడంటే ఆ వారసత్వ అనుభూతుల్ని వర్ణించలేం. తెలుగు శాసనం పుట్టిన వెయ్యేళ్ళకైనా అచ్చ తెలుగు కావ్యాన్ని రచించిన పొన్నగంటి తెలగన్న మెతుకు సీమ వాడేనంటే గర్వం కలుగుతుంది. అలాగే పట్టమెట్ట సోమనాథకవి, మల్లారెడ్డిలాంటి తెనుగు పండిత కవులు, మగ్దూం మొహియుద్దీన్ వంటి కవులు, కె. రాజయ్య తదితర విశ్వ విఖ్యాత చిత్రకారులు మెదక్ జిల్లా వారసత్వానికి సమున్నత ప్రతీకలు. అలాగే సంప్రదాయాన్ని గౌరవిస్తూ ప్రయోగాల్ని పరిశీలిస్తూ వచ్చిన ఘనత మెదకు సాహితీ మూర్తులకూ సంస్థలకూ దక్కుతుంది.

మంజీరా నది ప్రవహించు మన మెతుకు సీమలో వెలసిన మనోహర చారిత్రాత్మక నిర్మాణాలు దర్శనీయ స్థలాల ఔన్నత్యం గురించి విశిష్ట దేవాలయాల గురించి మనసును కదిలించే అక్షరాల స్వరఝరులల్లిన కవుల గురించి మహోన్నత కళాకారుల గురించి ఈ నేలను తడిమే నదుల గురించి మన భాష, సంస్కృతి, శిల్పం, కవిత్వం, వ్యాసం, కథ తదితర అంశాలకు కళలకు నిలయమైన కళాకారులకు పుట్టినిల్లయిన మన మెతుకుసీమ సంస్కృతి సాహితీ స్వర్ణ చరిత్రను గుర్తు చేసే విధంగా ఈ పరిశోధన చేయడం జరిగింది. తెలుగు జాతి పౌరుషం తెలుగు భాషా వైభవాన్ని తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను రాబోయే తరాలకి పదిలంగా అందించాలని మెతుకుసీమ కవుల కళాకారుల సేవలను ప్రాచీన కళాఖండాల సత్యాన్ని దర్శనీయ స్థలాల మొదలగు అంశాలతో రూపొందిన ఈ వ్యాసం సాహితీ జగత్తుకు సజీవ దృశ్యం కావాలని ఆశిస్తున్నాను.

మెతుకు నేల కొన్ని ఉద్యమాలకు శ్రీకారం చుట్టింది. తొలి కథకు ఆద్యుడు గుణాఢ్యుడు అయినాడు. అలాగే అచ్చమైన తెలుగులో తొలి కావ్యం రాశారు సంస్కృత అక్షరాల వాసన లేకుండా యయాతి చరిత్ర వ్రాసాడు పొన్నగంటి తెలగనార్యుడు. ఇతను పటాన్ చెరువు ప్రాంతం లోని వారు. సంస్కృత కావ్యాలు అర్థంకాని రీతిలో ఉన్నాయని వాటికి వ్యాఖ్యానం వ్రాసి ప్రపంచానికి వాటి శక్తిని అందించిన కోలాచల మల్లినాథ సూరి కొలిచెలిమ (కొల్చారం) గ్రామం వారు.

ఆ ముగ్గురు మహనీయులు సాహిత్యం ఉన్నంత వరకు చిరస్మరణీయులు అజరామరులు. మెదక్ జిల్లాలో మంజీరా నది గలగలలో ఏడుపాయల దుర్గామాత వెలిచిన పరిసర ప్రాంతాల్లోని ఒక చిన్న కుగ్రామం కొలిచెలిమె (కొల్చారం). మహామనిషి , విద్యా తపస్వి , సంస్కృత పండితుడు మహా వ్యాఖ్యాన కర్త అయిన శ్రీ కోలాచల మల్లినాథసూరి మహాకవి గా జన్మించారు. ఈ గ్రామంలోనే వైదిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన శ్రీ సూరి వంశం అంతయును పండిత వంశమే. వీరి తాతగారు మహా శతావధాని. మల్లినాథ శతాధాని బిరుదాంకితుడు. వీరు కాకతీయ రాజుల ద్వారా అనేక సన్మానాలు పొందారు. ఇక వీరి తండ్రి కపర్ధి సోమయాజి వైదిక సంస్కృతాంధ్రాలలో పండితులు మహా ఉపాసకుడు. ఈశ్వరారాధనా తత్పరుడు.

తెలంగాణలోని అలనాటి మెతుకు సీమనే నేటి మెదక్ జిల్లా. పుష్కలంగా వర్షాలు కురిసినా అనాడు వరి పంట బాగా పండేది. ఇతర ప్రాంతాలకు మెతుకును ఎగుమతి చేశారు. అందుకే మెతుకు సీమ అంటారు. రానురాను వర్షాలు కరువై భూగర్భ జలాలను నమ్ముకున్న రైతన్నలు కండబలానికి గుండెబలం జోడించి చెమటతో పొలాలను తడిపి పంటలు పండిస్తున్నారు. మరోవైపు సాహితీ కృషీవలులు కలాల హారాలతో సాహిత్య క్షేత్రాన్ని దున్ని,

చైతన్య కాంతుల్ని విత్తనాలు చల్లి, బుద్ధి బలం అనే నీరు పారించి అన్ని ప్రక్రియలతో పాటు కథానిక ప్రక్రియ ను సుసంపన్నం చేస్తున్నారు. సాహిత్యమనగా స-హితః హితముతో కూడినది. సమాజ హితము కోరునది. ఎందరో శతకకర్తలు నీతి, ధర్మము, సామాజిక న్యాయము గురించి తమ తమ అభిప్రాయములను వారు రచించిన శతకాలలో వెలబుచ్చి యున్నారు. ప్రస్తుత కాలములో కూడా తెలుగు భాషలో శతక రచన జరగుచునే వున్నది. భక్తి, ప్రేమ, గౌరవం, మర్యాద, ధర్మము, నీతి గురించి తెలుపడము శతక ప్రక్రియలలోనే నుసాధ్యము అగుననుటకు తెలుగు సాహిత్యంలో కొకొల్లలుగా శతక రచనలు వెలువడడమే ప్రబల తార్కాణము.

'ధర్మో రక్షతి రక్షితః అని ఆర్యోక్తి. వ్యక్తి ధర్మము, కుల ధర్మము, మత ధర్మము. అని ధర్మము అనేక విధములు. ముఖ్యమైనది వ్యక్తి ధర్మము అనగా జీవి పుట్టినది మొదలు గిట్టు వరకు అనేక పాత్రలు పోషిస్తూ వాటి కనుగుణమైన ధర్మానుష్టానము చేయవలసి యున్నది. వ్యక్తి ధర్మం లోపము వలన కుటుంబం, సహజమే కాక మానవ మనుగడ కుంటువడుటకు అవకాశము ఉన్నది. ధర్మము నిత్యమైనది. నీతి, న్యాయములు కాలానుగుణముగా మారు తుంటవి. మానవుడు ధర్మానుష్టానము చేసి న్యాయానుగుణముగా నడిచినపుడు మానవలోక మనుగడ మూడు పువ్వులు, ఆరు కాయలగుననుటలో సందేహం లేదు.

మానవుడు సంఘజీవి. వ్యక్తుల సమూహమే సంఘము లేదా సమాజము. సమాజము అవసరంలేని వ్యక్తి జంతువైన అవుతాడు లేదా దేవుడైన అవుతాడని అరిస్టాటిల్ భావించినట్లుగా మానవుడు పుట్టింది, మొదలుకొని మరణించే వరకు సమాజంపైన ఆధారపడి జీవిస్తాడు. వ్యక్తి తన కష్ట- సుఖాలకు, విద్యా బుద్ధులకు, రక్షణకు, ప్రాథమిక అవసరాలకు సమాజంపైనే ఆధార పడుతాడు. సమాజంలో నెలకొన్న ప్రమాణాలు, ఆచార వ్యవహారాలు, ధర్మాలు, విధి విధానాలు మానవులు పాటిస్తూ తమ యొక్క ప్రవర్తనను, స్వేచ్ఛను నియంత్రణలో ఉంచుకో గలుగుతారు.

సమాజం నిరంతరం పరివర్తన చెందే స్వభావం కలది. కనుకనే భిన్న వైరుధ్యాలు గల సమాజాలు కాలక్రమంలో ఆవిర్భవించాయి. ఆదిమ, భానిస, భూస్వామ్య -జమిందారీ, పెట్టుబడిదారి, సామ్రాజ్య సమాజాలుగా మానవ సమాజం రూపాంతరం చెందుతూ వచ్చింది. మానవ సమాజంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయాంశాల వైరుధ్యాలతోనే ఉన్నత, మధ్య తరగతి, అట్టడుగు వర్గ భావన అంకురించింది. ఇక మతం, సంప్రదాయాలు అనాదిగా వర్ణ-కుల వ్యవస్థ మనుగడకు ఊతమిస్తూనే ఉన్నాయి. సమాజంలో ఎన్నో వైరుధ్యాలున్నప్పటికీ వాని మధ్య సమన్వయం ఉన్న ప్పుడే ఆ సమాజం ముందుకెళ్ళ గలుగుతుంది. సమాజం నుండే సాహిత్యం పుడుతుంది. సాహిత్య సృష్టి చేసే వాడుకూడా సమాజంలోని ఒక వ్యక్తే సాహిత్యం యొక్క మనుగడ సమాజంపై ఆధారపడి ఉంటుంది. సాహిత్యం సమాజం కోసమే కారణం లోకవృత్తం అందులో ప్రతిబింబించటమే. సాహిత్య ప్రక్రియ ఏదైనప్పటికీ అది మనిషి జీవితానికి మానవతా విలువలకు సుఖదుఃఖాలకు ఆచారాలకు, అలవాట్లకు సామాజిక పరిస్థితులకు అద్దం పడుతుందని చెప్పక తప్పదు. ఆ విధమైన సామాజిక పరిస్థితులు ఈ భక్తి శతకాలలో కనిపిస్తాయి.

శతక కవుల రచనలు సమకాలీన సామాజిక స్థితిని తెలియజేసేవిగా ఉన్నప్పుడే ఆ సాహిత్యం చిరకాలం మనగలుగుతుంది. సామాజిక ప్రతిఫలనం శతకాలలో కనిపిస్తుం దనడానికి ఇదే నిదర్శనం. ఇంకా అనేక పద్యాలలో జాతి జీవన విధానాన్ని అక్షరబద్ధం చేశారు. మెదక్ భక్తి శతక సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూ తెలుగు భాష పరిమళ సువాసలను దిగ్దగతంతాలకు వెదజల్లిన శతక కవులు ఈ ప్రాంతంలో ఎందరో ఉన్నారు. మానవునికి మేలును కలిగించి, నీతిని బోధించి ధర్మ ప్రతిపాదన చేసేవి ఈ శతకాలు. ఈ శతకాలు మానవుని

ఆలోచనకు పదును పెట్టి సంస్కారాన్ని పెంచేవిగా ఉన్నాయి. రచయిత ఒక రచన చేస్తే ఆ రచనని ప్రజల ముందు ఆవిష్కరిస్తే ఆ రచననూ చదివిన పాఠకుడు ఒక నిర్ధిష్ట వైఖరిని అలవరుచుకుంటాడు. అప్పుడే ఆ రచనకు ప్రయోజనం సిద్ధిస్తుంది. మానవ జీవితంలోని అంతర బాహ్య రూపాన్ని విభిన్న కోణాలలో చూపించని సాహిత్యం నిజంగా మనజాలదు.

ఒక వ్యక్తి మీద సమాజం రాజకీయాలు, ఆర్థిక జీవన విధానం తప్పనిసరిగా ఎంతో కొంత ప్రభావాన్ని చూపు తాయి. ఈ మార్గంలో మెదక్‌జిల్లా భక్తి శతకకర్తలు సమకాలీన పరిస్థితులను, సంఘటనలను తీసుకుని శతక సాహిత్యాన్ని వెలువరించారు.

సహజ పరిణామ క్రమాన్ని అక్షర బద్ధం చేసుకుంటూ వచ్చింది సాహిత్యమే. అందువల్లే సామాజం- సాహిత్యం అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. ప్రాచీన రాచరిక యుగాల నుండి ప్రజాస్వామిక యుగాల వరకు సామాజిక చరిత్రలో వచ్చిన పరిణామ క్రమాల్ని అర్థం చేసుకోవా లంటే సాహిత్యమే ఆధారం. ఆనాటి శతక కవులు తమ శతకాలలో నాటి సామాజిక జీవనాన్ని చిత్రించడంలో నేర్పును ప్రదర్శించారు. పాల్కురికి సోమనాథుని రచన మొదటిసారిగా తెలంగాణ సామాజిక జీవనాన్ని ప్రతి బింబింపజేసింది. శ్రీ కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద కావ్యంలో ఆనాటి రాజకీయ, మత పరిస్థితులను చిత్రించాడు. ప్రాచీన సాహిత్యాధారాలతోనే శ్రీ సురవంర ప్రతాపరెడ్డి గారు సమగ్ర ఆంధ్రుల సాంఘిక చరిత్రను రాసారు. ఇదే మార్గంలో తెలుగు శతక కవులు పలు సామాజిక విషయాలను ఏకీభావంతో కలిపి నిలబెట్టే బాధ్యత తమ శతకాలలో ఆవిష్కరించారు.

భారతీయ సంస్కృతి ఎన్నో వైవిధ్యాలున్నప్పటికీ దానికున్న గతిశీలత, నవ్యతలే దాని మనుగడకు జీవం పోశాయి. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, భారతం, భాగవతం ఇవన్నీ భారతీయ ఉమ్మడి సంస్కృతిగా రూపొంది, జాతీయ సంస్కృతిని సుసంపన్నం చేశాయి. వాల్మీకి వ్యాసమహర్షులు మానవజాతికి అందిం చిన భారతీయ సంస్కృతిని శతక కవులు మార్గదర్శకంగా ఉన్నందునే నేటి వరకు ఆర్షధర్మము ఎక్కువై సజీవమై వర్ధిల్లుచున్నది. భారతీయ సంస్కృతికి మూలభూతాలైన వేదాల్ని, వేదధర్మాన్ని లోకంలో సుప్రతిష్ఠితం చేయడం కోసం ఏర్పడ్డ సులభ సాధనాలు శతకాలు. శతకాలు జ్ఞానభాండాగారం. దీనిలో అనేక నీతి, ధర్మ, న్యాయ మార్గానికి చెందిన కథలున్నాయి. ఈ కథలన్నియు మానవాళికి ఉన్నతమైన జ్ఞానసంపదని అందించాయి. మెదక్ జిల్లా శతక కవులు మరో విధంగా చెప్పాలంటే వివిధ దేవాలయాల గురించి తాను చెప్పదలచుకున్న భావాలను స్పష్టంగా తెలియజేశారు.

కవి అన్నవాడు నీతులు చెప్పడం కాదు. తాను నీతిగా నడుచుకోవాలి. భాగవతాన్ని నరాంకితం చేయనని నిర్భయంగా చెప్పుకున్నాడు. శ్రీనాథులు చేసిన పనిని చేయకపోవడమే మహాపురుషుడిగా పోతన్నను మన ముంద సాక్షాత్కరింప చేస్తుంది. కవులు సర్వజ్ఞులు కాకపోవచ్చును. కాని లోకజ్ఞులు మాత్రం కావాలి. పోతన లోకానుభవం, శాస్త్రానుభవంతో మిళితమై ఆయనొక దార్శనికునిగా మనముదు నిలబెడుతుంది. భాగవత కథలను పరిశీలిస్తే ఈ సత్యం ధ్రువపడుతుంది. పోతన భక్తి, జ్ఞాన, కర్మ యోగాలను తన కాలం నాటి ప్రజలచేత ఆచరింపచేయడానికి భాగవతం రచించాడు అనిపిస్తుంది. దీని ఆదర్శంగా తీసుకుని మెదక్ జిల్లా కవులు తమ శతకాల ద్వారా మాన సమాజానికి ధర్మ సూత్రాలను ఆధ్యాత్మికతను అందించారు.

శతకాలలోని కొన్ని పాత్రలు సంఘర్షణలు నేటికీ మన సమాజంలో ప్రతీ మనిషి జీవితానికి ప్రతీకలుగా ఉండడం మనం గమనిస్తాము. ఈ విధంగా ఈ శతకాలు సమాజా నికి ప్రతిబింబంగా నిలుస్తుందనడంలో అతియోక్తి లేదు. అందులోని పాత్రల ద్వారా మానవ సంబంధాలను చాటి చెప్పాయి. సమాజంలో సంస్కృతి కూడా ఒక భాగమే. సంస్కృతి మానవుని జీవన సరళని నిర్దేశిస్తుంది. తన

బ్రతుకును శోభాయమానం చేసేదే సంస్కృతి. ఈ సంస్కృతిలో ఆచార వ్యవహారాలు, నియమ నిబంధనలు అన్నీ ఉన్నాయి. వీటికి భాష సాహిత్యాలు అంతర భాగంగా వుంటాయి. ఇవన్నీ ఆదర్శమైన సమాజం కోసం పని చేస్తుంటాయి. సాహిత్యం ప్రజలను చైతన్యవంతులను చేయడానికి మానవీయులకు తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తుంది. మెదక్ జిల్లా శతక కవులు సమాజహితం కోసం, సమాజ శ్రేయస్సు కోరి రచనలు చేశారు.

భారతీయ సమాజ సంస్కృతుల యొక్క ఉదాత్త రూపము మనకు ఈ శతకాలలో కనిపిస్తుంది. ఇవి ప్రపంచంలో ఎలా నడుచుకుంటే లోకంలో సుఖము, శాంతి వర్ధిల్లుతాయో తెలియజేస్తాయి. ప్రపంచంలో ధర్మాన్ని కాపాడేందుకు విష్ణుమూర్తి అనేకసార్లు ఈ భూమీద అవతరించాడు. సంస్కృతి పరిరక్షణ కోసం ప్రతియుగంలో శ్రీహరి సమరభేరి మ్రోగించాడు. సనాతన సమాజ సంఘటికుడైన కృష్ణుడు ఎందరో దుర్మార్గులను అణచివేశాడు. నేటి సమాజంలో ఆర్థిక సంబంధాల ప్రాధాన్యం పెరిగిపోయి హార్థిక సంబంధాలు సన్నగిల్లాయి. కుటుంబ వ్యవస్థలోనూ మార్పులు వచ్చాయి. సమాజంతో మనం మనతో సమాజము అనుకున్నప్పుడే మానవ సంబంధాలు సంపూర్ణంగా కనిపిస్తాయి. మెదక్ జిల్లాలో భక్తిశతకాలు ఈ సమాజానికి ప్రతిబింబంగా నిలుస్తాయి అని చెప్పడంలో అతిశయోక్తి కాదు. ఇందులోని ప్రతి విషయంలో మన చుట్టూ తిరుగుతున్నట్టే ఉంటాయి. మహాభారతంలో 'యదిహాస్తి తదన్యత్ర-యన్నేహాస్తి నతత్ క్వచిత్ ' (మహాభారతంలో ఏదైనా ఉందంటే అది విశ్వమంతటా ఉంటుంది. ఏది ఉండదో ప్రపంచంలో ఎక్కడా ఉండదు) అని విస్తృత ప్రశస్తి గాంచింది ఇదే సూక్తి శతక వాఙ్మయానికి కూడా వర్తిస్తుంది.

ఈ ఆధునిక కాలంలో చూసినట్లయితే మన పాలకులలో స్వార్థమన్నది విపరీతంగా పెరిగిపోయింది. నా పిల్లలు, నా భార్య, నా కుటుంబం, నావాళ్ళు, నా మిత్రులు, నా పార్టీ ఇలా నా అన్నదే తప్ప మన అన్నది ఎక్కడా మనకు గోచరించదు. వయసులో వుండగా అజామిళుడు వ్యామోహంలో పడిపోయాడు. వ్యామోహం అనేది ఒక అంధకూపం లాంటిది. వృద్ధాప్యం సంభవించింది, మరణానికి చేరువయ్యాడు అప్పుడు వ్యామోహాన్ని విడనాడాడు. వెలుగు చూసాడు. కాని, ఆ వెలుగు అన్నది కొన్ని క్షణాలు మాత్రమే. ఆ కొన్ని క్షణాలు ఏమి చేయగలడు. కాబట్టి అజామిళునిలా జీవితం ఉండకూడదు అన్న విషయం ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలి. ఎవరైనా తన సొంత తల్లిదండ్రులను, భార్య పిల్లలను వదిలి వేశ్యాలోలురు ఐనట్లయితే, దాని వలన నిండు నూరేళ్ళు జీవితం వ్యర్థమవుతుంది. మనం ఆ మైకం నుండి బయటపడనంత వరకు జీవితమనేదే అర్థం కాకుండా పోతుంది. ఆలోచనలు తగ్గిపోతాయి. ఇది భాగవతంలో ఒక కథ.

పోతన ప్రహ్లాదుని లాంటి విష్ణుభక్తుడి కథను తీసుకుని ఒక మంచి వ్యక్తిత్వ నిర్మాణం చేశాడు. మన సమాజానికి ఆయన ఇచ్చిన సందేశం భక్తుడని చెప్పుకుంటే చాలదు. నిజమైన భక్తుడు భగవంతునితో సమానమని ఆయనతో ఉంటూ ఆయన కల్యాణ గుణాలను భక్తుడు కూడా పొందుతాడు. ప్రహ్లాదునికున్న సర్వ సమత వినయ విధేయతలు, సేవాభక్తి, పరస్త్రీలో మాతృమూర్తిని దర్శించే నుగుణం, దీనుల విషయంలో ధర్మవాత్సల్యం, స్నేహితులను సోదరులుగా భావించి మన్నించడం, సమయ సందర్భాలు తెలిసి ఎలా మెలగాలో ధర్మయుక్తి తెలిసి మాట్లాడడం ఇవన్నీ ప్రహ్లాదుని ద్వారా నేటి సమాజానికి ఉత్తమ వ్యక్తి లక్షణాలుగా భాగవతం వివరించింది. బలిచక్రవర్తి పేరు వినగానే దానానికి పెట్టింది పేరు. తన రాజ్యంలో ఎవరు ఏది అడిగినా లేదనకుండా ఇచ్చేవాడు. రాక్షసజాతిలో ఇలాంటి లక్షణం ఉండటమనేది చాలా అరుదైనటువంటి విషయం. బలిచక్రవర్తిలో ఇలాంటి ఎన్నో ఉత్తమ గుణాలు ఉన్నప్పటికీ గురువైన శుక్రాచార్యుల వారి మాట వినకపోవడమే రాజ్యభ్రష్టుడు కావడానికి ప్రధాన కారణం. కాబట్టి గురువు

మాటను ఎవరు శ్రద్ధతో విని ఆచరిస్తారో వారే ప్రయోజకులవుతారు. ఎవరైతే వినరో వారు అధోగతి పాలవుతారు, అన్న విషయాన్ని ఎవ్వరూ మరచిపోరాదు.

దానగుణం కలిగిన వానికి సర్వప్రాణులు సమానమే. ఏ ప్రాణి అయితే ఆకలి బాధతో ఉందో, ఏ ప్రాణి అయితే ప్రాణ సంకటముచే బాధపడుతుందో ఆ ప్రాణిని చూడగానే వాడి కళ్ళలో ఆర్ద్రత కనిపించాలి. అలాంటివాడే ఆపదలో ఉన్నవాడికి సహాయ పడగలడు. ఆ కోవకు చెందినవాడు రంతి దేవుడు. తన కళ్ళ ముందు మానవుడే కాదు ఏ ప్రాణి ఆకలితో ఉన్నా, తన ఆకలిని తీర్చుకోవడం మానుకొని యెదుటి ప్రాణి ఆకలి బాధను తీర్చేటటువంటి వాడు రంతిదేవుడు.

కుచేలుడు తన దుర్భర జీవితం అభవిస్తున్న సమయంలో తన భార్య వామాక్షి సహజమైన, సామాన్యమైన స్త్రీ ఆలోచన విధానముతో నీ స్నేహితుడైన, యాదవ వంశ ప్రభువైన శ్రీ కృష్ణుని దగ్గరకు వెళ్ళి కొంత ధనమును అడగమని చెప్పిన సందర్భాన ఆనాటి సమాజంలో పేదరికం మధ్య కొట్టుమిట్టాడుతున్న జన జీవన విధానం బయటపడుతుంది. తాము ఎంత కష్టం ఉన్నప్పటికి పిల్లలకు ఆ కష్టాన్ని తెలియనీయక తమకు సాహిత్యము యొక్క ప్రధానోద్దేశ్యము సమజ సంస్కరణమే సంఘ సంస్కరణ సమాజ సంస్కరణ కావించుట కొరకు సాహిత్యమేర్పడినది. విశ్వశ్రేయః కావ్యమ్ ప్రపంచానికి శ్రేయస్సును కలిగించటమే కావ్యము యొక్క ప్రధానోద్దేశము శతకములకు కూడా ఇదే కోవకు చెందినవి నారసింహ శతకం, శ్రీనివాస శతకం, రంగనాథ శతకం, శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర శతకం శ్రీచదువులమ్మ శతకం, శ్రీ మహాలక్ష్మి శతకం, సత్యసాయి శతకం మొదలైన శతకాలు సమాజ హితముతో పాటు నీతి, భక్తి సత్ప్రవర్తన, నైతిక విలువలు, మానవ సంబంధాలు అవినీతి నిర్మూలన మొదలగు అనేక విషయాలన్ని తెలియజేసాయి.

మంజీరా నది ప్రవహించు మన మెతుకు సీమలో వెలసిన మనోహర చారిత్రాత్మక నిర్మాణాలు దర్శనీయ స్థలాల ఔనత్యం గురించి విశిష్ట దేవాలయాల గురించి మనసును కదిలించే అక్షరాల స్వరఝురులల్లిన కవుల గురించి మహోన్నత కళాఖండాలు గురించి, ప్రసిద్ధ నదుల గురించి మన భాష సంస్కృతి చిత్రం శిల్పం కవిత్వం వ్యాసం కథ తదితర అంశాలకు కళలకు నిలయమైన కళాకారులకు పుట్టినిల్లయిన మన మెతుకు సీమ సంస్కృతి సాహితీ స్వర్ణ చరిత్రను గుర్తు చేసే విధంగా ఈ వ్యాసం రాయడం జరిగింది.

తెలుగు భాషా సౌభాగ్యమునకు మెదక్ జిల్లా ప్రాచీన ఆధునిక శతక కవులు చేసిన కృషి అనన్య సామాన్యమైంది. శతక ప్రక్రియతో పాటు ఎన్నో ప్రక్రియలు ఈ జిల్లా సాహిత్యంలో ఎన్నో ప్రక్రియలు అలరారు చున్నాయి. ఎన్నో భావాలను తనలో కలుపుకుని మహోత్తరమైన పద్య సాహిత్యాన్ని వచన సాహిత్యాన్ని వెలువరించడం ఒక అపూర్వ ఘట్టము.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు క్షేత్ర చరిత్రను జాతి గుండెలో పదిల పరిచారు. పద్య సాహిత్యంలో రసరమ్యమైన అలంకారాలు, సామెతలు, పదబంధాలు మొదలైనవి కనబడుచున్నాయి. కొంతమంది కవులు వైవిధ్యమైన అలంకారాలతో, ఛందస్సుతో కావ్య రచనలు చేసిన కొన్ని శతకాలలో భాష ప్రౌఢమై ఉన్న ప్రతీ పద్యం శబ్ద చమత్కృలతో తెలంగాణ సమాజానికి విలువైన సాహితీ సంపదగా అందించారు. జాతి జీవన విధానాన్ని ప్రత్యేక అస్థిత్వాన్ని నిలబెట్టేదే సంస్కృతి. తెలంగాణ ప్రాంతం వివిధ పాలకుల కాలంలో వివక్షతకు ఉపేక్షకు గురై చరిత్ర, సాహిత్యము, సంస్కృతి లేదనే స్థితికి చేరుకుంది. అయితే మెదక్ జిల్లా భౌగోళికంగా, చారిత్రకంగా, రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, సాహిత్య పరంగా ఒక ప్రత్యేకతను కలిగిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఆనాటి మెదక్ జిల్లా వాస్తవ స్థితిని కవులు, రచయితలు తమతమ రచనలు ద్వారా చిత్రించారు. ఇదే తెలంగాణ ప్రాంతానికి ఒక ప్రత్యేక భూమికను నిల

బెట్టింది. సాహిత్య, సాంఘిక, మత, కళారంగాలలో తెలుగు సంస్కృతి వైభవాన్ని ముఖ్యంగా తెలంగాణ వైభవాన్ని వెలిగింప చేసేందుకు మెదక్ జిల్లా క్షేత్ర కవులు ఉత్కృష్టమైన సంస్కృతి సాహిత్యాలను అందించారు. వీరి అందించిన స్ఫూర్తి నేటికి తెలంగాణ ప్రాంతంలో అవిచ్ఛినంగా ప్రవహిస్తునే ఉంది. ప్రతి వ్యక్తి తన కుటుంబం, తన ప్రాంతం, తన భాష, తన సంస్కృతిపట్ల అభిమానం ఉంటుంది. దీని నుండి స్ఫూర్తి పొందే లక్షణం లేకపోతే ఎవ్వరు ఏమి సాధించలేరు. సంస్కృతి సంప్రదాయాల పట్ల, ఆచార వ్యవహారలపట్ల ఆరోగ్యకర మైన ప్రాంతీయాభిమానం ఎంతగానో అవసరం దీనిని గుర్తించిన మెదక్ జిల్లా క్షేత్రకవులు తమతమ రచనల్లో తన జాతిగొప్పతనం పట్ల ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని కలిగిం చారు.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జాతర్లలో ప్రదర్శించే యక్షగాన రామాయణాలు

- బొలమఱి

తెలంగాణ రాష్ట్రంలో చారిత్రకంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా చాలా ప్రాధాన్యత కలిగి ఉంది. ఈ ప్రాంత గత వైభవ చరిత్ర ఘనం. అనేక మంది దేశభక్తులు, స్వాతంత్ర్య సమరయోధులు, మేధావులు, కవులు, కళాకారులు జన్మనిచ్చిన పుణ్యభూమి మెదక్ జిల్లా. ప్రాచీన కాలంలో ఇక్కడ వెల్లివిరిసిన కళావైభవం అమోఘం. అన్నపూర్ణగా ప్రసిద్ధికెక్కిన ఆంధ్రప్రదేశ్ లో అన్నానికి కొదవలేని మెతుకు సీమ మెదక్ జిల్లా. ఈ ప్రాంతం ప్రముఖంగా వ్యవసాయిక ప్రదేశం. ఇక్కడి సాంఘిక, చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, జానపద, ఆచార వ్యవహారాలు, ప్రజల జీవన సంస్కృతిలో అంతర్భాగాలు. జానపదులు జీవన శైలికి పట్టుకొమ్మలు పల్లెలు. జానపదులు ఆచార, వ్యవహార, సాంప్రదాయ, సంస్కృతికి నిలువుటద్దాలు జాతరలు.

భగవంతుడు సర్వంతర్యామి. సర్వవ్యాపకుడు, శాశ్వతుడు, అనంతుడు. అతను సృష్టించిన బుద్ధి జీవి మానవుడు. ఆ మానవుడు సర్వవ్యాప్తి అయిన భగవంతుడిని నిత్యం దర్శించి తరించే నేపథ్యంలో భక్తుడై భగవదారాధనకు అనేక మార్గాలు ఎంచుకున్నాడు. భాష, లిపి, దశను చేరుకోకముందే వాగ్రూపమైన భావజాలంతో తనకు జన్మనిచ్చి నిత్యం వెన్నంటి వుండే ఆ భగవంతుడ్ని ఆరాధిస్తూనే వచ్చాడు. 'ఆత్మవత్ సర్వభూతాని' అన్న ఉపనిషత్ మహా వాక్యాన్ని అనుసరించి విశ్వకళ్యాణ కాంక్ష అనే మహాప్రయోజనంతో భగవంతుని ఆరాధనను కేవలం తన వరకే కాక తనవారితో జరుపుకోవడం ప్రారంభించాడు. అది సంస్కృతిలో మూలమైన ఆచారంగా తరువాతి తరాలవారు వారసత్వంగా జరుపుకోవడం ప్రారంభించారు. జాతి, మత, కుల, వర్గ, వర్ణ, వివక్షత లేకుండా అందరూ ఏ జాతరలోనైనా ఐకమత్యంగా పాల్గొంటూ ఈ ప్రాంతపు ఆధ్యాత్మిక సంస్కృతిని మరింత ఉజ్జ్వలం చేస్తూ రాబోయే తరాలకు అందిస్తున్నారు.

చిరుతల రామాయణం :

జిల్లాలోని జానపద కళారూపాలలో ఒకటైన చిరుతల రామాయణం కూడా ఒకటి. దీనిని ప్రదర్శించేటప్పుడు చిరుతలను ఉపయోగిస్తూ రామాయణాన్ని పాడటాన్ని చిరుతల రామాయణం అంటారు. ఈ ప్రదర్శనను ప్రదర్శించేటప్పుడు పాత్రలకు సందర్భోచితంగా వేశాలు వేసుకుంటారు. ముఖానికి రంగులు, తలకు కిరీటం ధరిస్తారు. భుజకీర్తులు తప్ప అన్నిరకాల అలంకరణలు చేసుకుంటారు. అలాగే పాత్రోచితంగా గద, బాణం, పూసలు, రుద్రాక్షలు, ఖడ్గం మొదలైన వస్తువులను వాడతారు. పాత్రలకనుగుణంగా రంగులు వేసుకుంటారు.

ఈ ప్రదర్శనలో డోలు, తాళాలు, హార్మోనియం, ఈల, చిరుతలను వాయిద్యాలుగా వాడతారు. ఇది ప్రదర్శించే స్థలాన్ని ఒక కేంద్ర బిందువుని ఆధారంగా చేసుకుని, ఒక గుంజ పాతుతారు. అదెలాగంటే దీనిని ఎటునుండి చేసినా మూడున్నర అడుగుల దూరం ఉండేలా వర్తులాకారంలో వచ్చేటట్లు తొమ్మిది గుంజలను పాతి, మామిడి తోరణాలు కడతారు. ప్రతి గుంజను విద్యుత్ దీపాలతో అలంకరణ చేస్తారు. వేదిక నిర్మించడానికి ముందే స్థలం అలికి ముగ్గులు వేస్తారు. పసుపు, కుంకుమతో యంత్రం వేస్తారు. అలాగే ప్రదర్శన ప్రారంభంలో విఘ్నేశ్వరుని, సరస్వతి దేవిని ప్రార్థిస్తారు. ప్రదర్శన చివరలో 'మంగళమిదే రామా శ్రీ రామా అంగజ జనకా గంగాధర సుత' అంటూ మంగళహారతిని ఇస్తారు. పాత్రలు ఎవరికి వారు పరిచయం చేసుకుంటారు. పాత్రల పరిచయం తర్వాత కథ నడుస్తుంది. కథలో సంవాదాలు, వర్ణనలు ఉంటాయి. ఇవి దరువుల్లోను,

వచనంలోను ఉంటాయి. అప్పుడప్పుడు ఇతర అంశాలు కూడా ప్రదర్శనలో చోటు చేసుకుని కథకు ప్రాణం పోస్తాయి. ప్రదర్శనలో ప్రధానమైనవి అడుగులు. ఇవే కథకు జీవం. జాతర్లలో ఈ కళారూపాన్ని ఏదో ఒకరోజు ప్రదర్శిస్తారు.

తందనాన రామాయణం :

ఈ ప్రదర్శనలలో తందనాన అనే పదాన్ని అంటూ పాడుకునే రామాయణాన్ని తందనాన రామాయణం అంటారు. ఈ కథను చెప్పే వాళ్ళు పంచె కట్టుకుని నడుముకి పట్టా చుట్టుకుని, చేతిలో చిరుతలు, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని గానం చేస్తారు. అలాగే తాళాలను కూడా వుపయోగిస్తారు. జాతరలో దీనిని ప్రదర్శించటానికి ఒక అనువైన ప్రదేశాన్ని ఎన్నుకుని ఒక వేదికను ఏర్పాటు చేసుకుంటారు.

తెలుగు సాహిత్యంలో వెలసిన మార్గదేశీ రీతుల్లో రెంటికీ అనువుగా ఉన్న కావ్యం. ఈ తందనాన రామాయణం. ఇది సాహత్య భావనలో నూతన తత్వాన్ని, సంగీత పరంగా రాగతాళయుక్తా ఇతర గేయ రామాయణాల కంటే విలక్షణంగా ఉంటుంది. ఇందులో మొత్తం ఏడు గతులున్నా ఎక్కువగా చతురస్ర గతినే ఉపయోగిస్తారు. బాల, అయోధ్య, అరణ్య, సుందర, కిష్కింద, యుద్ధ కాండలు ఉంటాయి. కావ్య ప్రారంభంలో ఇష్టదేవతా ప్రార్థన, సరస్వతిదేవి ప్రార్థన, దాని తర్వాత కృతిపతి, గురుదేవుణ్ణి స్తుతిస్తారు. చివరగా ఫలశ్రుతి, మంగళహారతిని ఇస్తారు. ఈ తందనాన రామాయణంలోని కొన్ని గేయాలు

"ఆంజనేయుడు ద్రోణాచలమున కరుగుచున్నాడో
బాల తందాన తాన
వాయు వేగమున మనోవేగమున వచ్చుచున్నాడే
బాల తందాన తాన
కాలనేమియును పేరు గలాడు కావలియున్నాడో
బాల తందాన తాన
సరోవరమ్మున యెడ్డున వాడ సన్యాసయినాడో
బాల తందాన తాన
నారీమణి వినుముదమ్ము, నరాంతకుని చరితమ్ము
నగజాతా వినుమింకా నందమ్మును గొనమికా
మూలా నక్షత్రమున బాలులర్వైవేలే యన
ఇల జన్మించిరి కనుగొన మేలుగ దశకంఠుడు విన
చాల తాపమొందెనానాడు రావణుండు విన
శుభము లేక కుందినాడు శుక్రాచార్య చేరినాడు
సతుల పుట్టుక జెప్పినాడు
సుఖము గూర్చుమని నాడు గురూత్తముని వేడినాడు
అయ్యయ్యో దశకంఠ ఆపత్తులు వచ్చునింట
ఆ పిల్లలు యున్న తంట అందరినీ గొనుమంట
ఆ కడలి ద్రొబ్బంట అంటదు పాపం ఒంట
అందుకొరకు వినుమంట అరుగుమింకా రావణా
నేతి జెప్పితి నాయన

అంటూ రసవత్తరంగా సాగుతుంది. ఈ జానపద కళారూపం. ఈ విధంగా మెదక్ జిల్లాలో తందనాన రామాయణాన్ని అనేకులు ప్రదర్శిసుంటారు. దీనివల్ల తమ జీవనోపాధిని చూచుకుంటారు.

చిందు భాగవతులు :

తెలుగుజాతికి గర్వకారణమైన అన్య ప్రాంతీయులకు కూడా ఆదర్శప్రాయమైన, శాస్త్రీయ, సంప్రదాయ జానపద నృత్యరీతులను రూపొందించి ప్రచారంలోకి తీసుకువచ్చారు ప్రాచీనాంధ్ర నృత్య శాస్త్రవేత్తలు. పూర్వం తెలుగునాడును... యక్షభూమి అని పిలిచేవారు. యక్షులనే గంధర్వ జాతికి చెందినవారు ఆడిపాడిన, భూమి కనుక వారి నఈత్య శైలియే యక్షగానంగా వర్ధిల్లిందంటారు. యక్షగానం అతి ప్రాచీనమైనది. పల్లె ప్రజలకు అందుబాటులో వున్న రమణీయ కళారూపం. ఈ కళారూపాన్ని అనుసరించి నృత్య కేళిక చేయువారే చిందువారు.

ఈ నృత్యం సుమారు రెండువేల సంవత్సరాల నాటిదంటారు. నాటినుంచి నేటిదాకా ఒక ప్రత్యేకతను సంతరించుకుని పండితుల్నీ, పామరుల్నీ తమ కళానైపుణ్యంతో ఈ కళాకారులు మెప్పించి శభాష్ అనిపించు

కున్నారు. కాని ఈ కళాకారులు ఆశించేది పట్టె అన్నం, పాత వస్త్రాలు మాత్రమే. వృత్తుల ననుసరించి, జాతరలు ఏర్పడినట్లే ఆ జాతులపై ఆధారపడి వారికి వినోదాన్ని చేకూరుస్తూ జీవించే మరికొన్ని తెగలు ఏర్పడ్డాయి.

చిందుమాదిగలు :

మనదేశంలో అతి బీదవారై, అందరికంటే ఆఖరి జాతి వారిగా చూడబడే హరి జనులకు చెందిన మాదిగ వారిపై ఆధారపడి జీవించే కళాకారులు గనుక, వీరిని చిందు మాదిగలు అని పిలుస్తూ వచ్చారు. సంఘంచే వీరు కడజాతి వారుగా చూడబడ్డారు. వీరు లక్ష్మీ ప్రసన్నులు కాకపోయినా, సరస్వతీ పుత్రులు. ఈ చిందు జోగితలు ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలోని నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో నివసిస్తున్నారు. వీరు రామాయణ, భారత, భాగవత, కథల్ని నృత్య నాటకాలుగా ఆడుతారు. మన ప్రాంతాల్లో పగటి వేష ధారులు పగటి పూట ఎలా పగటి వేషాలను వీధుల్లో ప్రదర్శిస్తారో వీరు కూడా అతే మాదిరి పగటిపూటే తమ ప్రదర్శనలు నిస్తారు. స్త్రీలు పురుషులు కూడా ప్రద ర్శనాలలో పాల్గొంటారు. బృందాలుగా ఏర్పడి ప్రదర్శనల నిస్తారు. వీరు సుమారు ఏభై యక్షగానాల వరకూ ప్రదర్శిస్తారు. వీరి ప్రత్యేకత పాడుతూ ఆడతారు. వారికి కావలసిన అలంకరణకు సంబంధించిన వస్తువులన్నీ, దుస్తుల్నీ వారే తయారు చేసుకుంటారు. అవి ఎంతో ప్రావీణ్యతతో తయారు చేయబడతాయి.

జోగితలు :

చిందు జోగితలు ఇంచుమించుగా ఒకే తెగకు చెందినవారైనా, వీరిలో కొన్ని భేదాలున్నాయి. 'జొగిత' అనే పదాన్ని ఒక బిరుదుగా వుపయోగించేవారు. అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటి. అలంపురం జోగులాబపీఠం.. ఆ దేవి సేవలో అంకితమై నృత్య మాడేవారు గనుక వారిని జోగులాంబలు అని పిలవటం ఆచారమైంది. జోగుల వారని పిలువబడేవారు. నృత్య నృత్తములను మాత్రమే ప్రదర్శిస్తారు. జోగు చిందు స్త్రీలు నృత్త నృత్యాలతో కూడిన యక్షగానాలను ఆడతారు. జోగులవారు సుమారు ఇరవై దరువులతో ఆడతారు. ఒక్కొక్క దరువూ ఒక్కొక్క సందర్భంలో ప్రదర్శిస్తారు. వారి ప్రదర్శనంలో, మృదంగం, తాళం, చిప్పలు, గజ్జెలు, హార్మోనియం, శృతి మొదలైన ప్రధానంగా వాయించే వాయిద్యాలు నటులు నేపథ్యంలో వుండి వంత పాడుతారు. ప్రతి గామంలోను వీరు ప్రదర్శనం ఇచ్చే సమయంలో ఎల్లమ్మ ఆట ఆడటం వారి ప్రత్యేకత. తమ జీవితాలు మోడువారి పోయినా గ్రామాలు సస్యశ్యామలంగా వుండాలని కోరుతూ తన్మ యత్వంతో ఆడతారు. ఆ ఆటవల్ల కరువు కాటకాలు రావని నమ్మే ప్రజలు ఈనాటికి నిజామాబాద్ జిల్లాల్లో అనేక గ్రామాల్లో వున్నారు.

వీరు ప్రదర్శించే నాటకాలు :

సమాజంలోని అట్టడుగు వర్గానికి చెందిన ఈ కళా కారులు ప్రదర్శించే నాటకాలలో ముఖ్యమైనవి. 'మోహినీ రుక్మాంగద' సారంగధర, చెంచులక్ష్మీ, వీరభిమన్య, సుందరకాండ, సతీ సావిత్రి, మైరావణ మొదలైన నాటకాలను ప్రదర్శిస్తూ మధ్య మధ్య ప్రజల సమస్యలను సందర్భోచితంగా చొప్పిస్తూ పేద ప్రజానీకాన్ని ఆకట్టు కుంటారు.

శారదకాండ్రు :

శారదకాండ్రు అనేవారు ఒక్క తెలంగాణాలో తప్ప కోస్తా ఆంధ్రదేశంలోనూ, రాయలసీమలోనూ ఎక్కడా కనిపించరు. అయితే తెలంగాణాలో కూడా ఒక్క వరంగల్ తాలూకాలోనే వీరు ఎక్కువమంది వున్నారు. నిజానికి బుర్రకథ వాయిద్యాలకూ, శారద కథకుల వాయిద్యాలనికీ పెద్ద వ్యత్యాసం ఏమీ కనిపించదు. బుర్రకథలో మాదిరే వీరూ లక్కీలు ఉపయోగిస్తారు. వీరు ఉపయోగించే తంబురానే శారద అంటారు. అందువల్ల వీరికి శారద కాండ్రు అనే పేరు వచ్చింది.

మున్నూరు, ముతరాసి మొదలైన తెలుగు కులాల నుంచి పుట్టిన ఒక జాతి ఈ శారదకాండ్రనీ భిక్షక జాతుల్లో

వీరే ఎక్కువమంది వున్నారనీ పూర్వం ఈ జాతివారికి ఎటువంటి పేరుండేదో తెలియచెప్పే చారిత్రకాధారాలు ఏమీ లేవనీ, వీరికీ పేరు ఇటీవలే వచ్చి వుండవచ్చుననీ, ముఖ్యంగా జానపదగేయాల్లో శారద పాటలు పాడేవారు. ఈ జాతివారే పాడుతున్నా, ఇతర జానపద గేయాలలో కంటే, ఈ శారద పాటల్లోనే సాహిత్య ప్రతిభ అధికంగా వుంటుంది.

ఓ భారతీ కరుణామతి
భళి శారద కరుణానిధి

అనే వంతపాటలు పాడటం వల్ల, వీరికీ పేరు వచ్చిందేమో తెలియదనీ డా. రామరాజు గారు తమ గేయ సాహిత్యంలో ఉదహరించారు.

శారదంటే :

శారదను భుజం మీద ధరించిన కథకులు ఎడమచేతి బొటనవ్రేలుకు అందెలు ధరించి, భుజంపై నున్న తంబురాను కుడిచేతితో మీటుతాడు. దీనినే వారు శారద అని పిలుస్తారు. శారత అంటే సరస్వతి అనే పేరు సర్వ సాధారణంగా అందరికీ తెలిసిన విషయమే. అదే పేరును ఈ భిక్షకులు తంబురాకు శారద అనే పేరు పెట్టుకున్నారు. అందువల్లనే వారు కథ ప్రారంభంలో శారదాదేవినే స్తోత్రం చేస్తారు. పురుషుడు కథ చెపితే అతని భార్య వంత పాడుతూ డక్కీ కొడుతుంది. ఒక్కోసారి ఇద్దరే కథ చెపుతారు. అయితే వీరిలో బహుభార్యత్వం వుండడం వల్ల, ఇద్దరు భార్యలూ, వంతలుగానే వుంటారు. అందువల్లే వీరు ఇద్దరు భార్యలను చేసుకోవడం కూడా కద్దు. వీరి కథల్లో స్త్రీవంతల్లాగా, జంగం కథల్లోగాని బుర్ర కథల్లో కానీ స్త్రీలు వంతలుగా కనిపించరు. శారద కథకుల బహుభార్యత్వం

బాలనాగమ్మ... రాములమ్మ... ఎరుకల నాంచారి... చిన్నమ్మ మొదలైన కరుణ రసప్రపూరితమైన కథలతో పాటు 18 వ శతాబ్దంలో తెలంగాణా ప్రాంతాన్ని దద్దరిల్ల చేసిన సర్వాయి పాపడు కథనూ, అలాగే రెడ్డి వీరులకూ, వెలమవీరులకూ చెరువునీళ్ళ తగాదాలో వైరుధ్యాలు పెరిగి... కొండల్రాయుని తండ్రిని చంపిన వారి మీద పగ తీర్చుకోవడానికి యుద్ధానికి సిద్ధమైన పౌరుష వంతుడైన కొండల్రాయుని సాహసోపేతుడైన వీరుని కథనూ, ఈ కోవకే చెందిన సదాశివరెడ్డి, రాజా రాజేశ్వర రావు... గద్వాల సోమనాద్రి కథనూ, చారిత్రక కథలైన, బొబ్బిలి, పల్నాటి యుద్ధానికి సంబంధించిన, వీరరస గాథల్నీ చెపుతారు.

శారద రామాయణం :

ఎన్నో చారిత్రక గాథల్నీ, వీరరస గాథల్నీ, కరుణరస గాథల్నీ, అద్భుతంగా వాల్మీకి రామాయణాన్ననుసరించి ఒక కవి, పుత్రకామేష్టి నుండి పాదుకా పట్టాభిషేకం వరకూ, శారద వరుసలకు అనుగుణంగా వ్రాసిన శారద రామాయణాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో చెపుతారు.

పిచ్చుకుంట్లవారు :

వీరిని పిచ్చకుంట్ల, పిచ్చుకకుంట్ల, భిక్షకుంట్లయని పిలుస్తారు. పాల్కూరికి సోమనాథుని కాలమున పిచ్చు కుంట్ల జాతి ఉన్నట్లు పండితారాధ్య చరిత్ర వలన తెలు స్తోంది. వీరు కాపులు,గొల్లల కులగోత్రాల గుంట, తిత్తి వాద్యాలతో చెప్తూ జీవిస్తారు. పోషక కులాల వారి బిరుదుల పఠిస్తూ తెలంగాణాలో పర్వతాల మల్లారెడ్డి, సూర్యచంద్ర రాజుల, హరిశ్చంద్ర, లక్ష్మమ్మ కామమ్మ, బాలనాగమ్మ, సరోజనమ్మ, రాములమ్మ, సోమనాద్రి, సదాశివరెడ్డి మొదలగు గాథలు వీరు పాడతారు.

వీరు శైవ మతస్తులు, మల్లికార్జునుడు ఆరాధ్యదైవం. పోచమ్మ, ఎల్లమ్మ, మల్లమ్మ, ఈదెమ్మ మొదలగు క్షుద్ర దేవతలనందరినీ ఆరాధిస్తారు. ఒకప్పుడు నల్లగొండ విస్తరంగా ఉన్న జానపద వృత్తి గాయకుల కుటుంబాలు సరియైన ఆదరణ లేని కారణంగా, ఆధునిక నాగరికత వాసనలు సోకుట వల్ల భిక్షుకు వృత్తికి స్వస్తి చెప్పి, కూలినాలి పనులు చేసుకుంటున్నారు.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు దళిత సాహిత్యంలో నిజమైన సందేశకుడు జి.కే.

– చిలుక భాస్కర్, చిలుక బ్రదర్స్ కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్.

జి.కే. చాలామందికి తెలియదు. కథా రచయిత కనకయ్య పేరు కూడా చాలామందికి తెలియదు. కానీ గుండెడప్పు కనకయ్య అంటే చాలా మందికి తెలుసు. గుండెడప్పు కనకయ్య రాసిన కథలు ఎలాంటి పాఠకుల మనసునైనా స్పందింపచేసేవిగా ఉన్నాయి. ఆధునిక సమాజంలో కథా ప్రక్రియ అత్యంత అద్భుతంగా కొన సాగుతున్న ప్రక్రియ. కథా ప్రక్రియ బౌద్ధ జాతక కథలతో మౌఖిక రూపంలో మొదలైంది. మానవ మనుగడలో భాగంగా కథ వస్తు వైవిధ్యాన్ని సంతరించుకుంటూ కొన సాగుతుంది. ఉద్దేశ పూర్వకంగా అమ్మమ్మలు తాతయ్యలు మరియు గురువులు అల్లి చెప్పిన కథలు పిల్లలతో పాటు పెద్దల మనసును కూడా అలరిస్తూ కథా ప్రక్రియ నైపుణ్య వంతంగా పరిణామం చెందుతూ కొనసాగటం విశేషం. ఇవే మానవ మనుగడకు శోభాయమానంగా తలగడలా దోహదం పడుతున్నాయి. ఇంతటి ఆవశ్యకతను సంత రించుకున్న ఈ సాహిత్య కథా ప్రక్రియను రచయిత ఆచార్య గుండెడప్పు కనకయ్య ఎన్నుకుని కొత్త పుంతలను ఆవిష్కరించాడు. తెలంగాణ గుడిసె గోన, గూడెం ఆశలు, గూటం దెబ్బ వాటాలను మన గుంపుకు తెలిసే టట్లు తెలంగాణ మూలవాసి భాష యాసలో విశ్వవిద్యా లయాల ప్రాంగణంలో అభ్యసిస్తున్న భాషాభ్యాసకులకు భావి పౌర సమాజానికి సాహిత్యం ద్వారా గుండె చప్పుడు అక్షర శబ్దంగా వినిపిస్తున్న విజ్ఞాన ఆధునిక ఆచార్యుడు గుండెడప్పు కనకయ్య. 1998లో అచ్చయిన ఆయన కథలకు ఆయన బుద్దెరిన కాలం 1982 నుండి 1997 వరకు తానెరిగిన సత్యాసత్యాలను, ఆయన చూసిన అనుభవించిన జీవితానుభవాలను అక్షరీకరించుకున్నాడు. అవి మేమిట్లుండం కథల రూపంలో మనకందించారు. ఆయన చిత్రించిన కథలు చదువుతుంటే కథలోని పాత్రలు మనతో ముచ్చటిస్తున్నట్లుగా అనిపిస్తాయి. పాఠకుని హృదయాన్ని ఆకర్షించి పఠనాసక్తిని పెంచు తాయి. కథలలోని సంఘటనలు సన్నివేశాలు పాత్రలు సహజంగా పాఠకుని పరిసర ప్రాంతాలలో తటస్థ పడు తుంటాయి. కనుక కథను పూర్తిగా చదివించేలా కనకయ్య గారు తన కథను నడిపిస్తాడు. కష్టజీవి బతుకు చిత్రాన్ని కళ్లకు కట్టినట్లుగా మనకు చూపుతాయి. దగాబడి దిగులు చెందిన రోజువారి కూలి బతుకు దీన స్థితి జీవన చిత్రీ కరణను పాఠకుడు చదివేటప్పుడు భావ లోతుల్లను చూడడానికి కనకయ్య కథలు దివిటీలు పడతాయి. తెలుగు కథా సాహిత్య చరిత్రలో దళితులకు సంబంధించిన కథ భాగ్యరెడ్డి వర్మ రాసిన "వెట్టి మాదిగ

అయితే రెండవ కథ "తెలంగాణోద్యమ కొలిమి" బోయ జంగయ్య రాసిందని సాహిత్య కారులు భావిస్తు న్నారు. అయితే తెలంగాణ రాష్ట్రం కోసం పోరాట క్రమంలో భాగంగానైతే నేమి, దళిత ఉద్యమం లో భాగంగానైతే నేమి ఉద్యమ పర నేపథ్యంలో వచ్చిన మొట్టమొదటి కథల ప్రస్తావన వచ్చినపుడు గుండెడప్పు కనకయ్య రాసిన "మేమిట్లుండం" మొదటి సంపుటి అయితే... మొట్ట మొదటి సంకలనం "ఎదురుచూపులు" గా సాహిత్య కారులు భావిస్తున్నారు. చినుకు అనే మాస పత్రికలో కనకయ్య కథల ప్రస్థావనను మనం గమనించవచ్చు. దళిత ఉద్యమ నేపథ్యం నుండి వచ్చిన "మేమిట్లుండం" అనే కథా సంపుటి మొట్టమొదటిది కాగా ఈయన సంపాదకత్వంలో వచ్చిన "ఎదురుచూపులు" అనే కథా సంకలనం గురించి మొట్ట మొదటి కథా సంకలనం అని ఆచార్య వెలుదండ నిత్యానందరావు ప్రస్తావించటం కనపడుతుంది. బోయ జంగయ్య కథలు చైతన్యాన్ని రగిలిస్తే.... కనకయ్య గారి కథలు ఉద్యమాన్ని సాగిం చాయి. కనకయ్యగారు తన కథలనే అచ్చు వేయించుకోని ప్రాచుర్యం పొందాలనుకునే స్వార్థ పూరిత కథకుడు కాదు

కనుకనే తన తోటి సాహిత్య మిత్రుల కథలను పోగుచేసి పుస్తకంగా తీసుకొచ్చి తనతో పాటు ఇతర కథకులు రాసిన కథలను కూడా సాహిత్య పాఠకులకు పరిచయం చేసిన దాతృత్వ కథకుడు ఈ గుండెడప్ప కనకయ్య. అనాటి నేటి వరకు కూడా ఈ దినచర్యను పాటిస్తునే ఉన్నారు. ఈయన 1992లో రాసిన అక్షరాల బంగారయ్య కథను పరిశీలించినట్లయితే ఇందులో తెలుగు భాషాభివృద్ధికి తేవలసిన దోహద కారకాలను సోదాహరణంగా నొక్కి వక్కాణించారు. భాషావేత్తల ప్రస్థావన గావించారు. ప్రజల భాషకు పట్టం గట్టాడని చెప్పడానికి రుజువు ఈ బంగారయ్య కథలో పాత్రల నోట పలికించిన మాటలు. ఉదా:- ముంతపాగ, కూళ్లగుడి(ఇవి అనాటి శిక్షలు) సీగుడ్లు, కడిగిన ముఖం, రూపాయి బిళ్లంత బొట్టు, మంగళం పెంక..... ఇలా సహజ పద మెరుగులతో భాషాలంకారాలు భాషా సౌందర్యాలు కథలకు అద్దాడు. ఈయన కథలు కల్పితాలు కావు. పాత్రలు ఊహా చిత్రాలు అసలే కావు.

కథలు అల్లడానికి గ్రంథాలయ గడప తొక్కి గంటలకు గంటలు చదివి ఊహించి రాసిన ఊహా కథలు కావు. తాను ఉంట్ను ఊరిలోనే తిరుగాడు తున్న ఇరుగు పొరుగున జరుగుతున్న బతుకు ఉద్యమ బడుగుల జీవన ఒడుదొడుకులను బాదరా బందీలను బాల్యం నుండి కండ్లార చూసిన కనకయ్య అక్షర జ్ఞానం భాషా నైపుణ్య సాధనాలు సాధిస్తూనే బాల్య దశలో తన మనో ఫలకమై ముద్రితమై యదార్థ సంఘటలనే ఇతివృత్తంగా తీసుకొని సాహిత్య లోకానికి చక్కటి కథలను అందించారు. తాను పుట్టిన మహారాజు వంశానికి అస్థిత్వ కులాలు చిందు, మాష్టి, మాతంగి, బైండ్ల జాతులపై జరిగిన దాడులను, అవమానాలను, వివక్షతలను, బాధలను, ఆశ్రిత కులాల కష్ట సుఖాలను కూడా మొట్టమొదటి సారిగా చిత్రించి వారి జీవితాలను కథల్లోకి తెచ్చిన మొదటి కథకుడు కనకయ్య గారు. అంతేకాదు ఈ సమస్యలనన్నింటినీ ఎదుర్కొనే శక్తి యుక్తులను తన కథలలోని పాత్రల ద్వారా లోకానికి తెలియ చేసి, తమ తమ కింది కులాలు కూడా తన కథల ద్వారా జాగృతం కావాలని కోరుకున్న ఒక మంచి కథా రచయిత కనకయ్య గారు.

కనకయ్య గారి కథల్లో యక్షగానం ప్రధానమైన కథ. ఇందులో కథా నాయకుడు చిందు కళాకారుడు మాణిక్యం. ఈ కథా రచయిత ఊరు వీణవంక. పొద్దున్నే నిదుర లేచి పెద్దింటోళ్లయిన మాదిగ పెద్దలందిరి ని ధరంబాయి దగ్గర పోగు చేస్తాడు మాణిక్యం. వారిని కూర్చుండబెట్టి త్యాగం చెప్పమని మాదిగలందరికి దండం పెట్టి చేతులు జోడించి అర్థిస్తాడు.

"ఎన్ని ఆటలు ఆడుతావు మాణిక్యం?" అని మందిలో నుండి పెద్దమాదిగ అడుగుతాడు. అందుకు ''ఐదు ఆటలు, మరియు ఒక ఎల్లమ్మ ఆట ఆడుతమయ్య'' అని జవాబిస్తాడు. మరుసటి రోజు వెన్నెల రాత్రుల్లో వెదురు బొంగుల పందిరి కింద కర్ర బల్లల వేదిక పైకి మద్దెల తాళం మారు మోగుతుండగా తెరలు తొలగించుకొని మొదట బుడ్డరకాన్ పాత్ర ప్రత్యేక పాటలతో తెర బయటకు రావడం అందరికీ హాస్యం బట్టించే రీతిలో పాత్రను కథలో ప్రవేశపెట్టిన చిత్రీకరణ పాఠకుని మదిని దోచే విధంగా ఉంది. వెన్నెల తరిగి యక్షగాన ఆట మంచి రంజుమీద కొనసాగుతుంది. చూడొచ్చిన తల్లులు తమ పిల్లలను తొడల మీద పడుకోబెట్టి జోకొడుతూ ఆటను ఆసక్తిగా చూస్తుండ్రు. ఆరోజు బాలనాగమ్మ యక్షగానం నడుస్తుంది. ఆ ఆటలో బాలనాగమ్మ తన బిడ్డను తొట్లో ఊపుతూ నిద్రబుచ్చుతున్న నడిరేత్రిలో దుమ్ము రేపుతూ ఖాకీల జీబు వెలుగులు జిగేలుమని వేదిక పై ప్రసరించడంతో బాలనాగమ్మ పాత్రధారి చూస్తుండగానే మాదిగ పోరలను పోలీసులు గుంజుక పోవడంతో బాలనాగమ్మ ఆట మధ్యలోనే ఆగిపోవడం ఈ రెండూ సన్నివేశాలను అన్వయించి అబ్బుర పర్చిన కథారంగం బాలనాగమ్మ బాధను గుండెల నిండా ప్రేక్షకులు తరిస్తూ భరిస్తుంటే ఊహించని విధంగా ఖాకీల పాత్రలను ప్రవేశపెట్టి మాదిగ గూడెం రాకాసి రాజ్య

హింసతో మాదిగ గూడెం బోరుమని గుండెలు బాదు కోవడం ఆ స్థలం ఆవేదన రోదన పెడ బొబ్బల మయంతో కళ్లకు కట్టినట్లు కనకయ్య రాజ్య హింసను ఫకీరు మాయాజాలాన్ని అన్వయించిన చూపెట్టిన దృశ్యమును కళ్లముందుంచాడు కథా రచయిత. ఈ కథంతా పరమ అద్భుతంగా చిత్రీకరించబడింది అనటంలో సందేహం లేదు.

"మరో కథ ఉత్పాదకులం". ఇందులో పాత్రలు స్వీయ నియంత్రణతో శ్రమించి జీవించాలని, పని చేయకపోతే ఈ పుడమి మీద బతుకు ఎందుకు అని అసలు ప్రాణంతో ఉండటమే వేస్టు అని తెలిపే కథ. తమను తామే ప్రశ్నించుకునే , ఆచరించి తనువు చాలించే రోషం గల మనుషులు మాదిగ కులస్థులని చెప్పే సత్యాన్ని ఈ కథలో చక్కగా చిత్రీకరించారు.

ఇంకొక కథ "కనకపు గుడి" ఇందులో పాత్రలు దొర సుశీల. కనకయ్య ఈ ముగుర్గరి చుట్టే ప్రధానంగా కథ ముందుకు సాగుతుంది. ఇందులో సుశీల సహజ సౌందర్యాన్ని చూసి మోహపడిన దొర పని నెపము మీద దగ్గరకు తీసుకొని బలవంతంగా సుశీలను లొంగదీసుకుని దొంగనంగా నిత్యం అనుభవిస్తూ వారం రోజులు తన వాంఛను తీర్చుకుంటాడు. తీర కోరిక తీరినంక నీవు నాకు అక్కర లేదు అని సుశీలను పనిలో నుండి తీసివేస్తాడు. అదేంటి నీ అక్కర కొచ్చిన దిక్కులేనిదాన్ని ఎక్కడికి పోతాను దొరా... నీ లెక్క తేల్చాకే పోతా అని సుశీల అనగానే ఆవేశంతో దొర వెనుక ముందు ఆలోచించ కుండా బంగ్లా నుండి సుశీలను పడదోస్తాడు. పడిపోయిన సుశీల నిర్జీవిగా శవమైంది. వెంటనే దొరగారు కనకయ్యను పిలిపించుకొని ఈ శవాన్ని ఊరిబయట పడేసి రమ్మని పురమాయిస్తాడు. దొరకు జీతం ఉన్న పాపానికి కనకయ్య ఆ శవాన్ని భుజానేసుకొని ఊరి బయటకి వెళ్లే బడుతాడు. ఈ ఘోరానికి పాలుబడినది తన పాలేరు కనకయ్యనే అని నమ్మించడానికి తానే ఈ విషయాన్ని ఊరి వాళ్లకు చెప్పి కనకయ్యను రెడ్ హాండెడ్‌గా పట్టిస్తాడు. ఇక తాను చేసిన నేరాన్ని కనకయ్య మీదకు నెట్టి వేసి ఊరి వారిని నమ్మించి కనకయ్యను ఊరిలో నుండి వెలివేయిస్తాడు. కనకయ్య ఊరి బయటే వనంలో ఆవాసం ఏర్పాటు చేసుకొని ప్రకృతి వైద్యం ప్రజలకందించి ప్రజలల్లో మంచి పేరు సంపాదించి సహజ జీవనం కొనసాగిస్తాడు. కాలం కరిగి కొన్నాళ్లకు దొరకు పచ్చ కామెర్ల రోగం విచ్చి కనకయ్య దగ్గరకు పోవలసి వచ్చింది. కనకయ్య కృషిని పరోపకారం ఉచిత వైద్యం ఆరోగ్య పర్యావరణ పరిరక్షణ కీర్తిని ఓర్వని దొరతనం పొగరుతో పాటు జీవ వైద్య ప్రాముఖ్యతను ప్రబోధించే కథ రచయిత నిర్మించిన కనకపు గుడి కథ. ఈ కథ ద్వారా పర్యావరణ పరిరక్షణ జీవవైవిధ్య జీవన ప్రాముఖ్యతను సహజ రీతిలో సామాన్య జనాలకు సైతం అర్థమయ్యే విధంగా గొప్ప సందేశం ఇచ్చారు.

విడాకులు అనే పేరుతో మరో కథ ఆదివాసి జీవన సంస్కృతిని, ఆచారాలను, భాషా సౌందర్యాన్ని మొదలగు వస్తు రూప అభివ్యక్తీకరణను వ్యక్తీకరించిన కథ. కథలో కథా నాయకి శరీర సౌందర్య సొంపు కెంపుల సోయగాలకు సొంగలు కారుస్తూ సొంత మేనమామే ఆ వనిత సౌందర్య వంపులను బలవంతంగా తన వడి బిగి కౌగిలిలో బంధించి బలత్కారం చేసి తన బలమైన కోరికను ఏక పక్షంగా తీర్చుకుంటాడు. ఈ విషయం పొక్కకుండా తన పోట్టలో పాతరేసింది కథానాయకి. ఈ కథానాయకిని పసి గట్టిన గూడెంలో సింగడు అనే ఒక వ్యక్తి కూడా ఈ అందాల రాసిని అనుభవించడానికి అదును కోసం కాపు కాస్తాడు. ఒకరోజు అదును కాచి ఆగం చేసిండు. అడవిలో బలవంతడిదే భామ ప్రేమైనా సారవంతమైన భూమైనా అనే సూక్తి నిర్ధారణ అయిపోయింది. ఇలా ఆదివాసుల జీవితాన్ని నాశనం పదాహారు పాళ్లు చేసే వివక్షతను, వారి నిజ జీవన చిత్రణను విడాకులు అనే కథ ద్వార సాహిత్య లోకానికి చక్కగా తెలియ చేసాడు కథకుడు.

మరో కథ బయోగ్రఫీలకి తొంగి చూసే ముందు ఇక్కడ ఒక విషయం మనం మననం చేసుకోవాలి. బయో గ్రఫీ రాయాలంటే బలమైన మనో ధైర్యం మనలో

ఉండాలనే విషయం మనకందరికీ తెలియంది కాదు. అది రచయితలో పుష్కలంగా ఉంది కనకనే... ఈ బయోగ్రఫీలో కథా నాయకి ప్రేమ కులవివక్షతతో కుటుంబ పెద్దల బలవంతాన వికలమై మరొకరితో పెండ్లయిన తన పెనిమిటితో ఏమీ పాలుపోక ఎదలో ప్రియుని జ్ఞాపకాలు మరువలే ప్రియుడు రాసిన లేఖలో ఇలా వ్యక్తీకరిస్తాడు. 'డార్లింగ్ నా అన్న నీ కులం తెలియడంతో నిన్ను కాదని మరొకరితో బలవంతంగా పెండ్లి చేసినా ఇచట నా పెనిమిటితో ప్రేమగా ఉండలేక పోతున్నాను... మర బొమ్మలా కాపురం చేస్తున్నాను. నా మనసు నీ జ్ఞాపకాలతో బతుకుతుందని చెప్పించటంలో రచయిత పరోక్షంగా ప్రేమకు కులం అడ్డుకాకూడదు ఒకవేళ అడ్డగించినా ఆ బిడ్డలు ఆనంతంగా జీవితం కొనసాగించలేరని సమాజానికి చక్కటి సందేశం ఇచ్చారు.

ఇలా చెప్పుకుంటూ పోతే కనకయ్య గారి కథలు కల్పితాలు కాదు భారత దేశ మూలవాసుల గతాలు అని, జీవిత సత్యాలు అని, ఈ రచయిత కథలలో వాడిన భాష సౌందర్యం , శిల్పం కథనం పాత్రలు ఎచట నుండో ఏరుకొచ్చినవి కావు అని, ఏ గ్రంథాల నుండో అనుకరించి నవి అంతకన్నా కావు అని, కనకయ్య కథల మూలాలు తను పుట్టిన తూరుపువాడలో తాను ఎదుగుతున్న క్రమంలో తన నేత్రాలు చూసిన నిజమైన పాత్రల జీవితాలని విమర్శకుల భావన. పల్లె జీవితాలను ముఖ్యంగా దళిత జీవితాలను తీసుకొని, వారి శక్తి యుక్తులను ప్రేమానురాగాలను బంధ అనుబంధాల తీగలను, వారి జీవన వైవిధ్యాన్ని చరిత్రను తన కథలలో అందంగా చిత్రీకరించి భావి తరానికి సందేశమందించి వర్తమాన కథకులకు వంతెన అవసరము లేని కథా మార్గాలు ఇరువై యేండ్ల ముందే వేసిన కథల మార్గ దర్శకుడు గుండెడప్పు కనకయ్యగారు అభినందనీయులు.

ఆ మె

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు సాహిత్యంలో హేతువాద ఛాయలు

– డా॥. బుశెట్టి ఉపేంద్ర, అతిథి అధ్యాపకుడు ఎ.పి. ట్రిపుల్ ఐటి, ఆర్.కె.వ్యాలీ, కడప.

హేతువాదం అనే తాత్విక విధానాన్ని విశ్వసించి అనుసరించే వారిని హేతువాదులు అంటారు. హేతువు అంటే కారణం అని అర్థం. ఏదైనా ఒక విషయాన్ని గుడ్డిగా విశ్వసించకుండా దానికి కారణాలు అన్వేషించడం లేదా ఆరాతీయడాన్ని హేతువాదం అంటారు. జ్ఞానానికి లేదా ఋజువుకు హేతువు లేదా కారనం అనేది మాత్రమే నమ్మదగిన ఆధారం అని భావించే తాత్వికధోరణిని హేతువాదం అంటారు. దీనిని ఆంగ్లంలో "Rationalism, a philosophical position, theory or view that reason is the source of knowledge" అంటారు. ఆస్తికవాదులు మతంలో ఉంటూనే అహేతుక విషయాలను ప్రశ్నిస్తూ ఉంటారు. మూఢాచారాలను సంస్కరించాలని చూస్తారు. నాస్తిక హేతువాదులు దేవుడిని పూర్తిగా ఒప్పుకోరు. ప్రతిదానికి కారణం ఉంటుందని నమ్ముతారు.

రామాయణంలో జాబాలి, భారతంలో చార్వాకుడు నాస్తికులుగా కనిపిస్తారు. ఆతరువాత వారి వారసత్వాన్ని స్వీకరించిన హేతువాదులెందరో తెలుగుదేశంలో ఉన్నారు. వారిలో వేమన, పోతులూరి వీరబ్రహ్మం, స్వామినేని ముద్దునరసింహ నాయుడు, కందుకూరి వీరేశలింగం, ఆరుద్ర, ముద్దుకృష్ణ, చలం, కొడవటిగంటి కుటుంబరావు, పింగళి దశరథరామ్, మల్లాది సుబ్బమ్మ, అదృష్టదీపక్, గుమ్మా వీరన్న, పసల భీమన్న, ముక్కామల నాగభూషణం, ఆవుల గోపాలకృష్ణమూర్తి, గోరా, త్రిపురనేని రామస్వామి చౌదరి, తాపీ ధర్మారావు, శ్రీశ్రీ, కట్టమంచి రామలింగారెడ్డి, బాబుగోగినేని, నార్ల వెంకటేశ్వరరావు, కొత్త సత్య నారాయణ చౌదరి, రంగనాయకమ్మ, బి. రామకృష్ణ, డా॥ గురుకుల మిత్ర, ఈశ్వరప్రభు, రావిపూడి వెంకటాద్రి, ఎన్. ఇన్నయ్య, కత్తి పద్మారావు, భూపతి నారాయణ మూర్తి, డా॥ జయ గోపాల్, గోపరాజులవణం, అల్లం మాణిక్యాలరావు, పాలగుమ్మ పద్మరాజు, బి.వి. కృష్ణారావు, క్రాంతికార్, గుత్తా రాధాకృష్ణ, గూడవల్లి రామబ్రహ్మం, ఎన్.జి. రంగా, ఖాసాసుబ్బారావు, సరస్వతీ గోరా, కొడాలి కమలాంబ, చెన్నుపాటి విద్య, దాసురామస్వామి, రావి సుబ్బారావు, వెనిగళ్ళ కోయల, కొండవీటి వెంకటకవి, ఆలూరి బైరాగి, దేవరపల్లి మస్తాన్ రావు, చేవపట్ల నాగసిద్ధారెడ్డి వంటి వారిని ప్రముఖులుగా పేర్కొనవచ్చు. వీరు గాక ఇంకా ఎందరో హేతువాదులున్నారు.

రామాయణ, భారతాల్లో నాస్తికుల గురించి స్వచ్ఛంగా ఉన్నా, ఆతరువాతి కవులు వీరిని విపులంగానే అక్కడక్కడ ప్రస్తావించారు. నైషధంలో కలిపురుషుడు వర్తించిన తీరును శ్రీహర్షుడు కొన్ని శ్లోకాలలో వర్ణించాడు. వాటిని వివిధ పద్యాలలో తెనిగించి, ఒక శ్లోకంలోని భావాన్ని విపులంగా సీసపద్యంలో చెబుతూ తన కాలం నాటి నాస్తికులను శ్రీనాథుడు ఇలా వివరించాడు.

సీ॥ బౌద్ధుల బాటించు బరమ బంధుల వోలె
చార్వాకులకు కరాంజలి ఘటించు
జైనుల బొడగన్న సంతోషమున తేలు
చేయని మ్రొక్కు లోకాయతులకు
వైతండికుల కభివాదనం బొనరించు
బాషండులకు జాల భక్తిసేయు,
కాపాలికులకు సత్కారంబు కావించు
పరిచయించును దిగంబరుల తోడ

పాశుపత కక్ష పాలికా భస్మధూళి
పాళి యద్ధాళిన క్రియా వేళందు
గాలి వెంబడి బైరాలి గళవళించు
కలియుగంబు పావకవిస్ఫులింగంబులనుచు
(శృంగారనైషధము-7-127)

బౌద్ధులు, చార్వాకులు, జైనులు, లోకాయతులు, వైతండికులు, పాషండులు, కాపాలికులు, దిగంబరులు,

పాశుపతులు అనే తొమ్మిది రకాల నాస్తికులను ఈ పద్యంలో శ్రీనాథుడు చెప్పాడు. శృంగారనైషధం తర్వాత లోకాయతమతాన్ని చార్వాకాన్న పేర్కొనే తెలుగు గ్రంథం 'ప్రబోధ చంద్రోదయం'. దానిని 1480 ప్రాంతంలో నందిమల్లయ, ఘంట సింగన అనే జంటకవులు తెనిగించారు. దీనికి కృష్ణమిశ్రుడు సంస్కృతంలో రాసిన ప్రబోధ చంద్రోదయం అనే నాటకం మాతృక. ఇందులో చార్వాక, బౌద్ధ, జైన, సోమ సిద్ధాంతాలను హేయంగా అవహేళనం చేయటం జరిగింది. అయినా వాటిల్లో సిద్ధాంత బలం ఉండటం మూలంగా నేటికీ నిలిచి ఉన్నాయి.

తెలుగు దేశంలో హేతువాదాన్ని అలతి అలతి పదాల్లో పండించిన ప్రజాకవి వేమన. ఆదిమ కాలంలో లోకాయత మతం పుట్టినప్పుడు రాజులు బాగానే ఉండేవారు. తరువాత రాజరికాల్లో అవలక్షణాలు, అవినీతులు, దుర్మార్గాలు ప్రవేశించాయి. అలాంటి లక్షణాలు ధర్మ రాజులో పొడసూపాయంటాడు వేమన. దీనికి ఈ కింది పద్యాన్ని నిదర్శనంగా ఉటంకించవచ్చు.

కులము నీరు జేసి గురువును వధియంప
పాసగ నేను గంత బొంకు బొంకె
పేరు ధర్మరాజు పెనువేప విత్తయా
విశ్వదాభిరామ వినుర వేమ - అంటాడు.

రాజ్య కాంక్షతోనే ధర్మరాజు 'అశ్వత్థామ హతః కుంజరః' అన్నాడని, దాని మూలంగానే గురువు ద్రోణుడు మత్యకు గురయ్యాడని, అందుకే పేరు ధర్మరాజే కానీ, పెను వేపవిత్తనం వంటివాడని హేతు దృక్పథంతో చెప్పాడు. ధర్మరాజును ఒక్క మాటలో విమర్శించిన ఘనత ఒక్క వేమనకే దక్కుతుంది.

చార్వాకులలాగే వేమన కూడా ఇహలోకాన్నే నమ్ముతాడు. పరలోకాన్ని నమ్మడు. దీనికి నిదర్శనమే ఈ కిందిపద్యం.

ఇహునందు సుఖమె యింపారలేదట
పరమునందు సుఖము బడయుటెట్లు?
మొదలు చేవ లేక తుదనెట్లు కలుగురా
విశ్వదాభిరామ వినుర వేమ - అంటాడు.

చెట్టుకు మొదట లేని చేవ చివర ఎలా ఉండదో అదే విధంగా ఇహలోకంలో లేని సుఖం పరలోకంలో లభించదు.

మనుష్యులు మరణించిన తరువాత తద్దినాలు మొదలైన కర్మలు పురోహితులు జీవనోపాధికోసం సృష్టించారు. అంతేకానీ అంతకు మించిన ప్రయోజనం లేదని చార్వాకులు బలంగా చెప్పారు. ఈ విషయాన్ని వేమన ఇలా ఎండగట్టాడు.

పిండములను జేసి పితరుల తలపోసి
కాకులకును పెట్టు గాడ్దెలార
పెంటతినెడి కాకి పితరుడెట్లాయరా
విశ్వదాభిరామ వినురవేమ - అంటాడు.

పిండాలు చేసి పితరులను తలచుకొని దుఃఖిస్తూ ఆపిండాన్ని కాకులకు పెట్టే గాడెదలారా! పెంట తినెడి కాకి పితరుడెట్లవుతాడని సూటిగా ప్రశ్నిస్తాడు.

చార్వాకుల మతం ప్రకారం 'దేహచ్ఛేదో మోక్షః' దేహ వినాశనమే మోక్షం. మనుష్యుడు మరణించినప్పుడు పాంచభౌతికమైన అతని దేహంలోని భూతాలు విశ్వంలోని భూతాలతో కలసి పోతాయి. ఈ విషయాన్ని గూర్చి వేమన ఇలా అంటాడు.

గాలి గాలి గలిసే గగనంబు గగనంబు
మన్ను మన్ను గలిసె మంట మంట
నీరు నీటగలిసె నిర్మలంబై యుండె
విశ్వదాభిరామ వినువేమ - అంటాడు వేమన.

గాలి గాలిలో, నీరు నీటిలో కలిసిపోతుందని స్పష్టంగా పేర్కొన్నాడు వేమన.

వేమన, వీరబ్రహ్మంల తర్వాత హేతువాదాన్ని పతాక స్థాయికి తీసికెళ్ళిన మహాకవి త్రిపురనేని రామస్వామి చౌదరి. ఈయన కురుక్షేత్ర సంగ్రామం, ఖూనీ, శంబూక వధ, బ్రహ్మభగవద్గీత, సూతాశ్రమ గీతాలు, సూత

పురాణం, వివాహ విధి వంటి కావ్యాలు, నాటకాలు, గేయాలు రాశారు. పురాణాలను హేతుదృక్పథంతో విమర్శిస్తూ సూతపురాణం, మహాభారతం వృత్తాంతంలో పాండవుల అధర్మతత్వాన్ని ఎండగడుతూ కురుక్షేత్ర సంగ్రామం, భాగవతంలోని పురోహితుల కుట్రను బట్ట బయలు చేస్తూ ఖూనీ, రామాయణంలోని శ్రీరాముని వర్ణాధిపత్యాన్ని బహిరంగ పరుస్తూ శంబూక వధ రాశాడు. పెళ్ళి మంత్రాల్లోని అసంబద్ధతలను హేతుదృష్టితో ప్రశ్నిస్తూ వివాహ విధి రాశాడు. ఇంకా ఎన్నో గేయాలూ రాశాడు. అన్నింటిలోనూ హేతువాదం ఉంది.

రాయబారిగా కౌరవుల వద్దకు వచ్చిన శ్రీకృష్ణుడు దుర్యోధనుని ఆతిథ్యం స్వీకరించకుండా విదురుని ఇంటికేగి విడిది చేస్తాడు. ఈ విషయాన్ని రామస్వామి చౌదరి కర్ణునిచేత ఇలా ప్రశ్నింపజేస్తారు.

ఎవనితో సంధి కార్యంబు నీవు నడప
భవ్యమాని వచ్చి నావో యవ్వాని యింట
గుడిచి కూర్చుండి సంధిమాటడుగవచ్చు
నంతియేగాని ఈరీతి నాచరింతె? - అంటాడు.

ఈ లోక నీతిప్రశ్నకు సమాధానం చెప్పేవారు లేరు. ఇంత ఘాటుగా ఉంటాయి రామస్వామి ప్రశ్నలు.

శంబుక వధలో వర్ణాశ్రమ ధర్మాలు, తీర్పులు ఎంత పక్షపాతంగా ఉన్నాయో పూసగుచ్చినట్లు తెలిపాడు. అహదుడు హనుమంతుని ఇలా ప్రశ్నిస్తాడు.

సీ॥ చోరత్వమును జేయ శూద్రునకవయవ
విచ్ఛేదనము శాస్త్ర విహితమంట!
ఆదోషమునె విప్రుడాచరించిన యంత
మందలింపులె ధర్మమార్గమంట!
బ్రాహ్మణీ స్నేహ సంపర్కమ్ముగల శూద్ర
నగ్ని కర్పించుట న్యాయమంట!
శూద్ర వనిత యరుల్ సొక్కిన విప్రుండ
సంతాప పడుటయే చాలునంట!

తే.గీ. ఇవియె మన ధర్మశాస్త్రము లిందు నందు
నివియె చుమ్ము నిష్పక్ష పాతైక బుద్ధి
మనకుగాఁజెప్పి పెట్టిన మహితము లకు
గ్రండరాజముల్ వానర రాజ పుత్ర

దొంగతనం చేసిన, వ్యభిచారం చేసినా బ్రాహ్మణులకు స్వల్ప శిక్షలు వేయాలని, అదే నేరం తక్కిన సామాజిక వర్గంవారు చేస్తే కఠినంగా శిక్షించాలని మనుస్మృతి చెబుతుంది. ఈ పక్షపాతాన్ని రామస్వామి ఖండించాడు. హేతువాద దృష్టితో సాంఘిక న్యాయసాధన కోసం మానవతా విలువల ఆవిష్కరణ కోసం జీవితాన్ని వెచ్చించిన మనీషి కవిరాజు రామస్వామి చౌదరి గారు. మనిషి మనిషిగా మనగలిగిన సంస్కృతీ సంపన్నతను ఆయన సంతరించారు. భావవిప్లవ భావప్రభావాలను అందించారు. ఆ కృషిలోనే చివరి నిశ్వాసం విడిచారు.

రామస్వామి చౌదరి తరువాత ముద్దుకృష్ణమ, నార్ల వెంకటేశ్వరరావు, కత్తి పద్మారావు తదితరులు హేతువాదాన్ని తమ వారసత్వంగా స్వీకరించి రచనలు చేస్తున్నారు. దీనినిబట్టి హేతువు ద్వారానే ప్రపంచం విజ్ఞానం వైపు నడుస్తున్నదని సూటిగా చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1. వేమన పద్యాలు - వేమన
2. సూత పురాణం - త్రిపురనేని రామస్వామి చౌదరి
3. శంబూక వధ - త్రిపురనేని రామస్వామి చౌదరి
4. ఖూనీ - త్రిపురనేని రామస్వామి చౌదరి
5. కురుక్షేత్ర సంగ్రామం-త్రిపురనేని రామస్వామి చౌదరి
6. శృంగార నైషధము - శ్రీనాథుడు
7. ఆంధ్రమహాభారతము - శాంతిపర్వము - తిక్కన
8. రామాయణము - వాల్మీకి
9. మన వేమన - ఆరుద్ర

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావ వీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఎం.ఆర్.అరుణ కుమారి గారి కథలలో స్త్రీ చైతన్యం

– డా॥ ఇ. కోనప్రభ, రీసెర్చ్ అసోసియేట్, మహిళా అధ్యయన కేంద్రం, శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, తిరుపతి.

ఎం. ఆర్. అరుణ కుమారి గారు చిత్తూరు జిల్లాకు చెందిన రచయిత్రి. ఈమె 1960లో జన్మించారు. అలివేలమ్మ, ఎం.ఆర్.చంద్ర గార్లు వీరి తల్లిదండ్రులు. ఎం.ఆర్.అరుణ కుమారి గారు వేగుచుక్క (1996), సాగరకోయిల (2003) మన్నులో మన్నునై(2006) మొదలైన కథా సంపుటాలను వెలువరించారు. ఈమె కథలు భావాత్మకంగానూ, ఆలోచనాత్మకంగానూ, సందేశాత్మకంగానూ వుంటాయి. ఈమె వ్రాసిన కథలలో పురుషాధిక్యతా సమాజంలో అణచివేతకు గురవుతున్న స్త్రీల సమస్యా చిత్రణ, మానవ సంబంధాలు మొదలైన అంశాలు ప్రాధాన్యతను సంతరించుకుని కనిపిస్తాయి. ఈ నేపధ్యంతో స్త్రీ చైతన్యం అనే కోణంనుండి అరుణ కుమారి గారి కథలను పరిశీలించడం జరిగింది. ఇందుకై అరుణకుమారి గారి మన్నులో మన్నునై అనే కథా సంపుటాన్ని ఎంచుకోవడం జరిగింది. ఈ కథా సంపుటిలో స్త్రీచైతన్యం ప్రధానంగా వ్రాయబడిన కథలు నిశ్శబ్ద కెరటాలు, పాడవే కోయిలా, అడవి పువ్వు, మాఆయన పెళ్ళి రద్దుచేయండి, శిశిరంలో వసంతం, మరణ శాసనం, విషాదగీతం, దొరసాని బతుకులు, వంధ్యశిల మొదలైన కథలు.

ముఖ్యాంశాలు :

మన్నులో మన్నునై కథా సంపుటిలోని కథలు, స్త్రీ సమస్యా చిత్రణ, స్త్రీ చైతన్యం, పోరాటపటిమ.

1. నిశ్శబ్ద కెరటాలు :

పెళ్ళి పేరుతో తనకు జరగబోతున్న అన్యాయాన్ని సహించలేక ధైర్యంతో ఒక అమ్మాయి చేసిన తిరుగుబాటే ఇందులోని కథ. ఈకథలోని ప్రధాన పాత్రపేరు అమీనా. అమీనాది ఒక పేద ముస్లిం కుటుంబం. మూడు పూటలా తిండి దొరికితే పండగే అనుకునే పరిస్థితి వారిది. వారి పేదరికాన్ని ఆసరాగా చేసుకుని నజీర్ అనే పెళ్ళిళ్ళ బ్రోకర్ ఒక పెళ్ళి సంబంధం తీసుకు వస్తాడు. పెళ్ళి కొడుకు ఇదివరకే పెళ్ళిళ్ళు జరిగిన కోటీశ్వరుడైన డెబ్భైఏళ్ళ అరబ్ షేక్ అని, ఎదురు కట్నం (కావలసిన డబ్బు, బంగారం, చీరలు) ఇచ్చి మరీ పెళ్ళి చేసుకుంటాడని, అమీనా చెప్పినట్లు వింటే తనతో పాటుగా తీసుకు వెళతాడని చెబుతాడు. వివరాలు విన్న తరువాత అమీనా తల్లి ఫాతిమా కొంచెం కంగారు పడినా నజీర్ మాటల గారడితో తన కూతురు సుఖపడుతుందని భ్రమపడి పెళ్ళికి అంగీకరిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న అమీనాకు రాత్రి బడిలో విన్న పూర్ణమ్మ కథ గుర్తుకు వస్తుంది. ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో అమీనాకు జీవితమే ఒక యుద్ధమైనప్పుడు నిలిచి పోరాడకుండా చావు అనే మార్గంలో పారిపోవాలనుకోవడం పిరికితనం. ఎక్కడ పోగొట్టుకుంటామో అక్కడ వెతుక్కోవాలి. సమస్య పుట్టిన చోటే పరిష్కారముంటుంది కానీ ప్రతి సమస్యకు చావే పరిష్కారమనుకోవడం మూర్ఖత్వం, అన్న తన స్నేహితురాలు జరీనా మాటలు గుర్తుకువచ్చి ఎక్కడలేని ధైర్యం తెచ్చుకుని ఇష్టంలేని పెళ్ళి చేసుకోలేనని తల్లితో చెబుతుంది అమీనా. పెళ్ళికి అమీనా అంగీకారం కోసం ఫాతిమా ప్రయోగించిన సామదానబేధ దండోపాయాలేవీ అమీనాను మార్చలేక పాయాయి. దీంతో తలుపు తడుతున్న అదృష్టాన్ని చేజేతులా కాలదన్నుకోవడం బుద్ధిలేని పని అంటూ అమీనాతో వాగ్వివాదానికి దిగిన ఫాతిమాతో అమ్మా, ఒకసారి ప్రశాంతంగా ఆలోచించు, నువ్వు నిజంగా నీ కూతురి సుఖసంతోషాలు కోరుకుంటున్నావా, అతనిచ్చే డబ్బు, బంగారానికి కూతుర్ని అమ్మివేయాలనుకుంటున్నావా, పెళ్ళే జీవితం కాదు పగలు ఫ్యాక్టరీ పనికి పోతాను, రాత్రి చదువుకొని ఉద్యోగం చేసి మిమ్మల్ని పోషిస్తాను, అత్యాశలకు పోయి నా జీవితాన్ని నాశనం

చేయవద్దు, అన్న అమీనా మాటలు ఫాతిమాను ఆలోచనలో పడవేశాయి. చివరకు అరబ్బుషేక్‌ను పెళ్ళి చేసుకుని వెళ్ళి చిత్రహింసలను భరించలేక అతి కష్టంమీద పారిపోయి వచ్చిన జరీనా మరియు గల్లీలోని ఆడపిల్లలతో కలసి కమీషన్లకు ఆశపడి ఆడపిల్లల జీవితాలతో ఆడుకుంటున్న నజీర్‌లాంటి వెధవలకు బుద్ధిచెప్పడానికి ఉద్యమం చేయాలని నిర్ణయించుకుంటుంది అమీనా. ఇలా అమీనా ధైర్యంగా ఎదురు తిరిగి తనను తాను కాపాడుకోవడమే కాకుండా నజీర్ లాంటి బ్రోకర్లకు బుద్ధి చెప్పడానికి పూనుకోవడం ఆమెలో కలిగిన చైతన్యానికి నిదర్శనం.

2. పాడవే కోయిలా :

ఈ కథలో ఉష కథానాయిక. డిగ్రీ వరకు చదివి సివిల్స్ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంటుంది. చదువుసంధ్య ల్లేని ఒక పోకిరి వెధవ ప్రేమిస్తున్నానని ఉష వెంటపడి వేధిస్తుంటాడు. వాడు ఎంతగా ప్రయత్నించినా ఉష పట్టించుకోకపోవడంతో ఆమెను పాడుజేస్తే చచ్చినట్టు పెళ్ళికి ఒప్పుకొంటుందని ఉషను రేప్ చేస్తాడు. కోర్టు, కేసులు అని విషయం బయటకు పొక్కితే అప్రతిష్ట, అవమానం అని ఇష్టం లేకపోయినప్పటికీ వాడితో ఉష పెళ్ళికి సిద్ధపడతారు ఉష కుటుంబ సభ్యులు. అయితే వాడిని పెళ్ళి చేసుకోవడం ఇష్టంలేని ఉష నా ప్రమేయం, బాధ్యత లేకుండా ఎవరో చేసిన తప్పుకు శిక్ష నేనెందుకు అనుభవించాలి. జరిగింది ఒక ప్రమాదంగా ఎందుకు అనుకోరు. గాయపడ్డాను. శారీరకంగా,మానసికంగా ధైర్యం చెప్పి నయంచేయాల్సింది పోయి రోజు ఇదే ప్రమాదానికి గురౌతూ వుండు అని శాశ్వతంగా శిక్ష విధించడం న్యాయమా? అని అంటూ వాళ్ళ నాన్నమ్మకు నచ్చజెప్పి ఒప్పించి పెళ్ళి జరగకుండా తనను తాను కాపాడుకుని పరీక్షలు రాయడానికి సిద్ధపడుతుంది. ఈ కథలో శీలమంటే మనిషి సచ్ఛీలతే కానీ శారీరక పవిత్రత మాత్రమే కాదు అంటూ ఉష నిరాకరించి చైతన్యవంతంగా ముందుకు అడుగువేయడం ఆదర్శనీయం.

3. అడవి పువ్వు :

ఈ కథ లో కాలి ఒక గిరిజన యువతి. ఫారెస్ట్ ఆఫీసరైన శేఖరం తన భార్య పురిటికి పుట్టింటికి వెళ్ళిన సమయంలో తన ఇంట్లో పనిమనిషిగా వున్న కాలిని పెళ్ళిచేసుకుంటా నని నమ్మించి లొంగదీసుకుంటాడు. ఫలితంగా పెళ్ళి కాకముందే కాలి గర్భవతి అవుతుంది. కట్టుబాట్లు పేరుతో కాలి తల్లిదండ్రులు ఆమెను ఇంటినుండి వెలివేస్తారు. శేఖరం బదిలీ చేసుకొని వెళ్ళిపోతాడు. మెడలో తాళి లేకుండా, ఆదరించేవారు లేకుండా సమాజంనుండి ఎన్నో అవమానాలు, ఎగతాళులను ఎదుర్కొంటూ మోతీకి జన్మ నిచ్చి పెంచి పెద్ద చేస్తుంది కాలి. మోతీ చదువులో ముందుండటంతో బాలయ్య మాష్టారు సలహాతో పట్నంలోని కాలేజిలో చేర్పిస్తుంది.

తల్లి ద్వారా గతాన్ని తెలుసుకున్న మోతీ తన చదువు తున్న కాలేజిలోనే చదువుతున్న శేఖరం కొడుకు వినీత్‌తో జరిగిందంతా చెప్పి మోతి, వినీత్‌లు ప్రేమించుకుంటు నట్లు నాటకమాడి పెళ్ళికి పెద్దలు ఒప్పుకోవడం లేదని వినీత్‌తో కలసి పోలీస్ స్టేషన్ ఎదుట నిరాహార దీక్షకు కూర్చుంటుంది మోతీ. ఈ విషయం తెలుసుకున్న వినీత్ తల్లిదండ్రులు, కాలి అక్కడకు చేరుకుంటారు. అక్కడ మోతీ తల్లి కాలిని చూసి మోతీ తన కూతురేనని తెలుసు కున్న శేఖరం అన్నా చెల్లెళ్ళ పెళ్ళి అనాగరికమనీ, పెళ్ళి జరగకూడదని కంగారు పడుతుంటాడు. పెళ్ళి జరగ కూడదనుకుంటే శేఖరం కాలిని పెళ్ళి చేసుకోవాలని చెబుతుంది మోతీ. అందుకు శేఖరం అంగీకరిస్తాడు. ఇలా మోతీ తన పుట్టుక అపవిత్రం, అక్రమం కాదని, తన తల్లి పతిత కాదని, తన తండ్రి శేఖరమని సమాజానికి తెలియజేస్తుంది. ఈ కథలో మోతీ ప్రదర్శించిన ఆత్మస్థైర్యం, పోరాట పటిమ, చైతన్యం స్త్రీజాతికి ఆదర్శ నీయం.

4. మా ఆయన పెళ్ళి రద్దు చేయండి :

ఈ కథలో అలివేలమ్మ చదువులేని ఒక గ్రామీణ స్త్రీ. వెంకటప్ప అలివేలమ్మ భర్త. చిన్నప్పుడే తల్లిదండ్రులను

పోగొట్టుకున్న మల్లిని అత్తా మేనమామలైన అలివేలమ్మ, వెంకటప్పలు పెంచి పెద్దచేస్తారు. కూతురు లాంటి మల్లిని ఆస్తిపాస్తులకు ఆశపడి బలవంతంగా పెళ్ళి చేసుకుంటాడు వెంకటప్ప. ఈ విషయం తెలుసుకున్న అలివేలమ్మ మల్లి జీవితాన్ని కాపాడాలనే ఉద్దేశ్యంతో తన భర్తకు ఎదురు తిరిగి తనతో సాంసారిక జీవితం అనుభవిస్తూనే, తన భర్త మైనర్ బాలిక అయిన మేన కోడల్ని పునర్వివాహం చేసుకున్నాడని, ఆ వివాహాన్ని రద్దు పరచమని, ఫ్యామిలీ కోర్టులో కేసుపెడుతుంది. దాంతో పెళ్ళి రద్దవుతుంది. చివరకు మల్లి తనను ప్రేమించిన సందీప్‌ని పెళ్ళి చేసుకుంటుంది. ఈ కథలో మల్లి జీవితాన్ని కాపాడడం కోసం అలివేలమ్మ భర్తకు ఎదురు తిరగడం ఆమెలో కలిగిన అభ్యుదయానికి నిదర్శనం.

5. శిశిరంలో వసంతం :

ఈ కథలో గిరి పెళ్ళి చేసుకోకుండా ఉద్యోగం చేస్తూ కుటుంబ బాధ్యతలను మోస్తుంది. నలుగురు చెల్లెళ్ళను చదివించి వారికి పెళ్ళిళ్ళు చేస్తుంది. తీరా పెళ్ళి వయస్సు దాటాక తన ఆఫీసులో పనిచేసే అటెండర్ వసంత్‌ను పెళ్ళి చేసుకోవాలనుకుంటుంది గిరి. అందుకు గిరి అమ్మా చెల్లెళ్ళు అంగీకరించరు. ఈ వయస్సులో నీకు పెళ్ళేమిటని పెళ్ళి చేసుకుని వెళ్ళి పోతే కుటుంబ పోషణ ఏమైపోవాలని గిరిని ప్రశ్నిస్తారు. కుటుంబ సభ్యుల కుటిల మనస్తత్వాన్ని తెలుసుకున్న గిరి అందర్ని ఎదిరించి తనను ప్రేమించిన వసంత్‌ను పెళ్ళి చేసుకుంటుంది.

6. మరణ శాసనం :

ఈ కథలో సుప్రజను పెళ్ళైన ఆరునెలలకే ఇచ్చిన కట్నం చాల్లేదంటూ భర్త, అత్తమామలు కలసి ఆమె మీద పెట్రోలు పోసి నిప్పంటిస్తారు. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో వుంటుంది సుప్రజ. మేజిస్ట్రేట్‌కు ఇచ్చిన మరణ వాంగ్మూలంలో అగ్నికి ఆహుతవుతున్న అతివల్లారా ఈ వ్యవస్థ మనకు న్యాయం చేయదు. ఏవో చట్టాలు చేసి చేతులు దులుపుకుంటారు. మనమే ఎదురు తిరగాలి, లేకపోతే ఒకరిని చంపి మరొకరిని పెళ్ళి పేరుతో బలి చేస్తారు. మరో మగువ బలి కావద్దంటే ఇదొక్కటే మార్గం అని చైతన్యపూరితమైన మాటలు చెబుతూ ప్రాణాలు విడుస్తుంది. సుప్రజలా మరొక స్త్రీ వరకట్న దాహానికి బలి కాకూడదంటే ఎదురుతిరగడమే సరైన పరిష్కార మార్గమని ఈ కథ ద్వారా రచయిత్రి సూచించడం జరిగినది.

7. విషాద గీతం :

పెళ్ళైన అయిదేళ్ళకు పుట్టిన రోజాను ఎంతో గారాబంగా పెంచుతారు తల్లిదండ్రులైన సుధీర, శ్రీధర్‌లు. పెళ్ళై రెండునెలలు కాకముందే రోజా భర్త యాక్సిడెంట్లో చనిపోతాడు. రోజాను విధవను చేయడానికి ముతైదువులు వస్తారు. వారు తంతు మొదలు పెట్టగానే ఆ తంతుకు ఎదురుతిరిగి మీరంతా నన్ను, నాకుటుంబాన్ని వెలివేసినా సరే నాబిడ్డ పసుపు కుంకుమలు మాత్రం చెదరనీయను అని గర్జించి ఆ దుష్ట సాంప్రదాయాన్ని వ్యతిరేకించి ఆపిస్తుంది రోజా తల్లి సుధీర. స్త్రీల అణచివేతకు కారణమవుతున్న పితృస్వామ్య భావజాలంతో రూపుదిద్దుకున్న సాంప్రదాయాలను, ఆచారాలను వ్యతిరేకించాలి అనే సందేశాన్ని రచయిత్రి ఈ కథద్వారా సూచించారు.

8. దొరసాని బతుకులు :

ఈ కథలో గంగ, చిట్టిలు భార్యా భర్తలు. తొలిచూలు, మలిచూలు ఆడపిల్లలు పుడితే ఇంటికి అరిష్టమని భావించే గంగ అత్తింటివారు గంగ మొదటి బిడ్డను చంపేస్తారు. దీంతో గంగ భర్తతో కలసి వేరు కాపురం పెడుతుంది. భర్తకు ఇష్టం లేకపోయినప్పటికీ రెండోసారి గర్భవతి అయిన గంగ ఆడపిల్లకు జన్మనిస్తుంది. చిట్టి ఆ బిడ్డను అమ్మేయాలనుకుంటాడు. అయితే భర్తకు ఎదురు తిరిగి తన బిడ్డను అమ్మడానికి లేదా ఎత్తుకు పోవడానికి ప్రయత్నిస్తే పోలీసు కేసు పెడతానంటుంది గంగ. అలాగే మరొక కథ

9. వంధ్యశిల :

ఈ కథలో మాలతికి పెళ్ళై పది సంవత్సరాలైన పిల్లలు

పుట్టరు. అందరూ గొడ్రాలు అంటుంటే బాధపడు తుంటుంది మాలతి. ఈ కారణాన్ని చూపి ఆడపడుచు కూతురితో మరో పెళ్ళికి సిద్ధ పడుతారు మాలతి భర్త, అత్త మామలు. అయితే తనకు పిల్లలు పుట్టక పోవడానికి కారణం తన అత్తింటి వారి దురాశేనని తెలుసుకున్న మాలతి రెండో పెళ్ళికి సిద్ధపడితే భర్త, అత్త మామలు, ఆడపడుచులపై పోలీసు కేసు పెడతానని చెప్పి ఎదిరి స్తుంది.

ఇలా ఈ కథలన్నింటిలోనూ స్త్రీలు చైతన్యవంతులై తమ పట్ల జరుగుతున్న అన్యాయాలపై ఎదురుతిరిగి పోరాడడమే సరైన పరిష్కార మార్గమని రచయిత్రి సూచించారు.

ముగింపు :

స్త్రీ, పురుషుల మధ్య వున్న లింగ అసమానతల కారణంగా సమాజంలో గానీ, కుటుంబంలో గానీ, హోదాను, గౌరవమును పొందుటలోగానీ, అవకాశా లను వినియోగించుకోవడంలో, ఇలా ప్రతి విషయం లోనూ పురుషులతో సమానమైన స్థానం, ప్రాధాన్యత, గుర్తింపు స్త్రీలకు వుండటం లేదు. లింగ వివక్షత కారణంగా అనేక రకాల దోపిడీలకు, అవమానాలకు, అత్యాచారా లకు, అన్యాయాలకు స్త్రీలు గురవుతూ వున్నారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకు రావడానికై స్త్రీవాద ఉద్యమాలు, స్త్రీవాద సాహిత్యం చోటుచేసుకున్నాయి. తమ రచనల ద్వారా స్త్రీలను జాగృత పరచడానికి కృషిచేస్తున్న రచయిత్రులు లేకపోలేదు. ఈ ధోరణిలో నుంచి వెలువడినవే ఎం.ఆర్.అరుణ కుమారి గారి మన్నులో మన్నునై అనే కథా సంపుటిలోని కథలు.

తమకు జరిగిన అన్యాయాల పట్ల వ్యతిరేకతను, తిరుగుబాటును ప్రదర్శించాయి ఈ కథలలోని స్త్రీ పాత్రలు. ఇంకా ఈ కథలు తరతరాలుగా వివక్షకు, అణచివేతకు గురవుతున్న స్త్రీలు ఆస్థితినుంచి బయటపడి ముందుకు నడవాలి అనే స్త్రీవాద ధోరణిని మరియు దోపిడీ, దౌర్జన్యాలకు బలైపోతూ జీవితాలను గడుపుతున్న స్త్రీలు చైతన్యం, పోరాట స్ఫూర్తిని అలవరచుకుని ధైర్యంతో ఎదుర్కోవాలనే గొప్ప సందేశాన్ని అందిస్తున్నాయి.

ఆధార గ్రంథాలు :

1. మన్నులో మన్నునై - ఎం.ఆర్.అరుణ కుమారి
2. కవయిత్రుల కవితా మార్గం - శిలాలోలిత.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జాతి గర్వించదగ్గ కవి "తుమ్మల"

– డా॥. కె. లక్ష్మీనారాయణ, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ కళాశాల (స్వ.ప్ర), అనంతపురము.

సామాజిక స్పృహతో, నైతిక జీవన దృష్టితో, జాతీయ భావస్ఫూర్తితో, ధర్మప్రభోదాత్మకమైన కవితలల్లిన కవులలో "తుమ్మల సీతారామమూర్తి"గారు మర్చిపోలేని కవి. ఆధునికాంధ్ర సాహిత్యలో "తుమ్మల" వారిదోక విశిష్టస్థానం.

ప్రతియుగంలో కవులు పుడుతుంటారు. అందులో వ్యక్తిత్వం గల కవులు చాలా తక్కువ. ఉన్నత వ్యక్తిత్వం గల కవులు మరీ అరుదు. అటువంటి వారిలో తుమ్మల సీతారామమూర్తిగారు ఒకరు.

అభినవ తిక్కనగా, తెలుగులెంకగా, గాంధీకవిగా, యుగకవిగా సుప్రసిద్ధులైన తుమ్మల సీతారామ మూర్తిగారు "జాతిపెంపు నాకు చాలును/జాతీయ గౌరవంబ నాదు గౌరవంబు/జాతిసేవ నాదు జన్మంబు నకు / ఫలంబని తలంచు వాడే - నాయకుండు" అని నాయకుడికి వుండవలసిన వ్యక్తిత్వాన్ని విశ్లేషించడమే కాదు. తను కూడా నిష్కల్మషంగా, నిరాడంబరంగా, ఆదర్శప్రాయంగా జీవించి చూపించారు.

రైతు కుటుంబంలో పుట్టారు. పవిత్రమైన ఉపా ధ్యాయ వృత్తిని చేపట్టారు. సహజ ప్రతిభతో రాణించారు. సందేశాత్మకమైన కావ్యాలను వెలయిస్తూ నిరంతర కవితా హాలికులై జీవించారు. అయితే

మొదట కళా ప్రేరణచే సాహిత్యం పరిమళించినా, గాంధీ ప్రభావంతో "తుమ్మల" వారిలో జీవన ప్రేరణ కలిగింది- అదే వారి కవిత్వానికి జీవధార అయ్యింది. అదే సర్వోదయ కవితోద్యమానికి కారకమైంది.

"కళకొఱకే కవిత్వమని గంతులు వేయక, రోత రోతగా
వలపులు నింపి కబ్బములు వ్రాయక, విశ్వజనీన బోధ్దతా
లలిత ముదార వృత్తము కలాకమనీయము సంస్కృతి ప్రభా
మిళితమునైన నృష్టినెదవెచ్చితి, జాతికి కాన్కలిచ్చితిన్"

- అని మానవాభ్యుదయానికి కలం పట్టి కవితాగానం చేశారు.

తాను రచించిన కవిత్వాన్ని తెలుగువారి ఊపిరిగా, భారతీయతకు జీవాత్మగా, గాంధీతత్వాన్ని వజ్రకవచంగా మలచి స్వరాజ్య సాధనకు - స్వరాజ్య నిర్మాణానికి అంకితం చేసిన నిండు దేశభక్తి గల కవి. ఆకారంలో ఆంధ్రుడు. ధర్మంలో భారతీయుడు. భావనలో విశ్వ మానవుడు... ఇలా మధురమైన పూర్ణ కావ్య నిర్మాణ చాతుర్యం కలిగి మానవాభ్యుదయానికి కవిత్వగానం చేసిన అభ్యుదయవాది ఆయన మాటల్లోనే చెప్పాలంటే "సర్వతంత్ర స్వతంత్రుడే సత్కవీంద్రు/డెన్నడో కల్పమున కొక్కడే లభించు" ఈ మాట "తుమ్మల" వారికి చక్కగా వర్తిస్తుంది.

రాష్ట్ర సిద్ధికొఱకు రక్తమ్ముగార్చిన
కవిని నేను గాంధికవిని నేను
బడలిబడలి తల్లి బాస కూడెము సేయు
కవిని నేను దేశికవిని నేను

- అని చాటిన "తుమ్మల" వారు నిత్యవైతాళికులు.

ఆంధ్రత్వం మూర్తీభవించిన నిలువెత్తు దేహం వారిది. ప్రత్యేకాంధ్ర, రాష్ట్రావతరణ సమయంలో మహోద్రేక భావామృతాన్ని చిలికి జీవం పోసిన కవిబ్రహ్మ అతడు. అనాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రులకు జరిగిన జరుగుతున్న అవమానాలకు, అన్యాయాలకు ఆనాడు అట్టుడికిపోయారు. అందుకే పరవళ్ళు త్రొక్కే ఆవేశంతో, భావుకతతో వీరరస భరితమైన 'రాష్ట్రగానం'

అనే కావ్యాన్ని రాశారు. ఉద్యమానికి దిశానిర్దేశం చేశారు. గత ప్రభావాల్ని గుర్తుకు తెచ్చి ఆంధ్రుల్ని కార్యోన్ముఖుల్ని చేశారు. జాతిని చైతన్యపరిచారు. పాఠకుల మేను పులకరించే విధంగా "చదువుడొకసారి కండలు కదలి యాడ" అంటూ రసభావావేశాలతో "తెలుగు జాతి నిరం కుశ వీరజాతిగా నేలిన జాతిరా" అని ఆత్మ గౌరవ నినాదాన్ని ఇచ్చిన తొలి జాతీయకవి తుమ్మల సీతారామ మూర్తి గారు.

నూతన రాష్ట్ర ఆవిర్భానంతరం జాతి అభ్యుదయానికి "ఉదయగానము" అనే కావ్యం రచించి ఆనాటి సమస్య లను చర్చించారు. దానికి తగిన సూచనలిచ్చారు. మాతృ భాషను అధికార భాషగా గుర్తించమని చెప్పారు. రాష్ట్ర నడిబొడ్డున గల బెజవాడను రాజధానిగా చేయమని పిలుపునిచ్చారు. కృష్ణ, గోదావరి నదులను అనుసంధానం చేసి ప్రాజెక్టులను నిర్మించి వ్యవసాయానికి ప్రాధాన్యత యియ్యమని ఆనాడే సూచించిన ఘనత వారిది. అక్కడితో ఆగిపోలేదు. "పదవి కొరకు పుట్టినది కులతత్త్వమని" పసిగట్టిన దూరదృష్టి ఆయనది. దీనినిబట్టి "తుమ్మల" వారి నిశిత పరిశీలనా శక్తిని పసిగట్టవచ్చు. సమాజ సమస్యలకు చక్కని పరిష్కారాలను చూపించిన ప్రజాకవి.

నిజానికి, తుమ్మల సీతారామమూర్తి గారు దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న అకళంక దేశభక్తులు. ఆ సందర్భంలో శిక్షలు కూడా అనుభవిం చారు. చారిత్రక వీరగాథలను రచించి ప్రజలలో చైతన్యాన్ని రగిలించిన నిత్యచైతన్య శీలి. కాబట్టే "తల్లి శోకించువేళ ఆమెకు తోడ్పడలేని బిడ్డ బ్రదుక దేటికి ధాత్రికి బరువు చేటు" అని ప్రజల్ని ఉద్దేశించి, వారిని ఉద్యమంలో భాగస్వామ్యం చేసిన ఘనత తుమ్మల గారిది.

స్వాతంత్ర్యం వచ్చాక నాయకుల నైతిక పతనం, అధికారుల అవినీతిని చూచి చలించిపోయారు. ధన వంతుల దోపిడి చూసి తిరుగబడ్డారు. పేదల ఈతి బాధ లను అభివర్ణించారు.

1901 డిసెంబరు 25న ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన తుమ్మల వారు ఏ రోజు చదువు పట్ల అశ్రద్ధ చేయలేదు. మడికి ఒక పూటగా, బడికి ఒక పూటగా వెళ్ళి బాల్యాన్ని సాగదీసినవారు. ఇదే వీరిలో ఒక పట్టుదలని, కృషిని, శ్రమవిలువను ప్రోదిచేశాయి. చిన్ననాటి కార్యోన్ముఖ లక్షణమే ఎదిగేకొద్ది కవిత్వంలో జీవం పోసుకుందేమో. ఆవేశం, ఆదర్శం, పట్టుదల, ధర్మానురక్తి, విశుద్ధ వర్తనం కలబోసుకుని చైతన్యమై తన కవిత్వంలో చోటు సంపాదించుకున్నాయేమో!! అన్పి స్తుంది.

ఆయన కవిత్వంలో కన్నకలలు కొన్ని ఆయన కళ్ళ ముందే ఫలించాయి. ప్రధానంగా దేశ స్వాతంత్ర్యం చూశారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర అవతరణ చూశారు. అయితే అక్కడితో తన రచనలోని నిశిత దృష్టిని మానలేదు. ఆర్థిక, సాంఘిక సమానత్వ సాధనకు, నైతిక జీవనానికి సంబంధించిన రచనలు కడదకా రచించారు.

భాషాపరంగా ఆయన సాంప్రదాయబద్ధుడైనా భావనా పరంగా ఆధునికుడు. సాహిత్యానికి సాంఘిక ప్రయోజనం ఉండాలని గాఢంగా విశ్వసించారు.

మత విషయంలో వాస్తవిక దృష్టికలవారు "మతమ్ములు ముక్తికొఱకు పుట్టినవి కాని రాన్‌రాను భుక్తికయ్యె" అని పచ్చి నిజాన్ని తెల్పిన దార్శనికుడు. "కులము కల్పితంబు, కులమునకు జెప్పు లక్షణములు నిశ్చలములు గావు" అనే సార్వకాలిక సత్యాన్ని ప్రపంచిం చిన విజ్ఞులు. అందువల్లె తన పేరులోని "చౌదరి"ని ఏనాడో తెంచి పడేశారు. కులవ్యవస్థయే దేశానికి దురవస్థ తెచ్చిందని వాపోయిన సందర్భాలు ఎన్నో కన్పిస్తాయి.

మతం పెచ్చు మీరిన సందర్భంలో

"కొందరచటన్ కోవెల
కొందరకు మసీదు, చర్చి కొందరకున్నన్
సుందర భారతదేశం
బందరకున్ గుడియగున్ మహాతీర్థమగున్"

అంటూ మత సామరస్యాన్ని చాటారు.

స్త్రీ విద్య చాలా అవసరమని గుర్తించిన కవులలో "తుమ్మల" ఒకరు. స్త్రీ జాతి వికాసం భారత జాతి గౌరవోన్నతికి మూల హేతువు అవుతుందని గుర్తించిన వారు. మహిళలను అవమానించే దుర్మార్గులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని సూచించారు. ప్రకటించారు.

ఆధునిక పద్యకవుల్లో అగ్రగణ్యుడైన తుమ్మల తెలుగు భాషానురక్తి కలిగిన జాతీయోద్యమకవి. తెలుగు మాట లతో అందమైన, పద్యాలు అల్లగల్గిన కవి తుమ్మల.

కమ్మని తెల్గటంచు నుడికారము సొంపుల నీ విశాల వి
శ్వమ్మున దీనిబోలిన వచస్సు నభస్సుమ మంచు వేయువా
క్యమ్ముల నేను మెచ్చుటయుకాదు రసజ్ఞులు దారు
లెల్ల ఖం
డమ్ముల మెచ్చిరిచ్చిరి వినమ్రతయై గపురంపు
టారతుల్

అని తెలుగుభాష గొప్పదనాన్ని కీర్తించిన కవి తుమ్మల.

ఇలా - అక్షరాల్ని సామాజిక పరంచేసి 19వ యేట నుండి కవితా జైత్రయాత్ర ప్రారంభించిన "తుమ్మల" వారు - దాదాపు 1919 నుండి 1988 వరకు ఏడు దశాబ్దాల కాలం ఎనలేని సాహితీ వ్యవసాయం చేశారు. 89 సంవత్సరాల పూర్ణాయుష్కులు వీరు.

బహుగ్రంధకర్తలైన "తుమ్మల"గారు రామశతకము, రామలింగేశ్వర శతకము, గాంధీ తారావళి,నామ దేవ చరిత్రము, రామకృష్ణ స్మృతి, మహేంద్ర జననము, పురాంతక శతకము, మహాత్మగాంధీతారవళి, పఱిగపంట, పెద్దకాపు వంటివి - తొలినాళ్ళలో రాశారు.

ఆత్మార్పణము, ధర్మజ్యోతి, రాష్ట్ర గానము, ఉదయ గానము వంటి కృతులు వీరి కీర్తి కీరిటంలో వజ్ర వైఢూర్యాలు, కొన్నాళ్ళు అవధానాలు కూడా చేసినట్లు దాఖాలాలు వున్నాయి. గజారోహణ, గండపెండేర, స్వర్ణకంకణ, కనకాభి షేకాలు పొందారు. 1969 కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు. అదే సంవత్సరం ఆంధ్రవిశ్వ కళా పరిషత్ వారి కళాప్రపూర్ణ బిరుదు, నాగార్జున విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేటు వీరిని వరించాయి.

రైతుగా జీవించడమే కాదు. రైతు జీవితానికి కావ్య గౌరవం తెచ్చిన రైతు కవి. తెలుగు భాషార్చకుడిగా కవిత్వ కళకు నూతన జవాన్ని, జీవాన్ని ప్రోది చేసిన తెలుగు లెంక ఇతడు. ఆంధ్ర, అన్నామలై, మదరాను విశ్వవిద్యాలయాల లోని పాఠ్యగ్రంథాలలో వీరి కవిత్వం చోటు చేసుకుంది. ఒక వాక్యంలో చెప్పాలంటే తుమ్మల సీతరామమూర్తి గారు - తపిస్వి యశస్వి, మనస్వి, అందువల్లె వారి నిజ జీవితాన్ని - కవిత్వాన్ని విడదీసి చూడలేం.

ఆధునికయుగంలో ఉన్నతమైన సాహిత్యానికి, సమున్నతమైన వ్యక్తిత్వానికి గుర్తింపు తెచ్చిన కవి తుమ్మల సీతారామమూర్తి. ఆయన జీవితంలోనూ, సాహిత్యం లోనూ నైతికవిలువల పరిరక్షణ పరంగా జీవించిన కవి. జాతి గర్వించదగ్గ ఉత్తమకవి "తుమ్మల" - అని అనడంలో సందేహం లేదు. తెలుగుజాతికి, సాహిత్యానికి లభించిన అపూర్వమైన కానుక "తుమ్మల.

ఆధార గ్రంథాలు :

1) సాహిత్య వివేచన - డా॥ కోవెల సుప్రసన్నాచార్య వెంకట్రామ అండ్ కో, వరంగల్-1971.
2) సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు - ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం, తెలుగు అకాడమి, హైదరాబాదు-1991
3) తెలుగులో కవిత్వోద్యమాలు - ఆచార్య కె.యాదగిరి (సం) తెలుగు అకాడమి, హైదరాబాదు - 2012.
4) తెనుగులెంక తుమ్మల - గొల్లపూడి ప్రకాశరావు - 1975.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మహాత్మ కథ

– కొప్పులురెడ్డి శేఖర్‌రెడ్డి, పరిశోధక విద్యార్థి, లలితకళల విభాగం, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

తుమ్మలవారికి సాహితీ ప్రపంచంలో 'తెనుగు లెంక', గాంధికవి, రాష్ట్ర (గాన) కవి, జాతీయకవి, సర్వోదయకవి, కాపు (రైతు) కవి, నవ్యసంప్రదాయ భావ, విప్లవ కవి అని పలువురిచే పిలువబడ్డాడు. ముఖ్యంగా వీరికి 'అభినవతిక్కన' అనే బిరుదు కలదు. ఇంతటి గొప్ప మహనీయుడు, సాహిత్యం గురించి చెప్పవలసివస్తే ఈతని అన్ని కృతులు, రచనలు చాలా మంచిపేరు తెచ్చిపెట్టాయి అని చెప్పవచ్చు.

ఈయన గాంధికవిగా మహాత్ముని ఆస్థానకవిగా ప్రజలకు సువిదితం. ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రమన్న, తెలుగు ప్రజలన్న వీటన్నింటినీ మించి గాంధి గారన్న ఎనలేని ప్రేమ, అభిమానం కనబరుస్తారు. రాష్ట్ర (గాన) కవిగా ఆంధ్రత్వం గురించి చెబుతూ ఆంధ్రుడనై జన్మించి నందుకు ఈ భూమిమీద మరణించువరకు ఆంధ్రునిగా జీవించాలంటాడు.

కం. ఆంధ్రుడవై జన్మించితివి
వాంధ్రుడవై యనుభవింపు మాయుర్విభవం
బాంధ్రుడవై మరణింపుము
ఆంధ్రత్వము లేని బ్రదుకు నాసింపకుమీ

అంటూ ఆంధ్రత్వంలేని బ్రతుకు ఊహించరాదు, ఆసించరాదంటారు తుమ్మలవారు. మరొక పద్యంలో తెలుగుమాట తీరు తెలుసుకోవలెనన్న కోర్కెకలిగినపుడు

తెలుగుమాట తెలుసుకోవలెనన్న
కోర్కె వెడలినపుడు కోమలి నడుగు
డరక దున్నువారి నడుగుడు కవులార
చాలదిచట గోశ సముదయంబు

తుమ్మలవారు గాంధికవి నని చెప్పుకుంటూ 'సహజ కవి' పోతనను మార్గదర్శకంగా చేసుకొని

కం. పలికెడిది గాంధికథయట
పలికించెడివారు తెలుగు ప్రజలంట దీనం
బలికి నూఱుట యౌనట
పలికెదనిక నొండు మరచి బాపు చరిత్రన్

అని నేను గాంధి గురించి పలుకుతాను, పలికించే వారు తెలుగు ప్రజలని తెలుగు మీద అభిమానం కలదని చెబుతారు. అంతేగాక గాంధి వెంట నడిచి, అతని ఉద్యమాలలో పాల్గొని, గాంధిపై కవిత వ్రాయుటకు ఈ జన్మచాలని చెబుతూ...

గాంధి యుగమున బుట్టితి; గాంధి నడుపు
నుద్యమంబుల నలిగితి; నోపినంత
గాంధి నీక్షించితిని; గాంధి కవిత వ్రాయ
గంటి నీజన్మమునకు నీపంట చాలు నంటారు.

ఇహపోతే మహాత్ముని ఆస్థానకవి తుమ్మలవారు రాసిన 'మహాత్మ కథ'.

ఈ మహాత్మ కథలో మహాత్ముని మహత్తర చరిత్ర 'ఉత్తమరీతి'లో, 'ఉత్తమ కావ్యం'గా రచించారు తుమ్మల వారు. 1919 నుంచి 1948 వరకు గాంధి ఆధ్వర్యంలో జరిగిన సంఘటనలు అన్నింటినీ పద్య, గద్య రూపంలో స్వతంత్ర్య రచనగా చేశారు. ఈ మహాత్మకథ 1968 సం॥ అచ్చుయింది. అందులో అంశాలు వరుసగా

1919 రౌలత్ చట్టం, జలియన్ వాలాబాగ్ హత్యలు. 1920 ఆలీ సోదరుజ ఆవేదన, మహాత్ముడు నిరాకరణ పద్ధతిని ప్రజలకు బోధించుట. 1921 మహాత్ముడు ఆంధ్రదేశమున పర్యటించుట, చీరాల పేరాల సత్యాగ్రహము, 1922 పెదనందిపాడు పన్నుల నిరాకరణ, 1923 కాకినాడ కాంగ్రెసు మహాసభ, నాగపూర్ సత్యాగ్రహం. 1924 మహాత్మునకు శస్త్రచికిత్స, 1925 చిత్తరంజనుదాసు మరణం. 1925 గౌహతీ కాంగ్రెస్, 1927

సైమన్ బృందమేర్పడుట, 1928 సైమన్ గోబ్యాక్, బార్డోలి రైతుల పన్నుల చెల్లింపులు, 1929 బాపూ విదేశీవస్త్ర బహిష్కరణ, 1930 మహాత్ముడు దండికేగుట, 1931 మోతీలాల్ నిర్యాణం, గాంధీ-ఇర్విన్ సంధి. 1932 'హరిజన' పత్రికావరణము. 1933 వ్యష్టి సత్యాగ్రహము.

1934 బీహారు భూకంప బాధితులు, 1935 గ్రామ పరిశ్రమ సంగము, 1936 లక్నో కాంగ్రెసు, 1937 మొదటి ఎన్నికలు, కాంగ్రెసు గెలుపు, 1938 కాంగ్రెసు మంత్రుల పరిపాలన, 1939 రెండవ ప్రపంచ యుద్ధం, 1940 శాసనోల్లంఘన నిర్ణయము, 1941 జపాన్ విజృంభణ, 1942 క్రిప్స్ రాయబారము, క్విట్ ఇండియా, 1943 రాజాజీ దేశ విభజన దృష్టి, 1944 కస్తూరిబాయి నిర్యాణము, 1945 ప్రపంచ సమరం చరమదశ, 1946 బాపూజీ హత్యకు పన్నాగము, 1947 స్వాతంత్ర్య దినము - మహాత్ముని ఉపవాసము, 1948 గాంధీ హత్యకావటం మొదలైన అనేక సంఘటనలు 'మహాత్మకథ'లో తుమ్మల వారు రచించారు. అందులో కొన్నింటి సూత్రప్రాయంగా సాహిత్యాన్ని తెలియజేస్తూ...

1921లో మహాత్ముడు ఆంధ్రదేశమున పర్యటించి నపుడు ప్రజలనుద్దేసించి ధర్మయుద్ధం వస్తుంది, ఈ యుద్ధం భారత ప్రజల విముక్తి కోసం సాగినదని, దాసితనం పోవాలని, ఈ దాస్యతరం వల్ల చావుకు, బ్రతుక్కు మధ్య పోరాడుతున్నవారు త్యాగము, శాంతి, సత్యం అనే అస్త్రాలను ధరించమన్నారు. దానినే తుమ్మలవారు

ఉ. రాగలదోయి! ధర్మసమరం, బిదిబారత జాతి ముక్తికై
సాగినదోయి! దాస్యమునఁ జచ్చియుఁ జావని వార లందఱున్
ద్యాగము శాంతి సత్యమును దవ్వని యస్త్రములై జగజ్జయ
శ్రీగురియింప సంగరము సేయుఁడు, త్రోయుడు మాతృదుఃఖమున్

అంతేగాక, ప్రపంచం అంతా జ్ఞానమార్గంలో పయని స్తుంటే మీరు చీకటి అనే అజ్ఞానం వీడండి. ముల్లోకాలను గెల్చినవారి బిడ్డలు అయి ఈ ఆపదలో ఉంటారా అంటూ

ఉ. ఈ పరతంత్ర జీవనము నెట్లు భరింతురు విశ్వమెల్ల ను
ద్దీపితమై స్వతంత్రత కతీవకృషిం దలఁదాల్చి మానరే
ఖాపరిపుష్ట మయ్యెఁ ద్రిజగంబుల గెల్చిన వారిబిడ్డ లీ
యాపద నుందురా సమయమైనది లెండిక బారత ప్రజల్!

అని ఉద్బోధించాడు మరియు...

ఎవరో వస్తారు ఏదో చేస్తారని 'మననుకవి' ఆత్రేయగారి మాదిరిగానే

మ. ఎవరో మోక్షము నిచ్చువారు లని మీకెలా వృథాభ్రాంతి; మీ
వ్యవసాయంబ గటించి పెట్టవలె మీ వాల్ల భ్యమున్; మీనమే
షవివాదంబుల కాలమేగె నమరోత్సాహ మ్మునం బేర్చి మీ
భవమున్ ధన్యముఁ జేసికొండు మిము నొంపన్ బుట్టి లేఁడెవ్వడున్

ప్రజలను చైతన్యులుగా చేస్తూ మీకృషే మీకు అధి కారాన్ని ఇస్తుంది. మీనరాశి, మేషరాశి అంటూ సమయం వృథా చేయొద్దని పిలుపునిచ్చారు. ఇంకా... ఈ ధర్మ యుద్ధానికి, కుట్రలు, కత్తులు, ఈటెలు అవసరం లేదు. ఈ యుద్ధంలో వారిని చంపి శత్రువుల ప్రాణము తీయవలసిన అవసరం లేదంటూ...

ఉ. అన్నువులేదు, కుట్రలకు, నక్క అంలేదు కటారు, లీఁటెలున్
బన్నుటలేదు, శాత్రవుల ప్రాణముఁ దీయుట లేదు నెత్తురున్

జున్ను విధానఁ బట్టి తెగజుఱ్ఱుటలేదు;
జగచ్చరిత్రలోఁ
గన్నదిగాని; విన్నదియుఁగాని రణంబిది
విక్రమింపుఁడీ!

అని తుమ్మలవారు మహాత్ముని మాటలను సందేశంగా పద్యరూపంలో తెలియజేశారు. అంతేగాక 1930లో దండికి వెళ్ళి 'ఉప్పు సత్యాగ్రహం' చేసిన విధానాన్ని తెలుపుతూ...

మహాత్ముని యనుజ్ఞతో భారతభూమి నన్నిరాష్ట్రముల నానాఁడుప్పు సత్యాగ్రహమారంభమాయె - దేశభక్తి వేంకటప్పయ్య నియంతగా నిలువఁదెలుఁగు నాఁట నెల్లసీమలయం దీయుల్లంఘన మపూర్వోత్సాహ సంపన్నమై సాగె - ఆంధ్ర కర్షకవర్గ మీ సమరంబునఁ బుంఖానుపుంఖముగాఁ బాల్గొనియె - దేశభక్తికిం గాణాచియగు గుంటూరి మండలమునఁ దడవులంబట్టి కాంగ్రెసు సేవగావించు కల్లూరి చంద్రమౌళి, చింతమనేని భావయ్య, వెలువోలు సీతారామయ్య, వావిలాల గోపాల కృష్ణయ్య, గోళ్ళమూడి రత్నమ్మ, ముంతెన వేంకటరాజు, సీరము వేంకట సుబ్బారావు మొదలగు నాయకులు వచ్చిరి. ఆ సమయంలో మాండలిక సత్యాగ్రహాలు గుంటూరు చేరి యెడవల్లి వారి సత్రము తమ శిబిరముగా నిల్చి గుంపులు గుంపులుగాఁ బరిసర గ్రామములకేగి కాంగ్రెసు సందేశమును బ్రకటించుచుఁ బ్రజలలో నూతన వికాసము నా పాదించుచుండిరి. అని తుమ్మలవారు గాంధీ గారి ప్రతి సంఘటనల యందు వెన్నంటు ఉన్నట్లు తెలుస్తుంది.

ముగింపు :

పైన తెలుపబడిన సంఘటన లేకాక "మహాత్మా కథ"లో ప్రతి సంఘటన కూడా ప్రజల నుంచి వచ్చిన భావజాలం ఆధారంగా 'మధుకశైలి'లో తుమ్మలవారు స్వతంత్ర్య కావ్యంగా మలచి మహాత్మునికి ఎంత పేరు కలదో, అలాగే 'మహాత్మకథ' కూడా తుమల్మవారికి అంతే మంచిపేరు తెచ్చింది. అందుకే వీరిని 'మహాత్ముని' ఆస్థానకవి అని కొనియాడారు.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు చలన చిత్రాల్లో దళిత కథలు, పాత్రలు, కథనం : 'పలాస' (2020) అధ్యయనం

- కృష్ణ శంకర్ కుసుమ, అసోసియేట్ ప్రొఫెసర్, జామియా మిలియా ఇస్లామీయ, న్యూ ఢిల్లీ.

1970ల్లో 1980లో వచ్చిన చాలా సినిమా లు మనకి సినిమా ని సమాజానికి దగ్గరగా చూపించాయి వాటిలో మా భూమి (1979) గానీ లేకపోతే విప్లవ శంఖం (1982) ఆ తర్వాత 90 లో వచ్చిన సినిమాల్లో ఎక్కువగా ఎర్ర సినిమాలు లేక నక్సలిజం నేపథ్యంలో వచ్చిన సినిమాలు మనకు కనిపిస్తాయి. ఈ మధ్య తెలుగు సినిమాలు తీసుకుంటే ఎక్కువ హారర్ కామెడీ సినిమాలు ఒక హాస్యాస్పదమైన కోణంలో దాంట్లో చేర్చి మనకి చాలా సినిమాలు రావడం జరిగింది. అంతే కాకుండా ఇప్పుడు తెలుగు సినిమా చూసుకుంటే సాంకేతిక పరంగా పరంగా చాలా అభివృద్ధి చెందాయి. ఇప్పుడు బాహుబలి-1, బాహుబలి-2 వీటితో మనకి ఒక హాలీవుడ్ మరియు హాంగ్ కాంగ్ సినిమా యొక్క క్వాలిటీని చూడగలుగు తున్నాను ఇటువంటి సమయంలో ఒక్క కొత్తగాలి ఒక ప్రశ్న సమాజానికి దగ్గరగా ఒక సినిమా ఏదైనా ఉంది అంటే అది మనం చెప్పుకోవచ్చు

తెలుగు సినిమా మరియు సౌత్ ఇండియన్ సినిమా అధ్యాపకుడిగా నాకు ఈ చిత్రం తెలుగు సినిమా చరిత్రలో ఒక కొత్త యుగానికి నాంది పలికిందని చెప్ప వచ్చు. దీనిలో కారణాలు ఒకటి భాష పరంగా ఇది ఒక కొత్త ఒరవడికి తెరతసింది, తెలుగు సినిమా కదా వస్తువు ఎక్కువగా పెద్ద పట్టణాలు మరియూ పాత్రలు ఉన్నత వర్గానికి చెందినవిగాను, లేకపోతే మాఫియా,పోలీసు లేక ఉన్మాద ప్రేమికుడి మరియు ముఠాకక్షలు ఉంటున్న సమయంలో కొత్త నటి నటులతో, గాయకుల తో గ్రామా కుల రాజకీయాలు ఒక కదా వస్తువుగా ప్రేక్షకులకు గ్రామాన్ని దాని సహజ సిద్ధమైన రీతి లో చూపించారు.

గ్రామం కథా వస్తువుగా కొన్ని చిత్రాలు వచ్చినా అవి భూస్వామ్య వ్యవస్థను గొప్పగాను, గ్రామాలను విహార స్థలాలు గా చూపించారు. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన రంగస్థలం (2018) పలాస చిత్రం లాగానే గ్రామా రాజకీయాలని దగ్గరగా చూపించిన 'స్టార్ డం' లేక ప్రసిద్ధి చెందిన నటి నటులు ఈ సినిమాకి ఒక బలం. పలాస చిత్రం 'పారలల్ సినిమా' లేక 'ఇండియన్ న్యూ వేవ్' చిత్రాల కోవలోకి ఈ చిత్రాన్ని చేర్చొచ్చు. మళయాళం బాషలో వచ్చిన 'అమ్మఅరియన్ (1986)' (నేను నా అమ్మకు ఏమి తెలియాలనుకుంటున్నానంటే) సినిమాని చాలా నిజాయితీగా దారిలో కలసిన జనాన్నే నటి నటులుగా పెట్టి ఈ సినిమా భారతీయ చలన చిత్ర చరిత్రలో మైలురాయిగా బ్రిటీష్ ఫిలిం ఇన్స్టిట్యూట్ గుర్తించింది. ఆ చిత్రదర్శకుడు జాన్ అబ్రాహాము దృష్టికోణం, సినిమా తీసే విధానం పలాస దర్శకుడులో కనిపిస్తున్నాయి.

ఉత్తరాంధ్ర సినిమా :

నా భాషను ఎక్కువగా తెలుగు సినిమాలో ఒక కామెడీ ఒక హాస్యాస్పదమైన పాత్రలకు మాత్రమే రాజేంద్ర ప్రసాద్ ఇక మరే సినిమాల్లో మనం చూసిన ఎక్కువగా ఒక లేకపోతే హాస్యాన్ని కల్పించే విధంగా ఉపయోగించడం జరుగుతుంది ఇదే విధంగా ఇప్పుడు తెలంగాణలో చూస్తే తెలంగాణ యాస మన సినిమాల్లో ఎక్కువగా సైంటిఫిక్ లేకుంటే మీ పక్కన ఉండే రౌడీలు గానీ నేను గానీ ఉప యోగించే భాష ఎక్కువగా తెలంగాణ భాషని ఉప యోగించే వారు కానీ దీని వల్ల వచ్చిన నష్టం ఏమిటంటే తెలుగు మాట్లాడే ప్రజలకు ఒక యాక్సిడెంట్ మాట్లాడే

వాళ్ళు ఈ విధంగా ఉంటారు అని ఒక టెక్నికల్‌గా చిత్రీకరించడం జరుగుతుంది ఒక ముసలి మనం ఒక మూస పద్ధతిలో మనం ఒక సమాజాన్ని ఒక యాస లేకపోతే ఒక భాషలో ఒక యాస మాట్లాడే వాళ్ళని చూపించడం జరుగుతుంది ఇది చాలా ప్రమాదకరమైన పద్ధతి.

పలాస సినిమా చూసిన తర్వాత నాకు ఉత్తరాంధ్ర అనే ఒక కాన్సెప్ట్‌తో ఈ సినిమా ద్వారా ఆవిష్కరించ బడింది మనం చెప్పవచ్చు. తూర్పు యాస ఉత్తరాంధ్రలో మాట్లాడే తెలుగు యాస మన పాఠ్య పుస్తకాలలో గాని లేకపోతే టెలివిజన్లో గాని రేడియోలో కానీ న్యూస్ పేపర్లు కానీ పాఠ్యపుస్తకాల్లోని సినిమాలో గాని మనకు కనిపించదు.

ఉత్తరాంధ్ర భాషను ఎక్కువగా హాస్యానికి లేక వెనుక బాటుదనానికి చిహ్నంగా ఇప్పటి వరకు తెలుగు సినిమాలో ఒక మూస పద్ధతిలో చిత్రీకరించటం జరుగుతూ వచ్చింది. 'తూర్పు రామాయణం' ఆడియో కెసెట్స్ ఎంతో పాపులర్ అయ్యాయి. దీనికి కారణం ఉత్తరాంధ్ర తెలుగు యాస ప్రధాన కారణం. మహా వెంకటేష్ దర్శకత్వంలో వచ్చిన కేర్ అఫ్ కంచరపాలెం (2018) ఉత్తరాంధ్ర యాసని సినిమా ఆద్యంతం వాడి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపుని తెలుగు సినిమాకి తెచ్చిపెట్టాడు.

పలాస సినిమాలో మొదటి నుంచీ చివరి వరకూ అన్ని పాత్రలు కూడా ఉత్తరాంధ్ర విజయనగరం శ్రీకాకుళం ఆ తర్వాత బొబ్బిలి ఈ ప్రాంతాలన్నీ మాట్లాడే ఒక యాసని హీరో నుంచి ప్రధాన పాత్ర నుంచి రాత్రి వరకు అది భాష ఉపయోగించటం అనేది మీకు చెప్పే విధానం నేపథ్యానికి చాలా బాగుంది చేకూరుతుందని మనం చెప్పుకోవచ్చు. దర్శకుడు కరుణ కుమార్ మాట్లాడుతూ శ్రీకాకుళం భాష యొక్క సొగసును తీసుకొని మిగతా ప్రాంతాల ప్రేక్షకులకు అర్థమయ్యేలా డైలాగ్‌లను మలచాము అని చెప్పారు (యెన్ టీవీ ఎంటర్టైన్మెంట్, 2020).

'పలాస 1978' కథ :

తరతరాలుగా వస్తున్న కులవివక్షయే ఈ సినిమా మూల కథ. ఇది ఎప్పుడో నలభై ఏళ్ల క్రితం శ్రీకాకుళంలో ఉన్న సమాజాన్ని గురించిన దైనప్పటికీ, సినిమాలోని అన్నిసన్నివేశాలు నిన్న మొన్న జరిగినట్టు దగా పడ్డ దళితుల వ్యధ ప్రేక్షకులకు పచ్చిగా ఏ తళుకు బెళుకులు అద్దకుండా అందరూ కొత్త నటీ నటులతో 'కథే ప్రాణం'గా రక్తి దర్శకుడి సినిమా కట్టించాడు.

శ్రీ శ్రీ గారు అన్నట్టు "ఏ దేశ చరిత్ర చూసిన ఏమున్నది గర్వకారణం? నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరపరాయణత్వం", దళితుల విషయంలో అణచివేత అప్పుడు, ఇప్పుడూ, ఎప్పుడూ ఒకేలా ఉంది కానీ దాని స్వరూపం మారింది స్వభావం కాదు. డబ్బు, భూములు, ఫ్యాక్టరీలు ఉన్న జీడిపప్పు షావుకారులు రాజకీయంగాను, మానసికంగాను, సామాజికం గాను దళితులని ఏ విధంగా అణిచివేసారో అన్నది మూలకదాంశం. దళితుల పై అగ్రకులాల పైశాచికత్వం, అణిచివేతను ఎదిరించే దళిత యవకుల పయనం సామజికన్యాయ సాధ్య, అసాధ్యల వంటి ఇబ్బంది కరమైన ప్రశ్నలను ప్రేక్షకుల ముందుంచుతుంది.

ఈ చిత్రం దళితుల మనోభావాలు రాగద్వేశాలని చక్కగా ఆవిష్కరించారు. దళిత కథలతో వచ్చిన చిత్రాలు ఉన్నాయి కానీ దళిత చిత్రాలు ఉన్నాయా? ఉంటే ఇలా ఉండాలేమో అన్నట్టుగా ఉంది ఈ చలనచిత్రం. అంటరానితనం బడిలో, మంచి నీళ్ల గొడవల్లో, రాజకీయాల్లో, రౌడీఇజం ద్వారా చిత్రీకరించారు. మోహనరావు మరియూ అతని అన్న రంగారావు ఏటికి ఎదురెళ్లి తమ ఆత్మాభిమానం తమ ఆడ వాళ్ళ మానం, రాజకీయ హక్కుల సాధించుకునే క్రమంలో తమను తాము రక్షించుకోవటానికి, షావుకారులకు ఎదురులేని ప్రతిపక్షంగ ఎదుకుతారు.

ధనబలం, రాజకీయ ప్రాబల్యం కలిగిన పెద్ద షావుకారు, చిన్నషావుకారులు తమ మధ్య ఎంత వైరం ఉన్నా

దళితులను ఉపయోగించుకోవడంలోను, అంతఃకలహాలను సృష్టించి ఒకరి మీద మరొకరికి శత్రుత్వం సృష్టించి ఊరిమీద తమ ఆధిపత్యం పోనీయకుండా చూసుకోవడలో సిద్ధహస్తులు.

మోహనరావు చేసిన రెండు ప్రధాన హత్యలు ఈ సినిమాలో కీలకం. ఒకటి షావుకారి కొమ్ముకాస్తున్న కిరాతకుడు భైరాగి మరొకటి మాజీ నక్సలైట్ ఇప్పటి మంత్రి. మొదటి హత్య మహనరావు ఉనికి లేక ఇలా ఉంటేనే బ్రతకగలం ఏ మొండి ధైర్యం గల వ్యక్తిగా సరి కొత్త మనిషిగా పరిచయమవుతాడు. రెండవ హత్య రాజకీయ నాయకుడి వాసుది, ఆలోచనతో కూడిన మేధావిగా సామజిక న్యాయం గురించి ప్రస్తావిస్తూ మనిషిగా తెరమీదకు వస్తాడు.

చదువుకున్న దళితుల ఆత్మభిమానం, ఆత్మ విశ్వాసం, రాజ్యాంగం పట్ల విధేయత పోలీసు పాత్రలో సెబాస్టియన్ దర్శకుడు మనకు చూపించాడు.

కులం, రాజకీయం సామజిక భావజాలం :

దళితుల ఆత్మ అభిమానం ఈ చిత్రంలో అనేక కోణాల్లోను అనేక రకాలను అనేక పర్యాయాలు దర్శకుడు మనకు పరిచయం చేస్తాడు. అది స్కూల్‌లో అయితే కానీ రాజకీయాలు అయితే కానీ లేక తినే భోజనం అయితే గాని ఆడే ఆటలోను కుల వివక్ష అప్పుడు ఇప్పుడు అనేక రకాలుగా దళితుల జీవితాళ్ళకి సవాళ్లుగ నిలుస్తు న్నాయి. ఇది ఒక నిరంతర పోరాటం. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ (1936) "కులం అనేది ఒక భావన, ఇది మనస్సు యొక్క స్థితి" అని వ్యాఖ్యానించారు.

సహజత్వానికి దగ్గరగా ఉండే సన్నివేశాలను చూపించడానికి దర్శకుడు చేసిన పరిశోధన ఈ సినిమాకి ఆయువుపట్టు. పాత్రలు భాష, కట్టుబాట్లు, విధివిధానాలు క్షుణ్ణంగా పరిశీలించి చిత్రీకరించారు.

ఒక జమీందారు దగ్గర ఏ విధమైన కట్టుబాట్లు మరియు భాష ప్రయోగం ఉంటుంది అనేది మనకి దర్శకుడు యొక్క సునిశితమైనపరిశోధనకి నిదర్శనంగా మనం చెప్పవచ్చు

సినిమా మొదలు లోనే మోహన రావు ఒకేవేటుతో వాసు తల తెగ నరకడం ద్వారా కథలో విషయ తీవ్రతను ప్రేక్షకుల ముందుంచుతాడు. దీనిని మరో కోణంలో విశ్లేశిస్తే దళితుడైన మోహన రావు భయ భీభిస్తావతారంలో వున్న కాళికా దేవి తలను ఒక్క వేటుతో నరికి, నేలేకురిగిన తల, కుప్పకూకిన తల లేని మొండెం పురాణాలను తిరిగి రాసి కొత్త భావజాలానికి నాంది పలికేలా దర్శకుడు చెప్పకనే చెప్పాడు. మనం చూసే కాళికా దీవి రౌద్ర రూపంలో ఆమె కాలి కింద నలిగిపోతూ అసురుడు ఉంటాడు. ఈ సినిమాలో ఈ సీన్ దళిత కథలకు కొత్త పునాదులు వేసినట్టుగా వుంది.

దళిత మహిళా పాత్రలను ఆత్మగౌరవం, ధైర్య వంతులుగా చిత్రీకరించాడు. మాలపిల్ల నుండి ఒసే రాములమ్మ సినిమా వరకు దళిత మహిళలు మనకు కులాంతర వివాహాల్లో ఒక వస్తువుగానే మనకు కనిపిస్తాయి కానీ రాములమ్మ సినిమాలో తుపాకీ పట్టిన బలమైన నేతగా చూపించారు. పలాస సినిమాలో నూతిలో నీళ్లు తోడుకోవడానికి వచినప్పుడు "పప్పు వలడానికి, మీ పొలాల్లో పని చేయడానికి ఎందుకు పిలుస్తారు అప్పుడు మైలు అంటదా? నువ్వు ఎంతమందిని చెయ్ పట్టుకు లాగినవ్ అప్పుడు మైలాంటద" అంటూ సూటిగా అడిగిన ప్రశ్న దళిత మహిళా వ్యక్తివాన్ని, వాస్తవాన్ని మనకు పరిచయం చేస్తాడు దర్శకుడు.

కుల వివక్షతో కూడిన సమాజానికి సినిమా హాలు దళిత జీవితాలలో ఒక ప్రముఖమైన స్థానం వుంది. గుడులు గోపురాలు కాకుండా, సినిమా హాలు టిక్కెట్టు ఉన్నోడికి లోనికి వెళ్లే అవకాశం కల్పిస్తుంది. కానీ కొంత జమీందారీతనం సినిమా హాళ్ల రూపంలోను, రైస్ మిల్లులు ఫ్యాక్టరీల రూపంలోను కులాహంకారంతో ఇంకా బల మందుకుంటున్నాయి. చుండూరు దళితులపై దమన కాండ జ్ఞాపకాలలో సినిమా హాలు పాత్రను మరువలేం.

పలాస సినిమాలో చిన్న షావుకారు సినిమా టిక్కెట్ల కోసం దళిత మహిళలను బూతులాడుతూ కామవాంఛతో కించపరచడం వాళ్లకు ఒక సర్వసాధారణమైన విషయం. కానీ రంగారావు అన్న "జాతి తక్కువాళ్లంటే లంజల్లా కనిపిస్తున్నారా "మీ గుమ్మం తొక్కడానికి పనికి రాము కానీ ఈ మంచం ఎక్కడానికి పనికి వస్తామా ?" అంటూ సూటిగా ప్రశ్నించడం దళితుల బ్రతుకులకు అడ్డం పెట్టి చూపినట్టుగా వుంది. ఈ సీన్ పర్యంతము ఎన్.టీ. రామా రావు మరియు తెలుగు దేశం పార్టీ యొక్క రాజకీయ నేపథ్యం, కమ్మ మరియు రెడ్డేత్తర కులాల రాజకీయ సమీకరణాలు చెప్పకనే చెపుతాడు దర్శకుడు.

సంగీతం : 'జన' పదం, సహజత్వం, సామజిక మూలాలు :

పలాస సినిమాను రెండు భాగాలుగా మాట్లాడితే.. ఇందులో కదాబలాన్ని ఒకవైపు - సంగీతాన్ని ఒకవైపు త్రాసులో వెస్తే సమానంగా త్రూగుతాయి. రెండూ కూడా పోటాపోటీగా పలాస సినిమాని గెలిపించాయి. ఇంత ముఖ్యపాత్ర వహించిన సంగీతాన్ని రఘు కుంచె అందించారు. ఈయన ఈసినిమాలో విలన్‌గా కూడా నటించారు. ఆ పాత్రకు ఈ సంగీతానికి (పాటలు) ఎక్కడా పొంతన లేకుండా చెరో దిక్కులా చేయగలగడం ఇక్కడ గమనించ వచ్చు.

ఈ సినిమాకు సంగీత దర్శకుడుగా ఉన్న రఘు కుంచె గారు చాలా జాగ్రత్తగా ఎంచి ఎంచి ఈ సినిమాకు సంగీతాన్ని సమకూర్చారు. ప్రతి పాట, అటు పాడేవాళ్ళు ఇంకా వాయిద్యాలు అన్నింటి విషయంలో చాలా జాగ్రత్త తీసుకున్నారు. మనల్ని పాట ద్వారా 1978 నాటి కాలానికి తీసుకువెళ్ళారు.

ఈసినిమాలో మొదటిపాట పలాస మాఊరు, పలాస వస్తావా అంటూ రాగయుక్తంగా సీనియర్ గాయని విజయలక్ష్మి గారు, రాజు గారు పాడగా... వాళ్ళ గొంతుతో పాటు అసిరయ్యగారి జముకు వాయిద్యం ఆ పాటకి మరింత పల్లెపదాన్ని... జీవాన్ని తీసుకువచ్చింది. ఈ పాట పాడిన రాజుగారు క్రొత్తవారు. అలాగే అసిరయ్యగారు శ్రీకాకుళం నుండి విశాఖపట్నం వెళ్ళే ట్రైన్లో జముకు వాయిస్తూ పాటలు పాడుతూ...పొట్టపోసుకునే వ్యక్తీ అలాంటి ఇద్దరి క్రొత్త వ్యక్తుల పలన ఆపాట మరింత పల్లెపాటగా ప్రేక్షకుల హృదయానికి హత్తుకునేలా అసిరయ్య గారి జముకు వాయుద్యం వింటూ ప్రేక్షకులు పలాస మార్గంలో...పలాస వస్తావా ఆపాట వింటూ అలా అలా శ్రీకాకుళంలో ప్రయాణించి ఆవీధులు, సంతలు తిరుగుతూ... జీడిపప్పును చూస్తూ పలాసలోకి వెళ్లి పోతాము. ఈ పాటలో అసిరయ్యగారి జముకుకు గౌరవనీయమైన స్థానాన్ని ఇచ్చారు రఘు కుంచేగారు. భాస్కరబట్లగారు సాహిత్యం కూర్చారు.

ఇంక ఈ సినిమాలో పద్యాల సుందరరావు గారి కొడుకులైన ఇద్దరు పాటగాళ్ళ జీవితం. ఊరికి దూరంగా విసిరివేయబడ్డ వెలి జీవితాల్లో పొద్దుంతా జీడిపిక్కల ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ ... ఎంత అణచివేత ఉన్నా... వాళ్ళ బాధలు అవమానాలు మరచిపోవడానికి వాళ్ళకున్న దారి పద్యాలు, పాటలు పాడడం, ఆడడం. వాళ్ళ సాహిత్యాన్ని నోటిద్వారా తరతరాలకు అందించడం. పగలు అవమానించబడ్డా ... రాత్రికి ప్రోగ్రాం ఉంటుంది అంటే వాళ్ళు ఎంత ఉత్సహంగా ఉంటారు, ఎంత చలాకీగా అయిపోతారు, చుట్టూ చూసే జనులు ఎలా మైమరచి పోతారు అనేది - నాది ...నక్కిలీసు గొలుసు .. అనే పాటలో చూస్తాము. పాడేవాళ్ళు, ఆడేవాళ్ళు, చుట్టు చుసే వాళ్ళు ఎంతగా తమ బాధల్ని మరచి ఆనందంగా ఉంటారో ఈ పాటలో చూడవచ్చు. ఈ పాటని రఘు కుంచె పాడారు. పాటకి జీవం పోసారు. ఇది ఉత్తరాంధ్ర జాన పదం, ఇలాంటిదే ఇంకో పాట - బావోచ్చాడే లప్పా.... బావోచ్చాడే లప్పా పాట ఇదికూడా ఇంతే ఉత్సహంగా ఉండే పల్లెపాట. అడివి బావ రాజుగారు పాడారు, సంగీతం రఘు కుంచెగారు.

ఇందులో ఒక యుగళగీతం కూడా ఉంది - ఓ

సాగసరి... ఈ పాటని S.P. బాలు గారు, బేబీ గార్లు పాడారు. ఒక శ్రీకాకుళం గుండె ఇంకో శ్రీకాకుళం గుండె ప్రపంచంలో ఏమూల ఎదురైనా గుర్తు పడుతుంది. తెలుగులోనే మరో మాండలికంలో మాట్లాడే భాషే శ్రీకాకుళం యాస. ఈ యాసని వారు తప్ప ఎవరూ వాళ్ళ లాగా మాట్లాడలేరు. మీదీ బరంపురం మాదీ బరంపురం అంటూ ఎక్కడ ఉన్నా వరునలు కలుపుకుంటూ కలుపుకుపోతారు.

మొత్తంగా కుంచె రఘుగారు ఈ సినిమాలో సంగీతాన్ని పల్లె సంగీతంగా అందివ్వడానికి చాలా కృషి చేసారని చెప్పవచ్చు. ఆ కృషిలో భాగంగా గ్రుడ్డివాడైన రాజుతో, నిరక్షరాస్యురాలైన బేబీతో పాడించడం, అసిరయ్యగారి జముకి గౌరవమీయడం. అది రఘు గారికే చెల్లింది. సంగీత దర్శకుడుగా రఘుగారు పూర్తి న్యాయం చేసారు.

ముగింపు :

అగ్రవర్ణాలు, భూస్వాముల దౌర్జన్యాలకు తుపాకీ మాత్రమే జవాబు అనే వామపక్ష చిత్రాల కంటే భిన్నంగా ఈ కథ ముగింపు కొంత అభ్యుదయంగాను మరికొంత సామజిక న్యాయాన్ని స్థిరంగ మళ్ళి నొక్కి వక్కాణించి నట్టుగా వుంది. ఆఖర్లో మోహన్రావు తనకు తానుగా లొంగిపోయేటప్పుడు

"అందరు బ్రతకాలి" అంటూ చివరిగా మిగిలిన చిన్న షావుకారుని మాత్రం చంపకుండా వదిలేస్తాడు. చట్టాన్ని, రాజ్యాంగాన్ని గౌరవిస్తూ కటకటాల వెనక్కి వెళ్తాడు. తమిళ చిత్రాల్లో పా రంజిత్ లాంటి డైరెక్టర్స్ దళిత కథలను గౌరవంగా ఉన్నతంగా చూపిస్తూ ఒక నూతన అధ్యాయానికి తెరతీసాడు. తెలుగు సినిమా పెద్ద కథానాయకులు, దర్శకులుకి కొంత సమయం పట్టొచ్చు.

ప్రస్తావనలు :

అంబేద్కర్ బి.ఆర్. (1936). కుల నిర్మూలన (annihiliation)

లాహౌర్ యొక్క జాట్-పాట్-తోడక్ మండలం యొక్క సమావేశం వార్షికానికి సిద్ధమైన ప్రసంగం, కానీ పంపిణీ చేయబడలేదు. B R కద్రేకర్.

సుజాత సూరేపల్లి (2020) కామెంటరీ ఆన్ పలాస 1978 సినిమా. ఫేస్ బుక్.కం నుండి తీసుకొనబడింది. 21/04/2020న ప్రచురించబడింది.

యెన్ టీవీ ఎంటర్టైన్మెంట్ (2020) పలాస 1978 టీం ఇంటర్వ్యూ విత్ తమ్మారెడ్డి భరద్వాజ https://www.youtube.com/watch?v=L9xH6QIyeU%8. 03/03/2020న ప్రచురించబడింది.

రచయత ఢిల్లీలో "ఇంట్రడక్షన్ టు సౌత్ ఇండియన్ సినిమా" స్థాపకుడు.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రాయలసీమ కథా పరిణామం – పరిశీలన

– డా॥. ఎం. తిరిక్రష్ణ , ఎడిటోరియల్ అసిస్టెంట్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వ విద్యాలయం, కుప్పం.

'కథ'... ఇది ఏనాటి ప్రక్రియ? నిన్నటిదా..! మొన్నటిదా..! లేక అమ్మమ్మదా..! నాయనమ్మదా..!.... కాదు కాదనే అనిపిస్తోంది. కథా ప్రక్రియ నిన్నటిదో.. మొన్నటిదో.. అంతకుముందు నాటిదో అస్సలు కాదు. ఇది ఎప్పటిదో.. బహుశా భూమి పుట్టి, మనిషి పుట్టి, మనిషికి కాస్తంత జ్ఞానం అబ్బినప్పటి నుంచీ కథా ప్రక్రియ వుందనే అనిపిస్తోంది. ప్రపంచమంతటా... భారతదేశంలో కూడా... అత్యంత ప్రాచీన సాహిత్యం అయిన వేదాలు, మహాభారతం దీనికి సాక్ష్యాలు. వేదాల్లో కూడా చిన్న చిన్న కథలను శ్లోకరూపంలో పొందుపర్చారు. భారతంలో అయితే చెప్పనవసరమే లేదు. చిన్న చిన్న నదులన్నీ కలిసి మహాసంద్రంగా మారినట్లు చిన్న చిన్న కథలన్నీ కలిసి 'జయ సంహిత'ను మహా భారతంగా మార్చాయి. అయితే ఇవన్నీ కూడా రచనలు కావు. వాగ్రూపంలో ఒక తరం నుంచీ మరో తరానికి అందిన సాహితీ రత్నాలు.

అయితే ఇవన్నీ కూడా శృంగార, వీరరసాలనే ఎక్కువగా ప్రస్తావించాయి. సామాన్య ప్రజల జీవితాలను తడమడంలో వెనుకబడ్డాయి.

కాగా, కథకు పట్టాభిషేకం జరిగింది మాత్రం 19 శతాబ్దంలోనే అనడంలో ఏమాత్రం సందేహం లేదు. జాన్ గుటెన్ బర్గ్ కనిపెట్టిన ముద్రణా యంత్రం వినియోగం 19వ శతాబ్దానికల్లా ఊపందుకుంది. దీంతో పత్రికల సంఖ్య పెరిగింది. ఒక విషయాన్ని ఆకర్షణీయంగా, క్లుప్తంగా చెప్పాల్సిన ఆవశ్యకత పెరిగింది. ఇదే కథా రచనకు ప్రాణంపోసి పై స్థాయిలో నిలబెట్టిందని చెప్పవచ్చు.

'నవలను బూర్జువా సమాజం ప్రపంచ సంస్కృతికిచ్చిన మహత్తరమైన కానుకగా నవలా సాహిత్య విమర్శకులు అభివర్ణిస్తారు. ఆ పద్ధతిలోనే మనం కథను పారిశ్రామిక నాగరికత ప్రపంచ సంస్కృతికిచ్చిన మహత్తరమైన కానుకగా అభివర్ణించవచ్చు.' అంటారు వల్లంపాటి వెంకట సుబ్బయ్య.

"కథకు ప్రధాన లక్షణమైన క్లుప్తత కేవలం రూపానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు. అది 19 శతాబ్దపు జీవిత దృక్పథానికి సాహిత్య రూపం. జీవితంలోని ఒక ముక్కను తీసుకుని దానికి వ్యక్తిత్వం ఇవ్వాలన్న ఆకాంక్షలోంచి కథకు రూపం వచ్చింది" అంటారు క్యు.డి. లూయిస్.

ఇక తెలుగు కథకు విషయానికి వస్తే తొలి తెలుగు కథ ఏదన్న విషయం ఇప్పటికీ చర్చనీయాంశంగా వుంది. కొందరు ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ 1903లో రాసిన 'లలిత'ను తొలి తెలుగు కథగా చెబుతుండగా, మరి కొందరు 1904లో భండారు అచ్చమాంబ రాసిన 'స్త్రీ విద్య'ను తొలి తెలుగు కథగా పేర్కొంటున్నారు. అయితే మరికొందరు కథకు వుండవలసిన లక్షణాలను బట్టి గురజాడ అప్పారావు రాసిన 'దిద్దుబాటు'ను తొలి తెలుగు కథ అంటున్నారు.

1904లో తొలి తెలుగు కథ వెలువడిందనుకుంటే రాయలసీమలో తొలికథ రావడానికి దాదాపు 40 సంవత్సరాల కాలం పట్టినట్లు తెలుస్తోంది. రాయల సీమలో కథా ప్రారంభానికి ఇంతకాలం పట్టడానికి ఇక్కడి వైవిధ్యమైన జీవన విధానం, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు ఒక కారణంకాగా, ఈ ప్రాంతపు మాండలికంతో కూడిన కథలను ప్రచురించడానికి, ఈ ప్రాంతపు రచయితలను ప్రోత్సహించడానికి ప్రచురణకర్తలు పెద్దగా ఆసక్తి చూపక పోవడం కూడా ఒక కారణమని మనకు అనిపిస్తుంది.

దాదాపు 40 ఏళ్ళ తరువాత 1941లో రామకృష్ణ రాసిన 'చిరంజీవి' రాయలసీమ తొలికథగా వచ్చింది. అయి

నప్పటికీ రాయలసీమ ప్రాంతానికి చెందిన ఏ విషయాన్ని కూడా ఈ కథ తడమలేదు. రామకృష్ణ 1941 నుంచీ పది కథలు రాశారు. అయితే సీమ మాండలికం తప్ప ఆయన రాయలసీమ కథకు వేసిన ప్రత్యేక దారి అంటూ ఏదీ లేదు.

చిత్తూరు జిల్లా కథ :

1944లో కె. సభా తన రచనలతో రాయలసీమ రచయితలకు ఒక కొత్త ఊపు తెచ్చారు. ఆయన రాసిన 'కడగండ్లు' రాయలసీమ స్థితిగతులను తెలియజేసే కథగా చెప్పవచ్చు. 1944 నుంచీ 1980 మధ్యకాలంలో కె. సభా దాదాపు 300 కథలు రాశారు. సీమలోని తొలితరం కథకులందరిపైనా సభా ప్రభావం ఎక్కువగా వుంది. కె. సభా చిత్తూరు జిల్లా మధ్య ప్రాంతపు జీవితాన్ని చిత్రించారు.

సభా రాసిన 'పాతాళగంగ' బోర్లు వేసి చితికిపోయిన బేలప్ప అనే రైతు వ్యధను గురించి తెలియజేస్తుంది. చిత్తూరు మధ్య ప్రాంతంలో కరువు నెలకొని వుంది. బోర్లు వేసినా నీరు పడక ఎందరో రైతులు అప్పుల పాలై పోయారు. ఈ కష్టాలనే సభా తన కథలో చూపించారు. 'ఎండమావుల్లో తిమింగలం వేట' కరువు నివారణ పనుల పేరుతో ప్రభుత్వం చేసే వంచనను వ్యంగ్యంగా ఎత్తి చూపింది. కరువు నివారణ విషయంలో చిత్తశుద్ధి లేని ప్రభుత్వ వ్యవహారం ఇలాగే వుంటుందని ఆయన చూపారు.

1952 నుంచీ 1999 మధ్యకాలంలో రచనలు చేసిన మధురాంతకం రాజారాం కె. సభా ప్రేరణతో తాను కథలు రాశానని చెప్పుకున్నారు. 'సభా కథలు చదివాక నాబోటి సామాన్యుడు కూడా కథలు రాయవచ్చని గ్రహించానని' చెప్పుకున్నారు.

మధురాంతకం రాజారాం కథల్లో చిత్తూరు జిల్లా భౌగోళిక ప్రాంతాల ప్రస్తావన ఎక్కువగా వుంటుంది. 1958 నాటి 'సర్కస్‌డేరా' కథ రాయలసీమ ప్రజా జీవన పోరాటాన్ని తెలుపుతోంది. 1975లో వచ్చిన 'ఇక్కడ మేమంతా క్షేమం' కథలో ఈరయ్య పేదవాడు. అతని కొడుకు చెంగల్రాయుడు బాటపనికోసం దూర ప్రాంతాలకు వెళ్లాడు. ఈరయ్య కొడుక్కు రాయించిన జాబే ఈ కథ. ఇందులో ఈరయ్య తమ ప్రాంతంలోని కరువు కష్టాలను కొడుక్కు జాబులో వివరిస్తాడు.

1986లో రాసిన 'ఎడారికోయిల' కథ అమెరికానుంచీ సొంతవూరికి వచ్చిన ఒక యాత్రికుడి ప్రయాణం. తిరుపతి నుంచీ మహల్ దాకా, అక్కడి నుంచీ రాగుల పాడుదాకా భౌగోళిక పరిస్థితుల వర్ణన ఇందులో వుంది. 'గుట్టల నడుమ ఏటవాలుగా పడివున్న ఎర్రటి బీటి నేలలు' అక్కడి జీవితమని రచయిత చెబుతారు.

1958లో ఆయన రాసిన 'సర్కస్ డేరా' కథలో చేద బావిలో బండపడితే నాటు బాంబు పెట్టి వత్తి వెలిగించి పేలేలోగా తాడుతో పైకి ఎగబాకే పనివాడికి జారితే కింద కాపాడడానికి వలలేదు. సర్కస్‌లో వలైనా వుంది. డేరాలోపల ప్రదర్శన కన్నా బయట ప్రదర్శన నిజమైన సర్కస్ అని రాజారాం చెబుతారు.

1958-60 మధ్యకాలంలో కథా రచన ప్రారంభించిన వల్లంపాటి వెంకట సుబ్బయ్య, కలువకొలను సదానంద, పులికంటి కృష్ణారెడ్డి, సి.వేణు, ముంగర శంకరరాజులు కూడా సీమలోని గ్రామీణ జీవితాన్ని అద్భుతంగా చిత్రించారు. వల్లంపాటి 1972లో రాసిన 'గాయపడిన దేవత' కథ రెండు ఫ్యాక్షన్ కుటుంబాలు పదవుల కోసం రాజీకి సిద్ధం కావడాన్ని చూపుతుంది. అందులో ఒక ఫ్యాక్షనిస్టు కూతుర్ని మరో ఫ్యాక్షనిస్టు కొడుక్కి ఇచ్చి వివాహం చెయ్యాలనుకోవడం ద్వారా రాజీ ఒప్పందానికి వస్తారు. ఇందుకు కూతురు జానకి అంగీకరించదు. ఇది త్యాగం కాదు బలి అని చెబుతుంది. గుడిలోని సీతాకళ్యాణం నేపథ్యంగా ఈ కథ సాగుతుంది. 1991లో వల్లంపాటే రాసిన 'బండి కదిలింది' కథ సీమ కరువు మూలాలను వెతికి చెప్పిన కథ.

కాగా, మరో ప్రఖ్యాత సీమ రచయిత పులికంటి కృష్ణారెడ్డి రాయలసీమ జీవితం, సమస్యలు, భాషవ్యుత్పత్తి సంబంధాలలో వచ్చిన మార్పులవల్ల మానవసంబంధాల్లో వచ్చిన మార్పును వెల్లడించే కథలు రాశారు. 1974లో వచ్చిన 'మరపురాని మా వూరు' కథ నుంచీ, 1996లో వచ్చిన 'మండుతున్న మా వూరు' దాకా ఈ ప్రాంతంలో వచ్చిన మార్పును చిత్రించారు. 'బోడెద్దు' కథలో ముసలి దైన బోడెద్దును కసాయికి అమ్మి వదిలించుకోవచ్చు, ముసలివాడిని ఏం చెయ్యాలి? అన్న కుటుంబ సమస్యను ప్రస్తావించారు.

1960లో సి.వేణు రాసిన 'నవ్విన ధాన్యరాశి' ముంగర శంకరరాజు 'కోడి కూసింది. కుక్క చచ్చింది' అనే కథ లు కూడా రాయలసీమలో నెలకొని వున్న పరిస్థితులను తెలిపాయి.

అనంతపురం జిల్లా కథలు :

అనంతపురం జిల్లాలో 1941లోనే కథారచన ప్రారంభ మైంది. సీమ మొదటి కథకుడుగా గుర్తించిన జి. రామకృష్ణ 1941లో 'చిరంజీవి' కథను రాశారు. అయితే ఈ కథ సీమ జీవితాన్ని ప్రస్తావించలేదు.

1970వ దశకంలో రాయడం మొదలెట్టిన సింగమనేని నారాయణ తన కథలో సీమ జీవన వైరుధ్యాన్ని విస్తృతంగా చిత్రించారు. 1978లో ఆయన రాసిన 'జూదం'లో ప్రకృతి రైతుతో ఆడిన జూదాన్ని చూపారు. ఆయనే రాసిన 'అడుసు' చీనీ తోటలను స్వయంగా నరికేసుకున్న ఓ రైతు కథ. 'ఊబి'లో బోర్లువేసి చితికిపోయిన రైతు జీవితం కనిపిస్తుంది.

సింగమనేని రాసిన 'ఫిరంగిలో జ్వరం' కథలో వెంక ట్రాయుడు ఓ ఫ్యాక్షనిస్టు. అతని చీనీ తోటను ఎవరో నరికేశారు. గణనాయక్ సుగాలీ. ఇతను నరికేశాడని ప్రతీకారం తీర్చుకుంటానని వెంకట్రాయుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. తన శత్రువు వీరారెడ్డి ఇపుడు బల హీనుడని దాడి చేసే స్థితిలో లేడని అంటాడు. డబ్బుటీవో దాడిని ఈ కథ గుర్తు చేస్తుంది. అమెరికా వెంకట్రాయుడు అయితే రష్యా వీరారెడ్డి. బిన్ లాడెన్ గణనాయక్. పెట్రోలు బావులు కాపుసారా.

అనంతపురం జిల్లాకే చెందిన మరో రచయిత చిలు కూరి దేవపుత్ర 'సమిధలు', 'ఆయుధం' లాంటి కథలను రాశారు. 1979లో ఆయన దళిత చైతన్యంతో కథలు రాశారు. ఫ్యాక్షన్‌లో దళితులు ఆయుధాలుగా, సమిధలుగా మారిపోతున్న తీరును ఆయన తన కథల్లో చెప్పుకొచ్చారు. 'ఊడల మర్రి'లో రాజకీయ రిజర్వేషన్ల బండారాన్ని, 'విలోమ' కథలో రిజర్వేషన్లలో మోసాలను ఆవిష్కరించారు. 'మన్ను తిన్న మనిషి'లో భూమికి రైతుకు మధ్య వున్న ఆత్మీయ బంధాన్ని చెప్పారు. 'ఏకాకి నౌక చప్పుడు' కథలో చావు సమయంలో కూడా తండ్రి దగ్గర వుండలేని కొడుకు దౌర్భాగ్య స్థితిని తెలిపారు. దేవపుత్ర తన కథల్లో సీమ భౌగోళిక పరిస్థితులను పెద్దగా వివరించలేదు. కానీ సీమ జీవితాన్ని పైపైనే తడిమారు. ఆయన కథల్లో దళితవాదానికి పెద్దపీట వేశారు.

మరో రచయిత శాంతి నారాయణ కూడా సీమ జీవితాన్ని ప్రతిబింబిస్తూ కథలు రాశారు. ఆయన రాసిన 'కల్లమయిపాయ' నిత్యం దగాకు గురవుతున్న రాయల సీమను పరిచయం చేసే కథ. ఆయన కథల్లో రైతులను ప్రకృతి చేసే మోసం, ప్రభుత్వం చేసే మోసం, దళారీ వ్యవస్థ దగాను చూపారు.

'గర్భశోకం' కథలో ఫ్యాక్షన్ కుటుంబాల్లో స్త్రీలు పడే మానసిక క్షోభ, ఎదుర్కొనే శారీరక హింసను ఆయన కనులకు కట్టినట్లుగా చూపించారు.

'ఈ పయనం ఎక్కడికి?' కథలో కోస్తా ప్రాంతానికి వెళ్లి వచ్చిన ఓ రాయలసీమ వ్యక్తి మానసిక సంఘర్షణను చూపింది.

అనంతపురం జిల్లాకే చెందిన బండి నారాయణస్వామి 1987 తర్వాత తరం వారు. కథా వస్తు వైవిధ్యం, శిల్ప వైవిధ్యం వున్న రచయిత ఆయన. 'ఒక బిందె నీళ్లకోసం

ఇద్దరు ఆడవాళ్ల మధ్య మొదలైన గొడవ మగవాళ్ల మధ్య, కుటుంబాల మధ్య ఘర్షణగా మారుతుంది. బుర్రలు పగులుతాయి. నాగరికత లేని ఆ ఇద్దరూ జైలు పాలవు తారు. తాగే దానికి కడవ నీళ్లు నోచుకోలేని వాళ్లకు ఏం నాగరికత వుంటుంది? అనేది రచయిత ప్రశ్న.

జిల్లాకే చెందిన స్వామి రాసిన 'సావుకూడు' కథలో చనిపోయిన పెద్దవ్వయ్య భార్య పొగిలిపొగిలి ఏడుస్తుంటుంది. ఆమె ఏడుపు చచ్చిపోయిన మొగుడి కోసం కాదు. 'నా మొగానికి నీళ్లు కలిపిన పులుసు పోస్తిరి కదరా.. నా ఇస్తరాకులోకి మాత్రం నాలుగు తునకలు ఎయ్యకపోతిరి కదరా' అని ఏడుపు. చావును అధిగ మించిన దు:ఖం వెనుక ఆర్థిక, సామాజిక కారణాలను ఈ కథ తెలుపుతుంది.

ఆయనే రానినన 'తెల్లదయ్యం' ప్రపంచీకరణ విధ్వంస ప్రభావం వ్యవసాయం మీద ఎలా వుందో వివ రిస్తుంది. భూస్వామ్య వర్గం పెట్టుబడిదారులుగా మారిన తీరును ఈ కథ వివరిస్తుంది.

జిల్లాకే చెందిన రచయిత్రి ఎ. నాయకి రాసిన 'జాడలేని మనిషి' ఫ్యాక్షన్‌లోని క్రూరత్వాన్ని చూపే కథ. ఇది బీభత్స ప్రధానమైనది. రెడ్డి దాష్టీకంతో బలైన నారాయణ కుటుంబం కథ. నారాయణ భార్య కాన్సర్‌తో చనిపోయాక నలుగురు పిల్లల్ని తీసుకుని భార్య చెల్లెలి వూరు చేరతాడు. పెద్ద కొడుకు గోవింద్‌ను బలవంతంగా ప్రభాకర్ రెడ్డి పనికి పిలిపించుకుంటాడు. బాంబు లెయ్యడం, కాపలా కాయడం, నరకడం, గోవిందు పని. ఈ పనులకు భయపడి గోవిందు పారిపోతాడు. రెండవ కొడుకుని పనికి పంపమని రెడ్డి ఆదేశం. రామప్ప వచ్చి నారాయణకు నచ్చజెపుతాడు. జోరున వాన కురుస్తోన్న రాత్రి జీపు తునాతునకలైంది. ప్రభాకరరెడ్డి ముఖ్య అనుచరుడు నాగిరెడ్డి, మరో నలుగురు మానం ముద్దలయ్యారు. నారాయణ మిగిలిన కొడుకులను తీసుకుని సొంతవూరికి పారిపోయాడు. గోవిందు చనిపోయాడని అతనికి తెలీదు. ఒకరోజు రెండువేల రూపాయల మనియార్డరు, కోర్టు నోటీసు వచ్చాయి. గోవిందును దౌర్జన్యంగా తీసుకుపోయినందున గోవిందును అప్పగించాలని అందులో వుంటుంది. ఫ్యాక్షన్ క్రౌర్యానికి పరాకాష్ట ఈ కథ.

కడప జిల్లా కథలు :

కడప జిల్లాలో 1960లో సొదుం జయరాం, కేతు విశ్వనాధరెడ్డి, పి. రామకృష్ణారెడ్డి కథారచనకు నాంది పలికారు. వారి సమకాలీనులైన రాచమల్లు రామచంద్రా రెడ్డి 1957-60 మధ్య దాదాపు 12కథలు రాశారు. 'అలసిన గుండెలు' అనే కథా సంపుటిని కూడా ఆయన ప్రచురిం చారు. ఆయన కథల్లో మధ్యతరగతి జీవితాన్ని, వారి కష్టనష్టాలను ప్రస్తావించారు.

కాగా, 1962 నుంచీ కథలు రాయడం మొదలు పెట్టిన కేతు విశ్వనాధరెడ్డి రాయలసీమను కొత్త కోణంలో చూపారు. ఆయన రాయల సీమ జీవిత చిత్రణకే పరి మితం కాకుండా సమస్య ఎందుకు ఏర్పడిందో కూడా వివరించే ప్రయత్నం చేశారు. ఆయన రాసిన 'నమ్ముకున్న నేల' అనే కథలో రైతుకీ భూమికీ మధ్య సంబంధం శిధిలమైన తీరును వివరించారు. ఈ కథలో ప్రధాన పాత్ర కథకుడు, పల్లెలోని రెండెకరాలు అమ్మేసి భూమితో బంధం తెంచుకోవాలనుకుంటాడు. రెండవ పాత్ర వీరన్న పొలాన్ని కొంటానని అడ్వాన్సు ఇచ్చి కొనలేకపోతాడు. అతనిది ఆర్థికంగానూ, నైతికంగానూ పతనమైన పాత్ర. మూడవ పాత్ర అంగడి సుబ్బరాయుడు. ఇతను వ్యాపారి. కరువు ఇతనికి వ్యాపారంగా వుంటుంది. రైతు అవసరా లతో ఆడుకునే వ్యాపారి. మునిరెడ్డి కథకుడి బంధువు. మోతుబరి రైతు. కథకుడికీ, మునిరెడ్డికీ మధ్య కరువు నేపధ్యంలో జరిగే నిశ్శబ్ద పోరాటం ఈ కథ.

నేలను నమ్ముకుంటే బతుకే లేదు. పారిశ్రామికీకరణ తప్పదు అనే సూచన ఒక పాత్ర చేస్తుంది. ఉత్తర భారత దేశం నుంచీ వచ్చి కొందరు పరిశ్రమలు పెట్టడంతో ఈ ప్రాంత జీవితం మారిపోయింది. అంగళ్లలో బీడీల బదులు సిగరెట్లు, ఎద్దుల బళ్లు తిరిగే బాటల్లో జీపులు తిరుగు

తున్నాయి. ఇంతకీ ఇది అభివృద్ధేనా? అని ప్రశ్న మనకు ఎదురవుతుంది. ఇలా ముగుస్తుంది ఈ కథ.

అలాగే 'కూలిన బురుజు' కథ రాయలసీమ కక్షల నేపథ్యంలో వుంటుంది. ఈ కథలో కథకుడు హింసను నేరుగా చూపించడు. హింస భయాన్ని చూపుతాడు.

కేతు విశ్వనాధరెడ్డి రాసిన 'గడ్డి' కరువుకు సంబంధించిన కథ. కరువుతో తిండి సమస్య వచ్చి పడింది. పశువులకూ మేత సమస్య. గడ్డిని ప్రభుత్వం తెప్పించి పంపేది. అయితే దానిని పంచకుండా మునసబు దాచుకున్నాడు. అతనిపై ప్రజలు తిరుగుబాటు చేస్తారు. ఈ కథలో సమస్యకు పరిష్కారం కూడా ఆయన చూపారు.

1988లో ఆయన రాసిన 'కూలిన బురుజు'లో పట్టణం నుంచీ కడప పల్లెలోకి అడుగుపెట్టిన కిష్టుడు కక్షల వాతావరణాన్ని వివరిస్తాడు. పుట్ట చెండాట మాదిరిగా నాటు బాంబులతో ఆడుకున్న గ్రామ పార్టీల ప్రపంచంలోకి అడుగుపెడుతున్నాను అంటాడు. లక్ష్మక్క కిష్టుడితో మీ బావని చంపినోడు కుక్కచావు చచ్చేదాకా ఈ గాజులు పగలగొట్టుకోను, ఈ బొట్టు చెరుపుకోను అని ప్రతినబూనుతుంది. కేతు విశ్వనాధరెడ్డి రాయలసీమ జీవితాన్ని తన కథల్లో ప్రతిబింబించారు. మాండలికాన్ని మాత్రం పరిమితంగా వాడారు.

కాగా, పి. రామకృష్ణారెడ్డి తన 'పెన్నేటి కథలు'లో పెన్నాతీరంలోని ప్రజా జీవనాన్ని చిత్రించాడు. వాటిలో 'కుర్రోడు చచ్చిపోయినాడు' ఫ్యూడలిజం క్రౌర్యం వెనుక దాగివుండే పిరికితనం గుట్టును విప్పే కథ ఇది.

'పూజ' అనే కథలో ఆయన ఒక పెద్ద ప్రశ్న వేశారు. కరువు- మేత లేదు- తన దగ్గర వున్న ఆవునేం చెయ్యాలి? కరువు కాలంలో తిండి లేక మలమలా మాడుతున్న మాదిగ మారెప్పకు కోతకివ్వాలా? లేదా అందరి ఆస్తులనూ వడ్డీ పేరుతో స్వాధీనం చేసుకుంటున్న వడ్డీ వ్యాపారి నర్సప్పకు పూజకు ఇవ్వాలా? అనే ప్రశ్నను ఆయన వేస్తారు.

2003లో రాసిన 'కరువు పీల్చిన మనుషులు' కరువు కథ కాగా, 'ఎలిగే పెద్దోళ్లు నలిగే చిన్నోళ్లు' ఫ్యాక్షన్ కథ. ఈ కథలో వర్గాలను నడిపేది రెడ్లు, భూస్వాములు. బలయ్యేది పేదలు. బోయలు, మాదిగలు, మాలలు అన్న విషయాన్ని ఆయన తెలుపుతారు. ఈ విషయాన్నే కింది వర్గాల వాళ్లు గనక ప్రశ్నిస్తే ఫ్యాక్షన్ ముఠాలు నడిపే పెద్దలంతా ఒక్కటైపోతారు. అలాంటి పెద్దవాళ్ల కోసం కిందవాళ్లు కత్తితో నరుక్కుని చస్తారు. ఇది ఫ్యాక్షన్ లోగుట్టు పట్టుకున్న కథ.

మరో సీమ కథకులు వైసీవీ రెడ్డి 1980-82 మధ్య కాలంలో రాసిన కథలను 'గట్టిగింజలు' పేరుతో కథా సంపుటిగా తీసుకొచ్చారు. 'గట్టిగింజలు' ఫ్యాక్షన్, కరువు కలబోసిన కథ ఇది. కాగా, కథా నిర్మాణం సంపూర్ణంగా లేని స్కెచ్‌లలా ఈ కథలు వున్నాయిని మరో ప్రముఖ రచయిత వల్లంపాటి ఈ సంపుటిపై వ్యాఖ్యానించారు.

కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి 1982లో 'కుట్ర' అనే సంపుటని వెలువరించారు. కుప్పిరెడ్డి తన కథల్లో వ్యవస్థ మీద వ్యంగ్యధోరణిలో వ్యాఖ్యానించారు. అయితే ఆయన కరువు, ఫ్యాక్షన్, భూస్వాములపై రచనలు చేయలేదు.

ఇదిలా వుండగా మరో సీమ కథకులు, విమర్శకులు, అనువాదకులు ఎం.వీ రమణారెడ్డి 1988-93 మధ్య కాలంలో రాసిన తొమ్మిది కథలతో 'పరిష్కారం' అనే సంపుటిని వెలువరించారు. ఈ కథలన్నీ రాయలసీమ పెత్తందారీతనంపై చమత్కారాలను రువ్వాయి.

ఇదిలా వుండగా 2013లో చిట్వేలి జడ్పీ హైస్కూల్‌లో 7వతరగతి చదువుతున్న టి. నాగమణి 'బహుమతి' అనే కథలో తండ్రి కువైట్‌లో వుంటే వారి పిల్లలు తండ్రికోసం, తండ్రి మాటకోసం, తండ్రి ఓదార్పు కోసం, తండ్రి అభినందన కోసం ఎంత తహతహలాడతారో కంటికి కట్టినట్లు చెప్పడం అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. కువైట్‌లో ఎడారిలో పడే కష్టాన్ని ఇతరుల ద్వారా విన్న కుమార్తె తండ్రి ఎన్ని కష్టాలు పడుతున్నాడో అని కన్నీరు పెడుతుంది. తండ్రితో ఫోనులో మాట్లాడుతూ 'నిన్ను తల్చుకుంటేనే భయం వేస్తాంది. తొందరగా ఇంటికి రా నాయనా నాకు ఏడుపొస్తాంది' అంటూ అందరి కంటా నీరు పెట్టించింది.

కడప జిల్లాలో 1955-60 దాకా కథా సాహిత్యం అంత విస్తృతంగా రాలేదనే చెప్పవచ్చు. అయితే ఇదే సమయంలో సమయంలో కడపజిల్లాకు చెందినవారే అద్భుతమైన సినిమాలు తీశారు. కడపజిల్లాకు చెందిన బిఎన్ రెడ్డి 1939లో 'వందేమాతరం', 1940లో 'సుమంగళి', 1941లో 'దేవత', 1945లో 'స్వర్గసీమ', 1947లో 'యోగి వేమన', 1951లో 'మల్లీశ్వరి' వంటి సినిమాలు తీశారు.

అదేవిధంగా 1954లో ఇదే ప్రాంతానికి చెందిన కెవి రెడ్డి 'పెద్దమనుషులు' అనే చిత్రాన్ని తీశారు. అయితే ఈ సినిమాలు వేటిట్లో కూడా కడప స్థానికత ఎక్కడా కనిపించదు. ఈ సినిమాలు కథా సంబంధమైనవి అయినప్పటికీ కడప కథను ఇవి ప్రభావితం చెయ్యలేదు.

కర్నూలు జిల్లా కథలు :

కర్నూలు జిల్లా కథా రచనలో కొంత వెనుకబడిందనే చెప్పవచ్చు. 1990 దాకా కర్నూలు జిల్లాలో కథలేవీ రాలేదు. అనంతర కాలంలో సామాజిక వైరుధ్యాలు వేగవంతం కావడం చేత ఇక్కడ మంచి కథ పుట్టింది. 1996లో 'పల్లె మంగలి కథలు', 1998లో 'ఫ్యాక్షన్ కథలు', 2001లో 'కథా సమయం', 2013లో 'హంద్రీ కథలు' ఇక్కడి నుంచి పుట్టాయి.

ఇది ఇలా వుంటే 1921 ప్రాంతంలో చింతా దీక్షితులు 'సుగాలీ కుటుంబము' గురించి కథ రాశారు. కర్నూలు జిల్లాలోని శ్రీశైలానికి వెళ్లిన ఆయన అక్కడి అడవుల్లో నివశించే చెంచుల జీవితాలను ఈ కథలో చిత్రించారు. దీక్షితులు సీమ జీవితాన్ని చిత్రించారు కానీ ఆయన సీమ కథకులు కాదు. దీనిని తెలుగులో వచ్చిన మొట్టమొదటి తెలుగు కథగా చెబుతారు. ఆయన రాసిన ఈ కథలో రూపక్ నాయక్, అతని భార్య చంద్రి కూలీలు. కరువు కారణంగా కూలిపనులు లేకపోవడంతో అడవికి వెళ్లి ఈతగింజలు ఏరుకుని వచ్చి వాటి పొట్టుతో గంజి తాగేవారు. అవికూడా దొరక్కపోవడంతో చింతగింజలు ఏరుకుని వచ్చి పిండిచేసి రొట్టెలు చేసుకుని తినేవారు. తర్వాత అవి కూడా దొరక్క చింత చిగురు, బూడిద ఉడికించుకుని తినేవారు. అవికూడా కరువవడంతో అడవికి దేవదారు ఆకులకోసం వెళ్ళిన రూపక్‌నాయక్‌పై కొమ్మలు నరికేశాడని ఫారెస్టు వాళ్లు కేసు పెట్టి జైలుకు పంపారు. దీంతో అతని కుటుంబం విచ్ఛిన్నం అవుతుంది. ఇది కరువు చేసిన గాయం. కాగా ఆయన 'దాసరి పాట', 'పెద్ద వేట', 'చెంచురాణి' అనే కథలను కూడా ఈ నేపథ్యం లోనే రాశారు.

కాగా, జిల్లాకు చెందిన జి. వెంకటకృష్ణ రాసిన 'గరుడ స్తంభం', 'పడగనీడ', శ్రీనివాసమూర్తి రాసిన 'దేవుని మాన్యం', 'మెడమీద వేలాడే కత్తి', తుమ్మల రామకృష్ణ రాసిన 'మట్టిపాయ్య', 'ఊరు మద్దిస్తం' ఎం. హరికిషన్ రాసిన 'నయా ఫత్వా', ఇనయతుల్లా 'వలస', 'నిచ్చెన', నాగప్పగారి సుందరరాజు 'మాదిగోడు', పాణి 'ప్యాపిలి వచ్చింది' సంపుటాలు 1990 తర్వాతే ఇక్కడి నుంచీ వెలువడ్డాయి. ఇవన్నీ కూడా సీమ జీవిత ప్రతిబింబాలుగా వుండడంతో పాటు సమస్యలను ప్రస్తావించడం, సమస్యలకు కారణాలపై గొంతెత్తి ప్రశ్నించడం చేశాయి.

2016లో వెంకటకృష్ణ రాసిన 'వర్తమానం'లో ప్రత్యేక రాయలసీమను కోరుకుంటున్న సమయంలోనే సీమలోని శ్రామికులకు జరుగుతున్న దోపిడీని చూపుతుంది. పీఎంఆర్ సార్ ఇంట్లో జరుగుతున్న సమావేశం సీమకు జరిగిన ద్రోహాన్ని, సీమ నాయకులు కీలుబొమ్మలైన వైనాన్ని, సీమ భాష, ఆహారాలకు జరుగుతున్న అవమానాన్ని ప్రస్తావిస్తుంది. మరో వైపు ఇదే సమయంలో దుబ్బన్న ఇంటికి నీరు మోసే బక్క నల్లన్న సమస్యను రచయిత ప్రస్తావిస్తాడు. తనకు నీరు మోసినందుకు జీతం ఇవ్వాలని నల్లన్న దుబ్బన్నను అడుగుతాడు. ఈ మధ్యస్తానికి ఇద్దరూ పీఎంఆర్ సార్ ఇంటికి చేరతారు. అక్కడా సీమ నీటిపై చర్చ జరుగుతూ వుంటుంది. తనను అన్నదమ్ముడిగా చూసినట్లయితే ఆస్తిలో వాటా ఇవ్వవా అని, జీతగాడిగా చూస్తే జీతం ఇవ్వవా అని నల్లన్న ప్రశ్నిస్తాడు. ఇది సీమ ప్రశ్న అని కథకుడు అంటాడు.

రాయలసీమ కథా రచయితలు ప్రస్తుతం రచనకే పరిమితం కాలేదు. సీమ కన్నీటి పరిస్థితులకు కారణాలు గ్రహించి ఆగ్రహంతో కథతో ప్రశ్నిస్తున్నారు, నిలదీస్తున్నారు. అంతటితో ఆగక కార్యకర్తలుగానూ మారుతున్నారు. ఉద్యమాల్లో భాగం అవుతున్నారు. అనంతపురంలో బండి నారాయణ స్వామి బిసీ ఉద్యమ కార్యకర్తగా వున్నారు. శాంతి నారాయణ బీసీ సామాజిక ఉద్యమాల్లో పని చేస్తున్నారు. శశికళ మహిళా ఉద్యమాల్లో క్రియాశీలంగా వున్నారు. కర్నూలుజిల్లాలో పాణి విరసం నాయకుడుగా వుంటే, వెంకటకృష్ణ, సుభాషిణి విరసంలో క్రియాశీలంగా వుంటూ అస్తిత్వ ఉద్యమాల్లో పాల్గొంటున్నారు. చిత్తూరు జిల్లాలో యండవల్లి భారతి సామాజిక సమస్యల మీద ప్రశ్నించే కార్యకర్తగా వున్నారు.

కాగా తరాలు మారే కొద్దీ సీమ కథకుల ఇతివృత్తాలు కూడా మారాయి. 1941-70ల మధ్యకాలంలో రాసిన తొలి తరం కథకులు మధ్యతరగతి జీవితాన్ని, వారి సమస్యలను, కుటుంబ కల్లోలాలను ఇతివృత్తంగా తీసుకున్నారు. వీరిలో గుత్తి రామకృష్ణ, కె. సభా, మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద, పులికంటి కృష్ణారెడ్డి, ఆర్ఎస్ సుదర్శనం, రాచమల్లు రామచంద్రారెడ్డి, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, ముంగర శంకర్రాజు, సాదుం జయరాం, వైసీవీ రెడ్డి వున్నారు.

1970-95 కాలానికి చెందిన రెండవ తరం కథకులైన కేశవరెడ్డి, చక్రవేణు, నామిని, నరేంద్ర, మహేంద్ర, పి. రామకృష్ణ, సింగమనేని నారాయణ, బండి నారాయణ స్వామి, శాంతి నారాయణ, చిలుకూరి దేవపుత్ర, కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి, దాదాహయత్, ఎంవి రమణారెడ్డి కరువు, ఫ్యాక్షనిజంలను తమ ఇతివృత్తాలుగా తీసుకున్నారు.

1995 నుంచీ ప్రారంభమైన మూడవతరం కథకులు మాత్రం తమ ప్రపంచాన్ని విస్తృత పరచుకున్నారు. వారు కరువు, ఫ్యాక్షన్, నీటి సమస్య, సీమకు జరుగుతున్న ద్రోహం, దళితవాదం, స్త్రీవాదం, ముస్లింవాదం, ప్రపంచీకరణ ప్రభావాలను తమ ఇతివృత్తాలుగా చేసుకున్నారు.

వారిలో పాలగిరి విశ్వప్రసాద్, సన్నపురెడ్డి వెంకట రామారెడ్డి, ఇబ్రహీం, ఇనయతుల్లా, గోపిని కరుణాకర్, తవ్వా ఓబుల్ రెడ్డి, వేంపల్లి గంగాధర్, జి. వెంకటకృష్ణ, సుభాషిణి, తుమ్మల రామకృష్ణ, పాణి, హరికిషన్, జి. ఉమా మహేశ్వర్, నిర్మలా రాణి, శశికళ, నాయకి, సుంకోజి దేవేంద్రాచారి, యండవల్లి భారతి వున్నారు.

ఇలా సీమ కథ రూపు మార్చుకుంటోంది. అయితే సీమ అస్తిత్వ వాదాన్ని నేటితరం రచయితలు మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం చాలా వుంది. సీమ మాండలికాలను, జీవన వైరుధ్యాలను, ఆహార, ఆచార వ్యవహారాలను మరింతగా ప్రస్తావించాల్సి వుంది. దీనితో పాటు సీమ కరువుకు, సమస్యలకు కారణాలను అన్వేషించడంతో పాటు వాటి పరిష్కారానికి సూచనలను ఇస్తూ, సీమ ప్రజలను మోసం చేస్తున్న, తప్పుదారి పట్టిస్తున్న వ్యవస్థను, నేతలను తమ కథల ద్వారా నిలదీయాల్సిన అవసరం వుంది.

ఆధార గ్రంథాలు :

1. రాయలసీమలో ఆధునిక సాహిత్యం, సామాజిక సాంస్కృతిక విశ్లేషణ, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, మార్చి, 2006.
2. ఫిక్షన్ అండ్ ది రీడింగ్ పబ్లిక్, క్యు.డి. లెవీస్, 1932.
3. వివిన మూర్తి, దిద్దుబాటలు, తానా ప్రచురణలు, అమెరికా, 2015.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అనుభూతి వాదిగా తిలక్

– ఎరుగుటల్లి బలరామ్, తెలుగు అధ్యాపకులు, టి.జె.పి.యస్. కళాశాల, గుంటూరు.

జీవితం స్థిరమైంది కాదు. అన్ని యుగాల్లోనూ, అన్ని కాలాల్లోనూ జీవితం ఒకేలా ఉండదు. సమాజ క్రమ పరిణామాన్ని బట్టి జన జీవితం పరివర్తన చెందుతుంది. పదార్థంలో ఉండే వైరుధ్యాలు, సమాజంలో ఉండే వైరుధ్యాలు జీవితంలోనూ ప్రతిబింబిస్తాయి. జీవితం గురించిన అవగాహనల్లోనూ ఆక్రమిస్తాయి. ఈ నేపథ్యం లోంచి అవగాహన ప్రాతిపదికగా విభిన్న కళారూపాలు ఏర్పడతాయి.

ఆర్థిక సంబంధాలు మారినప్పుడల్లా సమాజం మారు తుంది. సమాజం మారినప్పుడల్లా జీవితం మారుతుంది. సంస్కృతి మారుతుంది. అనుభూతులు మారుతాయి.

''దేవరకొండ బాలాగంగాధర తిలక్'' అనుభూతి కవిత్వానికి ఆద్యుడు. 1970-80 ప్రాంతలో విప్లవ కవిత్వం ధాటికి తట్టుకోలేక, దాంతో కలిసి నడవలేక వెనక్కి వెళ్ళం అనిపించుకోలేక ఎటూ చెదరకుండా ఉం డాలనుకున్నారు కొందరు మధ్యతరగతి కవులు. కవిత్వం లోకి రాజకీయం రావటం వాళ్ళకు నచ్చలేదు. లోకాను భూతులకి తట్టుకోలేక ఆత్మానుభూతుల్ని ఏర్పరచు కున్నారు. 'శుద్ధం' గా 'శుభ్రం'గా జీవించాలనుకున్నారు. ఈ ధోరణి మనస్తత్వంతో ''అనుభూతివాదం'' అనే శాఖ చిగురు తొడిగింది.

అనుభూతి కవిత్వమంటే అనుభూతికి సంబంధించిన కవిత్వమని కానీ, అనుభూతి కొరకైన కవిత్వమని కానీ, అనుభూతిని ఆవిష్కరించే కవిత్వమనికాని అనుభూతికి ప్రాధాన్యమిచ్చే కవిత్వమని కాని చెప్పడానికి వీలుంది. అనుభూతి కవిత్వమనే పేరును ఏదో ఒక చైతన్యం ప్రతిఫలం కవితకు గల వైశిష్ట్యంగా చెప్పుకోవచ్చు. అసలు అనుభూతి లేకుండా ఏ కవి రచనలు చేయలేడు.

అనుభూతి కవిత్వం తలెత్తడానికి దోహదం చేసిన స్థితి గతుల్ని ఇట్లా వివరించవచ్చు.

1. మధ్యతరగతి మనస్తత్వం
2. వ్యక్తి వాదం
3. శుద్ధ కళావాదం
4. ఆనంద లక్ష్యం
5. ఉనికి లేదా మేధావి వాసనలు
6. అత్యాధునికుల మనిపించుకోవటం
7. పరిస్థితుల సానుకూల్యం
8. పత్రికల ప్రోత్సాహం
9. శిల్పదృష్టి

లక్షణాలు :

అనుభూతి కవిత్వం ప్రధానంగా జీవచైతన్య ప్రవృత్తికి సంబంధించినదని అనుభూతి కవులు ఇంద్రియ చైతన్య ప్రవృత్తి, ఆధ్యాత్మిక చైతన్య ప్రవృత్తి, భావచైతన్య ప్రవృత్తి, జ్ఞాన చైతన్య ప్రవృత్తి అనే నాలుగు ప్రవృత్తులను సాధ్యమై నంత వరకు జీవచైతన్య ప్రవృత్తిలో సంగమింప చేసుకో వటమో దానికి పోషకంగా నిలుపుకోవటమో చేస్తానన్నారు.

తిలక్ కవిత్వంలోని సామాజికాంశాలు :

తిలక్ రాసిన ''అమృతం కురిసిన రాత్రి'' కవితా సంకలనంలో చాలా కవితలు అవి. ప్రకృతికి సంబంధించి నవి, కవులకు సంబంధించినవి, ఊహాతాలు కవితలు ఉన్నాయి. అలాగే సమాజానికి సంబంధించిన కవితలు కూడా ఉన్నాయి.తిలక్ తలన కవిత్వం గురించి ''నా కవిత్వం''లో చెప్పుకుంటూ నా కవిత్వం ఒక తత్వం కాదని చెప్పాడు.

''నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయా
పారావతలు

నా అక్షరాలు ప్రజాశక్తులు వహించే విజయ ఐరావతాలు
నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు"

అని తన అక్షరాలు ఎప్పుడూ ప్రజలపక్షం వహిస్తాయని చెప్పాడు. "శిక్షాపత్రం"లో ప్రభుత్వ స్వార్థానికి బలైనటు వంటి సైనికులను గురించి చెప్పాడు. ఎప్పుడో ఒకప్పుడు అధిపత్యం చూపే పెద్దపులి పంజా విప్పుకుని వస్తుంది. కష్టజీవులను, పేదవాళ్ళను హింసిస్తున్నారని ప్రజలవైపు తన మద్దతుని నిర్భయంగా చాటిన కవి తిలక్.

"నీ కనురెప్పల సందుల నుండీ
బ్రతుకు గోడ చీలికల నుండీ
వినవచ్చును ఒక కష్టజీవి మూలుగు
ఒక పేదవాని యీలుగు"

కర్షకులు, శ్రామికులు అందరూ మీ స్వార్థానికి కష్టాలు పడుతున్నారు. వారికి తిండిలేక బక్కచిక్కి చస్తున్నారు. ఎప్పుడో ఒకప్పుడు మీ చరిత్ర బయట పడుతుంది అప్పుడు.

ఓ వర్తకుడా! ప్రభుత్వద్యక్షా
ఓ స్వార్థజీవి! మీరే జవాబుదారీ

వయసులో ఉన్నప్పుడు ఎలా ఉన్నాడో ముసలివాడు అయిన తరువాత ఎటువంటి కష్టాలు పడ్డాడో తెలిపాడు. కనుగుడ్లు నల్లగా ఉండి నారలు లాగుతుంటే చావడానికి దగ్గరైన ముసలివాడిచే జీవిత పరమ సత్యాన్ని తెలిపాడు.

"చివరకు చివరకు అక్కడికే అక్కడికే
అది జీవిత పరమ సత్యం
అది నాగరికత గమ్యస్థానం
అది చరిత్రల సారాంశం"

అంటూ సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరిని భూస్వామి అయిన, నిరుపేద అయినా, దౌర్జన్యంగా చేసేవాడయినా ప్రతి ఒక్కరి గమ్యస్థానం అదే, అది ఇప్పుడే కాదు గత చారిత్ర సారాంశం కూడా అదే అని తెలిపాడు. తిలక్ సమకాలీన సమాజ స్థితి గతులను చూసి హృదయం స్పందించి "ఆర్తగీతం" రచించాడు. ఇందులో

"నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి మర్రిచెట్టు కింద మరణించిన ముసలివాణ్ణి
నేను చూసాను నిజంగా నీరంధ్ర వర్షాన వంతెన కింద నిండు చూలాలు ప్రసవించి మూర్చిల్లిన దృశ్యాన్ని
నేను చూసాను నిజంగా తల్లి లేక తండ్రి లేక తిండి లేక ఏడుస్తూ ఏడుస్తూ
ముంజేతుల కన్నులు తుడుచుకుంటూ మురికి కాల్వ పక్కనే నిద్రించిన మూడేళ్ళ పసిబాలుణ్ణి"

అని పేదల జీవితాలని అనాధల బాధల్ని కళ్ళకు కట్టినట్టు చూపించాడు. ఇలాంటి సంఘటనలు నేటి సమాజంలో ఇంకా ఉన్నాయి. ఈ దీనుల బాధామయ గాధలు, కరుణామయ దృశ్యాలు, ఇవన్నీ ఏ నాగరికతకు ఫలశ్రుతులో చెప్పండి? ఏ విజ్ఞానానికి మూల కారణమో చెప్పండి? అంటూ ప్రశ్నించాడు.

ఒక్క నిరుపేద ఉన్నంత వరకు, అతడు ఒక్క మలినమైన కన్నీటి బిందువు కురుస్తున్నంత వరకు, ఒక్క వ్యక్తి ఆకలితో బాధపడుతున్నంత వరకు, ఒక్క పసిపాప తల్లిపాలు లేక ఏడుస్తున్నంత వరకు, ఒక తల్లి హీన స్వరంతో ఆక్రోశిస్తున్నంత వరకు

"నాకు శాంతి కలుగదు నేస్తం నేను నిగర్వినైనాను
ఈ సిగ్గులేని ముఖాన్ని చూపించలేను"

అంటూ సమాజంలోని దీనుల బాధలను తెలుపుతూ ఆవేదన చెందుతున్నాడు కవి"గొంగళి పురుగులు" అనే కవితలో

"పంచదార లేదు పాలడబ్బా లేదు బొగ్గులేవు - రాత్రికి రగ్గులేవు"

అంటూ పేదవారి జీవితాన్ని చిత్రించాడు. ఇప్పటికీ కూడా 50 - 60 శాతం దాకా ఇటువంటి అవస్థలు పడుతున్న వాళ్ళు మన సమాజంలో చాలామంది

ఉన్నారు. డబ్బుల్లేక ఏ రోజు సామాగ్రి ఆరోజు తెచ్చుకుంటారు. ఇటువంటి జీవితాలను అనుభవిస్తూ పస్తులుంటుంటారు.“తపాల బంట్రోతు” అనే కవితలో

“చెవిలో పెన్సిల్ - చేతిలో సంచి
కాకీ దుస్తులు - అరిగిన చెప్పులు
ఒక సాదా పేదవాడు”

ఇందులో సాధారణ ఉద్యోగస్తుల జీవితాలు ఎలా ఉంటాయో తెలిపాడు.

“దూరాల దారాల్ని విచిత్రంగా ఒకే నిముషము
అనే కండెచుట్టూ త్రిప్పగల నేర్పరివి - కూర్పరివి”

అంటూ మానవ సంబంధాలను వారి ఆత్మీయ అనురాగాలను పంచేవాడిగా చిత్రించాడు. ఆ నేర్పరితనం నీలోనే ఉంది. నీవు అందరికి ప్రేమను పంచుతావు. కానీ నీ జీవితంలోకి ఒక్కరు కూడా తొంగి చూడరు అని బంట్రోతు యొక్క వృత్తిని, జీవితాన్ని తెలియజెప్పాడు. “అమ్మా నాన్న ఎక్కడికి వెళ్ళాడు ?” కవితలో

“నీతిని విడిచిపెడితే రాజనీతి అవుతుంది
జాతికి మతావేశం పొదిగితే కోతి అవుతుంది”

అని మన సమాజంలో ఉన్నటువంటి రాజకీయాలను గురించి, మతోన్మాదుల గురించి రెండు వాక్యాలలో తెలియపరిచాడు.“ప్రార్థన” అనే కవితలో తిలక్ అభ్యుదయ భావం కనిపిస్తుంది.

“దేవుడా! రక్షించు నా దేశాన్ని
పవిత్రుల నుండి పతివ్రతల నుండి
పెద్ద మనుషుల నుండి పెద్ద పులుల నుండి”

అనటంలో లోకంలో పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్న వారు దేశాన్ని దోచుకు తింటున్నారని కాబట్టి నా దేశాన్ని కాపాడమని దేవునితో మొరపెట్టుకున్నాడు కవి. ఆకలి బాధలు, ఆందోళనలు, సమస్యలు ఎన్నో మానవులకు ఉన్నాయని తినడానికి ఆహారం, స్వతంత్రంగా జీవించే అవకాశం మాకు చాలంటూ సరదాగా, నిజాయితీగా, హాయిగా బ్రతకాలని పేర్కొన్నాడు. అన్నింటి కంటే మానవత్వమే మనిషికి ఒక అలంకారమని మా ఆశలను, కలలను, నిజం చేసుకునేందుకు పవిత్రుల నుండి, పతివ్రతల నుండి పెద్ద మనుషుల నుండి దేశాన్ని కాపాడమని “ప్రార్థన” అనే గీతంలో వివరించాడు.

ఆధార గ్రంథం :

1. అమృతం కురిసిన రాత్రి వచన కవితా సంపుటి.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సామెతల్లో వ్యవసాయక సంస్కృతి

- డా॥. కొప్ప సుభాష్ చంద్రబోస్

"గోస్తు మాత్ర న విద్యతే" - గోవు అమూల్యమైనది, ఇది యజుర్వేదం మాట. పుష్టై గోపాలం, పుష్టి కొరకు గోపాలన చెయ్, ఇది వేదంలోని మాటే, అంటే అతి ప్రాచీన కాలం ఉండి గోవులను పెంచడం వాటిని పోషించడం ఈ దేశం తన కర్తవ్యంగా భావించింది. ఎక్కడ గోవులు పెంచబడతాయో అక్కడ వ్యవసాయం వికసిస్తుంది. భారతదేశం ప్రధానంగా వ్యవసాయక దేశం. అందువల్ల అన్ని సాహిత్య ప్రక్రియల్లో వ్యవసాయక సంస్కృతి కన్పిస్తుంది.

వ్యవసాయమే మానవ జీవన వికాసానికి దోహదం చేస్తుందని అందరి అభిప్రాయం. అటువంటి వ్యవసాయ దారుడు అన్నదాతగా ఉంటాడని కవులు ఆశించారు. శ్రీ దువ్వూరి వారి ఈ క్రింది పద్యం చూడండి

ఉండి తిన్నను లేక వస్తున్న గాని
యాస చేయవు పరుల కష్టార్జితంబు
నాక లెత్తగ నీపంచ కరుగు నతిథి
తినక త్రావకపోయిన దానము లేదు

కృషీవలుడు కావ్యంలో కర్షకుణ్ణి గూర్చి ఈ విధంగా ఎన్నో అంశాలు శ్రీ దువ్వూరి వారు చెప్పారు. తన కష్టార్జితం తప్ప మరొక దానిని ఆశించని కర్షకుని ఉదాత్త జీవనం చిత్రీకరించబడింది. అంతేగాక తన దగ్గరికి వచ్చిన అతిథికి అన్నం పెట్టి అన్నదాతగా కర్షకుడు నిలుస్తాడని శ్రీ దువ్వూరి అన్నారు. ఈ సత్యాన్ని బట్టే యోగి వేమన అన్ని దానములకు అన్న దానము మిన్న అన్నాడు. కర్షకునికి, కర్షక జీవనానికి సంబంధించి, ఎన్నో విషయాలు ప్రతిబింబిస్తున్నాయి. సుమతీ శతకారుడు కూడా వ్యవసాయక జీవనమే శ్రేష్ఠమైనదని అన్నాడు

అడిగిన జీతం బియ్యని
మిడిమేలపు దొరను కాల్చి మిడుకుట కంటెన్
వడిగల ఎద్దుల గట్టుక
మడి దున్నక బ్రదుకవచ్చు మహిలో సుమతీ!

ఇటువంటి పద్యాలన్నీ వ్యవసాయ జీవన ప్రాశస్త్యాన్ని వివరిస్తున్నాయి. ముఖ్యంగా సామెతల్లో ఈ సంస్కృతి కన్పిస్తుంది.

"అందరికి అన్న పెట్టేవాడు రైతే"

ఈ సామెత కర్షకుని ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది. అందరికి పని కల్పించడంతో పాటు ఆ పనికి తగ్గ ప్రతి ఫలం అందించే వ్యవస్థ, యాజమాన్యం, ప్రభుత్వం ఉన్నప్పుడు మాత్రమే ఈ దేశంలో శాంతి సుస్థిరత భద్రత ఉంటాయి. అయితే వ్యవసాయానికి అనుకూలమైన వాతావరనాన్ని నిర్మించుకున్నప్పుడే రైతు అందరికి అన్నం పెట్టగల్గుతాడు.

కర్రు, కొండి, నాగలి, బొక్కెన, తొండం, మోట తదితర వ్యవసాయక పరికరాలు రైతుకు ఇతర వృత్తుల వారు అందిస్తారు. కుండలు, పాత్రలు, సొమ్ములు ఇటువంటి వస్తువులు కూడా ఇతర వృత్తుల వారే రైతు కిస్తారు. ఏ వృత్తిలో ఎటువంటి ఉత్పత్తి వచ్చినా అవి వినియోగించుకునే వారికి అందే ఏర్పాటు ఎవరు చేసినా, అందరికి అన్నం అందేది మాత్రం వ్యవసాయదారుని వల్లనే. తాను ధాన్యమిచ్చిన లేదా ఒక వ్యాపార కేంద్రం నుండి పది మందికి అందినా, అది వ్యవసాయదారుని కృషే అని చెప్పాలి. కేవలం మానవులకే కాక పశుపక్ష్యాదులకు కూడా వ్యవసాయదారుని వల్లనే ఆహారం అందడం మనం చూస్తూనే ఉన్నాం. వ్యవసాయక క్షేత్రంలో వరి, జొన్న తదితర ధాన్యాలు చేతికి వచ్చే సమయంలో రకరకాల పక్షులు, భూమిలోని ఎలుకలు ఇతర క్రిమికీటకాదులు ఈ ధాన్యాన్ని ఆహారంగా వినియోగించుకుంటాయి. కాబట్టి అందరికి అన్నం పెట్టేవారు రైతే అన్న సామెత పరమ సత్యం.

వ్యవసాయక జీవనం వదిలి మరొక రంగంలో ప్రవేశించిన రైతు బాధ పడడం వెనుక కూడా ఇంత ఉత్తమ వృత్తిని నేను వదిలిపెట్టాను కదా అన్న వేదననే విన్పిస్తుంది.

హాలికుడగాని పటలేదు హలమునెపుడు
సీత తల్లికి సేవల చేయలేదు
కలము గిరగిరా త్రిప్పితి తెలివి కొలది
వాణి కొలువున గడిచెను ప్రాయమెల్ల

శ్రీ సురవరం వారు నేను రైతునై కూడా హలం పట్టలేదని కలం గిరగిరా త్రిప్పి సరస్వతీ దేవికి సేవ చేశానని వేదన చెందారు. పూర్వం నుండి వస్తున్న ఒక పవిత్ర వృత్తిని పరిస్థితులు అనుకూలించక వదిలివేసిన వారు బాధపడడం సహజమే. అయితే వ్యవసాయక సంస్కృతిని ప్రబోధించిన ఈ క్రింది సామెతను చూడండి

"అన్నం లేకుంటే జొన్న సాగు చెయ్యి"

చైనాలో ఒక మంచి సామెత ఉన్నది, ఒకరికి నీవు దానం చెయ్యకు. అతను పని నేర్చుకొనేట్టు చెయి అని దానర్థం. దానం చెయ్యడం వల్ల మళ్లీ మళ్లీ తనకు ఎవరో ఇస్తారని దానం పొందిన మనిషి అనుకుంటాడు. కాని ఒక పని స్వరూపం తెలిసిన వ్యక్తి ఆ విధంగా భావించదు. తాను పనిచేసి ఆ ఫలసాయాన్ని తన ఆహారంగా మలుచుకుంటాడు. అందుకే అన్నం లేకుంటే జొన్న చేను పెట్టి జొన్నలు పండించి తుష్టిగా పుష్టిగా జీవించు అని ఈ సామెత సందేశం అందిస్తున్నది.

నిరంతరం కర్మ చేస్తూ ఉండు అన్న భగవద్గీత ప్రబోధం కూడా ఇదే. కాడి, కవ్వం, కదురు ఏ ఇంట ఆడితే ఆ ఇంటిలో కరువు లేదు అనే ఒక మంచి సామెత మనము వింటుంటాం. కాడి వ్యవసాయానికి సంబంధించింది అంటే నిరంతరం వ్యవసాయ జీవనం కొనసాగేటట్టుగా వ్యవసాయదారుడు అలాంటి వాతావరణం సృష్టించుకోవాలి సరిగ్గా వ్యవసాయం చేయకున్నా పంట బాగా వస్తుంది అని భావించడం తప్పు. అందుకే దున్నక పెడితే కొయ్య పండుతుంది అన్న సామెత వచ్చింది. అంటే భూమిని సరిగా దున్నకుండా విత్తనం పెడితే అది బాగా ఎదగదనీ, ఆ చేనుకొయ్యవలసిన అవసరమే రాదని దీనర్థం. శ్రద్ధతో వ్యవసాయం చేసినప్పుడే మంచి పంట వస్తుంది. కాడి నిరంతరం ఆడాలి అనే దానివెనక ఇదే భావన ఉంది. అదే విధంగా కవ్వం ఆడాలి అనే పదంలో పాడి పశువులు పెంచబడాలి అనీ, వాటివల్ల వెన్న, నెయ్యి, పాలు, పెరుగు, గృహ జీవితంలో అందరికి అందాలి అన్న ఆలోచన ఉంది.

ఇక కదురు విషయం అంతే. వ్యవసాయదారుడు వేసిన పత్తిపంట ఏకులుగా చేయబడి ఇళ్లల్లోనే దారం తీసే వ్యవస్థ ఒకటి ఉండేది. రాట్నంలో భాగం కదురు, కదురు వాడటం అంటే నిరంతరం దారం తీయడం, రైతుల గృహాలలో కూడా రాట్నంతో దారం తీసే వ్యవస్థ ఉండేది. ఆ దారాన్ని వారు నేత పనివారికి ఇచ్చేవారు. వారు దుప్పట్లను, పంచెలను, చీరలను నేసి దానికి తగిన మూల్యం తీసుకుని రైతులకు ఇచ్చేవారు. పూర్వకాలం గ్రామాలలో కేవలం రైతులే కాక ఇతర వృత్తుల వారు కూడా దారం తీసి నేతపనివారికి అందించేవారు. ఆ తర్వాత చిన్న చిన్న యంత్రాలు వచ్చిన కాలంలో కూడా కదురు మీద తీసిన దారానికి చాలా కాలం గౌరవం ఉండేది.

ఈనాటికీ కొందరు ఆ గౌరవాన్ని కాపాడుతున్నట్లుగా నేత వస్త్రాల్ని ధరించడం మనం చూస్తాం. ఈ ఒక సామెత వెనుక మానవ జీవన సంస్కృతి ఇంత గొప్పగా ముడపడి ఉంది.

అయితే కాలం మారిపోతున్నది. వ్యవసాయ దారుల పిల్లలు వ్యవసాయం మీద శ్రద్ధలేని వారవుతున్నారు. ఆ కారణంగానే రైతు దెబ్బ తింటున్నాడు. ఈ సందర్భంలోనే అబ్బ త్రవ్విస్తే అబ్బాయి పూడ్పించాడు అనే సామెత పుట్టింది. చేనుకు నీటి కొరకు తండ్రి బావి త్రవ్వించాడు. కాని కొడుకుకు ఆ బావి గొప్పతనం తెలియలేదు. అందువల్ల దానిని మట్టితో నింపి చదును చేశాడు. ఈ

సామెత మరో అర్థాన్ని కూడా ఇస్తుంది. తండ్రి సంపాదించి పెట్టింది కొడుకు కాపాడలేకపోయాడు అనేదే ఆ అర్థం. ఇటువంటి సందర్భంలోనే అన్నీ పండించిన రైతుకు అన్నమే కరువు అనే సామెత పుట్టుకొచ్చింది. ఎవరు శ్రమ చేస్తారో వారికి ఫలితం అందాలని ఎవరమైనా కోరుకుంటాం. రైతుకు అమ్మ బోతే అడవి కొనబోతే కొరివి అన్న విధంగా ఉన్నప్పుడు నిజంగా అతనికి అన్నం దొరకని పరిస్థితే ఏర్పడుతుంది. ఆ కారనంగానే ఆధునిక కాలంలో యాజమాన్య వ్యవస్థ పద్ధతి (మేనేజ్‌మెంట్ పాలసీ) అనే శాస్త్రం ఒకటి పుట్టకొని వచ్చింది. దీని ప్రకారంగా రైతును అధ్యయనం చేయమని కోరుతున్నారు. భూమి, నీరు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, ఎద్దులు, ఎరువులు, తదితర వినియోగాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని రైతులు తెలుసుకొంటున్నారు.అందుకే అప్పుచేసి పప్పు కూడు తినరాదని, అబద్ధం చెప్పితే అన్నం పుట్టదని, అభ్యాసం కూసువిద్యని, ఇలా ఎన్నో సామెతలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసేవి కూడా జీవితంలో నిలదొక్కుకునేట్లు చేశాయి. అంతేకాకుండా అయిన వాళ్ళకు ఆకుల్లోను కాని వాళ్ళకు కంచాల్లోను పెట్టరాదని కొన్ని నిషిద్ధ సూత్రాలను సామెతలు నిర్దేశిస్తున్నాయి. పైగా అరవై ఆరు పిండివంటలు, ఆవుచంటిలోనే ఉన్నాయని గోవుల పోషణ అవసరాన్ని తెలియజేస్తున్నాయి.

దేశం, కాలం, వాతావరనం అన్ని తెలిసి ఏ పనికైనా పూనుకోవాలని నేటి యజమాన్యా పద్ధతులు బోధిస్తున్నాయి. సామెతల్లో కూడా ఇటువంటి జీవన సంస్కృతి ప్రతిబింబిస్తుంది. ఆరుద్ర కార్తె విత్తనానికి అన్నం పెట్టిన ఇంటికి సేటు లేదు - అంటే విత్తనం ఆరుద్రలోగానే భూమిలో విత్తాలని అర్థం. ఆరుద్ర తర్వాత విత్తే ధాన్యం సరిగా పంటనివ్వదు అని ఈ సామెత సూచిస్తుంది.

గృహజీవనంలోను వ్యవసాయక జీవనంలోను ఏ విధంగా వ్యవహరించాలో కూడా సామెతల ద్వారా తెలుసుకోవచ్చు. అలు ఏడ్చిన ఇల్లు ఎద్దు ఏడ్చిన సేద్యం ముందుకు రావు.. అంటే ఇంట్లో గాని పొలంలో గాని కష్టాలుండరాదు, కంట తడి పెట్టరాదని గ్రహించాలి. సుమతీ శతకకారుడు కూడా "కలకంఠి కంట కన్నీరొలికిన సిరి ఇంటిసుండనొల్లదు" అన్నాడు. ఇల్లు కళకళలాడాలి, వ్యవసాయ క్షేత్రం అదే విధంగా ఉండాలి.

ఈ విధంగా వ్యవసాయక సామెతలను పరిశీలిస్తే ఎన్నో విషయాలు బహిర్గతమవుతాయి. సామాజిక జీవనానికి మూలాధారమైన వ్యవసాయం, వ్యవసాయక సంస్కృతి వికాసం, పరిరక్షణతో పాటుగా వ్యక్తిగత సంస్కృతి, సమాజ సంఘటన, కుటుంబ శాంతి, జాతి శ్రేయస్సు, ఇలా ఎన్నో అంశాలను వ్యావసాయక సామెతల ద్వారా అనుశీలించే అవకాశం ఉన్నది. అప్పుడు సామెతల ద్వారా వ్యక్తివికాసం, గృహ జీవనం, సమాజ సంఘటనం, జాతి నిర్మాణం, దేశ వికాసం, విశ్వమానవతావాదం తదితర అంశాలెన్నింటినో వెలికి తీయవచ్చు.

సామెతలు సాహిత్యంలో సాంస్కృతిక అమృత బిందువులని నిరూపించవచ్చు.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"గురజాడ అప్పారావు రచనల్లో సంఘ సంస్కరణలు – అంతర్లీనత : ఒక పరిశీలన"

– డా॥. కి. సతీదేవుడు, చరిత్ర ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉరవకొండ, అనంతపురము జిల్లా.

ప్రపంచంలో అధిక శాతం బ్రతికి ఉన్నపుడే జీవిస్తారు. కాని అతి కొద్ది మంది మహానుభావులు మరణించిన తర్వాత తరతరాలు జీవిస్తారు. వారి ఆలోచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయి. అటువంటి కోవకు చెందిన సాహితి స్రష్ట గురజాడ అప్పారావు.

'సాహిత్యము ఏ కొందరి సొత్తోయనుకొన్న కాలములో అది ప్రజల సొమ్మని ఉదారముగా పంచిపెట్టిన సౌమ్యశీలి ఆయన. కందుకూరి సాంఘీక విప్లవం గిడుగు భాషా విప్లవమును తనలో సమన్వయించుకొని సరిక్రొత్త సాహిత్య విప్లవమును లేవనెత్తిన నవయుగ వైతాళికు డాయన. ఆయన చేతిచలువతో అన్పృశ్యముగా పడియున్న వాడుక భాష అందలమెక్కినది' అని డా॥ సి.నారాయణరెడ్డి గురజాడ వారిని కొనియాడారు.

గురజాడ నాడు సంఘంలో పేరుకుపోయిన సాంఘీక దురాచారాలు కన్యాశుల్కం, బాల్యవివాహాలు, వ్యభిచారం మొదలైన వాటిపై తన కలాన్ని కత్తిగా మార్చి సాహితీ రచనలు సృష్టించారు. తెలుగు సాహిత్యానికి అమూల్య మైన సేవ చేసిన గురజాడ రచనల్లో అంతర్లీనంగా సాగిన సంఘ సంస్కరణ అంశాలు శోధించడమే ఈ పరిశోధన వ్యాస ముఖ్య లక్ష్యం.

గురజాడ అప్పారావు జీవితం సంక్షిప్త రూపం :

గురజాడ అప్పారావు 21 సెప్టెంబర్, 1862 సంవత్సరంలో వెంకట రామదాసు, కౌసల్యమ్మ దంపతులకు విశాఖపట్నం, ఎలమంచిలి ప్రాంతంలోని రాయవరము గ్రామంలో జన్మించారు. చీపురుపల్లి గ్రాంటు స్కూల్, విజయనగరం మిడిల్ స్కూల్ నందు విద్యాభ్యాసం గావించి 1882లో మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణుడయ్యారు. 1885లో వివాహం చేసుకున్నారు. 1886లో బి.ఏ., పట్టాను పొంది, తదుపరి యఫ్.ఏ. పూర్తి చేశారు.

తొలుత డిప్యూటి కలెక్టర్ ఆఫీసునందు హెడ్ గుమాస్తాగా పనిచేశారు. విజయనగరంలోని శ్రీ ఆనంద గజపతి మహారాజ కళాశాలలో ఉపన్యాసకులుగా పని చేశారు. తరువాత ఆనంద గజపతి సంస్థాన పరిశోధకుడిగా, రీనారాణి అంతరంగిక కార్యదర్శిగా పనిచేశారు. 1915వ సంవత్సరం నవంబర్ 30వ తేదీన గురజాడ వారు స్వర్గస్తులయ్యారు. 'ఇతడు మరణించిన తరువాతనే జీవించడం ఆరంభించాడు' అని దేవులపల్లి కృష్ణశాస్త్రి గురజాడ గురించి చెప్పిన మాటలు అక్షర సత్యాలు.

గురజాడ అప్పారావు రచనలు - సాంఘీక సంస్కరణలు :

గురజాడ తన రచనలకు కేంద్ర బిందువుగా సమాజాన్ని ఎంచుకొన్నాడు. ప్రజా ప్రయోజనాలే ప్రాణ వాయువులుగా తన రచనలలో ఇతివృత్తాలను మలిచాడు. వ్యవహారిక భాషా ఉద్యమానికి మద్దతుగా నిలిచినా గ్రాంధికంలో తన రచనలు కొనసాగించాడు. అయితే ఆ గ్రాంధిక రచనలు ప్రజలకు అర్థమయ్యేరీతిలో వ్యక్తం చేశారు. అందుకే ప్రజాకవిగా తెలుగు సాహితీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాడు. సాహిత్యంను అంతర్లీనంగా సంఘసేవకు వినియోగించిన ప్రజాకవి గురజాడ.

గురజాడ అప్పారావు కలం నుండి ఎన్నో విలువైన సాహితి శిల్పరచనలు వెలువడినవి.

"గుత్తు నాయని జాతిముత్యాల్
గుచ్చినాడే మేలి సరముల

ఇత్తునాని తెలుగుతల్లికి
ఇచ్చినాడే భక్తితో.....!

అని గురజాడ రచనలను దేవులపల్లి కృష్ణశాస్త్రి పొగిడారు.

గురజాడ కలం నుండి వెలువడిన రచనల్లో కన్యా శుల్కం నాటకం మణిదీపం వంటిది. సారంగధర పద్య కావ్యం, చిత్రాంగి నాటకంలను ఆంగ్లంలో రచించారు. కన్యక, లవణరాజు కల, పెద్ద మసీదు, మెడిల్టా, సంస్కర్త హృదయము, దిద్దుబాటు, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, బిల్హణీయం నాటకం, కాసులు, డామన్ పితియసు, దించు లంగరు గేయాలు, సుభద్ర కావ్యం, డైరీలు, మాటా-మంతి, కొండుభట్టీయము, వ్యాసచంద్రిక రచనలు వెలువరించారు. గురజాడ కొన్ని చారిత్రక గ్రంథాలు రచించారు. పూసపాటి గజపతుల చరిత్ర, విశాఖ చాళుక్యుల చరిత్ర, కళింగ రాజుల చరిత్ర రచించారు.

గురజాడ అప్పారావు రచించిన "ముత్యాల సరాలు" సంపుటిలో నాలుగు కథాత్మక ఖండ కావ్యాలున్నాయి. మొదటిది "పుత్తడిబొమ్మ పూర్ణమ్మ", రెండవది "డామన్ పితియన్", మూడవది "కన్యక", చివరిది "లవణరాజు కల".

ఆంధ్ర సారస్వతమున ముత్యాల సరములను కొత్త ఛందస్సు ఏర్పరుచుకొన్న మహావ్యక్తి గురజాడ అప్పారావు అని శ్రీశ్రీ తెలుపుతూ.....

"ఆటవెలది స్వయముగా సృష్టించకపోయినా వేమన దానిని తన సొంతం చేసుకొనునట్లు గురజాడ వారు జానపద గేయములలో ఒదిగివున్న ముత్యాల సరములనే తనదిగా చేసుకొన్నారు".

గురజాడ తన రచన కన్యకలో తన అభిప్రాయానికి వ్యతిరేకంగా రాజు కన్యకను వంచించడాన్ని గొప్పశైలితో మలిచాడు. తన జీవితంలో అధిక భాగం రాజ కుటుంబ సేవలో గడిపినా కాని రాచరిక నిరంకుశ ధోరణిని విమర్శించారు. 'లవణరాజు కల' రచనలో గురజాడ కులవ్యవస్థను ఖండించాడు. 'పుత్తడిబొమ్మ పూర్ణమ్మ'లో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను చక్కగా వివరించాడు. 'మెడిల్టా' రచనలో ముదసలి భర్త వల్ల పడిన స్త్రీ బాధలు హృద్యంగా తెలిపాడు. 'సంస్కర్త హృదయం'లో సరళ అను వేశ్య ఏవిధంగా తిరిగి మాములు క్రొత్త జీవితాన్ని ఆరంభించిందో... సంస్కరణాభిలాషతో వివరించారు. 'పెద్ద మసీదు' రచనలో తీర్థయాత్రలకు పోయి రాగానే దేవాలయం స్థానంలో మసీదు ఉండటం, ఆ మసీదు ఇమాంగా తన మేనల్లుడు ఉండటం వారి మధ్య జరిగిన మానసిక సంఘర్షణను అద్భుతంగా గురజాడ మలిచారు. 'దిద్దుబాటు' కథలో వేశ్యాలోలుడైన తన భర్తలో మార్పు తెచ్చిన కమిలి వృత్తాంతం గొప్పగా గురజాడ రచించారు.

గురజాడ వారి కన్యాశుల్కం గొప్పగా పేరుపొందిన సాంఘిక వచన నాటకంగా చరిత్రలో నిలిచింది. దీనిని విజయనగర రాజు ఆనంద గజపతికి అంకితం చేశారు. 1897లో వెలువడిన కన్యాశుల్కం మొదటి కూర్పులో 5 అంకాలు, 132 రంగాలు, 109 పేజీలతో పుస్తకం వెలువడింది. 1909లో వెలువడిన కన్యాశుల్కం రెండవ కూర్పులో 7 అంకాలు, 133 రంగాలు, 199 పేజీలతో పుస్తకం వెలువడింది. శ్రీకాకుళం మాండలికంలో కన్యా శుల్కం రచనలో మాటలు కొనసాగినవి. విజయనగర సంస్థానంలో కన్యాశుల్కం దురాచారం ప్రబలంగా ఉన్న రోజులవి. కన్యాశుల్కం నాటకమున ముందుమాటలో గురజాడ అప్పారావు "కన్యాశుల్కం వంటి మూర్ఖాచారములు సంఘమున తీరని అవమానకరములు. అటువంటి దురాచారములను ఎత్తిచూపి వాటిని ఖండించి సంఘమున నీతి నియమాలు స్థాపించుట కంటే సాహిత్యమున మరొక ప్రయోజనముండబోదు. ఈ విషయములే నన్ను ఈ కన్యాశుల్క నాటకమునకు ప్రోత్సహించినవి" అని తెలిపారు.

కన్యాశుల్కం నాటకను జగన్నాథ విలాసిని సంస్థ తొలిసారిగా ప్రదర్శించింది. ఆంధ్రరాష్ట్రం అంతా పలుచోట్ల ఈ నాటకం విజయవంతంగా ప్రదర్శించ

బడింది. సత్యకాలపు వితంతువుగా బుచ్చమ్మ, సంస్కర్తగా సొజన్యరావు, చదువుకున్న వంచకుడిగా గిరీషం, సంస్కారం గల వేశ్యగా మధురవాణి, డాంబికునిగా రామప్పపంతులు, ఛందస్సు పండితునిగా అగ్నిహోత్రావధానులు, ఇలా వివిధ పాత్రను గురజాడ కన్యాశుల్కం నాటకంలో అత్యుద్భుతంగా మలిచారు. కన్యాశుల్కం నాటకం ఆంధ్ర సాహిత్యంలో మహాకావ్యంగా శాశ్వత స్థానం పొందిందని సి.ఆర్.రెడ్డి ప్రశంసించారు.

'డామిట్ కథ అడ్డం తిరిగింది', 'ఏమి వాయ్ వెంకటేశం' అంటూ కన్యాశుల్కం నాటకంలో ముఖ్య పాత్రధరి గిరీషం మాటలు గురజాడ వారి సృజనాత్మక సృష్టిగా వర్ణించవచ్చు. రామప్పపంతులు సొజన్యరావు పంతులు, మధురవాణి, బుచ్చమ్మ, అగ్నిహోత్రావధాన్లు వంటి పాత్రలు గురజాడ మలిచిన తీరు అద్భుతంగా ఉన్నది. ఈ పాత్రలను నాటి, నేటి సమాజంలో విభిన్న మనఃప్రవృత్తులకు ప్రతిబింబాలుగా నిలుస్తున్నాయి.

గురజాడ వారి రచన 'మినిట్ ఆఫ్ ది సెంట్' విమర్శనా జ్ఞానమునకు, భాషాశాస్త్ర పరిజ్ఞానమునకు వ్యవహారిక భాషావాదమునకు బలపరిచే చక్కటి సాహిత్యసృష్టిగా చెప్పవచ్చు.

గురజాడ వారు వ్యవహారిక భాషావాది. గురజాడ తన రచనలలో పద్యభాగాలు మినహాయించి మిగిలిన రచనలన్నీ పామరులకు అర్థమయ్యే వాడుకభాషలో వ్రాసి వ్యవహారిక భాషా ఉద్యమానికి జీవం పోశాడు. వ్యవహారిక భాషావాద రచనలపై వచ్చిన విమర్శలను త్రిప్పికొడుతూ గురజాడ...

"మెచ్చనంట వీవు నీవిక
మెచ్చకుంటే మించి పోయెన
కొయ్యబొమ్మల మెచ్చుకళ్ళకు !!!
కోయలల సొరెక్కువా - !"

అని ఉద్ఘాటించాడు.

గురజాడ దేశభక్తి గేయం, బకీంచంద్రుని వందే మాతరం, రవీంద్రుని 'జనగణమన', ఇక్బాల్ 'హిందూస్థాన్ హమారా' లతో సమానంగా ఉందని సాహితి విమర్శకుల అభిప్రాయం. గురజాడ రచనలు వాస్తవిక వాదానికి చాలా దగ్గరగా ఉన్నాయి. సమాజం, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, సంఘ దురాచారాలు, వ్యక్తిగత మానసిక కోణాలు తన రచనలలో ప్రతిబింబించాడు.

"జీవితంలో ఎంతో వైవిధ్యముంది ! ఎంతటి తీవ్రంగా మనముందుంది. నేటి జీవితం పుష్కలమైన, అనంతమైన గాధలతో నిండియుంది. అయితే రచయితలు దీనిని దర్శించరు. అది గొప్ప లోపమని భావించి నిత్య జీవితము నుండి ఒక వస్తువును తీసుకొని దానిని చిత్తరవు వలె తీర్చిదిద్ద ప్రయత్నించాను" అని గురజాడ వాస్తవిక వాదం ఆయన సొంత మాటల్లో వ్యక్తీకరించాడు.

మనిషి మనిషిని ప్రేమించగల్గితే ప్రపంచంలో సమస్యలుండవనే ఈయన విశ్వాసం. గురజాడ కాసులు గేయంలో ఈ ప్రేమభావం కనబడుతుంది.

'ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును - ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును'

నాటి కుల వ్యవస్థను గురజాడ తీవ్రంగా తన రచనలో ఖండించారు. మంచిచెడ్డలు మనుజులందున ఎంచి చూడగా రెండు కులములు మంచియన్నది మాలయైతే మాలనే నగుదున్" అని తెలిపారు.

'దేవుడు చేసిన మనుష్యుల్లారా
మనుషులు చేసిన దేవుళ్లారా'

అంటూ విగ్రహారాధనను గురజాడ ఖండించారు. మత విశ్వాసాలకంటే మానవత్వం గొప్పదని మనిషి గేయంలో తన అభిప్రాయాలు వెలిబుచ్చారు.

ముగింపు :

గురజాడ అప్పారావు అక్షరాల ద్రష్ట. స్రష్ట
అచ్చమైన మహాకవి

"బ్రతికి, చచ్చియు ప్రజలకెవ్వడు
బ్రీతి గూర్చునొ, వాడె ధన్యుడు"

సంఘానికి సామాజిక నిబంధనలకు వాస్తవికతకు నన్నిహితముగా నుండేదే ఉత్క ృష్టమైన సృష్టి! సాహిత్యానికి, నంఘానికి ''బింబ, ప్రతిబింబ'' భావమున్నది. ఈ భావ ప్రాశస్త్యముకై గురజాడ సర్వశక్తులు కేంద్రీకరించారు. అందుకే...

'గురజాడ అప్పారావు గారిదే తెలుగు ప్రజల కథ, తెలుగు భాషా సాహిత్యం, తెలుగు సాంస్కృతిక కథ' అని దేవులపల్లి ప్రభాకరరావు కొనియాడారు.

గురజాడ అప్పారావు మహామనిషి... మహాకవి... నాటక కర్త, విమర్శనాశాలి, మహా కథకుడు, వాస్తవికతావాది, వ్యవహారిక భాషావాది. కాల్పనికోద్యయమునకు విశ్వనాథ ఎటువంటి వారో అట్లే వ్యవహారిక భాషా వాదమునకు గురజాడ ఉషస్సు లాంటివారు. పాతకొత్తల మేలి కలయికకై సంధియుగమున ఆంధ్ర సాహితీ నందనోద్య మున తీయని గొంతునెత్తి పాడిన కోయిల గురజాడ అని సాహితి విమర్శకుల అభిప్రాయం.

'విశ్వమంతా ఒక జాతిగా మనస్పర్థలు లేక, కులమత వైషమ్యాలు లేక, పరస్పర సహజీవనం చేయాలని గాఢంగా కాంక్షించిన విశ్వవైతాళికుడు గురజాడ అప్పారావు. నాటి సమాజంలో పాతుకుపోయిన సాంఘీక దురాచారాలను అరికట్టుటకు తన రచనలలో అంతర్లీనంగా సాంఘీక సంస్కరణలకు పునాది వేసిన ధీశాలి గురజాడ. ప్రజా ప్రయోజనాలే ప్రాణవాయువులుగా ఆయన రచనలు కొనసాగి అమరజీవిగా మారి ప్రజాకవిగా గురజాడ అప్పారావు తెలుగు సాహిత్య రచనలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

ఉపయుక్త గ్రంథాలు - వనరులు :

1) ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు - కె.కె. రంగనాథాచార్యులు
2) కన్యాశుల్కం - గురజాడ అప్పారావు
3) ముత్యాల సరాలు - గురజాడ అప్పారావు
4) తెలుగు సాహిత్య చరిత్ర - నన్నయ నుండి నేటి వరకు - డా॥ ద్వానా.శాస్త్రి
5) తెలుగు సాహిత్య చరిత్ర - తెలుగు అకాడమి

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చిత్తూరు జిల్లా జానపదుల దైవ సంబంధ నమ్మకాలు

– కె. మహేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

'చిత్తూరు జిల్లా జానపదుల నమ్మకాలు, మూఢ విశ్వాసాలు, శకునాలు - పరిశీలన' అనే నా పరిశోధనాంశములో భాగంగా జిల్లాలోని జానపదుల దైవ, క్షేత్ర సంబంధ నమ్మకాలను ఈ వ్యాసంలో వివరించే ప్రయత్నం చేస్తున్నాను. మానవుడు అనాది నుండి పంచభూతాలను, ప్రకృతిని, చెట్టు, పుట్ట రాయిని దైవంగా భావించి పూజలు చేస్తున్నారు. శాస్త్రసాంకేతిక రంగాలు ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో మానవుడు తనకు వచ్చే శారీరక, మానసిక, సామాజిక సమస్యలకు తన ముందు వుండే డాక్టర్‌లను, ఇంజనీర్లను నమ్మకుండా నేటికి కూడా దైవాన్ని నమ్మి బ్రతుకుతున్నాడంటే దేవతల మీద మనిషికి వున్న అపారమైన భక్తికి ఇది ఒక నిదర్శనం. ఆలయాల కాణాచిగా ప్రసిద్ధి చెందిన చిత్తూరు జిల్లాలో పెద్ద సంఖ్యలో క్షేత్రాలు ఉండటం వలన దైవాలకు సంబంధించిన నమ్మకాలు ఉన్నాయి. గ్రామ దేవతలు, కులదేవతలు, క్షేత్ర ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి, తిరుమల, బోయకొండ గంగమ్మ, శ్రీనివాస మంగాపురం, కాణిపాకం మొదలైన ఆలయాలపై అనేక నమ్మకాలు ఉన్నాయి. ప్రతి దేవాలయానికి తనదైన చారిత్రక విశిష్టత ఉంది. ఫలానా దేవుడ్ని కొలిస్తే ఈ విధమైన కోర్కెలు నెరవేరుతాయని ఇక్కడి ప్రజలు నమ్ముతారు. వాటిలో కొన్నింటిని క్రింది విధంగా పేర్కొంటున్నాను.

ప్రమాణాల వరసిద్ధుడు :

చిత్తూరు సమీపంలో కాణిపాకం వరసిద్ధి వినాయకుడు సత్య ప్రమాణాల స్వామిగా ప్రసిద్ధి. సాధారణంగా తిరుమల వెంకన్న యాత్ర వరసిద్ధుని దర్శనంతో పరిపూర్ణమవుతుందని భక్తులు భావిస్తారు. ఏ దేవుని మీద ఒట్టు వేసిన నమ్మని వాళ్ళు సైతం కాణిపాక ఆలయ ఆవరణలో ప్రమాణం చేస్తే నిజమని నమ్ముతారు. ఎందుకంటే వక్రదంతుడైన విఘ్నేశ్వరుడు స్వయంభువుగా వెలసిన క్షేత్రంగా కాణిపాకం ప్రతీతి. స్వామివారి ఎదుట తప్పుడు ప్రమాణాలు చేస్తే శిక్ష అనుభవిస్తారని భక్తుల భయం మరియు విశ్వాసం. స్వామివారి ఎదుట సామాన్య భక్తులతో పాటు వ్యసన పీడితులు, దురలవాట్లకు బానిసలైనవారు ప్రమాణాలు చేస్తుంటారు. అలా ప్రమాణం చేయడం వలన వ్యసనానికి బానిస అయిన వారు వ్యసనాల నుంచి విముక్తి పొందినట్లు ఇక్కడ ప్రజలు నమ్ముతున్నారు. రోజు సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఇద్దరికి 550 రూపాయల చొప్పున దేవస్థానం టికెట్టు నిర్ణయించింది.

బోయకొండ గంగమ్మ :

చిత్తూరు నుంచి 80 కిలోమీటర్ల దూరంలో బోయకొండ గంగమ్మ ఆలయం ఉంది. కోరిన కోర్కెలు తీర్చే అమ్మగా బోయకొండ గంగమ్మ క్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి నిత్యం వేలాది మంది తరలివస్తుంటారు. మొదటగా భక్తులు అమ్మవారి శిరస్సు పై పువ్వును ఉంచుతారు. అమ్మవారి శిరస్సు పై ఉంచిన పువ్వు కుడివైపు పడితే వెంటనే కోరిక తీరుతుందని నమ్ముతారు. మధ్యలో పడితే ఆలస్యంగా నెరవేరుతుందని, ఎడమవైపు పడితే ఆ పని జరగదని భక్తులు నిశ్చయించుకుంటారు. కోరిక నెరవేరినవారు కుటుంబ సమేతంగా విచ్చేసి మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తుంది. సంతానం లేని దంపతులు అమ్మవారి ఆలయం వద్దకు చేరుకొని సంతానం కలగాలని కోరుతూ పుష్కరిణిలో స్నానం ఆచరించి తడిబట్టలతో పూజలు చేసి గర్భాలయం ఎదుట అమ్మవారిని స్మరిస్తూ నమస్కారం చేస్తారు. ఆలయం వద్దగల చెట్టుకు చిన్న రాయిని బట్టతో ఉయ్యాలలా కట్టి సంతానం కోసం మొక్కుకుంటారు.

కొండ పై అమ్మవారి ఆలయం సమీపాన అతి సహజంగా ఏర్పడిన పుష్కరిణిలోని నీరు పవిత్రమైన తీర్థంగా భక్తులు భావిస్తారు. ఈ తీర్థాన్ని సేవించడం వలన రోగాలు మటుమాయం అవుతాయని, పంటలపై చిలకరిస్తే చీడలు తొలగుతాయని భక్తుల నమ్మకం.

శ్రీకాళహస్తి :

దక్షిణ కైలాసంగా పేరొంది కోట్లాది మంది భక్తులను పునీతులను చేసే దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి. శ్రీ కాళ హస్తీశ్వరుణ్ణి నిష్టతో పూజించిన మూడు మూగజీవాల సమ్మేళనంతో శ్రీ-కాళ-హస్తి పేరు వచ్చిందని ప్రచారంలో ఉన్న కథలను బట్టి తెలుస్తుంది. దేవస్థానంలో స్వామి, అమ్మవార్లుతో పాటు అనేక ఇతర దేవతామూర్తుల విగ్రహాలు భక్తులను భక్తిపారవశ్యంలోకి తీసుకువెళ్తాయి. శ్రీకాళహస్తి దేవాలయంలోని కంచు గడప సమీపంలో పురుషామృగంను వీక్షిస్తే మోక్షం లభిస్తోందని శాస్త్రం చెబుతుంది. ఇక్కడ సరస్వతి తీర్థాన్ని సేవిస్తే చెవిటి, మూగవారు వ్యాధి విముక్తులవుతారని భక్తుల నమ్మకం, ఇక బంగారు బల్లిని తాకితే శరీరం పై బల్లిపడితే వచ్చే దోషాలు హరించుకుపోతాయని నమ్మకం.

రాహుకేతు పూజలు ఈ క్షేత్రంలో చేయడం తద్వారా వాటి సంబంధమైన దోషాలు కూడా నివారణ జరుగు తుందని భక్తుల నమ్మకం.

మత్తు బానిసలకు విముక్తి ప్రదాయని ఓ సూరమ్మ :

ఏర్పేడు మండలంలోని మూలకండ్రిగ ఓసూరమ్మ మత్తుబానిసల విముక్తి ప్రదాయనిగా వెలుగొందుతుంది. ఇక్కడ అమ్మవారి కృపతో ఆలయ పూజారి మద్యానికి బానిసలైన వారిచేతికి దారాలు కడతారు. అమ్మవారి మహిమ కల్గిన దారాలు ధరిస్తే మళ్ళీ మత్తుజోలికి వెళ్ళ రని జానపదులు భావిస్తారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఏర్పేడు, రేణిగుంట, వడమాలపేట, శ్రీకాళహస్తి, తిరుపతి తదితర ప్రాంతాల నుండి అశేషంగా భక్తులు ఆలయానికి వస్తుంటారు. అలాగే ఆలయం పక్కన ఉండే నాగమల్లె చెట్టుకు పూజిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.

సంతాన వరప్రసాదుడు కలిగిరి శ్రీనివాసుడు :

పెనుమూరు - పూతలపట్టు మండలాల సరిహద్దులోని కలిగిరి కొండపై వెలసిన కలిగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి సంతాన వరప్రసాదుడుగా ప్రసిద్ధి. ఇక్కడ వెలసిన స్వామి వారిని సేవిస్తే సంతానంలేని వారికి సంతానం కలుగు తుందని భక్తుల నమ్మకం. ఆలయ ఆవరణలోని వరాల స్వామి వద్ద కోరికలు కోరి వరం పొందుతారని ప్రచారంలో ఉంది. మహావిష్ణువు కలిపురుషుడిని ఇక్కడే తన ఎడమ కాలితో పాతాళలోకానికి తొక్కాడని స్థలపురాణం అందుకు చిహ్నంగా ఆలయానికి ఈశాన్య దిశలో రాతిబండపై స్వామివారి పాదముద్ర ఉంది. ప్రతి ఏడాది తిరుమలలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించే సమయంలో అదే మాదిరిగా ఇక్కడ స్వామి వారికి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. దాతలు పశువులను స్వామి వారికి మొక్కు బడిగా సమర్పిస్తుంటారు. వీటి కోసం గోశాలను సైతం నిర్మించారు.

కన్నుల దైవంగా దేశమ్మ :

నగిరి పరిధిలోని టి.ఆర్. కండ్రిగలో దేశమ్మ దేవత ఆలయం ఉంది. ఈ ఆలయంలోని దేవత కంటి నొప్పులు పోగొట్టడంలో ప్రసిద్ధిగాంచినదని భక్తుల నమ్మిక. అమ్మవారి తీర్థం భక్తుల కళ్ళల్లో పోయడం ఇక్కడి ప్రత్యేకత. పొంగళ్ళు పెట్టి మొక్కుకుంటే కోరిన కోర్కెలు దేశమ్మ దేవత ఈడేరుస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఆలయానికి జిల్లా నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి భక్తులు అధికంగా తరలివస్తుంటారు. పూజా కార్యక్రమం అయిన తరువాత తీర్థం చేతిలో పోయడం ప్రతి ఆలయంలోనూ జరుగుతుంది. దేశమ్మ ఆలయంలో ఇందుకు భిన్నంగా తీర్థం కంటిలో చల్లుతారు. అలా చేస్తే కంటి రోగాలు నయమవుతాయని నమ్మకం.

సుఖ ప్రసవాన్ని ప్రసాదించే దేవతామూర్తి :

నత్యవేడు పట్టణంలో కళ్యాణవీరభద్రస్వామి

ఆలయంలో ఉన్న నందీశ్వరుని విగ్రహం ఎటుతిప్పితే అటు తిరిగే విశిష్టతను కలిగి వుంది. సత్యవేడు పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు గర్భం దాల్చినప్పటి నుండి ప్రసవసమయం వరకు నందీశ్వరుని నిత్యం కొలుస్తారు. ప్రాచీన కాలంలో ప్రసవసమయంలో శిశువు అడ్డం తిరిగితే స్థానిక దేవాలయంలోని నందీశ్వరుడ్ని బిడ్డ అడ్డంగా తిరిగిన దిశవైపు తిప్పేవారట తద్వారా సుఖ ప్రసవం జరిగేదని ఇక్కడి ప్రజల విశ్వాసం. ప్రస్తుతం వైద్యసదుపాయాలు అందుబాటులో వచ్చినప్పటికి ఇక్కడ నందీశ్వరునికి పూజలు నిర్వహించిన తరువాతనే వైద్యశాలకు గర్భవతులను కాన్పుకు తీసుకెళ్ళడం సంప్రదాయంగా ఆచరిస్తున్నారు.

సంతానప్రదాయనిగా ఊడల మర్రి :

వరదయపాళెం మండలం నేల్లటూరు గ్రామంలో వందేళ్ళ పై బడిన ఊడలమర్రి చెట్టు దగ్గర వెలసిన మర్రెమ్మ సంతాన ప్రదాయనిగా కీర్తిగడించింది. దశాబ్దాలుగా ఇక్కడ ఊడలమర్రి ఎంతో చరిత్ర కలిగివుందని స్థానికులు చెబుతున్నారు. మర్రిచెట్టుకు ముడుపులు కట్టి మొక్కుకుంటే సంతానం కలుగు తుందని, కోరిన కోర్కెలు నెరవేరుతాయని ఇక్కడ భక్తుల నమ్మకం. కోర్కెలు నెరవేరినవారు అందుకు గుర్తుగా తమ చిన్నారులకు మర్రెమ్మ, మర్రెయ్య వంటి పేర్లను పెట్టుకుంటారు. నేల్లటూరు చుట్టు పక్కల గ్రామాల్లో చాలామందికి మర్రెమ్మ, మర్రెయ్య అనే పేర్లు కలిగి వుండడం గమనార్హం.

శ్రీ పల్లి కొండేశ్వరస్వామి :

నాగలాపురం మండలం సురుటుపల్లిలోని శ్రీపల్లి కొండేశ్వర ఆలయం ఒక పుణ్యక్షేత్రం. ఈ దేవాలయం చారిత్రకంగా కొంత విశిష్టతను కలిగి ఉంది. అమృతం కోసం దేవతలు వాసుకీ అనే సర్పం సాయంతో క్షీరసాగర మధనానికి పూనుకున్నారు. పాలసముద్రాన్ని చిలికే సమయంలో భయంకరమైన కాలకూటవిషయం బయటపడింది. మహేశ్వరుడు వారికి అభయం ఇచ్చి ఆ కాలకూటవిషాన్ని చేతబూని అమాంతంగా మింగి వేస్తాడు. ఆ హాలాహలం శివుని గర్భంలోకి పోనియ్యకుండా పార్వతిదేవి శివుని కంఠం పట్టుకోగా ఆ విషం కంఠం వద్దే నిలిచిపోయి స్వామిని నీలకంఠుణ్ణి చేసింది. భయం కరమైన ఈ కాలకూటవిషం మహాశక్తివంతుడైన పరమ శివున్ని సైతం కాసేపు మత్తెకిస్తుంది. విషప్రభావానికి లోనైన శివుడు మైకంతో కాసేపు ఈ క్షేత్రంలో విశ్రమించాడని, శివుడు శయనించిన క్షేత్రం గనుక దీనిని 'శివశయన క్షేత్రం' అంటారని స్కందపురాణం ద్వారా తెలుస్తుంది. శివుడు హాలాహలం సేవించి విశ్రమించినందున దీనిని 'కాల కుటాసన క్షేత్రం' అని కూడా అంటారు. ఆలయంలో దక్షిణామూర్తి విగ్రహం అరుదైన రీతిలో వృషభ వాహనం పై దర్శనమిస్తుంది. పవిత్ర భారతదేశంలోని ఏ శివా లయంలోను ఇటువంటి మూర్తి కనిపించదు. ఇక్కడ దేవత పేరు గౌరి. కొత్తగా పెళ్ళి చేసుకొన్న దంపతులు మరియు పిల్లలు లేని వారు గౌరిసమేత దక్షిణామూర్తిని దర్శనం చేసుకొని సంతాన కోరిక కోరినట్లయితే వారికి సంతానం కలుగుతుందనే నమ్మకం ఉంది.

దైవాన్ని నమ్మాలి. అనారోగ్య విషయంలో మాత్రము దేవుడు బాగుచేస్తాడు అని దైవంపై భారంవేస్తే కొన్ని సందర్భాలలో ప్రాణానికి ముప్పు వచ్చే ప్రమాదము ఉంది. కావున జాగ్రత్త వహించడం మంచిది. ఒకరు నమ్మిన విషయాన్ని అందరూ నమ్మాల్సిన అవసరం లేదు. ఆయా నమ్మకాలు ఆయా వ్యక్తుల విచక్షణా జ్ఞానం మీద, అనుభవాల మీద ఆధారపడి ఉంటాయి.

ఇలా చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలలో ప్రసిద్ధి చెందిన ఆలయాలపై అనేక నమ్మకాలు ఉన్నాయి. వీటిని నా పరిశోధనా పరిధిలోనికి తీసుకొని ఈ పరిశోధన పత్రాన్ని రూపొందించాను.

ఆధార గ్రంథాలు :

1. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆచార్య. ఆర్వీయస్. సుందరం
2. జానపదుల నమ్మకాలు - ఆచార్య. జి.ఎస్. మోహన్
3. జానపద విజ్ఞానాధ్యయనం - ఆచార్య. జి.ఎస్. మోహన్
4. తిరుపతి గంగజాతర - ఆచార్య. పేట శ్రీనివాసులురెడ్డి

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బోయ జంగయ్య రచనలు – అభ్యుదయ భావాలు

- కళ్యాణం అన్నపూర్ణ

ఇతివృత్త వైవిధ్యం, పాత్ర చిత్రణలో పటుత్వం, అద్భుతమైన కథాశిల్పం, గంగా ప్రవాహంతో సాగే రచనా పాటవంతో కథలను మలచిన కథా శిల్పి, సీనియర్ కథా రచయిత బోయి జంగయ్య. బోయ జంగయ్య రచనా వ్యాసంగం 1964లో ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన అనేక కవితలు, కథలు రాశారు. తన సాహిత్య నేపథ్యం గురించి ప్రస్తావించినప్పుడు 'చుట్టూ చూస్తున్న విషయాలు సాటి మనుషుల బాధలే నా కథావస్తువులు' అని ఆయన చెప్పారు. 'చాకిరి చేస్తూ అవమానాలకు గురవుతున్న నా తోటి మానవులను చూసి ఆత్మ ఘోషిస్తుంది. వాటిని తట్టుకోలేక అరిచిన అరుపులే నా కవిత్వం, నా కథలు, నా సాహిత్యం' అని బోయ జంగయ్య 'ఇండియా ఇన్ఫో'తో అన్నారు.

సమాజంలోని కింది వర్గానికి చెందిన జంగయ్య అట్టడుగు వర్గాల బాధలను, వేదనలను చూసి వాటికి కారణాలను అన్వేషించే ప్రయత్నం చెశారు. అందుకే 'ఎంతోమంది బాగా బతుకుతున్న ఈ సమాజంలో కొంత మందే కష్టాలకు గురికావడం, కన్నీరు కార్చడం నన్ను కలచివేసింది. ఈ బాధలను కారణాలేమిటి, బాధ్యులెవరు అనే ప్రశ్నల పరంపరలే నా రచనలు' అని చెప్పగలిగారు.

'జనం బాధలే నా వస్తువులు. కొన్న నా సొంత అనుభవాలు, కొన్ని చూసినవి, కొన్ని విన్నవి. నేను ఎక్కువగా పుస్తకాలు చదవలేదు. ఉద్యోగరీత్యా మనుషులను ఎక్కువగా చూడడం, వారితో మాట్లాడడం నా సాహిత్యానికి పునాదులు వేశాయి' అని ఆయన జవాబిచ్చారు.

వీటిలో ఏ కథ తీసుకొన్నా, వస్తు ప్రాధాన్య దృష్టిలో నిబద్ధత (కమిట్‌మెంట్), నిమగ్నత (ఇన్‌వాల్వ్‌మెంట్) అనే గుణాలతో ఒక డాక్యుమెంటరీ చిత్రాన్ని మన కళ్ళముందు నిలిచినట్లు గొప్ప అనుభూతిని కలిగిస్తాయి. ఆయన కథల్లో ఒక సంపూర్ణ సమగ్రత ఉంటూ, ఇజాలు, వాదాల జోలికి పోకుండా దళిత జీవితానికీ, దళిత జీవిత విలువలకూ ప్రాధాన్యం ఇచ్చిన విశిష్ట కథకులు బోజ. తెలంగాణ వాస్తవికతను కళ్ళకి కట్టిస్తూ అనేక కథలు రాశారు. విశ్వజనీన భావాలు, సరళమైన భాషలో చెప్ప గలగడం ఆయన కథల్లో కనిపిస్తాయి. తన కథల ద్వారా పుట్టినగడ్డ ఋణాన్ని తీర్చుకున్న అద్భుతమైన కథకుడు బోయి జంగయ్య. సజీవంగా కొంతకాలం నిలవగలిగే నవల రాయాలంటే రచయిత తన రచన పట్ల మిక్కిలి శ్రద్ధ వహించాలి. ఇతివృత్తమందలి పాత్రలు, సంఘటనలు నిజ జీవితానికి దగ్గరగా వుండాలి. రచయిత తాను సృష్టించబోయే పాత్రలకు ఆకృతిని, నిర్మాణాన్ని ఇచ్చే విధానాన్ని పాత్ర అంటాం. దీన్నే పాత్ర సృష్టి అని కూడా అంటారు. పాత్ర పోషణ, పాత్ర సృష్టి రెండూ ఒకే అర్థాన్నిచ్చినప్పటికి ఈ పదాలకు సూక్ష్మభేదం వుంది.

రచయిత భావాలనూ రచనా శిల్పాన్ని తెలుసు కోవడానికి రచయిత చిత్రించిన పాత్రలను పరిశీలించ వలసి వుంది. సమర్థుడైన రచయిత వివిధ పాత్రల మనస్తత్వాలను అనుసరించి రాస్తాడు. రచనలో 'కథా గమనమందలి వివిధ సన్నివేశములలో త్తతదుచితముగా ఆయా పాత్రముల చేష్టాదికములతో, మనః ప్రవృత్తులతో గలుగు క్రమోన్మీలనమును పూర్వాపర సందర్భముగా ప్రవచించి నిరూపించుట పాత్రపోషణ' అన్ని పేర్కొన్నారు.

'పనిష్‌మెంట్' కథలోని ప్రధాన పాత్ర పేరు మోతి. ఈమె దళిత స్త్రీ. మోతి భర్త ప్రమాదవశాత్తు కొడుకు చేతిలో ప్రాణాలు పోగొట్టుకుంటాడు. భర్త ఎట్లా పోయాడని, కొడుకునైనా ఉనికంభం ఎక్కనీయకుండా తప్పించాలని మోతి నానా అగచాట్లు పడుతుంది. చివరకు

రాజకీయ నాయకుల్ని ఆశ్రయిస్తుంది. పర్యవసానంగా కొడుకు ప్రాణాన్నే కాదు కోడలు శీలాన్ని పోగొట్టుకుంటుంది. ఈ కథలో సామాన్య నిరేపేద స్త్రీ ఆవేదన కన్పిస్తుంది.

'గొర్రెలు' కథలో రాజకీయ నాయకులు ఏ కులానికి చెందినా అందరూ ఒక్కటేనని, కార్యకర్తలు మాత్రం పావులుగా పనికొచ్చే గొర్రెలు వంటివారని ఈ రాజకీయ వ్యవస్థ మారదని, దళితులు, గొర్రెల మనస్తత్వాన్ని వీడాలని పిలుపునిచ్చారు.

'ఇంకానా ఇకపై సాగవు' కథలో శ్రమజీవుల సమైక్యతను ఆకాంక్షించారు. దళితుల్ని కులాల, మతాల పేరుతో విభజించి, వేదింపులకు గురిచేయడాన్ని నిరసించి, వారి చైతన్యాన్ని కోరుకున్నాడు.

'బంచరాయ' కథలో రాజకీయ వంచనను బట్టబయలు చేసాడు. దళితులకు ఓట్లకోసం బర్రెల్ని, గొర్రెల్ని ఎరవేసి, వారి ఓట్లు దండుకుని చివరకు వారినే బర్రెల్ని, గొర్రెల్ని చేయడాన్ని నిరసించాడు. దళితుల్లో విభేదాలను సృష్టించడాన్ని ఖండించాడు.

'మనసు' కథ కులాంతర వివాహాల్ని సమర్థించే కథ, గ్రామాల్లో కుల పంచాయితీల నిరంకుశ స్వరూపాన్ని కళ్ళకు కట్టినట్లు చెప్తూ వాటిని ఖండించాడు. తప్పుచేయని వాడెవడూ లేడని సందేశమిచ్చాడు.

'గత్తర' అనే కథలో పాత, కొత్త పాలక వర్గాలు గ్రామాల్లో గత్తర (కలరా) పేరుతో జరిపే అమానుష కృత్యాల్ని తెలియజేయటం, అజ్ఞానంలో ఉన్న దళితుల్ని చైతన్యం చేయటం కన్పిస్తుంది.

వెలుతురు (1981) :

ఇది కవితా సంకలనం. ఇందులోని కవితలు ముందుగా వివిధ పత్రికలలో ప్రచురణ పొందాయి. ఆ ఖండికల్లో గతమంతా మతానికి, కులానికి పట్టం గట్టిన కాలమని, మూఢవిశ్వాసం హరిజనుల్ని, దీనుల్ని, స్త్రీలను వివక్షా దృష్టితో దయనీయమైన స్థితికి నెట్టి వేశాయని ఆవేదన చెందారు.

ఎచ్చరిక (1983) :

ఈ కథా సంపుటిలో 'దొంగలు', 'కుండబద్దలు కొడత', 'చెదలు', 'గమనిక', 'ఎచ్చరిక' అనే అయిదు కథలున్నాయి. మన సమాజంలో పీడనకు గురయిన దళితుల్ని వారి కష్టాల్ని దీనిలో గుర్తుచేసారు. పీడన లేని సమాజాన్ని రచయిత ఆకాంక్షించారు.

'దొంగలు' కథలో బీరప్ప అనే రైతు ఆఫీసులో లోనుకోసం తిరిగి వారిక లంచాలు ఇవ్వలేక విసిగి పోతాడు. లంచగొండులైన ఆఫీసు దొంగల్ని తనకు తెలిసినరీతిలో 'దొంగలు'గా సమాజానికి పట్టించి దేహశుద్ధి చేయిస్తాడు. ఈ కథ ద్వారా రచయిత లంచగొండి సమాజాన్ని హెచ్చరించారు.

'కుండబద్దలు కొడతా' కథలో కామాంధులైన అగ్రవర్ణాలవారు కల్లుతాగి కల్లమ్ముకునే దళిత స్త్రీపై అత్యాచారయత్నం చేయడానికి ప్రయత్నిస్తారు. అవమానానికి గురైన ఆ దళిత స్త్రీ, ఆమె భర్త, అత్త, ఊరిలోని దళిత యువకులు, దోషుల్ని వెంటాడి తరుముతారు. దళితులంతా ఐక్యమత్యంగా ఉంటే ఏ సమస్య అయినా పరిష్కారమవుతుందని ఈ కథ సారాంశం.

'చెదలు' కథలో దుస్థితిని వివరించారు. 'అయ్యయ్యో! మాకున్న బాధలు ఇంకెవరికుంటాయి. పండిస్తూ పస్తుండటం, కష్టపడుతూ నౌకరు వెల్లదీస్తాం' చేతిలోని కర్ర పడేస్తే పురుగు పారిపోతుంది. కాని అదే మనిషైతే పైపైకొస్తాడు అనే సత్యాన్ని తెలుసుకోమన్నారు. కర్రపట్టే స్థితికి దళితుడొచ్చాడని హెచ్చరించారు.

'జాతర' నవలలో నల్లగొండ జిల్లాలోని ఒక ప్రాంతపు ప్రజాజీవనం, మోతుబరులైన రైతులు, వారి కుటుంబాలలోని స్త్రీలు, నౌకర్లు, కూలీలు, వృత్తిపనివాళ్ళు, పోలీసులు, పూజారులు, అక్కడ ఉన్న అర్థంలేని ఆచారాలు, అంధ విశ్వాసాలను కళ్ళకు కట్టినట్లుగా చిత్రించారు. ఆయన తన అభ్యుదయ భావాలతో దళిత ప్రజలను చైతన్యపరచి, దళిత సాహిత్యానికి తనవంతు కృషి చేసారని చెప్పక తప్పదు.

వాస్తవ సంఘటనలు ఆకళింపు చేసుకొని వాటిని కథా వస్తువుగా స్వీకరించి రాస్తే ఆ కథలో బలం ఉండటమే కాక పాఠకులకు చేరువైతుందని, ప్రముఖ కథా రచయిత బోయ జంగయ్య అన్నారు. తాను ఇప్పటి వరకు రాసిన పద్నాలుగు కథా సంపుటాలలో ఎక్కువగా రాసిన కథలన్నీ వాస్తవం నుంచి పుట్టినవేనన్నారు. బోయ జంగయ్య మాట్లాడుతూ తానెపుడు భగవంతుని నమ్మలేదని, ఎందుకంటే నేను ఎవరిని ప్రశ్నించిన కనిపించ లేదన్నారు. తాను పుట్టి పెరిగిన ఊరులో అష్టకష్టాలు పడి చదువుకున్న రోజులు, తల్లితండ్రులు కూలీ నాలి చేసుకొని రోజులు వెళ్లదీసిన పరిస్థితులు, సామాజిక సంఘటనల్లోంచి కథలు ఉద్భవించాయని చెప్పారు. తన తొలి కథ 'మనసు కథ' అని తొలి కథా సంకలనం లోకం-గొర్రెలు అని చెప్పారు.

తన వ్యక్తిత్వానికి, రచనలకు బాలా సాహెబ్ అంబేడ్కర్ మాత్రమే స్ఫూర్తిగా నిలిచాడని స్పష్టం చేశారు.

'ఒక్క చూపుడు వేలుతోనే
కుల రక్కసిని రూపుమాపావు
ఒక్కకలం పోటుతోనే...
తలరాతలు మార్చినావు...

అంటూ అంబేద్కర్‌పై తాను రాసిన కవితని వినిపించారు. బలమైన ఆలోచనలు కదలిక రావాలి, దాని పర్యవసానమే వస్తు బలంతో కథలు పుడతాయని చెప్పారు.

ఆయన ప్రతి రచనలో ఏదో ప్రత్యేకత, ఏదో ఒక కనువిప్పు. ఉదాహరణకు 'మల్లెపూలు' కథ దీని ద్వారా పురుషులు పరస్త్రీ వ్యామోహం చెందుటకు కారణం భార్యల నిర్లక్ష్యమే అనే సందేశమిచ్చినారు. హాస్పిటల్‌లోని అవినీతిని గురించి ఒక కథ ద్వారా చెపుతు ఒక పేదవాడు తన గేదెనమ్మి తెచ్చిన డబ్బుతో తన కూతురును బ్రతికించుకోలేదు. కారణం డాక్టర్ నిర్లక్ష్యం. ఈ సన్నివేశం డాక్టర్‌గా నన్ను నా హృదయమును ఎంతో కదిలించి వేసింది. ఇలాగే గొర్రెలు - ఈయన శ్రీశ్రీ లాగ అగ్గిపెట్టె-సబ్బుబిల్ల లాగా చిన్న కూర్పు ఎంతో గూడార్థముతో నిండివుంటుంది.

తొలినాళ్లలో మినీకవిత్వంతో సామాజిక రుగ్మతుల మీద యుద్ధం ప్రకటించిన జంగయ్య తరువాత కథలు, నవల ద్వారా సమాజంలో జరుగుతున్న అవలక్షణాలు ఎత్తి చూపారు. మినీ కవిత్వంలో సమాజంలో జరిగే అన్యాయాలను సూటిగా ప్రశ్నించారు. మూఢనమ్మకాలను ఎత్తి చూపారు. పావురాలు, హారతిపళ్లెం, ఆకలి కవితలు 'కర్మా నీవు కనపడకు ఎవరినోట వినపడకు' అని కర్మ సిద్ధాంతాన్ని నిరసించారు. గుర్రం జాషువాలాగ తనజాతి జనుల గోడు వినిపించినట్లుగా జంగయ్య దళితులు, బహుజనులు, అట్టడుగు వర్గాల బాధలు, గాధలు, గ్రామీణ జీవిత యదార్థతలు తన రచనలలో ప్రతిబింబించారు. ఎక్కడ ధగా, మోసం, ఆకలి, దారిద్ర్యం వుందో అక్కడ నేనున్నానంటూ వారి పక్షాన నిలబడ్డ రచయిత.

తను నమ్మిన, తను చూసిన జీవితాలు గ్రామాలలో బలవంతుల చేతుల్లో అణగ దొక్కబడుతున్న బల హీనులు ముఖ్యంగా దళితుల జీవితాలు, దొరలు, దేశ్‌ముఖ్‌ల, ఆగడాలు, దోపిడీలు స్త్రీల పట్ల వాల్ల వికృత చేష్టలు తన కథలల్లో కల్లకు కట్టినట్లు చిత్రీకరించారు. లోకం, గొర్రెలు, చీమలు, తెలంగాణా వెతలు, ఇప్పపూలు, బొమ్మలు, బొగ్గులు, కథల సంపుటాలల్లో ఏ కథను కదిలించినా బడుగు జీవుల వెతల బతుకు చిత్రాలే.

తనురాసిన జాతర నవల ద్వారా మూఢ విశ్వాసాలపై దేవుడు, దయ్యాలు, భూతాలు, కర్మ సిద్ధాంతాలను బాబాలు వారి బండారాలను బయట పెట్టాడు. అందుకే ఆనవల పలువురి ప్రశంసలు పొందింది. యూనివర్సిటీ ఉపవాచకంగా పెట్టారు. ఇక జగడం నవల కొడవటిగంటి వారి 'చదువు' నవలతో పోల్చవచ్చు. చదువు నవల నాయకునికి జగడం నవల నాయకుడు 'రాజం' పాత్రకు దగ్గరి పోలికలున్నాయి. చదువు కోసం 'రాజం' పడ్డ కష్టాలను ఈ నవలలో కల్లకు కట్టినట్లు చిత్రీకరించారు జంగయ్య. తను చెప్పదల్చుకున్నది సాదాసీదాగా చెప్పటం కుటుంబరావు చెప్పినట్లనిపిస్తుంది. కథలు ఆకాశంలో పుట్టవు. మనిషి జీవితంలోంచి పుడతాయి. అందుచేతనే

రచయితలు జీవితానికి దగ్గరగా ఉండాలి. జీవితానికి దగ్గరగా ఉండగలిగిన వారే మంచి రచయితలుగా మిగుల్తారు. గొర్రెల కథల్లో శ్రీ జంగయ్య గారు తీసుకున్న ఇతివృత్తాల్లో అవలంభించిన శిల్పాల్లో. వాడిన మాటల్లో. ఉపయోగించిన ఉపమల్లో, అన్నింటి బట్టి కూడా ఈయన ఉత్తమ రచయిత అని తెలుస్తుంది.

'బంచరాయి' కథ కూడ రాజకీయ వంచనా శిల్పానికి పరాకాష్ట, బంచరాయి అంటే బంజరు భూమి. యేళ్లు వూళ్ళు గడిచినా, మన స్వాతంత్ర్యానికి మైనారిటీ పోయి యవ్వనదశ ప్రాప్తించిన బంజరు భూమి పంపిణీ సమస్య సమస్యగానే ఉండిపోయింది. హరిజనులు వగైరా గ్రామీణ పేదలకు ఎన్నికల్లో ఎరవేయడానికి యిదో పరమపద సోపానపఠం. గొర్రెలు బర్రెలు పంపకం గొప్ప ప్రాపు. అందుకోసం పాలక వర్గాలకు ఈ సమస్య సజీవంగానే వుండాలి. ఈ గొప్ప సత్యాన్ని ఈ కథ చాల చక్కగా చిత్రించింది.

ఆకలి వూరుకోనివ్వదు. మధ్య నాగటి చాలులో దేవత విగ్రహం దొరికిందనిపించినా హరిజనులు భూమిని దున్నారు. ఫలితం వాళ్ళ కొంపలు అగ్గిపాలైనై. దీనికంతా మూలకందం ముకుందం అయిన దొరకవారు, గ్రామాధికార్లు కర్మ సిద్ధాంతాన్ని విప్పి చెప్పుతున్నారు. దేవుడి భూమిని. దేవతా విగ్రహాన్ని కదల దున్నినందుకే హరిజన వాడ అంటుకున్నదని ధర్మ పన్నాలు చెప్పారు. కాదు అంతా అబద్ధం అని గోపాలం అరచినప్పుడు అంత అతని, చూపులవైపు, చూపుడు వేలువైపు చూస్తున్నారు అని కథ ముగిస్తాడు రచయిత. ధ్వన్యాత్మకంగా యువకుడు గోపాలం చూపుడు వేలు ఎటు దిక్కు చూపుతోందో, ఎంచేయాలంటుందో పాఠకుల ఊహకు వదిలాడు రచయిత. పాత ప్యూడిల్ అధికార వర్గానికి, పంచాయితి ఎన్నికల ద్వార అధికారంలోనికి వచ్చిన నూతన సంపన్న వర్గానికి వున్న ఘర్షణా చిత్రణ పరోక్షంగా జరిగింది ఈ కథలో.

హరిజనవాడ పూర్తిగా తగలబడి పోయింది. దొర, పటేలు కర్మ సిద్ధాంతాన్ని విప్పి చెప్పుతున్నారు. దేవుడి భూమిని, దేవతా విగ్రహాన్ని కదులచున్నినందుకే హరిజన వాడ తగలబడ్డదని పూజారి అన్నప్పుడు 'ఔను' అన్నాడు. దొర 'నిన్న కొలుపులో చెప్పినది నిజమైనది!' అన్నాడు పటేలు.

కథా రచన శిల్పదృష్టితో జరిగే సృష్టి, శిల్పం అనేది ఒకచోట - ఒక పాత్రలో, ఒక సన్నివేశంలో మట్టుకే కేంద్రీకృతం అయి వుండేదికాదు. కథ పొడుగునా - పైకి కనిపించకుండానే వ్యక్తం అవుతూ వుంటుంది.

ప్రతి రచన ఒక ప్రత్యేక పరిస్థితుల్లో ఆ సమాజానికి పనికి వచ్చేటట్టు మార్పును తెస్తుంది. దానిలో శాశ్వతమైన విలువలుగల సాహిత్యంగా అది మిగిలిపోతుంది. దళిత కథా సాహిత్యం సమాజం మారడానికి, సమాజాభివృద్ధికి, సమాజంలో సమతుల్యం తేగల అనివార్యమైన సాధ్యమని చెప్పాలి. అందుకే దళిత సాహిత్యం పుట్టెడు కష్టాల్లోంచి పుట్టింది. అందువల్లే ఆ సాహిత్యం అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిపోతోంది.

వాస్తవ ప్రపంచంలోని దుర్భర దారిద్ర్యాన్ని, దాన్ని అనుభవిస్తున్న అలగా జనాన్ని ఈసండించుకునే ధనిక వర్గం, ఆ దృశ్య చిత్రణ, కళాత్మకంగా, కావ్యాను మీదకెక్కగానే తమ బంగ్లాలా అందానికి అమర్చుకున్న వైనాన్ని దిష్టిబొమ్మ కవితలో చెప్పారు.

ఆకలి అదుపు కోసం
నడికట్టును బిగించి
అర్ధనగ్నంగా ఓ స్త్రీ
నెత్తిన ఎండుపుల్లల మోపు
గట్టు నుండి గుడిసెకు నడక
నల్లరాయి శిల్పం లాంటి
ఆరేళ్ళ పాపడు ఆమె వెనకాల
పేదరికం ఉట్టిపడే ఆ చిత్రం
వున్న వాడి మేడ వరండాలో
ఖరీదైన ఫ్రేములో కనిపిస్తుంది.

ఈ కవితలో ఆకలిని అదిమిపెట్టడానికి నడికట్టును బిగించడం, ఆమె కొడుకు నల్లరాయి శిల్పంలా వున్నా డనటం, ఈ మొత్తం దృశ్యం ఖరీదైన ఫ్రేములో బిగించ బడటం అన్న అంశాలు కవిత్వానికి బలాన్ని చేకూర్చాయి.

దళిత సాహిత్యం వ్యవస్థలోని లోపాల్ని సరిదిద్దేందుకు తోడ్పడుతుందిగానీ, అది వ్యక్తిగతమైంది ఎంత మాత్రం గాదు. అలాంటి దాన్ని సంయమనంతో స్వాగతించాల్సి ఉంది. దాన్ని అర్థం చేసుకోడానికి ఆసక్తి చూపనివారు యదార్థాన్ని తెల్సుకోడానికి జంకేవాళ్ళే అవుతారు. అపుడు దళిత సాహిత్యం దళితులే చదువుకోవాల్సి వస్తుంది. దానితో వాస్తవికమైనదేమిటో మరుగునపడిపోతుంది.

కథానికాశిల్పం - అదేదో బాహ్యాలంకరణ కాదు. 'కథను ఎక్కడ మొదలు పెట్టాలి; ఎంత చెప్పాలి; ఎలా, ఎక్కడ ముగించాలి అనే మెళకువల సమాహార రూపానికి శిల్పం అని పేరెట్టుకుంటే చాలు' అంటారు విహారి.

చందమ్మ కొడవలితో భూమి మీద కాట్లుపెడుతూ 'భూదేవి నీకింత సాకిరి సేస్తే ఏం మిగిలింది.

బావితోడితే ఏమొచ్చు-
పొలం అచ్చుకడితే ఏమొచ్చు-
సేనుకాస్తే ఏమొచ్చె-
పంట ఎవరి గరిన జేరే-
పాడి ఎవరి యిల్లు జేరె-

ఐదేండ్ల పిల్లప్పుడు ఈ వూరికి కోడలై వచ్చిన నాటినుండి నేటి వరకు ఈ వూరి అన్ని బావుల దగ్గర నాటేసి, కోసి, కొట్టి పుట్లకు పుట్లు పోగుసేస్తే ఏ పూటకు ఆ పూటే నాయె- ఏం బతుకులు ఈ ఆకలి బతుకులు. సేసుక బతికే వయసులనే సస్తే బాగుండు. అనుకుంటు బావి వైపు చూసింది. ఒకప్పటి రోజులు గుర్తొచ్చి గతంలోకి వెళ్లింది.

పేదరికం తాండవించే
గ్రామీణ ప్రాంతాల్లో
అట్టడుగు బడుగు
జీవుల బతుకు దర్పణం
ఈ 'లేకి బతుకులు'.

ఐదేళ్ళ పసిప్రాయం నుంచీ పరిమళ్ళలో కాయకష్టం చేస్తూ మట్టి పిసుకుతూ ఉన్నోళ్ళ సంపద పెంచిన ఓ బడుగు ముసలి స్త్రీ జీవితానికి చివరకు ఏమీ మిగలలేదని కన్నీళ్ళు పెట్టుకుంటూ చెప్పే ఈ కథంటే నాకెంతో యిష్టం అని జంగయ్య అన్నారు.

జగమెరిగిన రచయిత బోయ జంగయ్య గారి కొత్త కథల సంపుటి యిది. తెలుగు సాహిత్యంలో తనదైన విశిష్ట స్థానాన్ని రచనా సామర్థ్యంతో సాధించుకున్న బోయ జంగయ్య నూతన శతాబ్ది యువ సాహితీవేత్తలకు మార్గదర్శకులు.

చివరగా ఆయన కూడా కన్యాదాత. అనుభవించాడో లేక సమాజాన్ని చదివాడో కానీ ఇది ప్రపంచం ఉన్నంత వరకు ఉండే ఒక చక్కని సాహిత్య బిట్టు...

డబ్బిచ్చేవాడు... దాత, భూమినిచ్చేవాడు... ధర్మదాత
అన్నీ యిచ్చి బిడ్డనిచ్చేవాడు... ఉష్,
గడ్డిపోచ!...

లాంటి ఎన్నో సాంఘిక అంశాలను చిత్రించాడు. ఇలాంటి రచనలు ఎందరివో కడుపుకోతలను అతి సున్నితంగా స్పృశిస్తాయి. ఎంతో మంది సహృదయులను స్పందింప చేస్తాయి. మంచి పరమ నిజాయితీ గల అంశాలే నేడు పాఠకలోకానికి పాఠ్యాంశాలుగా మిగిలిపోతా యనడంలో సందేహం ఎంతమాత్రం లేదు.

'ఒక మనిషి అవసరం మీద మరోమనిషి ఎప్పుడూ వల విసురుతనే ఉన్నాడు. ఇతరుల అవసరాన్ని గుర్తుచేసి భయాన్ని మనిషే సృష్టిస్తున్నాడు. దేవుని పేరుచెప్పి ఆ భయాన్ని అణచివేస్తున్నారు. మనిషి తాను బతకడం కోసం రాయిని పూజిస్తున్నాడు. పామును పూజిస్తున్నాడు. ఈ పూజలకు కారణం భయం. ఈ భయాలు పోవాలి. భౌతిక దృష్టి రావాలి' ఇదే భావాన్ని కవి తన 'మతం' అనే కవితలోనూ పేర్కొన్నాడు.

ఎక్కడ
ఈ మొగ్గలు
పరిమళాల్ని విరజిమ్ముతాయోనని
వికసించి
నాగరికతను నిదర్శనంగా నిలుస్తాయేమోనని
వెలుతురు చూడకుండా
చుట్టూరా
మూఢనమ్మకాల ముళ్ళపొదలు
అజ్ఞానపు చీకటి తెరలు.

మనదేశపు వెనుకబాటు తనానికి శాస్త్రీయ దృక్పథం లేకపోవడం, మూఢనమ్మకాలు దేశపు నలుమూలలా ముప్పిరిగొనడం ఒక ముఖ్యకారణం అనే విషయాన్ని రచయిత చక్కగా అర్థం చేసుకొని తన భావాన్ని పదే పదే వినిపించారు. డి.రామలింగం. తన ఇతిమతాన్ని ఏ మూసలో పోస్తే ఎటువంటి వస్తువు ఉత్పత్తి అవుతుందో తెలిసిన నేర్పరి జంగయ్య. ఈయన కథలకొక ప్రత్యేక పద్ధతి ఉంది. అది ఎవరి అనుకరణమూ కాదు. ఏవో ఒక బాటన పడిపోతాడు. అందులో క్లుప్తత ఉంది. సందర్భాన్ని బట్టి ఒక అంశాన్ని వెలుగులోకి తేవడానికై గతంలోకి పోవడం ఉంటుంది. కథనంలో నుంచి పూర్తిగా పాత్రల డైలాగులతో ఒక స్థితిని విశిదీకరించడం ఉంది'.

శిల్పపరంగా జంగయ్య నల్లగొండ నాడి పట్టుకున్నాడు. గురజాడకి, రావిశాస్త్రికి, కా.రా.కి. వారివారి మాండలిక రచనల్లో ఎంతపేరుందో జంగయ్య పేరు అంతకంటే తక్కువేం కాదు. తనకు తెలియకుండానే (బహుశా తెలిసి కూడా) ప్రాంతీయ అస్థిత్వాన్ని, జీవితాన్ని ఆయన అక్షరీకరించారు.

ఈయన కథల గురించి, రావిశాస్త్రి కథలు జీవితంలో నుండి వస్తాయని, అన్నారు. నవలరచన గురించి పురాణం బోజ సాహిత్యంలో స్థిత ప్రజ్ఞతవుందన్నారు. ఈయన కవిత్వం ఎంతో సరళంగా వుంటు జనం నాలుకల మీద కదిలాడుతుంది అన్నారు. సి.నా.రె. బతుకులోతులను తవ్వి, సంఘం ముందు ఉంచాల్సిన కవి బోజ జంగయ్య అన్నారు. శ్రీశ్రీ తన ముందు మాటలో. ఇట్లా సాహితి ప్రముఖులు అభినందనలను అందుకుంటూ సాహిత్య రచనల కొనసాగిస్తున్నారు.

పూజారి చేసిన గుడి గంటల సందడికి / ఆలయపు గోపురాల నుండి ఎగిరిన పావురాలు/ ప్రభువు ప్రార్థన కోసం/ పస్టర్ చర్చి తలుపులు తెరిచినపుడు/ ఎగిరిన పావురాలు/ అల్లా-అక్బర్ మౌజన్ పిలుపుకు/ మసీదు మీనారుల నుండి/ ఎగిరిన పావురాలు/ అన్నీ కలిసి తిరుగుతున్నాయి/ కానీ పూజారి/ పాస్టర్/మౌజన్/?

'పావురం కనిపించడం లేదు/ కనుచూపు మేరలో దాని జాడే లేదు/
ఎగిరేసిన పావురం ఎటు పోయినట్టు?
కాశ్మీరు పూదోటల్లో/ కన్యాకుమారి కాలిబాటల్లో/
గోవా చర్చి గంటలపై/
భాగ్యనగర్ చార్మినార్‌పై/ వణుకుతూ నిలుచుందట/
కర్ఫ్యూలకు కాల్పులకు/ కునుకు మాని కూర్చుందట.
మందిర్ - మసీదుల కోసం/ మనుషులే పోట్లాడుతుంటే
స్థావరం కోల్పోయిన పావురం/ మీ ఊరు వాడా చేరితే రాళ్ళు రువ్వకండి
ఆ అపురూప కపోతాన్ని స్వేచ్ఛగా ఎగరనివ్వండి.

ఈ కవితలోని ఒంటి పావురం శాంతికి ప్రతీక. దేశంలో మతకల్లోలాల వల్లా, హింసాకాండవల్ల మనందరం ఆశించే శాంతి కనుమరుగైందని, నగరాల్లో అగ్నిజ్వాలగా వ్యాపించిన అశాంతి వల్ల బహుశా పల్లె ప్రాంతాలు వారించవచ్చుననీ, అక్కడ కూడా రాళ్ళతో కొట్టి తరిమి వేయవద్దని కవి ఈ కవితలో ప్రభోదం చేశాడు. పాత ధోరణిలో చెపితే - నాకు 'పావురాలు' 'అహా' అనిపించింది. 'పావురం' 'ఓహో' అనిపించింది.

నేటి కవులలో భావచిత్రాలను, ప్రతీకలను శక్తి మంతంగా వాడుతున్న వారిలో శ్రీ బోయ జంగయ్య

మొదటి వరుసలో ఉన్నారు. సంక్షిప్తత, వ్యంగ్యం, స్పష్టత, సౌందర్యం జంగయ్య కవితకు సహజాలంకారాలు. కవిగా కవితలకే కాక కథకుడుగా, నవలాకర్తగా ఆయా ప్రక్రియలకు కూడా ఈ లక్షణాలను సంప్రదిస్తూ భావ చిత్రాల నందించే శీర్షికలు పెట్టటం, శిల్పాలు తీర్చడం జంగయ్య ప్రత్యేకత. సామాజిక స్పృహతో పాటు సాహిత్య స్పృహను సాహిత్యానికి ఊపిరితిత్తులుగా నిల్పిన రచయిత శ్రీ బోయ జంగయ్య.

ఉదా॥ శ్రీ బోయ జంగయ్య 'కన్యాదాత' (మినీ కవిత).

'డబ్బిచ్చేవాడు / దాత
భూమినిచ్చేవాడు / ధర్మదాత
అన్నీ యిచ్చి/ బిడ్డనిచ్చేవాడు
ఉష్ / గడ్డిపోచ

మొదటి- రెండు పాదాల చొప్పున రెండు భావ చిత్రాలు ప్రత్యక్షం అవుతాయి. అని పైకి నిర్వచనాల్లాగా కనపడుతున్నాయి. కాని డబ్బిచ్చినవాడు, భూమినిచ్చినవాడు లోకంలో ఎలా ప్రశంసింపబడతారో ధ్వనింపచేసే పదాలు: దాత, ధర్మదాత అని అలంకారాలు కాని అలంకారాలు. డబ్బును, భూమిని, బిడ్డను కూడా దానం చేసిన కాన్యాదాత పై ఇద్దరి కంటే గొప్పవాడు కావాలి. కానీ లోకంలో గడ్డిపోచలా పరిగణింపబడుతుఆన్నడు. 'ఉష్!' అనే మాట ఒక్కటి పై కవితలో ఒక చరణం. అయ్యో, లాభంలేదు, అవన్నీ, లెక్కలేదన్నవి, అని గట్టిగ అనకండి. అవన్నీ ఎన్నో అర్థాలు చెప్పుకోవచ్చు ఆ ఏకపద చరణానికి. 'గడ్డిపోచ' రూపకాలంకారమే, భావచిత్రంగా పరిణమించింది. కవితలోని తులనాత్మక దృక్పథం వస్తువును భావచిత్రంగా మార్చే పరికల్పనా శిల్పం.

చదువు ప్రియమైంది
ధర పెరిగింది
పెళ్ళిళ్ల సంతలో వరులకు ధర పెరిగింది
ఇచ్చి పుచ్చుకొనే పెద్దల్లో సంస్కారం కరువైంది
స్వచ్ఛత మాయమైంది
జాతి జీవితంలో
మంచి కరువైంది - మమత కరువైంది
ఇన్ని కరువైన బతుకు
మరీ మరీ బరువైంది

రచనా రీతి, శైలి, ప్రారంభం, ముగింపు, రచయిత వ్యక్తిత్వం, కథ చెప్పిన తీరు - శిల్పం అంటారు. రచయిత వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెపితే, ఆ వస్తువు ఏ రూపంలో అభివ్యక్తం అవుతుందో ఆ రూపాన్ని శిల్పం అంటారు. భావ ప్రతిమలు, భాష శిల్పంలో ముఖ్యమైన అంశాలు. కథలో అనుభవానికి దృశ్య నిర్మాణం చేయడం భావ ప్రతిమ.

కథల్ని పాశ్చాత్య విమర్శకులు 'ఎపిఫనీ'లు అంటారు. "ఎపిఫనీ" అన్న మాటను కథా శిల్పానికి అన్వయించిన వాడు జేమ్స్ జాయిస్.

గొర్రెను తిన్న నా కొడుకులకు ఇంత ఇస్సాసం లేదు, వీళ్ళ కంటే నా మందకాడి కుక్క నయం, చారెడు గంజి పోస్తే దినమంతా మంద కాసుద్ధి. అంటూ అవ్యక్త సమాజ భవాల్ని పవర సమాజానికి చెర్నాకోలులా అంటిస్తారు బోయ జంగయ్య. తాను ఏం చెప్పదలుచుకున్నాడో దానికి అనువైన పాత్రల్ని, సన్నివేశాల్ని చిత్రించాక ఇక రచయిత విడిగా చెప్పేదేముంది? బోయ జంగయ్య గారి శిల్ప రహస్యాల్లో ఇదొకటి

రావిశాస్త్రి రాజ్యాన్ని, అల్లం రాజయ్య పార్టీ, రాజ్యాంగ యంత్రాన్ని, కాలువ మల్లయ్య జీవితాన్ని, బి.ఎన్. రాములు మానవ సంబంధాల్ని కేంద్రం చేసి కథలు రాస్తారు. వి.చంద్రశేఖర రావు, ఆడెపు లక్ష్మిపతి శిల్పాన్ని కేంద్రంగా చేసుకొని కథలు నిర్మిస్తారు. బోయ జంగయ్య సామాజిక సమస్యల్ని, అవి వ్యక్తి జీవితంలో ప్రతిఫలించే తీరును శిల్పం మీదనిలబెట్టి చెక్కుతారు. తెలంగాణా ప్రజల వ్యథలు - బోయ జంగయ్య కథలు అని కాలువ మల్లయ్య అన్నారు.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'ఆమె వితంతువు కాదు' నవల – సామాజిక చిత్రణ

– కటుకం శారద, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్లు, తెలంగాణ.

రేగులపాటి కిషన్‌రావు 12 జనవరి 1946 లో చంద్రమ్మ భూంరావు దంపతులకు జన్మించారు. వీరి జన్మస్థలం సిరిసిల్ల జిల్లాలోని చింతల్‌ఠాణం. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ప్రవృత్తి రచనలు చేయటం. వారు ఆరు నవలలు, ఆరు కథా సంపుటాలు, 13 కవితా సంపుటాలు, వ్యాసాలు, సమీక్షలు, విమర్శ, యాత్రా చరిత్ర, మొదలగు విభిన్న ప్రక్రియలలో రచనలు చేసిన అనుభవజ్ఞుడైన సీనియర్ రచయిత, కవి. వీరు రాసిన మొదటి నవల ఇది. దీనిని 1976 వ సంవత్సరంలో రాసినారు. వీరి నవలలన్నీ కూడా స్త్రీ సమస్యా ప్రధానమైనవి కావటం విశేషం. పురుషాధిక్య సమాజంలో స్త్రీలు పడుతున్న కష్టాలను ఎంతో ఆర్ద్రంగా చిత్రించారు. అదేవిధంగా సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను చిత్రించారు. ఆ సమస్యల గురించి పాఠకులను ఆలోచింపచేసి వారిలో సంస్కారాన్ని పెంచే ప్రయత్నం చేసినారు. బ్రతికి ఉన్న ప్రతి మనిషికి మస్యలు ఉంటాయి. సమస్యలు లేనిది చచ్చిపోయిన వాళ్లకు మాత్రమే. కనుక సమస్యలకు భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలన్న సందేశం వీరి నవలలల్లో కనిపిస్తుంది.

కుటుంబంలో స్త్రీల పాత్ర ఎంతో ముఖ్యమైనది. తల్లిగా, భార్యగా, తోబుట్టువుగా ఇలా ఎన్నో రూపాలలో పురుషుడి విజయానికి మెన్నుదన్నుగా ఉన్నప్పటికీ ఆమెకు కుటుంబంలో దక్కవలసిన స్థానం, విలువ, గౌరవం దక్కటం లేదనేది నిర్వివాదం. పైగా పురుషుడు ఆమెను సరిగా అర్థం చేసుకోలేకపోవటమే కాక అనుమానాలు, అపార్థాలతో సంసారాన్ని నరకం చేయటం జరుగుతున్నది. వీరు రాసిన నవలల్లో నేను 'ఆమె వితంతువు కాదు' నవలలో సామాజిక చిత్రణ గురించి ఈ వ్యాసంలో పరిశీలన చేస్తాను. మొదట నవల ఇతివృత్తాన్ని క్లుప్తంగా పరిచయం చేస్తాను.

వ్యవసాయదారుడైన రంగారావు కూతురు అన్నపూర్ణ. మొదటి భార్య చనిపోవటం వల్ల రెండవ పెళ్లి చేసుకుంటాడు. ఆమె అన్నపూర్ణను చిత్రహింసలు పెడుతుంది. అతడు భార్య చేసే పనులన్నీ చూసి కూడా మందలించే వాడు కాదు. ఇంటి పనులన్నీ చేసినా కూడా ఏదో విధంగా సాధించేది. ఆమెను పాపారావుకు ఇచ్చి పెళ్లి చేసినారు. ఆమె అత్త దుర్గమ్మ పరమ గయ్యాలి. కల్లు తాగటం ఆమెకున్న వ్యసనం. తల్లీ కొడుకులు అన్నపూర్ణను సరిగా చూసేవారు కాదు. అన్నపూర్ణ కుట్టుపని నేర్చుకొని ఆ సంపాదనతో తన అవసరాలన్నీ తీర్చుకునేది. ఆమె స్వతంత్రంగా సంపాదించటం భర్తకు, అత్తగారికి నచ్చలేదు. పైగా కల్లు తాగటానికి డబ్బులు లేనప్పుడు కోడలును అడిగితే ఇవ్వలేదని, చెప్పకుండా దొంగతనంగా తీసి దొరికిపోయింది. అది మనసులో పెట్టుకొని కొడుకుతో ఉన్నవీ, లేనివీ చెప్పి గొడవలు పెట్టించింది. తాగి వచ్చిన భర్త ఆమెను తిట్టడమే కాక కొట్టేవాడు. వారింట్లో రవిచంద్ర అనే ఉపాధ్యాయుడు అద్దెకు ఉండేవాడు. అతనికి అన్నపూర్ణకు అక్రమ సంబంధం అంటగట్టి అనుమాన బీజం రేకెత్తించింది. అనుమానం పెనుభూతం కదా. దాంతో అతడు అవమానం తట్టుకోలేక చనిపోవాలని రైలు పట్టాల వద్దకు చేరుకుంటాడు. అక్కడ అప్పటికే తల చిద్రమై చనిపోయిన ఒక శవాన్ని చూసి భయపడుతాడు. తాను చనిపోకుండానే చనిపోయినట్టుగా అందరిని నమ్మించాలి. అన్నిపూర్ణను విధవగా బ్రతికేటట్టు చేయాలని భావించి ఒక ఉత్తరం రాసి శవం పక్కనే వేసి వెళ్లి పోతాడు.

అన్నపూర్ణకు రవిచంద్రతో ఉన్న అక్రమ సంబంధం వల్లనే పాపారావు చనిపోయినాడని భావించిన అత్త గారు ఆమెను ఇంటిలోంచి వెళ్లగొట్టింది. దిక్కుతోచని

అన్నపూర్ణ కడుపులో బిడ్డతో పుట్టినింటికి చేరింది. కాని సవతితల్లి, తండ్రి కూడా ఆమెను ఆదరించలేదు. దాంతో తల్లిదండ్రుల నిరాదరణకు గురియైన ఆమె చనిపోవాలని అనుకుంటుంది. చివరకు కడుపులోని బిడ్డ కోసమైనా బ్రతుకాలని నిర్ణయించుకొని బ్రతుకుదెరువు కోసం వివిధ ప్రాంతాలు తిరిగి చిన్నచిన్న పనులు చేసింది. వితంతువు, ఒంటరి మహిళగా లక్ష్మీప్రసాదు, నాగభూషణం వంటి మృగాళ్ల నుండి చాకచక్యంగా తప్పించుకున్నది. సూరమ్మ, లక్ష్మీపతి దంపతుల సహాయంతో బ్రతుకు దెరువును సంపాదించుకొని కవల పిల్లలైన నిర్మల, మాధవరావులను చదివించి ప్రయోజకులను చేసింది. ఇంటిలో నుంచి వెళ్లి పోయిన పాపారావు ఆయా చోట్ల చిన్నా చితక పనులు చేస్తాడు. చివరకు రవిచంద్ర ద్వారా అన్నపూర్ణ తప్పులేదని తెలుసుకొని వేములవాడకు వచ్చి ఆమెను వెతుకుతాడు. చివరకు కూతురు నిర్మల ద్వారా అన్నపూర్ణను కలుసుకొని చేసిన పనికి పశ్చాత్తాపాన్ని ప్రకటిస్తాడు.

మానవ జీవితాన్ని సంపూర్ణంగా దర్శించడానికి నవలాకారుడికి ఉన్నంత అవకాశం ఓ మహర్షికి గాని, ఓ శాస్త్రజ్ఞుడికి కాని, తాత్వికుడుకి కాని, ఓ కవికి కాని లేదని లారెన్స్ అంటాడు. సమాజం- సాహిత్యం రెండూ సన్నిహిత సంబంధం లేకుండా ఉండవు. కవి కాని, రచయిత కాని సమాజంలోని వాడే కాబట్టి తాను రచించే రచనల్లో ఏ కొద్దిగానైనా సంఘ పరమైన విషయాలు చోటు చేసుకోక తప్పదు. ఉత్తమ రచయిత తాను పొందిన అనుభూతులకు స్పందించి సాహిత్య సృష్టి చేస్తాడు. అందుకే విమర్శకులు సాహిత్యానికి కావలసిన ముడి సరుకు సమాజంలోనే లభిస్తుందని అన్నారు. సమాజ దర్పణంగా ఉండే సాహిత్యమే పది కాలాల పాటు నిలుస్తుందని చెప్పవచ్చు. నవలలో సమాజ చిత్రణను పరిశీలన చేస్తాను.

సమష్టి కుటుంబ విధానం హిందూ సంప్రదాయంలో ఒక భాగం. ఒకే గార్హస్థ్యాన్ని అర్చిస్తూ, ఒకే విధమైన కర్మలను అనుసరిస్తూ ఉమ్మడి ఆస్తిని అనుభవిస్తూ కొనసాగించే సామూహిక జీవనం ఉమ్మడి కుటుంబం. ఈ వ్యవస్థ ఉన్నతమైనదైనా అందులోను కుటుంబ సభ్యుల మధ్య ఉండేది పరస్పర అవగాహన, ప్రేమ, అనుబంధాల వల్ల వారి మధ్య మనస్పర్ధలు రాకుండా ఉండటానికి అవకాశం ఉంది. ఇటువంటి కుటుంబాలే సమాజ నిర్మాణానికి ఆధారాలు. ఏ సమాజంలో కుటుంబ సభ్యులు తమ విధులను నిర్వర్తించకుండా ఉంటారో ఆ సమాజం నిర్వీర్యమవుతుంది. కుటుంబం సంస్కారవంతంగా ఉన్నప్పుడే సమాజం పురోగమనం సాధిస్తుంది. ఒక కుటుంబం యొక్క సంస్కారం ఆ కుటుంబంలో ఉండే విద్యావంతులైన సభ్యుల మీద ఆధారపడి ఉంటుంది.

'ఆమె వితంతువు కాదు' నవలలో సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో భాగంగా రచయిత పాపారావు కుటుంబాన్ని చిత్రించారు. ఇతడు వ్యవసాయదారుడు. కష్టపడి చక్కని పంటలు పండించేవాడు. సోదరుడు పార్థసారధి చదువుకున్న విద్యావంతుడు. నిజామాబాదులో ప్రభుత్వ ఉద్యోగం చేసేవాడు. అతని తల్లి దుర్గమ్మ సగటు అత్తగారిగా కుటుంబం మీద పెత్తనం చలాయించడం కనిపిస్తుంది. పాపారావుకు, తల్లికి ఇద్దరికీ కల్లు తాగే అలవాటు ఉంది. క్రమంగా అది వ్యసనంగా మారి ఒక్కరోజు కూడా తాగకుండా ఉండలేని పరిస్థితి ఏర్పడింది. అత్తగారిని కల్లు తాగడం మానుకోమని, తాగడం వల్ల శరీరం, మనస్సు, గౌరవం చెడిపోతాయని కోడలు సున్నితంగా మందలించేది. కాని ఆమె మాటలను లెక్కచేసేది కాదు.

తాగడానికి డబ్బులేనప్పుడు కోడలును అడిగేది. ఆమె ఇవ్వనప్పుడు కొడుకుతో చెప్పి తిట్టించేది. ఇంటి అద్దెతో వచ్చిన డబ్బును సైతం తాగడానికి వెచ్చించేది. ఆమె కోడలు సందుగను పగులగొట్టి దొంగతనంగా డబ్బు తీసుకొని తాగిన విషయం గమనించిన కోడలు అత్తగారిని నిలదీసింది. ఇద్దరి మధ్య జరిగిన గొడవతో అత్త కోపాన్ని మనసులో పెట్టుకొని కొడుకుతో చెప్పేది ఈరోజు నామీద దొంగతనం మోపింది, రేపు నిన్ను కూడా దొంగగా

భావించవచ్చు అని రెచ్చగొట్టింది. అతడు తాగిన మైకంలో భార్యను మూర్ఛపోయేలా కొడుతాడు. తాగుడుకు బానిస కావడం వల్ల కుటుంబంలో కలహాలు చెలరేగడమే కాకుండా ఒళ్లు గుల్ల కావడం కూడా జరుగుతుంది.

కుటుంబంలో భార్యాభర్తలు అన్యోన్యంగా కలిసి మెలిసి ఉన్నప్పుడు ఆనందం వెల్లివిరుస్తుంది.'గృహమే కదా స్వర్గసీమ' అంటారు పెద్దలు. వారి మధ్య మనస్పర్ధలు వచ్చినప్పుడు ఆ కుటుంబం చిన్నాభిన్న మతుంది. ఈ నవలలో అటువంటి పరిస్థితులు పాపారావు అన్నపూర్ణ దంపతుల మధ్య రచయిత చిత్రించారు. చిన్న పాటి అనుమాన బీజం వట వృక్షమై జీవితాలను కాల్చి వేసింది. భార్యాభర్తల మధ్య అత్తగారు తలదూర్చి సమస్యను మరింత జటిలం చేయడం జరిగింది. పాపా రావు ఇంట్లో అద్దెకున్న రవిచంద్రకు అనారోగ్య కారణాల వల్ల నీరసపడిపోతే అన్నపూర్ణ దయాగుణంతో అతనికి పాలు తాగించినందున ఆమె భర్త చూసి అనుమాన పడుతాడు. అతని తల్లి దాన్ని మరింత పెద్దది చేసి అగ్నికి ఆజ్యం పోసినట్టు కోపంతో 'పెండ్లాము పరాయి మగవాని దగ్గరకు పోతే చూసి ఊరుకుంటా వటరా' అంటూ కోపంతో అగ్గి రాజేసింది. దాంతో అతడు కోపంతో ఆమెను చంపడానికి సైతం ప్రయత్నించాడు. ఒంటరిదైన అన్నపూర్ణ జీవితంలో ఎన్నో కష్టాలను అనుభవించింది. అన్నపూర్ణ భర్తను పోగొట్టుకొని, ఒంటరిదై అందరికీ దూరమై కడుపులో బిడ్డను మోస్తు ఎన్నో కష్టాలను అనుభ వించింది. ఆమె ఎంతో మంది దగ్గర చిన్నచిన్న పనులు చేసింది. విష్ణుప్రసాద్ ఇంట్లో పనిచేసినప్పుడు అతని బావమరిది ఆమె మీద కన్నువేసి పొందాలని ఆశించి భంగపడుతాడు. అన్నపూర్ణకు అతని బావకు అక్రమ సంబంధం ఉందని ఇంట్లో అందరిని నమ్మించి బయటకు వెళ్లగొట్టి అక్కడ ఆమెను పొందాలని ప్రయత్నించాడు. అదీ తీరలేదు. నాగభూషణం ఇంట్లో కూడా అతని భార్య కానుపు కోసం పుట్టినింటికి వెళ్లగా అదను చూసి అన్నపూర్ణ వద్దకు వచ్చి కోరిక తీర్చుమని అడుగుతాడు. ఆమె చాకచక్యంతో అతన్ని ఇంట్లో పెట్టి తలుపులు వేసి బయటపడింది. ఒక బిచ్చగాడు సైతం ఆమెను వెంబడించి వేధించాడు.

సమాజంలో ఒంటరిదైన స్త్రీల పట్ల మగవానికి చిన్న చూపు. తన అవసరాలు తీర్చుకోవడానికి అవకాశం కోసం ఎదురుచూస్తాడు. అసలే కుటుంబానికి దూరమైన ఆమె మానసిక స్థితిని తెలుసుకొని సహాయం చేయాలనే మానవత్వం వారిలో కనిపించదు. ఆమె కూడా ఒక ఇంటి చెల్లెలే అన్న భావన ఉండదు. అటువంటి పరిస్థితి తన ఇంటి మహిళకు వస్తే అని ఒక్కసారి కూడా ఆలోచిం చడు. చిన్నతనం నుండి తల్లిదండ్రులు కూడా ఆడ పిల్లలకు ధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని నూరిపోయాలి. సమాజంలో స్త్రీ శారీరకంగా బలహీనురాలు కావచ్చు, కాని మానసికంగా ఎంతో ధైర్యాన్నికలిగి ఉంటుంది. ఐతే మగవాని దృష్టి కోణం మారినప్పుడే సమాజంలో స్త్రీలకు రక్షణ లభిస్తుంది.

భారతీయ సమాజంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు ఉన్నాయి. వాటి ఆధారంగానే కులాలు, వృత్తులు ఏర్పడినవి. గ్రామీణ జీవనంలో ప్రజలు వారి కులాలను అనుసరించి వృత్తులు ఏర్పాటు చేసుకున్నారు. నవలలో పాపారావుకు ప్రత్యేకమైన కులంపేరు సూచించకపోయినా పాపారావు, రంగారావు అన్న పేర్లను బట్టి ఉన్నతవర్గంగా చెప్పబడే వెలమ కులానికి చెందిన వారుగా భావించవచ్చు. వారి వృత్తి వ్యవసాయం. పాపారావుకు చెందిన రెండెకరాల వ్యవసాయ భూమిలో చక్కని పంటలు కుటుంబ అవసరాలకు తగినంత పండించినట్లు తెలుస్తుంది. అలాగే రంగారావు కూడా పదెకరాల వ్యవసాయ భూమిలో మొదట స్వయంగా పంటలు పండించాడు. తర్వాత కౌలుకిచ్చి రైతులతో పంటలు పండించేవాడని తెలుస్తుంది. ఆనాటి కాలంలో ఎవరి వృత్తులను వారే స్వీకరించేవారు. ఇతర వృత్తులను చేసి పొట్ట పోసుకోవడం చిన్నతనంగా భావించేవారు. పాపారావు భార్య సావిత్రి ఇంటికి వెళ్లి మేర (బట్టలు

కుట్టడం) పనులు నేర్చుకునేది. కొద్ది రోజుల్లోనే తగిన మెలకువలు నేర్చి రకరకాల బట్టలు కుట్టి సొమ్మును సంపాదించింది. కాని పాపారావు మేరపని చేయడం చిన్నతనమని, వంశ గౌరవానికి అపకీర్తి వస్తుందని భార్యను మందలించాడు. కాని అతడు తన కనీసావ సరాలు తీర్చక పోవడం వల్ల అన్నపూర్ణ ఆ పని మాను కోలేదు. చివరకు అతడు తీవ్రంగా మందలించి, కొట్టి ఆ పని మానిపించాడు. ఐతే భర్తకు దూరమైన సమయంలో ఆ మేరపని ఆమెకు తన పిల్లలను పెంచి పోషించు కోవడానికి మంచి సాధనంగా ఉపయోగపడింది. మనం బాగా ఆలోచించినపుడు సమాజంలో ఒక వృత్తి ఉన్నత మైనదనీ, మరో వృత్తి నీచమైనదనీ చెప్పడానికి వీలులేదని తెలుస్తున్నది.

వివాహ వ్యవస్థ మానవ సంస్కృతీ, నాగరికతల పరి ణామ క్రమంలో మంచి పరిణామం. సమాజ ఆరోగ్యానికి అవసరమై రూపొందించుకున్న వ్యవస్థే వివాహం. నవలలో భర్త చనిపోయిన స్త్రీలు మరో పెళ్లి చేసుకోవాలన్న ఆలోచన దాదాపుగా వారిలో కనిపించదు. వారు తన పిల్లల తోడిదే లోకం అనుకుంటారు. వారిని పెంచి పోషించడంలోనే ఆనందాన్ని వెతుక్కుంటారు. కాని మరో పెళ్లి చేసుకొని భర్తతో ఆనందంగా జీవించాలనే ఆరాటం వారిలో కనిపించదు. అందుకే 'ఏనుగంత తండ్రి పోయినా ఏకుల గుళ్లంత తల్లి బ్రతికి ఉండాలని' అంటారు పెద్దలు. అన్నపూర్ణ భర్త చనిపోయిన తర్వాత తన పిల్లలను పెంచి పోషించుటకు అష్టకష్టాలు పడింది. వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి అనుక్షణం తపన పడింది. పుట్టింటి, అత్తింటి వారి అండదండలు, ఉన్నత విద్యాభ్యాసం లేకపోయినా విచక్షణతో, సమయస్ఫూర్తితో జీవితంలో కష్టాలను దాటుకుంటూ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకున్నది.

సమాజంలో వితంతువులను హీనంగా చూసేవారు. వారిని బయటివారే కాదు, ఇంట్లోవారు కూడా అన్ని పనులకు దూరంగా ఉంచేవారు. శుభ కార్యాలకు దూరంగా ఉంచేవారు. అన్నిరకాల అలంకారాలకు దూరం చేసేవారు. కఠిన నియమాలను అనగా కడుపునిండా తిండి కూడా తిననిచ్చేవారు కాదు. కఠినమైన నేల మీదే పడుకోవాలి. కోరికలను అణచుకోవాలి. పాపారావు తన భార్య ద్రోహం చేసి పర పురుషుడితో అక్రమ సంబంధం పెట్టుకున్నదని భావించి తను చనిపోయినట్లుగా అందరిని నమ్మించి తన భార్య విధవగా బ్రతకాలని, తద్వారా సమాజంలో ఎన్నో కష్టాలను అనుభవించాలని కోరుకోవడం అతని నీచమైన మనస్తత్వాన్ని తెలుపుతుంది.

నవలలో స్త్రీలు వేశ్యావృత్తిని అవలంభించి డబ్బు సంపాదించడం చూడవచ్చు. పేదరికం, తప్పనిసరి పరిస్థితుల కారణంగా కుటుంబ పోషణకు వేశ్యలు పర పురుషులను సంతోష పరిచి తద్వారా వచ్చిన సొమ్ముతో అవసరాలను తీర్చుకునేవారు. పెద్దపల్లిలో అన్నపూర్ణకు ఆశ్రయం ఇచ్చిన ముసలమ్మ ఎంతో కాలంగా ఇదే వృత్తిలోనే జీవించడం చూడవచ్చును. తర్వాత కూతురును కూడా ఈ వృత్తిలోకి దింపింది. ఆమెకు ఇష్టం లేకపోయినా తప్పదని దానిని కొనసాగించాలని బ్రతిమిలాడుతుంది. అన్నపూర్ణ ఒంటరితనాన్ని, పేదరికాన్ని గమనించిన ముసలమ్మ ఆమె వివరాలను తెలుసుకొని తన ఇంటిలో ఆశ్రయం ఇచ్చింది. ఆమె ప్రసవించిన తర్వాత కొంత కాలానికి వేశ్యావృత్తిలోకి దింపి డబ్బు సంపాదించాలని పథకం వేసింది. ఆమె కూతురు పెరిగి పెద్దయిన తర్వాత దాన్ని ఇదే వృత్తిలోకి దింపడానికి ప్రయత్నించడం, వారి పథకాన్ని పసిగట్టిన అన్నపూర్ణ ఇంట్లో నుండి పారి పోవడం జరిగింది. పేదరికం వంటి పరిస్థితులు ఈ సమస్యకు ప్రధాన కారణం అని అర్థం అవుతున్నది.

ఈ విధంగా నవలలో సామాజిక చిత్రణలో భాగంగా కుటుంబ వ్యవస్థ, కుటుంబ సభ్యుల మధ్య అను మానాలు, అపార్థాలు, వృత్తుల పట్ల వారికి గల అభి మానం, స్త్రీలకు పునర్వివాహాల పట్ల ఆసక్తి లేకపోవటం, సమాజంలో వేశ్యావృత్తితో జీవనం గడిపే స్త్రీల తీరు తెన్నులు వంటి విషయాలను ఈ వ్యాసంలో పరిశీలించి విశ్లేషించటం జరిగినది.

ఆధార గ్రంథాలు :

1. ఆమె వితంతువుకాదు నవల- రేగులపాటి కిషన్‌రావు, విజయలక్ష్మీ ప్రచురణలు, కరీంనగర్, 1976.
2. తెలుగు వైజ్ఞానిక మాస పత్రిక, తెలుగు అకాడమీ ప్రచురణ, మే 1987.
3. సాహిత్య వ్యాసాలు- నవీన్, ప్రత్యూష ప్రచురణలు, 2001.
4. అంధకారంలో నవల - రంగనాయకమ్మ, స్వీట్‌హోమ్ పబ్లికేషన్స్, హైదరాబదు, 2015.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పరిశోధనలకు దశ-దిశల్ని నిర్దేశించిన ఖండవల్లి లక్ష్మీరంజనం

- కిరణ్మయి

ఉస్మానియా తెలుగు శాఖలో ఎందరో ఉద్దండులు, మహానుభావులు ఆచార్యులుగా పనిచేశారు. ఖండవల్లి లక్ష్మీరంజనం, దివాకర్ల వేంకటావధాని, సినారె, పల్లా దుర్గయ్య, పాటిబండ మాధవ శర్మ, బిరుదురాజు రామరావు. మొదలైన వారు ప్రతిభావంతులే కాక నాయని కృష్ణకుమారి, యశోదారెడ్డి ప్రభృతులు విజ్ఞాన బీజాలు నాటారు. కాలం మారింది. విలువలూ మారుతున్నాయి. పల్లెల్లోని ఎందరో యువ కిషోరాలు ఉన్నత విద్యలోకి తరలివస్తున్నారు. వీరందరికీ వెనకా ముందు బంగారు భవిష్యత్తు తప్పకుండా ఉంటుంది. వీరిలో మొదట పరిశోధన నిర్మాణానికి పునాదులు వేసిన ఖండవల్లి లక్ష్మీరంజనం గారికి అగ్రతాంబులం ఇవ్వాలి. వారి పరిశోధలను వివరించడం ఈ వ్యాస ఉద్దేశ్యం.

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ద్వితీయ అధ్యక్షులైన ఖండవల్లి తననుతాను అద్వితీయ అధిపతిగా నిరూపించుకున్నారు. విభాగం యావత్తూ నిత్య చైతన్యంతో ఉండేందుకు తోడ్పడ్డారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో పరిశోధనలకు ప్రాణం పోశారు. ఈ పరిశోధనలు ప్రయోజనకరంగా, ప్రణాళికాబద్ధంగా ఉండేందుకు అవసరమైన పథక రచన చేశారు. స్నాతకోత్తర విద్యార్థుల్లోనూ పరిశోధనా జిజ్ఞాస పెంపొందేందుకు తోడ్పడ్డారు. ఆయన తెలుగు విభాగాధ్యక్షులుగా ఉన్న సమయంలో ఎన్నెన్నో వినూత్న బోధనారీతులు, శోధనా మార్గాలు నిర్మాణం అయ్యాయి. ఖండవల్లి లక్ష్మీరంజనం గారి పర్యవేక్షణలో మహాభారత సంశోధన ప్రతిని సంసిద్ధం చేసి, ఒక్కొక్కటి వేయి పుటల సంపుటంగా అందించి, పరిష్కరణకూ పరిశోధనకు మార్గదర్శనం చేసిన ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగుశాఖ కృషి అనితర సాధ్యమైంది.

ఉత్తమ వ్యక్తిత్వం ఖండవల్లి జీవితం నేటి తరానికి నూ్ఫర్తిదాయకం. పండితుడు, పరిశోధకుడు, సహృదయుడు, కార్యదక్షుడు ఇట్లా అనేక ఉత్తమ లక్షణాలు ఆయన వ్యక్తిత్వంలో సమపాళ్లల్లో మిళిత మయ్యాయనిపిస్తుంది. ఖండవల్లి వారిపేరు చెప్పగానే కళ్లుమూసుకుని భక్తితో స్మరించుకునే విద్వాంసులు నేటికీ ఉన్నారు. ఖండవల్లి చక్కని పరిశోధకులు విమర్శకులు. ఆయన కాలంలో మల్లంపల్లి సోమశేఖర శర్మ, సురవరం ప్రతాపరెడ్డి, వేటూరి ప్రభాకరశాస్త్రి వంటి గొప్ప పరిశోధకులు ఉన్నారు. వాళ్ళు విశిష్టమైన పరిశోధనా ఫలితాన్ని తన విలక్షణమైన విశ్లేషణలతో కూర్చి తెలుగువారికి అవసరమైన సామాజిక సాంస్కృతిక చరిత్రను రచించిన విద్వాంసులు లక్ష్మీరంజనం. ఇందుకు ఆయన రచించిన 'ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి' చక్కని తార్కాణం. ఇది ఎప్పుడో 1950లలో ఉస్మానియా విశ్వవిద్యాలయం స్నాతక (డిగ్రీ) స్థాయి విద్యార్థుల కోసం రచించబడినది. ఈ పుస్తకం కేవలం మూడు నెలల వ్యవధిలో వెలువడిన ప్రామాణిక పరిశోధనా గ్రంథమిది. దీన్ని ఆ రోజుల్లో డిగ్రీ 'ద్వితీయ భాష' పాఠ్యగ్రంథంగా నిర్ణయించారు. అప్పటి నుంచి నిన్నమొన్నటి వరకు ఈ పుస్తకం పలు ముద్రణల్ని పొందింది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌వారు నిర్వహించే పలు పరీక్షలకు సిద్ధమవుతున్న ఎంతోమంది అభ్యర్థులకు ఖండవల్లి రచన నిత్యపఠనీయ గ్రంథంగా భాసిస్తోంది. 'ఆంధ్ర సాహిత్య చరిత్ర-సంగ్రహం' విద్యార్థుల కోసం ఉద్దేశించిన రచనే అయినా విద్వాంసులకు సైతం ఆధారగ్రంథంగా మారింది. అట్లాగే కాకతీయులపై రచించిన చిన్న పుస్తకం, లక్ష్మీరంజన వ్యాసావళి అనే రచనలు వర్ధమాన పరిశోధకులకు, వికసిస్తున్న విమర్శకులకూ ఆదర్శ రచనలుగా నిలబడ్డాయి. 'పరిశోధన అన్నది సామాజిక

ప్రయోజనాన్ని కలిగించాల'నే కొమర్రాజు వంటి మహనీయులు ప్రతిపాదించినారు. ఈ అంశం లక్ష్మీరంజనం రచనల్లో పుష్కలంగా కనబడుతుంది. ఆయన రచనలన్నీ సారస్వతరంగానికి ఇతోధికంగా ఉపకరించాయి. ఇప్పటికీ పరిశోధన గ్రంథాలుగా ఉపయోగపడుతున్నాయి.

ఆచార్య బి.రామరాజు వంటి సుప్రసిద్ధ పరిశోధకులు తన ప్రగతికి లక్ష్మీరంజనం ప్రోత్సాహమే కారణమని ప్రకటించారు. సుప్రసిద్ధ కవి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత ఆచార్య సి.నారాయణరెడ్డి, ప్రముఖ విద్వాంసులు ఆచార్య నాయని కృష్ణకుమారి, పల్లా దుర్గయ్య, వేటూరి ఆనందమూర్తి, అమరేశం రాజేశ్వరశర్మ, అరిపిరాల విశ్వం, కె.గోపాలకృష్ణారావు, ఎం.కులశేఖరరావు, ఇరివెంటి కృష్ణమూర్తి, పి.వరవరరావు, ముదిగొండ వీరభద్రయ్య, కోవెల సుప్రసన్నాచార్యులు ఇంకా ఎంతోమంది ప్రముఖులు ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం శిష్యులే. ఖండవల్లి జీవితం నేటితరానికి స్ఫూర్తినిస్తుందని చెప్పవచ్చు. ఖండవల్లి వారితో సుప్రసిద్ధ కవి, బోయి భీమన్న, ప్రముఖ సాంస్కృతికోద్యమ నిర్మాత దేవులపల్లి రామానుజరావు, విఖ్యాత పరిశోధకులు ఆదిరాజు వీరభద్రరావులతో అన్యోన్యమైన మైత్రి ఉండేది. మాడపాటి హనుమంతరావును తన సాంస్కృతిక జీవితంలో మార్గదర్శిగా ఖండవల్లి భావించారు. మాడపాటి వ్యక్తిత్వ ప్రభావం ఖండవల్లిపై బలంగా ఉంది. ప్రసిద్ధ శాసన పరిశోధకులు బి.ఎస్.శాస్త్రి కొన్ని సందేహాల్ని నివృత్తి చేసుకునేందుకు ఖండవల్లిని కలుసుకునే వారు. ఇట్లా ఆయనకు బాగా సన్నిహితులయ్యారు. నిర్మొహమాటంగా మాట్లాడటం లక్ష్మీరంజనం పద్ధతి. అందుకే ఆయన శిష్యుడు ఆచార్య సి.నారాయణరెడ్డి 'నిప్పులాంటి నిజాయితిని గుప్పించుటయందే కాని అతని హృదయ వ్యాకరణమున పురుషములు లేవు' అని ప్రశంసించారు.

ఖండవల్లి వారు తెలుగు శాఖాధ్యక్ష బాధ్యతల్ని స్వీకరించిన తర్వాత పరిస్థితుల్లో మార్పులు ఆరంభమయ్యాయి. భాగ్యనగర సాంస్కృతిక ప్రముఖులైన సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, ఆదిరాజు వీరభద్రరావు, దేవులపల్లి రామానుజరావు, తణికెళ్ళ వీరభద్రుడు వంటివారితో లక్ష్మీరంజనం అత్యంత ఆత్మీయమైన అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు. ఈ పరిచయాలు తెలుగుశాఖ అంతకంతకూ వికసించేందుకు చక్కగా దోహదం చేశాయి. ఖండవల్లి అధ్యక్షులుగా ఉన్న కాలంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అనూహ్యమైన ఆరోహణాపర్వాన్ని నిర్మించుకున్నది. "కల్పవృక్షాన్ని అమృతంతో రంగరిస్తే నాకు ఏదో ఒక ఆకారం తటిల్లతవలె భాసిస్తుంది. ఆ అక్షరమూర్తియే పూజ్యగురువర్యులు ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు అని ఆచార్య కె.గోపాలకృష్ణ రావు ఒక వ్యాసంలో రాశారు.

తెలుగు శాఖాధ్యక్షులుగా ఉన్న కాలంలో నిజంగానే పని ఒత్తిడి ఉంది. పైగా అది విభాగం విస్తరిస్తున్న దశ. అందువల్ల అధ్యక్షుడి కార్యభాగం మరింత అధికమవడం సహజం. ఈ పరిస్థితుల్లోనూ విద్యార్థుల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు లక్ష్మీరంజనం చొరవ చూపేవారు. తెలుగు విభాగంలో సర్వసమన్వయ సంస్కృతిని ఆయన ప్రవేశపెట్టారు. అందరినీ కలిపి మునుముందుకు సాగడమే ఈ విధానం. తెలుగు విభాగానికి వచ్చిన విద్యార్థులు, పరిశోధన విద్యార్థులు తప్పనిరిగా తనను దర్శించుకొని వెళ్ళాలనే భేషజాన్ని ఆయన ఏనాడూ ప్రదర్శించలేదు. విషయ పరిజ్ఞానం లేకుండా కేవలం అతివినయ ఆశ్రయ గుణంతో బతుకును సాగించాలనుకునే పండితులను దూరంగానే ఉంచేవారు. వారికి ఖండవల్లి నుంచి పిసరంత ప్రోత్సాహం సైతం దక్కకపోయేది. అసలే మాత్రం ఆధారం లేని విద్యార్థులకు ఆయన గాడ్‌ఫాదర్‌వలె వ్యవహరించేవారు. విద్యార్థులు స్నాతకోత్తర స్థాయిలో ఉన్నప్పటి నుండే వివిధ సాహిత్య సమావేశాలలో పాల్గొనాలని, ప్రసంగించాలని, లక్ష్మీరంజనం గట్టిగా కోరుకునేవారు. విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అధిపతిగా పనిచేసిన సుప్రసిద్ధ

పరిశోధకులు ఆచార్య బిరుదురాజు రామరాజువంటి వారు కూడా 'తెలుగు సాహిత్యానికి నేను చేసిందేమైనా ఉంటే అది కేవలం గురుదేవులు ఖండవల్లి వారి చలువ' అని వినయంగా ప్రకటించుకున్నారు.

"తెలుగు శాఖాధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన నిమిషం నుంచి పదవీ విరమణ చేసే క్షణం వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలో ఎన్నో నిర్మాణాత్మక కార్య క్రమాల్ని లక్ష్మీరంజనం ఆరంభించారు. తాను ఆరంభిం చిన కార్యక్రమాల్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి అయ్యేనాటికి తెలుగు బోధనాభ్యసన అస్తిత్వాలు దాదాపు నామమాత్ర స్థాయిలో ఉన్నాయి. 1940వ దశకంలో ఉ స్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో 'దీనియాయిత్' (మత బోధన) అనే ఒక బోధనాంశం డిగ్రీ స్థాయిలో ఉండేది. ఇందులో మత సంప్రదాయానికి సంబంధించిన అంశాలు ఉంటాయి. 'ఎథిక్స్'కు సంబంధించి అంశాల్ని బోధించేవారు. ఈ అంశానికి బదులుగా స్నాతకస్థాయి విద్యార్థులకు అనివార్య రీతిలో ప్రాంతీయ భాషలు బోధించాలని ఖండవల్లి సూచించారు. ఈ విషయంలో గట్టి పట్టుదలతో వ్యవహరించారు.

నాటి హైదరాబాద్ సంస్థానంలో ఉర్దూ, తెలుగు, మరాఠీ, కన్నడ భాషా వ్యవహర్తల సంఖ్య పుష్కలంగా ఉండేది. ఖండవల్లి సూచించినట్లు ద్వితీయ భాషను అనివార్యంగా ప్రవేశపెట్టినట్లయితే ఈ భాషలన్నిటిపైనా మరింత కాంతి పడుతుంది. అందులోనూ సంఖ్యాధిక్యత కారణంగా తెలుగు వైభవం మరింతగా పెరుగుతుంది. అయితే లక్ష్మీరంజనం సంకల్పానికి అనేక అవరోధాలు ఎదురయ్యాయి. ఉన్నత విద్యారంగంపై ఏర్పాటైన ఆచార్య రాధాకృష్ణన్ కమిషన్ ముందు ఖండవల్లి తన అభిప్రాయాల్ని తొలుత వెల్లడించారు. తన సూచన కార్యరూపంలోకి వచ్చేందుకు నాటి ప్రముఖ నాయకుడు, సాహిత్యాభిమానీ నూకల నరోత్తమరెడ్డి, సాహితీవేత్త దేవులపల్లి రామానుజరావు, మేధావి రావాడ సత్య నారాయణల సహకారాన్ని తీసుకున్నారు. ద్వితీయ భాష విషయంలో గోలకొండ, ఆంధ్రపత్రికలు తమ సానుకూల వాణిని వినిపించాయి. అయితే, అప్పటి ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ అలీవర్‌యార్ జంగ్‌కు ఇది రుచించలేదు. ద్వితీయ భాష అనే అంశం మీద ఖండవల్లి లక్ష్మీరంజనం ఆచార్య రాధాకృష్ణన్‌ను కలుసు కున్నారనే కోపం కూడా అలీవర్‌యార్ జంగ్‌లో ఉండేది. అందరిముందూ ఆయనను 'Language Fanatic' అని జంగ్ విమర్శించారు. అయినప్పటికీ కార్యసాధకులైన ఖండవల్లి తన పట్టుదలను విడిచిపెట్టలేదు.

'తెలుగును కనుక మీరు ద్వితీయ భాషగా అంగీకరించకపోతే, విశ్వవిద్యాలయం ముందు సత్యా గ్రహం చేస్తా'నని అలీవర్‌యార్ జంగ్‌తో చెప్పారాయన. అప్పట్లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రముఖులైన సత్యనారాయణ సింగ్, ఎన్.వి.నుబ్బారావు, రావాడ సత్యనారాయణ వంటి మిత్రుల అండదండల్ని ఖండవల్లి అందుకున్నారు. వీరు అలీవర్‌యార్ జంగ్‌తో మాట్లాడారు. ద్వితీయ భాష విషయంలో ఆయన ఆగ్రహాన్ని తగ్గించారు. ద్వితీయ భాషకు జంగ్ అంగీకారం లభించింది. పరీక్షా పథకం ప్రకారం రెండు సంవత్సరాలలో రెండు ద్వితీయ భాషకు జంగ్ అంగీకారం లభించింది. పరీక్షా పథకం ప్రకారం రెండు సంవత్సరాలలో రెండు ద్వితీయ భాష పేపర్లు ఉంటాయి. ప్రతి పేపరుకు వందమార్కులు. ఇందులో ఒక పేపరు సాహిత్యానికి పరిమితమవుతుంది. మరొకటి తెలుగువారి చరిత్ర, సంస్కృతులకు సంబంధిం చింది. ఈ పేపరుకు అవసరమైన పాఠ్యాంశాల కోసమే ఖండవల్లి మూడు నెలల కాల వ్యవధిలోనే తన సోదరుడు ఖండవల్లి బాలేందు శేఖరంతో కలసి 'ఆంధ్రుల చరిత్ర సంస్కృతి' అనే గ్రంథాన్ని రచించారు. 'అధ్యాపనాన్ని క్రోడీకరించి రచించిన గ్రంథంగా' ఆచార్య బిరుదురాజు రామరాజు ఈ పుస్తకాన్ని గురించి వ్యాఖ్యానించారు. అలీవర్‌యార్ జంగ్ వైస్ ఛాన్స్‌లర్‌గా ఉన్నకాలంలో కేవలం బి.ఎ. విద్యార్థులకు మాత్రమే ద్వితీయభాష పేపర్

ఉండేది. సూరి భగవంతం వి.సి. అయిన తర్వాత ద్వితీయభాష పేపర్‌ను బి.కాం. బి.ఎస్సీ. విద్యార్థులకు సైతం వర్తించేలా చేశారు.

నాడు గట్టిపట్టుదలతో లక్ష్మీరంజనం సాగించిన కృషి నిజంగానే భగీరథ ప్రయత్నం. ఎట్టకేలకు ఆయన ప్రయత్నం ఫలించింది. ఈ కృషి ఫలితంగా ద్వితీయ భాషగా తెలుగు ప్రాభవం అంతకంతకూ విస్తరించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో చదువుకునే విద్యార్థులు ఎక్కువమంది తెలుగును ద్వితీయభాషగా ఎంపిక చేసుకున్నారు. పర్యవసానంగా తెలుగు అధ్యాపకుల సంఖ్య పెరగవలసిన పరిస్థితి ఏర్పడింది. తెలుగు అధ్యాపనం ద్వారా ఉపాధి పొందేవారి సంఖ్య పెరిగింది. దీనితో తెలుగు అధ్యయనం చేసే స్నాతకోత్తర స్థాయి విద్యార్థుల సంఖ్య కూడా పెరిగింది. ఇలా లక్ష్మీరంజనం సంకల్పం ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో తెలుగుదనాన్ని పెంపొందించేందుకు ఎంతో తోడ్పడింది. ఈ రకమైన ఉత్సాహభరిత వాతావరణం కారణంగా పరిశోధనలు ఆరంభించేందుకు అవసరమైన ప్రోత్సాహకాలు లభించాయి.

సాహిత్యజిజ్ఞాస పెంపొందేందుకు, పరిశోధనా కాంక్ష అంకురించేందుకు, అభిరుచి కలిగిన అంశాల పట్ల భవిష్యత్తులో ప్రత్యేక అధ్యయనం చేసేందుకు విద్యార్థులకు ఒక అవకాశం లభించాలని ఖండవల్లి కోరుకున్నారు. అందుకోసం 'సెమినార్' పద్ధతిని ప్రవేశపెట్టారు. ఆయన నేతృత్వం వహించిన కాలంలో తీసుకున్న అత్యంత కీలక నిర్ణయాల్లో సెమినార్ పద్ధతికి శ్రీకారం ఒకటని ఎందరో ఆచార్యులు అభిప్రాయపడ్డారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ 1953వ సంవత్సరం నుంచి సెమినార్ పద్ధతికి శ్రీకారం చుట్టింది. సెమినార్ సంస్కృతిలో భాగంగా ఎం.ఎ. చదువుకున్న విద్యార్థులు, అధ్యాపకులు తమ పరిమిత పరిధిలో విద్యాగోష్ఠి ఏర్పాటు చేసుకునేవారు. ఈ గోష్ఠుల నేపథ్యంలో స్నాతకోత్తర స్థాయి విద్యార్థులు తమ నిర్ణీత శీర్షికలతో పరిశోధనా పత్రాల్ని రచించాలి. వీటిని ఆచార్యులు ముందు చదివి వినిపించాలి. విద్యాగోష్ఠుల వల్ల ఎంతో విలువైన ఫలితాలు లభించాయి. విద్యార్థులు పరిశోధనా కాంక్ష పెరిగింది. వారిలో సాహిత్య జిజ్ఞాస అధికమైంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పరిశోధనలకు నాందీగీతాన్ని పాడిన సందర్భంలో నాటి విద్యార్థుల పరిశోధనా కాంక్షలు, విజ్ఞాన జిజ్ఞాసలు మరోమారు వెలుగులోకి వచ్చాయి. సెమినార్ రోజుల్లో ఏర్పడిన పరిశోధనాభిరుచితో పలువురు పిహెచ్.డి. లో చేరడం అట్లా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు పరిశోధనలు విస్తరించడం క్రమ పరిణామరీతిలో సంభవించాయి. ఆంధ్ర మహాభారతం, శ్రీనాథ పద ప్రయోగకోశం, పోతన సాహిత్యం, దక్షిణాంధ్ర సాహిత్యం, ఆంధ్రుల చరిత్ర సంస్కృతి, తెలుగు నాటకాలు ఇట్లా వైవిధ్యభరితమైన శీర్షికలతో సెమినార్‌లు నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులే కాకుండా బయట నుంచి వచ్చిన ప్రముఖులు కూడా సెమినార్‌లు శ్రద్ధతో పరిశీలించారు. కాంగ్రెస్ చరిత్ర రచయిత, ప్రసిద్ధ మేధావి భోగరాజు పట్టాభి సీతారామయ్య తెలుగు నాటకాలను గురించి నిర్వహించిన సెమినార్‌కు విచ్చేశారు. సెమినార్‌ను ఆయనే ఆరంభించారు. శ్రీనాథ మహాకవి రచనల్ని విశ్లేషించుకునేందుకు ఏర్పాటు చేసిన సెమినార్ ప్రసంగ పత్రాలను ఆంధ్ర సారస్వత పరిషత్తు వారు 'శ్రీనాథ భారతి' పేరుతో ప్రచురించారు. నాటి విద్యాగోష్ఠుల్లో విద్యార్థులు రచించిన పరిశోధనా పత్రాలు అత్యంత ప్రామాణిక స్థాయిలో ఉండటం గొప్ప విశేషం. విద్యార్థులే ఎంతో శ్రమకోర్చి శ్రీనాథ పదప్రయోగ కోశాన్ని రూపొందించారు. దీనిని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురించింది. 'విద్యార్థులు పెద్దగా ఆడంబరంగా లేకుండా చేసిన పనులు ఇవి' అని ఖండవల్లిగారు చెప్పటం జరిగినది.

విద్యాగోష్ఠులు ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణానికి పరిమితం కారాదని ఖండవల్లి వారు నిశ్చ

యించారు. బయట వేదికలను కల్పించి, అక్కడ ప్రసంగించేందుకు విద్యార్థులకు అవకాశమివ్వాలని ఆయన భావించారు. ఇట్లా చేసినట్లయితే విద్యార్థుల్లో 'సభా భయం' పోతుందని ఆయన అభిప్రాయం. 1956 నుంచి విద్యాగోష్ఠులకు శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం కూడా వేదికగా మారింది. ఎందరెందరో విద్యార్థులు ఇందులో పాల్గొని ప్రసంగించేవారు. ఇక్కడ ప్రసంగించిన వారిలో పలువురు అనంతర కాలంలో విలక్షణ విమర్శకులుగా గుర్తింపును పొందారు. ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య ఇందుకు ఉదాహరణ. 1960లో 'అష్టదిగ్గజములు' నదస్సులో విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా పరిశోధనా పత్రాలు రచించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో 1951 నుంచి డిపార్ట్‌మెంట్ కాన్ఫరెన్సులు ఆరంభమయ్యాయి. డిపార్ట్‌మెంటల్ కాన్ఫరెన్సుల్లో బోర్డ్ ఆఫ్ స్టడీస్ తీసుకునే నిర్ణయాలను అకడమిక్ కౌన్సిల్‌కు పంపించేవారు. అప్పట్లో ద్రవిడ భాషాధ్యయాన్ని ఒక భాగంగా మార్చాలని డిపార్ట్‌మెంటల్ కాన్ఫరెన్సులో నిర్ణయించారు. ఎం.ఎ. తెలుగు చదువుతున్న విద్యార్థి కన్నడ, తమిళ, మళయాళాల్లో ఏదైనా ఒక భాషను ఐచ్ఛికంగా తీసుకునే పద్ధతిని ఆరంభించారు. ఖండవల్లి లక్ష్మీరంజనం సమర్థులైన నిర్వాహకులుగా విశ్వ విద్యాలయ శాఖాధ్యక్ష పదవికి ఒక హోదాను కల్పించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయ తెలుగు విభాగాలతో పాటు అన్యరాష్ట్రాల్లో తెలుగును బోధించే యూనివర్సిటీల్లో సైతం ప్రస్తుతం పిహెచ్.డి. పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే స్వాతంత్ర్య సాధన సమయంలో పరిశోధనలకు యూనివర్సిటీల్లో ఇంత విస్తారమైన అవకాశం లేదు. "తెలుగు పరిశోధనలు అనగానే అందరి దృష్టి మదరాసు విశ్వవిద్యాలయం వైపు మరలింది. తెలుగులో తొలి డాక్టరేట్ (చిలుకూరి నారాయణరావు)ను మద్రాసు విశ్వవిద్యాలయం ప్రదానం చేసిన వాస్తవం తెలిసిందే. ఇంకా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిశోధనా విభాగం అభివృద్ధి దశకు రాలేదు. ఈ సమయంలో ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగంలో పరిశోధనల కోసం పథక రచన చేశారు ఖండవల్లి. ఆయనకు పిహెచ్.డి. లేదు. అయితే అప్పటికే ఆయన 'ఆంధ్రసాహిత్య చరిత్ర సంగ్రహము' 'ఆంధ్రుల చరిత్ర సంస్కృతి' వంటి గొప్ప గ్రంథాలు రచించారు. నాటికే ఈ రెండు రచనలు యావతాంధ్రలో గుర్తింపును పొందాయి. బహుశా ఈ వాస్తవాన్ని చక్కగా గుర్తించి వాటి ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య సూరి భగవంతం ఖండవల్లికి పిహెచ్.డి. పరిశోధనలకు దశ-దిశల్ని నిర్దేశించిన ఘనత ఖండవల్లి వారికి దక్కుతుంది.

'ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ప్రారంభింపబడిన పరిశోధన ఒక ప్రణాళిక ననుసరించి సాగినట్టుగా సమీక్షకులకు తెలుస్తుంది. తెలుగులో సమగ్ర సాహిత్య చరిత్ర నిర్మింపబడాలని తెలుగు వారంతా కలలు కంటున్నారు. కాని దానికను బంధంగా భాషా చారిత్రక సాంస్కృతికాంశాల మీద కూడా పరిశోధన సాగవలె. ఆ అవకాశాన్ని గుర్తించి తెలుగు శాఖలో మొదటి పరిశోధనాంశాలను ఎంపిక చేయడంలో సాహిత్య ప్రక్రియలనూ యుగాలను దృష్టిలో పెట్టుకున్నట్టు కనబడుతుంది. జానపద సాహిత్యం, ప్రాఙ్నన్నయ యుగం, కవిత్రయ యుగం, శ్రీనాథయుగం, ప్రబంధ యుగం, దక్షిణాంధ్రయుగం, ఆధునిక యుగం, నాటక వాఙ్మయం, శతక వాఙ్మయం, నవలా సాహిత్యం ఇలా పరిశోధనాంశాలు ఇవ్వబడినాయి. ఆ తరువాత ప్రసిద్ధ కవుల కావ్యాల పరిశోధనం సాగింపబడింది. ఆ తరువాత నిర్దిష్టమైన అంశాలపై పరిశోధన సాగింపబడింది. చారిత్రక భాషా సాహిత్యాధ్యయనం అనుబంధంగా సాగింది. ఈ విభాగం, ఈ శాఖల్లో జరిగిన పరిశోధన ప్రణాళికను విశ్లేషణ దృష్టితో చూసినట్లతే, విమర్శకులకు అవగత మవుతుంది. ఈ విధమైన పరిశోధన ప్రణాళికలకు అంకురార్పణ చేసి రూపకల్పనం చేసిన గౌరవం ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారిదనటంలో సందేహం లేదు'.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు నవల్లలో గిరిజన సాంస్కృతికే అంశాలు

– యం. మహేంద్రనాయక్, పరిశోధక విద్యార్థి, యస్.వి. విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గిరిజనుల సాంస్కృతుల విభిన్న సంస్కృతుల మేలు కలయిక. సంస్కృతి అంటే ఆట, పాట, వేషం, నృత్యం లాంటివి అని పేర్కొన వచ్చును. స్థూలంగా ఒక జాతి పురోగమన విధానంగా పేర్కొనవచ్చు. శాస్త్రవేత్తలు మానవ జీవన పరిణామ క్రమంలో 3 దశలను గుర్తించారు. అవి 1) ఆరణ్య జీవన స్థితి, 2) అనాగరిక స్థితి, 3) నాగరిక స్థితి ఈ మూడు దశలు సంస్కృతి లేదా సాంస్కృతిక వికాంలో భాగమని మానవ శాస్త్రవేత్తల అభిప్రాయం. మొదటది గిరిజన సంస్కృతి గాను, రెండవది గ్రామీణా సంస్కృతి గానూ, మూడవది నాగరిక సంస్కృతి గానూ భావించవలసి ఉందని ఆర్.వి.ఎస్. సుందరం అభిప్రాయం.

ఒక జాతి పాటించే ఆచార సంప్రాదాయాలు ఆ జాతి సంస్కృతిని మూలధారాలు. అలాగే ఒక కులం లేదా జాతి సంస్కృతి గురించి తెలియచేయాలంటే వారి ఆచారాలు, సంప్రదాయాలు తెలుసుకోవడం చాలా అవసరం ఆచారాల్లని నియమ నిబంధనలను కూలకషంగా పరిశీలిస్తే వాటి వెనుక ఎన్నో సామాజిక, అధ్యాత్మిక, విజ్ఞాన శాస్త్ర విషయాలు దాగి ఉన్నాయనే సత్యం మనకు బోధపడుతుంది

నేడు గిరిజనుల సంస్కృతిలో కనిపించే అనేక అంశాలు నేను పరిశోధనకి ఎన్నుకున్న నవలల్లో చిత్రింపబడినాయి. గిరిజనుల అంశాలను కొన్ని నవలల్లో స్థూలంగాను, కొన్ని నవలల్లో విపులంగానూ చిత్రించబడ్డాయి. 661 గిరిజన తెగలు భారతదేశంలో మనుగడ సాగిస్తున్నాయి. అందులో 35 గిరిజన తెగలు ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ 35 తెగలు గుర్తించిన సంస్కృతి అంతగా వెలువడలేదు. కొన్ని తెగల జీవితాలు గురించి మాత్రమే సంస్కృతి అందుబాటులో వుంది. ఆ సంస్కృతి కూడా గిరిజనేతరులు వ్రాసినది మాత్రమే. గిరిజనులు తమ జీవితాలు గూర్చి, తమ సాధక బాధల గురించి చిత్రించుకోలేదు. ఈ పరిశోధనకు తీసుకున్న కొన్ని నవల్లో చిత్రించబడిన తెగలు లంబాడీలు (సుగాలీలు) గోండు, ఎరుకల, యానాది, కొండ, సవరలు, ఈ ఏడు గిరిజన తెగల గురించి మాత్రమే నవలలు వెలువబడ్డాయి. ఈ నవలల్లో గిరిజన జీవితాల గురించిన రచయితలు, రచయిత్రిలు చిత్రించిన ద్వారా గిరిజనుల్లో కలిగిన మార్పును పరిశీలించవల్సిన అవసరం వుంది. కాబట్టి తీసుకున్న నవలల్లో గిరిజన సాంస్కృతిక అంశాలను చూద్దాం.

గిరిజన సాంస్కృతిక అంశాలు :

1) దుస్తులు
2) ఆభరణాలు
3) అలంకరణాలు
4) వినోధా విలాసాలు
5) వివాహాలు
6) పండుగలు

వస్త్ర భూషణ అలంకరణాలు వైయుక్తికంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా వుండవచ్చు. వారి వారి శరీరాన్ని బట్టి బట్టలు, నగలు ధరించడం అలంకరణ చేసుకోవడం వైయుక్తకం. కులాన్ని బట్టి బట్టలు నగలు ధరించడం, అలంకరణ చేసుకోవడం సాంఘికం. కొన్ని మతాలు వాళ్ళు కుడి పైట వేయడం, కొందరు ఎడమ కొప్ప పెట్టడం ఇందుకు ఉదాహరణగా గ్రహించవచ్చు. ఆచార వ్యవహారాన్ని అనునరించి వస్త్ర భూషణ అలంకరణ చేసుకోవడం సాంస్కృతికం ముత్తైదు తాళి, మెట్టే ధరించడం లాంటివి.

ముఖ్యంగా ఆభరణాలకు, అలంకరణలను ప్రాధాన్యం ఇవ్వడానికి నాలుగు కారణాలు కనిపిస్తున్నాయి.

అవి :

1) దిష్టి తగలకుండా ఉండడం
2) అందంగా ఉండాలని ఆశించడం
3) స్త్రీ, పురుషులను, పురుషులు స్త్రీలను పరస్పరం ఆకర్షించుకోవడం కోసం
4) కట్టుబాట్లను వాటించడం

వీటిలో పచ్చబొట్టు కూడా ఒక భాగం

ముఖ్యంగా కొమరంభీమ్, ఊరు, ఎల్లి, అడవి మొదలైన నవలలో గిరిజనుల అలంకరణలను గురించి చిత్రించారు. వెన్నెలకంటి రాఘవయ్య యానాది అలంకరణ గూర్చి చెప్తూ యానాది స్త్రీలు కట్టుకునే చీరలు, రవికలు పాచీపని చేయించుకునే యాజమానులు ఇచ్చే పాత గుడ్డలు గానే ఉంటాయి. పాత కాలపు కొప్పలను యానుదులు ఇంకా వదలలేదు. ముప్పై సంవత్సరాల క్రితం వారు ఈ కొప్పల్లో దురముకుంటూ ఉండరు. అలాగే ఉచితముగా లభించే తరిగేడు పూలే అని అంటూ తిరనాళ్లకు, జాతర్లకు పాయ్యే రోజున అందంగా కనిపించుకొందామనే కోరిక యానాదికి లేకపోలేదు. ఇందుకు గాను అతను చేసే ప్రయత్నాలు, చేతికి అందాని దువ్వేనను, వంగని ఎరుకుల చుట్టి రంగు దారము, మెడకు ఎదురు రొమ్ముకు పూసే గాధము, చాకిరేవు నుండి ఎరపు తెచ్చుకున్న గంజి బిరుసు, తెల్ల ధోవతి పైన నలగకుండా పల్లె వాటంగా వేసుకొనే తెల్ల ఖండవా అతన్ని కొత్త బిచ్చగానివలే జనము నుండి వేరు చేయవచ్చునని వర్ణించాడు.

గిరిజనులు అలంకరణలో ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చేది పచ్చబొట్టు. పచ్చబొట్టు ప్రధాన కారణం శారీరక రుగ్మతలు పోగొడుతాయనే నమ్మకం, గిరిజనుల్లో విపరీతంగా వుంది. అందువల్ల గిరిజనులు నుదురు, చేతులు, లీపు వంటి ప్రధానాంగాల పై పచ్చబొట్టు పొడిపించుకుంటారు. కొన్ని అటవిక సమాజాల్లో పచ్చ బొట్టు సామాజిక అంశమును తెలుపుతుంది. పచ్చ బొట్టును జాడిపక్క మళ్ళీసూదులను ఉపయోగిస్తారు.

చాలా భారతీయ గిరిజన తెగలకు పచ్చబొట్టు అంటే విపరీతమైన ఆసక్తిని "నదీం హస్నైన్" వివరించారు.

కానీ, నేడు పచ్చబొట్టు విషయంలో ఆ ఆతృత అంతగా కనిపించదు. పూర్వ కాలంలో పచ్చబొట్టు లేని కుటుంబాలు లేదంటే నమ్మశక్యంగా లేదు. ఎందుకు అని పరిశీలిస్తే ఒక్కొక్క తెగకు ఒక్కొక్క రకంగా చెప్తుతుంది. అలాంటి వాటిలో బంజారాల గురించి పరిశీలిస్తే చనిపోయిన వ్యక్తి పచ్చబొట్టు వుంటే పై లోకంలో అతడికి పచ్చబొట్టు ధన సంపద అవుతుందట. పచ్చబొట్టు లేకపోతే అక్కడ బతకడం కష్టమంట అని చెప్తుతుంటారు. అందువల్ల ఎన్ని పచ్చబొట్టు ఉంటే అంత అంతస్థని భావించి కావాలని మరి పొడిపించుకుంటారు. కాని ప్రస్తుత కాలంలో తండాలో ముసలివాళ్ళు, నిరాక్ష రాస్యులైన యువకులు కూడా ఏదైనా రోగం వస్తే మందులు వాడడం మని పచ్చబొట్టు పొడిపించడం కనిపిస్తుంది.

కష్టాల్ని మరచిపోయి మనిషి హాయిగా జీవించడానికి, జీవితాన్ని సుఖమయం చేసుకోవడానికి వినోదాలు, ఆటలు మొదలైనవి చాలా అవసరం. గిరిజనులు వినోదా విలాసాల్ని రచయితలు అక్కడక్కడ ప్రస్తావించారు. ఆటలు, మధ్యపానం మొదలైనవి గిరిజనుల వినోద విలాసాలుగా భావించవచ్చు.

గిరిజనుల విలాసాల్లో ముఖ్యమైనవి మధ్యపానం, తాటికల్లు, ఈతకల్లు, కాపుసారా లేదా ఇప్పసారా మొదలైనవి. గిరిజనులు సేవించే మధ్యపానీయాలు గిరిజనులే ఇప్పసారాను తయారు చేసుకుంటారు. గిరిజనులు స్త్రీ, పురుషుల ఇద్దరు కలిసి మధ్యపానం సేవిస్తారు. గిరిజనుల్లో వచ్చినా తగాదాలు పరిష్కార

సమయాల్లో, పెళ్ళిళ్ళలో, పండగల్లో, జాతరల్లో కల్లుసారా ప్రముఖ పాత్ర వహిస్తుంది. సాయంత్రమే కాక వీరు పగటి పూట కూడా గిరిజనులు తాగే వుంటారు. గిరిజనుల ఇంటిల్లో సారా తప్పకుండా వుంటుంది.

"లంబాడోళ్ళ రాందాసు" నవలలో ఈ రెండు సీసాలు సారాయి రాందాసుకు అట్టే పెట్టండి, తక్కింది మనక అంటున్నాడు మల్లూ. రాందాసు తాగుతాయి? మన రాందాసే. చుక్కికి అంతా వింతగా తోచింది. రాందాసు తాగి తూలుతూ నడుస్తుంటే గమ్మత్తుగా ఉంటుంది. వక్కీడా? తాగుతాడా? ఇప్పుడు సూద్దాం సూడాల్సిందే.

నిజానికి రాందాసుకు మధ్యపానం అలవాటు లేదు. అయిన కొంత మంది మూర్ఖత్వానికి బలవుతాడు. మామూలుగా గిరిజన సంస్కృతిలో మధ్యపానం సేవించడం ఒక ఛాలెంజ్‌గా తీసుకుండారు. ఒకర్ని చూసి మరొకరు ఇలా చిన్నప్పటి నుండి అలవాడు చేసుకుంటారు. అది తప్ప అని తెలిసినా, దాని వల్ల అనారోగ్యమని తెలిసినా వదలరు. పైగా స్వయంగా తయారు చేయడం వల్ల సమయం అంటూ వుండక ఎప్పుడు పడితే అప్పుడు తాగుతుంటారు. దానిలో చిన్న వయస్సులోనే అనేక రోగాలు వచ్చి చనిపోతుంటారు. అందుచేత గిరిజనుల్లో ఇటువంటి విధానాలల్లో మార్పు రావాలంటే ఐక్యత రావాలి. మొదటి దాని వల్ల వచ్చే అనర్థాలను తెలుసుకోవాలి. అప్పుడు గాని మార్పు రాదు.

గిరిజనుల నృత్యాలు లయ ప్రధానమైనవి కాదు. వారు అడుగులు ముందుకు వెనకి వేస్తూ పాటను పెంచుకుంటూ సాగిపోతారో గాని నృత్యంలో శాస్త్రీయతను గురించి ఆలోచన గిరిజనులో ఉండదు. గిరిజనులు పండగలప్పుడు వెన్నెల రోజుల్లో నృత్యాలు చేస్తుంటారు. ఎక్కువగా సామూహిక నృత్యం చేస్తుంటారు. ఎరుకల తెగవారు అప్పుడప్పుడు ఊరూరు తిరుగుతూ 'గరిడి' నృత్యాన్ని ప్రదర్శిస్తుంటారు.

'ఎల్లి' నవలలో గరిడ ప్రదర్శనకు ముందు కొందరు తరంగం తొక్కుతున్నారు. వాళ్ళు మోకాళ్ళ కిందుగా మువ్వల పెట్టా కట్టుకుని లయబద్ధంగా చిందులు తాక్కుతున్నారు. ఆలయకు అనుగుణంగా డప్పులు మోగుతున్నాయి. మధ్య మధ్యన డప్పులు ఖంగున మోగకపోతే డప్పులు వాళ్ళని తిడుతారు. చిందులు తాక్కేవాళ్ళు తాగి వున్నారు. చిందులు తొక్కేవాళ్ళు మధ్య మధ్య వొకలిచేత మరొకరి చేయి మెలివేసి రెండవ చేతిలో చెరొక వీరతాడు తీసుకుని బాదుకుంటారు.

వివాహం చేసుకోవాలంటే అనాడు కన్యాశుల్కం ద్వారా స్త్రీ, పురుషుల నుండి డబ్బును పొందేవాళ్ళు నేడు పురుషుల వరకట్నం ద్వారా స్త్రీల నుండి డబ్బును పొందుతున్నారు.

'కొమరంభీమ్ నవలలో' ఈ ఆలోచనలు ఎటూ తేలకముందే భీం పెళ్ళి సామిలో ఘనంగా జరిగింది. గోండు సాంప్రదాయం ప్రకారం పిల్లకు ఐదు జతల రవికె గుడ్డలు తెచ్చారు. చాలా గ్రామాల నుండి గోండువాళ్ళు బండ్ల మీద వచ్చారు. పెళ్ళి ఖర్చుంతా లచ్చుపటేల్ భరించాడు. అతనికి పన్నెండెకరాల బంగారం తునకలాంటి భూమి దక్కింది. బహుశా దీనిని కన్యాశుల్కం వివాహం అని చెప్పవచ్చు.

గోండు వివాహ పద్ధతులో కొన్ని సంప్రదాయాలను పాటిస్తుంటారు. వివాహానికి వదువును అడగడానికి పోయే మందు వారి 'సగా' యొక్క గొప్పతనానికి ప్రాధాన్యత యిస్తారు. ఉదాహరణకు వరుడు అవసగాకు వధువు 7వ సగా అమ్మాయి అయినట్లయితే అమ్మాయి యొక్క తల్లి 4వ సగాకు చెంది ఉండి అబ్బాయి యొక్క తల్లి కూడా 4వ సగాకు చెందినట్లయితే అమ్మాయికి, అబ్బాయికి మెట్టి పరిస్థితులలోనూ వివాహ సంబంధము కుదరదు.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ జాతీయాలు – భాషీ

– రాగుల సుధాకర్, పరిశోధక విద్యార్థి, తెలంగాణ విశ్వవిద్యాలయం, డిచ్‌పల్లి, నిజామాబాదు, తెలంగాణ.

భావ వినిమయానికి సాధనం భాష. భావ వ్యక్తీకరణ అనేది సందర్భానుసారంగా ఉంటుంది. భావాన్ని చాలా సులభంగా, సంక్షిప్తంగా సమాచారాన్ని చేరవేయడంకోసం జాతీయాలు ఉపయోగపడతాయి. మనస్సుకు హత్తుకునేలా చెప్పడానికి జాతీయాలు ఉపయోగపడతాయి. ప్రతి భాషలోనూ జాతీయాలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఏ భాషా రచయిత అయినా ఆ భాషలోని జాతీయాలను ఒంటబట్టించుకొని, సందర్భానుసారంగా ప్రయోగిస్తే ఆ రచన రాణిస్తుంది. పాఠకుల మనసులో నాటుకు పోతుంది.

జాతీయానికి చమత్కారం, నుడికారం, నుడికట్టు, పలుకుబడి, భాషీయం అనే పర్యాయ పదాలున్నాయి. ఏ భాషకైనా తనదైన ప్రత్యేక నుడికారపు సొంపు ఉంటుంది. ఇది ఆ భాషకు పరంపరంగా సిద్ధించిన సాంస్కృతిక లక్షణం. జాతీయాలు భాషకు పుష్టిని, సొగసును ఇస్తాయి. భాషకు తమదైన ప్రత్యేకతను కలిగిస్తాయి.

జాతీయం అంటే విశిష్ట పదబంధం అని అర్థం. జాతీయాలు ఒక జాతికి, ప్రాంతానికి సంబంధించిన విషయాలను తెలియజేస్తాయి. ఇవి పదరూపంలో ఉంటాయి. ఏదైనా సందర్భాన్ని, సన్నివేశాన్ని, విషయాన్ని ఒక పదరూపంలో జాతీయాలు తెలియజేస్తాయి. ఇవి ప్రాంతీయతను కలిగి ఉంటాయి. అదే విధంగా తెలంగాణలో కూడా ప్రత్యేక ప్రాంతీయతను కలిగి భిన్నమైన సంక్షిప్త అర్థాలను ఈ జాతీయాలు అందిస్తాయి. యాస, భాష కూడా మిగతా ప్రాంతాలతో పోలిస్తే భిన్నంగా ఉంటాయి. అటువంటి తెలంగాణ జాతీయాల్లోని విశేషాలను ఈ పత్రంలో విశ్లేషించాను.

భాష : జాతీయాలు ప్రత్యేకంగా ఒక ప్రాంతాన్ని, ఒక జాతిని కలిగి ఉంటాయి. కావున ఆ ప్రాంత భాషను తెలుసుకోవాలంటే జాతీయాలను అధ్యయనం చేయాలి. జాతీయాలలోని భాషను విశ్లేషించాలి.

తెలంగాణ జాతీయాలు-విశ్లేషణ :

అంబట్ల తెడ్డు :

ఏ పక్షానికి పూర్తిగా చెందకుండా రెండు వర్గాల వారిని మెప్పించే వాడిని 'అంబట్ల తెడ్డు'గా వ్యవహరిస్తారు.

ఇంటింటికి మంటి పొయ్యి :

బీద, ధనిక తేడా లేకుండా కొన్ని వస్తువులు అందరికీ సమానంగా ఉంటాయి. అవి కలిమి లేములు-కష్ట సుఖాలు. కట్టెలతో వంట చేసినపుడు ఏ ఇంట్లోనైనా మన్నుతో వేసిన పొయ్యి అవసరం అవుతుంది. ధనముంది గదా అని బంగారు పొయ్యి వాడరు.

ఇంటి నిట్టాడు కూలిపోయినట్లు :

గుడిసెకు నట్టనడుమ ఉండే నిలువు స్తంభం నిట్టాడు. నిట్టాడు విరిగితే ఇల్లు కూలిపోతుంది. ఇంటి యజమాని చనిపోవటం జరిగితే ఆ కుటుంబం మొత్తం దెబ్బతింటుంది.

ఇవ్వాలింట్ల - రేపు మంట్లె :

ఎవరికైనా చావు చెప్పిరాదు. బతుకు ఎవరికీ శాశ్వతం కాదు. 'ఇవ్వాలింట-రేపు మంట్లె ఉంటరు. గుండెపోటు వస్తె బతుకులు కష్టం. నాలుగు రోజుల బతుక్కే ఇంత ఆశ.

ఎంత చెట్టుకు అంత గాలి :

సంపాదనకు తగ్గట్టు ఖర్చులుంటుందని దీని భావం. రాబడి పెరిగినపుడు హొదాకు తగ్గ డాబు, దర్పం ఉంటాయి.

ఎద్దును చూసి మ్యాతెయ్యాలి :

విచక్షణతో వ్యవహరించాలనేది అర్థం. దానం చేసే

ముందు ఎవరికెంత ఇవ్వాలో అంత ఇస్తె, ఇచ్చిన ధనం వృధా కాదు. ఎద్దుల్లో పెద్దవి, చిన్నవి ఉంటాయి. రెండింటికీ ఒకే విధంగా మేతవేస్తే చిన్న ఎద్దులు మేతను పాడుచేస్తాయి.

కూరాడు కుండ :

కదలక మెదలక ఒకచోట ఉండట మనే అర్థం.

గుట్టకు కట్టెలు మోయుట :

గుట్టమీద చాలా చెట్లుంటాయి. కట్టెలు కూడా ఉంటాయి. అలాంటి చోటుకు కట్టెలు మోయడం అనేది తెలివి తక్కువ పని.

తాకులు తినుట :

అనుభవాల ద్వారా జీవితాన్ని దిద్దుకొనుట : తప్పులు చేయడం మానవ సహజం.

ఊళ్ళియ్యం, నిత్తె కయ్యం :

ఇప్పటికీ చాలామంది పల్లెవాసులు తమ బిడ్డలను దూరంగా ఇచ్చేకంటే ఉన్న ఊళ్ళోనే మంచి పిల్లవాణ్ణి లేదా పిల్లని చూసి ఇస్తే తమ బిడ్డలు ఆపతి-సంపతికి దగ్గరుంటరని ఆశించి పెళ్ళి చేస్తారు. ఇట్లాంటి పెళ్ళిళ్ళల్లో ఎక్కువ గొడవలు జరుగుతుంటాయని తర్వాత తెలుసు కుంటారు. ఏ చిన్న గొడవ జరిగినా వెంటనే బిడ్డ తన తల్లిగారింటికి వెళ్ళడం ఆ వెంటనే, అల్లుడు వచ్చి తీసుకెళ్ళ డానికి ప్రయత్నించడం జరుగుతుంటుంది. చివరికి ఇవి ఇరు కుటుంబాల మధ్య ఘర్షణలకు కూడా దారి తీస్తుం టాయి. ఇలాంటి వాటిని చూసినప్పుడు 'పెద్దలు ఊళ్ళియ్యం నిత్తె కయ్యం' అని ఈ జాతీయాన్ని వాడు తుంటారు.

గుంజ లేనిదే పందిరి లేదు :

పునాది లేని మేడ ఉండటం సాధ్యం కాదు. అలాగే, మనం ఏదో ఓ రోజు ఉన్నత స్థితికి ఎదిగినప్పటికీ సహకరించిన వారిపట్ల ఎప్పుడూ కృతజ్ఞతాభావం కలిగి ఉండాలి. కొంతమంది ఉన్నత స్థాయికి చేరుకున్నాక ఇందుకు భిన్నంగా ప్రవర్తిస్తుంటారు. సాధించిన ఘనత 'తమ ఒక్కరి కృషే' అన్నట్లుగా మెదులుతుంటారు. అలాంటి వారిని చూసినప్పుడు గ్రామీణులు 'వాడేందిరా, గుంజ లేనిదే పందిరి లేనట్లు' గతంలో తనకు సహాయ పడిన వారిని మర్చిపోయి ప్రవర్తిస్తున్నడు' అని వ్యంగ్యంగా పై జాతీయాన్ని వాడుతుంటరు.

అమ్మబోతే అడ్వి-కొనబోతే కొర్వి :

రైతులు ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తరు. వారు ఉత్పత్తి చేసిన ఏ వస్తువుకైనా శ్రమకు తగ్గ ఫలితం లభించదు. వ్యవసాయ దారుడు కష్టపడి తన ధాన్యాన్ని అమ్మేందుకు మార్కెట్‌కు తరలిస్తే అక్కడ తగిన గిట్టు బాటు ధర లభించదు. కొన్ని సందర్భాలలో పెట్టిన పెట్టు బడి తిరిగొస్తుందన్న నమ్మకమూ ఉండదు. రైతులు చేసేది లేక అగ్వ సగ్వకు అమ్ముకుంటరు. అయితే, మనం అవసరం ఉండి సరుకులు కొనబోతే మాత్రం ధరలు ఆకాశాన్నంటుతై. అట్లాంటి సందర్భంలో గ్రామీణులు 'అమ్మబోతే అడ్వి-కొనబోతే కొర్వి' అనే జాతీయాన్ని వాడుతుంటారు.

పాత ఒక రోత, కొత్త ఒక వింత :

కాలం గడుస్తున్న కొద్దీ సమాజంలో కొత్త మార్పులు వస్తుంటాయి. ప్రతిదీ మారాల్సిందే. కొత్తలో ప్రతిదీ ఆకర్షణీయంగానే ఉంటుంది. అయితే, కొంతమంది కొత్త వస్తువుని చూసి పాత వస్తువుని పడేస్తుంటారు. అది సరైంది కాదు. పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. కొత్త మురిపెం తీరగానే కొన్నిసార్లు పాతదాని అవసరం ఏర్పడు తుంది. అప్పుడు కావాలన్నా పాతది దొరకదు. అందుకే నూతన వస్తువులు ఎంత ఆకర్షణీయంగా, ఉపయోగ కరంగా ఉన్నా పాత దానిని విస్మరించకూడదు. దేని ప్రయోజనం దానికుంటుందని పెద్దలు అనుభవంతో పై జాతీయాన్ని ఉదహరిస్తారు.

ఉద్దెర సొమ్ము నిద్దుర చేటు :

జీవితంలో పొదుపు అందరికీ అవసరం. అడ్డూ, అదుపూ లేని జీవితాలు అవస్థల పాలవుతాయి. మనకున్న ఆర్థిక వనరుల్ని ప్రణాళికాబద్ధంగా, ఎంతో జాగ్రత్తగా

వినియోగించుకోవాలి. ఆర్థిక సమతుల్యత అనేది కుటుంబానికైనా, వ్యవస్థకైనా అవసరం. అయితే, సమాజంలో కొంతమంది తమకున్న దాంతో సంతృప్తి చెందరు. అప్పులు చేసి మరీ తమ కోర్కెలు తీర్చుకుంటారు. 'శక్తికి మించి అప్పులు చేస్తూ, తరువాత తీర్చొచ్చులే' అన్న ధీమాతో అరువుమీద అరువు చేస్తుంటారు. అప్పు చేయడం మనిషికి మానసిక వ్యధను కలిగిస్తుంది. ప్రశాంతత దూరమవుతుంది. అందుకే, మనకున్న ఆర్థిక వానరుల మేరకే ఖర్చు చేయాలి. లేదంటే కష్టాలు తప్పవని గ్రామాల్లో పెద్దలు ఈ జాతీయాన్ని వాడతారు.

కొత్త మురిపెం పొద్దెరుగదు :

కొత్తలో ఏ పని చేసినా సంబురంగానే ఉంటుంది. కొత్తగా కాపురం పెట్టినా సంబురమూ తీరేది కాదు. కొత్త పంట చేతికి వచ్చినప్పుడు వాటితో చేసిన ఏ వంటకం అయినాసరే రుచిగా ఉంటుంది. ప్రతి కొత్త దినుసూ ఉవ్విళ్ళూరిస్తుంది. కొత్త మురిపెంలో కబుర్లతో కాలమెంత త్వరగా గడిచిపోతుందో తెలిసిరాదు. అట్లా కొంతమంది కొత్తదాని ధ్యాసలో పడి పాత వాటిని నిర్లక్ష్యం చేస్తుంటారు. తీరా సకాలంలో పనులు కాకపోయేసరికి ఆందోళన పడుతుంటరు. తాము చేసిన తప్పులను గుర్తించక ఇతరులపై నెపంతో కాలం వెళ్ళదీస్తుంటారు. ఇది సరైంది కాదు అని తెలిపే సందర్భంలోనే ఈ జాతీయాన్ని వాడతారు.

నియ్యతెంతనో బర్కతంత :

మనలో కొంతమంది సంకుచిత స్వభావంతో జీవిస్తుంటారు. ఇలాంటి మనస్తత్వం కలవాళ్ళు ఒకరు ఎదుగుతుంటే చూసి ఓర్వలేని తనంతో రగిలిపోతుంటారు. ఎప్పుడూ పక్కవారి గురించి చెడుగా ఆలోచిస్తూ కీడు తలపెట్టాలని చూస్తుంటారు. అయితే, ఓర్వలేని గుణం ఉన్నవారికి బర్కత్ ఉండదు. పైగా మానసిక, శారీరక రుగ్మతలతో వారు బాధపడుతుంటారు. తను చేసే పనిలో, ప్రవర్తనలో మంచి ఉండి ఒకరికి చెడు చేయకపోవడమే నియ్యత్. అందుకే, గ్రామాల్లో ఇలాంటి వారిని చూసినప్పుడు పెద్దలు తమ అనుభవంతో 'నియ్యతెంతనో బర్కతంత' అనే జాతీయాన్ని వాడుతుంటారు.

గుమ్మినిండా వడ్లుండాలె-గూటాలోలె పిల్లలుండాలె :

సమాజంలో కొంతమంది తమ అవసరాలకు డబ్బు ఖర్చు చేయరు. వారి ఆర్థిక స్థోమత మంచిగున్నా సరే ఖర్చు అనేసరికి వెనుకాడుతుంటారు. కానీ, తమ పనులు మాత్రం సకాలంలో జరగాలనుకుంటారు. అందుకోసం ఎదుటివాళ్ళపై ఆధారపడుతుంటారు. అయితే, మనవద్ద ఉన్నదే మన అవసరాలను సరైన సమయంలో తీరుస్తుంది. అలా కాకుండా ఇతరులపై ఆధారపడటమో, ఉన్నవాటిని అవసరాలకు వాడకపోవడం వల్లనో లాభం కంటే నష్టమే ఎక్కువ. పిల్లలు మంచిగుండాలె, తిండికి ఖర్చు కావద్దు అంటే ఎట్ల? అలాంటి వారిని చూసినప్పుడు గ్రామాల్లోని పెద్దలు ఈ జాతీయాన్ని వాడుతుంటారు.

కొంగు బంగారం :

సాధారణంగా కోరుకున్న పనులు వెంటనే జరిగినప్పుడు దీన్ని వాడతారు. కొంగు బంగారం అనే జాతీయానికి సులభ సాధ్యం అనే అర్థం ఉంది. మన పూర్వీకులు తమకు కావాల్సిన ధనాన్ని కొంగులో ముడివేసుకునేవారు. ఆ రోజుల్లో మనీ పర్సులు ఉండేవి కావు. వారికి ఏదైనా డబ్బు అవసరం అయితే, వెంటనే కొంగు ముడి విప్పి అందులోంచి కావాల్సిన మొత్తాన్ని సులభంగా వాడుకునేవారు. అదే వారి డబ్బు ఏ పెట్టెలోనో ఉంటే అది అంత సులువుగా సకాలంలో ఉపయోగపడదు. అలా కాల క్రమంలో 'కొంగు బంగారం' అనే జాతీయాన్ని వాడులోకి తెచ్చారు మన పెద్దలు.

ముగింపు :

తెలంగాణలో ప్రత్యేకమైన భాషా పదజాలం కన్పిస్తూ ఉంటుంది. చరిత్ర, సంస్కృతీ సంప్రదాయాలు, కళలు మొదలైన వాటిల్లో తెలంగాణ తన ప్రత్యేకతను చూపిచ్చుకున్నట్టుగానే, వాటి యాస, భాషల్లోని పదజాలంలో కూడా భిన్నత కన్పిస్తుంది. తెలంగాణ ప్రజలు మాట్లాడే స్వచ్ఛమైన తెలుగు పదాలు, ఉర్దూ పదాలతో కూడిన పదజాలం

కన్పిస్తుంది. పల్లెప్రజలు సృష్టించిన సహజమైన, అర్థవంత మైన పదజాలం తెలంగాణలో కన్పిస్తుంది. అదేవిధంగా జాతీయాల్లో కూడా ఆ భిన్నత కన్పిస్తుంది. సంక్షిప్త పదాలతో అధికార్థాన్ని, స్పష్టమైన వివర్ణాత్మకమైన అర్థాన్ని ఇస్తాయి. ఇలా సంక్షిప్తమైన పదాలతో కూడిన జాతీయాలు హృదయానికి హత్తుకునేలా, తొందరగా విషయం అర్థం అయ్యేలాగా ఉంటాయి. వీటివల్ల సమయం వృధా ఉండదు. అదేవిధంగా చాలా విషయాలు స్పష్టంగా అర్థం అవుతాయి. తద్వారా అటువంటి జాతీయాలు ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయి.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గిరిజన కథలు – జన జీవన చిత్రణ

– రొసుకచ్చుల రమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, డా.బి.ఆర్.ఆర్. ప్రభుత్వ కళాశాల, జడ్చర్ల.

ఆంగ్లంలో Triber అనే పదానికే సమానార్థకంగా మనం ఆదిమ జాతి, ఆదిమ నివాసి, ఆదివాసి, గిరిజన అనే పేర్లతో వ్యవహరిస్తున్నాం. వీరి విజ్ఞానాన్ని ఆంగ్లంలో Tribal Lore అని అంటారు. దీనికి గిరిజన విజ్ఞానం అంటాం.

ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణలో గిరిజనులు :

గిరిజన తెగ	ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని జిల్లాలు	మాట్లాడేభాష
అంధ్	ఆదిలాబాద్ జిల్లాలోని కొండ ప్రాంతాలు	మరాఠీ, తెలుగు
ఎరుకల	ఆంధ్రప్రదేశ్ అంతట నివసిస్తున్నారు.	తెలుగు, ఎరుకల
కట్టునాయికన్	ముఖ్యంగా పట్టణ ప్రాంతంలో వ్యాప్తి చెంది ఉన్నారు.	తెలుగు, ఒరియా
కొండకమ్మర	శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి	తెలుగు
కొండకాపు	శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తూర్పగోదావరి, పశ్చిమగోదావరి	తెలుగు
కొండదొర	శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి	కొండ, కువి, తెలుగు
కొండరెడ్డి	ఉభయగోదావరి, ఖమ్మం	తెలుగు
కొలాము	ఆదిలాబాదు	కొలామి, తెలుగు
కోండు	విశాఖపట్నం, శ్రీకాకుళం	కువి, తెలుగు
కోటియా	విశాఖపట్నం, శ్రీకాకుళం	ఒరియా, తెలుగు
కోదులు, జాతపు	శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం	కువి, తెలుగు
కోయ	ఉ.గోదావరి, ఖమ్మం, వరంగల్	కోయ, తెలుగు
ములియా (లేదా) కులియా	విశాఖపట్నం	ఒరియా, తెలుగు
గదబ	విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం	తెలుగు, గదబ
గోండు	ఆదిలాబాద్, కరీంనగర్	గోండి, తెలుగు
గౌడు	విశాఖ. శ్రీకాకుళం	తెలుగు
చెంచులు	కర్నూలు, మహబూబ్‌నగర్, ప్రకాశం, గుంటూరు	తెలుగు

గిరిజన తెగ	ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని జిల్లాలు	మాట్లాడేభాష
తోటీలు	ఆదిలాబాద్	తెలుగు, మరాఠీ
ధులియ, పైకోపుటియా	విశాఖపట్నం, విజయనగరం	తెలుగు
నక్కల, కుర్వికారన్	నెల్లూరు, కడప తెలుగు	నక్కల
నాయకపోడు, నాయక్	ఉభయగోదావరి, ఖమ్మం, కరీంనగర్ వరంగల్, ఆదిలాబాద్	తెలుగు
ప్రధానులు, పర్ధాన్‌లు	ఆదిలాబాద్	గోండి, మరాఠీ, తెలుగు
పొరజలు	విశాఖపట్నం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి	వర్జీ, తెలుగు, ఒరియా
బగతలు	విశాఖపట్నం, శ్రీకాకుళం	తెలుగు
భిల్లులు	ఆదిలాబాదు, మహాబూబ్‌నగర్, హైదరాబాద్	తెలుగు
మన్నెదొరలు	విశాఖపట్నం, శ్రీకాకుళం	తెలుగు
మాలీలు	విశాఖపట్నం	ఒరియా, తెలుగు
మూకదొరలు (లేదా) నూకదొర	శ్రీకాకుళం, విశాఖపట్నం	తెలుగు
యానాదులు	ఆంధ్రప్రదేశ్ అంతటా వ్యాపించి ఉన్నారు	తెలుగు
రెడ్డిదొర	విశాఖపట్నం	తెలుగు
వాల్మీకులు	తూర్పుగోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం	తెలుగు
సవరలు	శ్రీకాకుళం, విజయనగరం	ఒరియా, తెలుగు, సవర
సుగాలీలు	శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలో తప్ప మిగిలిన జిల్లాలన్నిటిలో ఉన్నారు	లమాని (లేదా) లంబాని, తెలుగు
బెంథో, ఒరియా	శ్రీకాకుళం, విశాఖపట్నం	ఒరియా, తెలుగు
రోన	విశాఖపట్నం, విజయనగరం	తెలుగు, ఒరియా

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని గిరిజనుల సంఖ్య సుమారుగా 35 అని ప్రభుత్వం అంచనా. శ్రీ వెన్నలకంటి రాఘవయ్యగారు 'చెంచు, కోయ, గోండు, భగత, గదబ, జాతపు, కమ్మర, కట్టునాయక, కొండదొర, కొండకాపు, కొండరెడ్డి, ఖోండు, కొటియ, బెంతొబరియ, కులియ, మాలి, మన్నెదొర, ముఖదొర, పొరజు, రెడ్డిదొర, రోన,

సవర, సుగాలి, యానాది, ఎరుకుల, అంధ్, భిల్లు, నాయక్‌పోడ్, కోలం, పర్ధాన్, తోటి, గౌడు, నాయకవాల్మికి' జాతుల్ని పేర్కొన్నారు.

ఆధునిక తెలంగాణా సాహిత్యంలో నవల, కథ, కవిత్వం, నాటకం ప్రధాన ప్రక్రియల్లో గిరిజనుల సమస్యలను చిత్రిస్తూ పలువురు తెలంగాణా గిరిజనులతో పాటు గిరిజనేతర రచయితలు అల్లం రాజయ్య, ఉప్పల నరసింహం, కాలువ మల్లయ్య, గీతాంజలి, జాతశ్రీ జీవన్, బోయ జంగయ్య, బి.ఎస్.రాములు, ముదిగంటి సుజాతా రెడ్డి, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, దిలావర్, పి.చంద్, పైడి చంద్రలత, శెట్టి కాంతారావు, శనిగరం వెంకటేశ్వర్లు (సాహు), పెద్దింటి అశోక్ కుమార్, గోపిభాగ్యలక్ష్మి, తెలంగాణా ప్రాంత గిరిజనుల జీవితాలను కథావస్తువుగా తీసుకొని అనేక కథలు రచించారు. వారిలో ఎ.విద్యా సాగర్, ఫణికుమార్, కేశవరెడ్డి మొదలైనవారు ముఖ్యులు. ఇంకా పూర్తిగా గిరిజన సంస్కృతి, చరిత్ర, సాహిత్యంపైన పరిశోధనలు రావాలి.

ఆధునిక తెలంగాణ కథా సాహిత్యం విస్తృతంగా వ్యాప్తిలోకి వచ్చింది. గిరిజన సమస్యలు, గిరిజన స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధాన ఇతివృత్తాలుగా తీసుకొని తెలంగాణ కథా రచయితలు గీతాంజలి, జాతశ్రీ, బోయ జంగయ్య, బి.ఎస్.రాములు, ముదిగంటి సుజాతారెడ్డి, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, పి.చంద్, శనిగరం వెంకటేశ్వర్లు (సాహు), గోపిభాగ్యలక్ష్మి మొదలైన వారు స్త్రీల కథా సాహిత్యాన్ని వెలువరించారు. కొంతమంది తెలుగు ప్రాంత రచయితలు తెలంగాణ ప్రాంత గిరిజన స్త్రీల జీవితాలను ఇతివృత్తాలుగా తీసుకొని రచనలు చేశారు. వారిలో ఎ.విద్యాసాగర్, ఫణికుమార్, మొదలైన వారు ముఖ్యులు.

'యాడి' కథను గీతాంజలి రాశారు. పేదరికం కారణంగా ఒక లంబాడీ కుటుంబం పదేళ్ళ పాపైన చిట్టిని ఉద్యోగస్తుల ఇంట్లో పనిచేయడానికి పెట్టడంతో, ఆ పాప పడే కష్టాలు, తల్లిని చేరుకోడానికి చేసే ప్రయత్నాలు మనకు కంట తడిపెట్టిస్తాయి.

పి.చంద్ రాసిన 'హత్య' కథలో మానభంగానికి గురై హత్యచేయబడిన ఆదివాసి జంగుబాయి కన్నీటి కథ. గిరిజనులపై జరుగుతున్న హత్యలు ఎవరు చేశారో, ఎందుకు చేస్తున్నారో తెలియని పరిస్థితులను ఈ కథ వివరిస్తుంది. హత్యకథ 'భూనిర్వాసితులు' కథా సంపుటిలోనిది. మహిళలు వ్యభిచారంలోకి నెట్టబడటానికి ప్రధాన కారణం పేదరికం. కుటుంబ పోషణ భారం, కరువు ఏర్పడటం, చేతివృత్తులు నశించటం వల్ల బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టబడుతున్నారు. గిరిజన ఆడపిల్లలు బొంబాయివంటి పెద్ద పట్టణాలలో వ్యభిచార కేంద్రాలకు అమ్మబడుతున్నారు. పేదరికాన్ని జయించడానికి మాత్రమే గిరిజన స్త్రీలు వ్యభిచారులుగా మారుతున్నారు. 'బురద' కథను అల్లం రాజయ్య రాశారు. ఈ కథ 'శ్వేతరాత్రులు' కథాసంపుటిలోనిది. కొండమీదకి పెట్టుబడిదారి పరిశ్రమ విస్తరించి కృత్రిమ కరువు సృష్టించింది. అడవిలో నివసించే మనుషులు అడవిపై ఆధారపడి జీవిస్తుంటే అడవి అంతరిస్తుందని అక్కడున్న గిరిజనుల్ని బయటకు తరిమారు ఫారెస్టు అధికారులు. ఫలితంగా పట్టణాలకు వలస వచ్చిన గిరిజన స్త్రీ గోండుబాయి మాట్లాడేవారులేక పొట్టకూటికోసం దారి తప్పుతుంది. మూడురోజుల పసికందును బిడ్డలు కోల్పోయిన రైతు దంపతులకు 50 రూపాయలకు అమ్మేస్తుంది. గోండు యువకుడు ఆమెను గుర్తించి తమతో తీసుకెళ్లాలనుకుంటాడు కానీ ఆమె కనిపించదు. ఎవరూ రక్షించలేని పట్నం బురదలో కూరుకుపోతుంది ఆ స్త్రీ. అప్పుల ఊబిలో కూరుకు పోతున్న తీరు సాహు ''ఐదు రూపాయల కథ''లో చిత్రీకరించారు. ఆదిలాబాద్ గోండు గూడెంలో జరిగిన దాన్ని ఇతివృత్తంగా తీసుకొన్నారు. పేదరికం కారణంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్నాయి. అమాయక గిరిజనుల కష్టాన్ని అప్ప పేరుతో దోచుకొంటుంటాడు. కొమరం జంగు కొడుకు రాంసావుకి అప్ప ఉరిబిగిసింది. తండ్రి చేసిన

అప్పు ఐదువందలు చెల్లించాలని, చెల్లించకపోతే జైలో వేస్తానని షావుకారి బెదిరిస్తాడు. రాంసావు భయపడి బాకీ చెల్లించడానికి సిద్ధపడతాడు. గొండు తెగలమీద వచ్చిన కథల్లో విశిష్టమైనది.

పోడు వ్యవసాయం చేసుకొంటూ సంచార జీవనం గడుపుతున్న గిరిజనుల భూమిని గిరిజనేతరులు కబ్జా చేసిన తీరును చిత్రించిన కథ "అక్రమణం" రచయిత ముదిగంటి సుజాత రెడ్డి. ఆకయ దేవర జాతరను చక్కగా వివరించారు. కోయల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని భూమిని గిరిజనేతరులు కాజేస్తారు. భూమిని తిరిగి సంపాదించుకోవాలన్న చైతన్యాన్ని, భూస్వాములపై తిరుగుబాటుని శిరంశెట్టి కాంతారావు "బిగిసిన ఆ పిడికిళ్ళు" కథలో చిత్రించారు. కోల్పోయిన భూమిని తిరిగి పొందే వరకు పిడికిళ్లు బిగిస్తామని పోలీసులకు, అచ్యుత రామయ్యకు చెప్తారు. ఇందులో గిరిజన చైతన్యం కనబడుతుంది. ప్రభుత్వం అటవీ సంరక్షణలో భాగంగా గిరిజనుల భూమిని ఆక్రమించి తుమ్మచెట్ల ప్లాంటేషన్స్‌గా మారుస్తున్న భూమిని రక్షించుకోడానికి గిరిజన రైతుకూలి సంఘం చేసిన పోరాటాన్ని వివరించిన కథ "భూమికొరకు" ప్రభుత్వం, షావుకార్లు గోడౌన్లులో ధాన్యం దాచుకొంటూ పేదవారికి పంపిణీ చేయకుండా, అన్యాయం చేస్తున్న వారిని శిక్షించకుండా, అడవుల్లో భూమిపైన ఆధారపడి జీవించే వారిని శిక్షిస్తోందని సాహు వివరించారు.

గిరిజనులు ఐక్యమై పోరాటానికి సిద్ధమైన తీరు అల్లం రాజయ్య "మరట్‌తుండుం పాయానా"లో వివరించారు. నోటీసులొచ్చిన విషయం గూడెమంతా పాకిపోతుంది. గూడెం పెద్ద సోనేరావు గిరిజన రైతు కూలీ సంఘం నడిపిన లింగుతో భూమిని దక్కించు కోవాలని, లింగు గిరిజన రైతుకూలీ సంఘం ద్వారా సాధించిన విజయాలు, నక్స లైట్లు భూమిని దక్కించుకోడానికి సహాయపడిన తీరుని వివరిస్తాడు. గిరిజనులందరు ఐక్యమత్యంగా పోరాడలని అల్లం రాజయ్య చెప్పారు.

శ్రమకు తగిన ఫలితం లేదని రిక్షా శ్రామికుడి శ్రమని "ఘర్మజలానికి.. ఖరీదు కట్టే షరాబు" కథలో కాలువ మల్లయ్య స్పష్టం చేశారు. ఒకతను రిక్షాలో మర్చిపోయిన బ్యాగ్‌ని తిరిగిచ్చినందుకు, రతన్ దొంగతనం చేసాడని పోలీస్ స్టేషన్‌లో అప్పగిస్తాడు. ఇరవై రూపాయలు చెల్లించి విడుదలవుతాడు. రిక్షాలో ముగ్గురు ప్రయాణి కుల్ని ఎక్కించుకొని చెమటలు కారుస్తూ ప్రమాదాలు తప్పించుకుంటూ వెళితే. ఐదు రూపాయిలకు మూడున్నర రూపాయిలు ఇస్తాడు. ధర్మంగా చిందించే ఘర్మజలానికి సరైన ఫలితం ఎవరు చెల్లించగలరు?. రతన్ నిరాశతో వెళ్లిపోతాడు. నిజాయితీకి విలువలేదని రతన్ వాపోయాడు.

గిరిజనేతరుల చేతిలో మోసపోతూ జీవనం సాగిస్తున్న వైనాన్ని గోపిభాగ్యలక్ష్మి "బతుకు పయనం"లో చిత్రీకరించారు. గోండుల్లో వెనుకపడిన పరదాన్ల తెగకి చెందిన సోము ఎద్దులు బండి నడుపుతాడు. గిరిజనేతర సమాజం చేతిలో మోసపోతూ సాగిస్తున్న అడవి బిడ్డల జీవన యానమే బతుకు పయనగాథ. కష్టపడుతున్నా ఫలితం లేకపోవడం, గోండులు నివాసముంటున్న ప్రాంతంలో గిరిజనేతరులు మరాఠాలు, దళితులు వచ్చి కొంత భూమిని సంపాదించుకొని షావుకార్లుగా చలామణి అవు తుంటారు. జగ్గయ్య షావుకారిగా ఈ ప్రాంతంలో గోండు లనే పాలేర్లుగా నియమించుకొని ముగ్గురు భార్యలతో, ధనధాన్యాలతో తులతూగుతుంటాడు. ఆదిలాబాద్ అడవుల్లో ఉన్న గోండు తిరుగుబాటు వారి జీవితంలో తిరిగిన మలుపు చుట్టు పక్కల వ్యాపిస్తుంది. అని గొండు తెగల గురించి అల్లం రాజయ్య మలుపు కథలో స్పష్టం చేశారు. కష్టాల నుండి బయట పడటానికి తిరుగుబాటు ధోరణి పరిష్కారంగా భావించిన తీరు బి.ఎస్.రాములు "అడవిలో వెన్నెల"లో చూపించారు. మోతీ మేకలు రిజర్వుఫారెస్టులో ఫారెస్టు అధికారులు ఇస్రూ ఇంటిపై దాడి చేస్తారు. ఇస్రూ కుర్దూని ఆశ్రయిస్తాడు. కుర్దూ కామ్రేడ్ అన్నని ఆశ్రయిస్తాడు. కామ్రేడ్ అన్నల చేతిలోని

తుపాకి అడవి జంతువుల్నే కాదు, పీడించే మనుషుల్ని చంపగలదని గిరిజనులందరు అనుకొంటారు. ఇదే అడవిలో ఎదురౌతున్న సమస్యలు ఎదుర్కోడానికి వారికి పరిష్కారం దొరికినట్లౌతుందని రచయిత వివరించాడు.

పోలీసులు కాల్పులు జరుపుతున్నా బెదిరిపోకుండా పోలీసులను గూడెం నుండి తరిమిన తీరుని అల్లం రాజయ్య "తుడుం" అన్న కథ చిత్రించింది. తుడుం మోత వినపడిన ప్రతివ్యక్తి కర్రలు తీసుకొని పోలీసులు చుట్టు గుమికూడుతారు. గిరిజనులు ఏమాత్రం భయపడక పోలీసులకు దారి చూపటానికి వచ్చిన గిరిజనేతర వ్యక్తుల్నిద్దర్ని కొండ తిరిగే దాకా తరిమి తరిమి కొడతారు. పోలీసులు భయపడి పారిపోతారు. గిరిజనులలో చైతన్యం తీసుకురావడానికి ఇటువంటి కథలు దోహదపడతాయి. తండాలోని లంబాడీలను పోలీసులు చితకబాదిన వైనాన్ని "ముట్టడి" కథలో ముదిగంటి సుజాత రెడ్డి చిత్రించారు. మెగ్యానాయక్, తండా నివాసులందరు పోలీసులు చేసిన గాయాలతో బాధపడుతుంటారు. రాత్రి తుపాకులతో వచ్చినవాళ్లు ఆచూకి చెప్పమని పోలీసులు వేధిస్తారు. అందరు వాళ్ళు ఎక్కడుంటారో తెలియక మౌనంగా ఉంటారు. లంబాడీల నుండి సమాధానం రాకపోయే టప్పటికి గుడెసెల్లోని వస్తువులు, ఆహార పదార్థాలను ధ్వంసం చేస్తారు. అడ్డువచ్చిన వారిపై లాఠీలు ఝళిపించిన వైనాన్ని రచయిత్రి వివరించారు.

దాడి :

అడవిలో నివసిస్తున్న గిరిజనులు నిరంతరం జంతువులు దాడులతో, ప్రకృతివైపరీత్యాలతో సతమత మవుతుంటారు. దానికి తోడు వైద్య సౌకర్యం అందు బాటులో లేక నిస్సహాయంగా ప్రాణాలు కోల్పోతున్న దీన గాథను ఉదయమిత్ర "దాడి" కథలో చిత్రించారు. వాగు నీటి ప్రవాహం చూసి పెద్దోడు భుజాలు మీద గంగారాంని ఎక్కించుకొని చిన్నోడ్ని పట్టుకొని ముగ్గురు కలిసి వాగులో దిగుతారు. ఈ స్థితిలో గంగారాం చేయినొప్పిని మరిచి పోతాడు. కడకు అందరు నీటి ఉధృతిలో కలిసిపోతారు. ప్రాజెక్టులు గిరిజనుల నివాస ప్రాంతంలో ఏర్పాటు చేయడం వల్ల గిరిజన సంస్కృతి అంతరించే ప్రమాదం ఉంది. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన తర్వాత పునరావాసం చూపకపోవడం వల్ల గిరిజనుల మనుగడ అగమ్య గోచరంగా తయారవుతోంది. పునరావాసం కల్పించి నప్పటికి గోదావరి జిల్లా పాపికొండల్లోనే మరణించడానికి సిద్ధపడేకోయల గాథ "అమానుషం" రచయిత జాతశ్రీ. ప్రభుత్వం నిర్ణయంలో మార్పురాకపోతే అక్కడే ప్రాణాలు వదలి మరుజన్మలో చేపలమై ఆ జలాల్లోనే తిరుగాడు తుంటామని అంటాడు. గిరిజనులకు పోలవరం ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని జగన్నాథంకి బుచ్చి రాములు లేఖ ద్వారా వివరిస్తే, గోపాలం బన్సు ప్రయాణంలో వివరిస్తాడు.

జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టు నిర్మించదలచిన ప్రభుత్వం గిరిజన గూడేలను ఖాళీ చేయించింది. పున రావాసం కల్పించి ఇబ్బంది పడుతున్న తీరుని చిత్రించిన కథ దిలావర్ "అరణ్యరోదన". ప్రాజెక్టువల్ల మానవ సంబంధాలు, సంస్కృతి అంతరిస్తున్న తీరుని గూడెం వద లిన గిరిజనులు పట్టణంలో ఎలా మోసగింపబడుతున్నారో తెల్పుతుందీ కథ.ప్రాజెక్టు నిర్మాణం పనులు చేపట్టడానికి ప్రభుత్వాధికారులు చేసిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన కొండవాసి దీనగాథ, యుద్ధభూమిగా మారిన పోలవరం తీరుని రచయిత శిరంశెట్టి కాంతారావు "పోరువనం" కథ చిత్రీకరించింది. ముత్తెంరెడ్డి చనిపోయిన వెంటనే కొండరెడ్లను పోలీసులు బంధిస్తారు. ముత్తెంరెడ్డి మరణం ప్రాజెక్టు నిర్మాణం ఆపకలిగితే ఎంతోమంది గిరిజనుల జీవితాలు ప్రకృతి పచ్చగా ఉంటాయని వివరించారు. తిండికి లేకపోయినా గౌరవంగా జీవించాలనుకొనే గోండు వ్యక్తి గాథ ఫణికుమార్ రచించిన "రాజాసాబ్". ఫణి కుమార్ గిరిజనుల సిద్ధాంతాల్ని, ఆచారాల్ని గౌరవించాలని తెలుసుకొంటాడు. తినడానికి తిండిలేక పోయిన రాజ వంశానికి చెందినవారు కావడం వల్ల ఎవరిని ఆశ్రయిం

చరు. గిరిజనుల సమస్యకు చక్కని పరిష్కార మార్గాలు సూచించిన వయోవృద్ధుని సేవను, అభిప్రాయాలను వ్యక్తీకరించిన కథ "గోండ్వానా భీష్ముడు" ఫణికుమార్ రచించారు. పదోతరగతి చదివిన గిరిజనులనే పాఠశాల అధ్యాపకులుగా నియమిస్తే మంచి ఫలితం ఉంటుందని సూచిస్తాడు.గోండుల జీవన యానంలో వ్యవసాయపు పని ప్రారంభమైనప్పటి నుండి పంట చేతికొచ్చే దాక ప్రతి పనికి కోడిని బలివ్వడం సంప్రదాయం. నిరుపేదలయినా అప్పోసప్పో చేసి సంప్రదాయాన్ని కొనసాగించటానికి బద్దుడై అప్పుల ఊబిలో కూరుకుపోయే తీరుని "కాయిదా" కథలో సాహు చిత్రించారు. ఈ కథలో గోండుల సంస్కృతి, సంప్రదాయాలను చక్కగా వివరించారు. గోండు తెగలోని వివాహ సంప్రదాయం కొనసాగించలేక పడుతున్న అవస్థ లను సాహు "పెళ్ళికావాలి" అన్న కథలో చిత్రించారు. సమాజంలో గిరిజనులు పలురకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. గిరిజనులకు గిరిజనేతర వ్యక్తులతో సంబంధం ఏర్పడినప్పటి నుండే సమస్యలు ప్రారంభ మయ్యాయి. జంతువులకంటే గిరిజనేతర మానవున్ని చూస్తే చాలా భయపడతారు.గిరిజనుల సంస్కృతి, గిరిజన పోరాటాలు, గిరిజన సమస్యలు, తెలుగు కథా సాహిత్యంలో గిరిజన జీవితాలను చిత్రించిన కథల ఇతి వృత్తాల పరిశీలన చేయడం జరిగింది. గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు, భాష రోజురోజుకీ అంతరించి పోతుంది. ఈ సంస్కృతిని పరిరక్షించుకోవడం కొరకు గిరి జనులు, ప్రజా ప్రతినిధులు మరియు తదితరులు నడుము బిగించాలి.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అయ్యగారి శ్రీనివాసరావు గారి కథలు – సామాజిక విశ్లేషణ

- సేవేని రామస్వామి, పరిశోధక విద్యార్థి, ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం, రాజమండ్రి.

ప్రపంచం అంటే ఏమిటో తెలియని దశలో అమ్మమ్మ, నానమ్మ చెప్పిన కథలు విని ఆనందించాము. ఆ ఆనందంలో ఎన్నో అనుభూతులు, కోరికలు, లక్ష్యాలు, గొప్ప భావనలు నేర్చుకున్నాము. పెరిగి పెద్దయ్యాక చదివి ఆనందించాము. కాలంలో ఎన్నో మార్పులు. కాలచక్రం ఆగకుండా తనపని తాను చేసుకుని పోతుంది. కాల గమనంలో పెనుమార్పులు. మార్పు మంచిదే. ప్రాచీనం నుండి నవీనం మంచిదే. కానీ తల్లివేరు వంటి ప్రాచీనాన్ని మరువకూడదు. మనం చిన్నప్పుడు ఏడుస్తుంటే అమ్మ దగ్గరకు తీసుకుని గోరుముద్దలు తినిపిస్తూ, చందమామని చూపిస్తూ చెప్పిన కథలను ఎలా మరువగలం. పశువులను కొష్టంలో కట్టేసి వచ్చిన తాతయ్య చెప్పిన ఏడు చేపల కథను ఎలా మరువగలం. పాఠశాలలో పంతులు గారు చెప్పిన కథల ద్వారా పాఠ్యాంశ బోధన ఎలా మరువ గలం. ఎప్పటికీ మరువలేం. ఎందుకంటే జీవితానికి పునాది రాళ్ళు అవి. వారు చెప్పే అంశాలు, అనుభవాలను ఆధారం చేసుకుని వాస్తవానికి సన్నిహితంగా ఉండే విధంగా తీర్చి మనకు కథలు రూపంలో చెప్పారు కాబట్టి.

రచయిత ఋషితో సమానం. తన రచనల ద్వారా సమాజానికి సందేశాన్నిచ్చి మార్పులు తెస్తాడు కాబట్టి. ప్రతి కథకి ఒక అనుభవం, ఒక ప్రేరణ అవసరం. రచయిత మనుషుల ద్వారా స్వభావాల్ని ఆకళింపు చేసుకుని, వారి జీవన విధానాన్ని, ప్రవర్తన, తీరుతెన్నులు గమనిస్తే నిజమైన కథలు ఎన్నో బయటకు వస్తాయి. స్థూలంగా కథ ఒక వ్యక్తి జీవితానికి దర్పణం వంటిది. మధ్యతరగతి మనుషుల జీవితాలని కథావస్తువుగా ఎంచుకొని, నిరాశా నిస్పృహలతో కృంగిపోతున్న వారి జీవితాలలో వెలుగులు నింపే ఆత్మ విశ్వాసం వారిలో కలిగించి, పేదరికంలో పుట్టడం శాపం కాదు ఒక వరం అనే పట్టుదలను సమ కూర్చిన కథారచయిత శ్రీ అయ్యగారి శ్రీనివాసరావు గారు. వీరి రచనలు పరిశీలించినట్లైతే సమాజాన్ని ఎక్కువగా చదివినట్లనిపిస్తుంది. సగటు మనిషి పడే బాధలు, తీరలేని కోరికలు వీరి కథలలో స్పష్టమవుతాయి. యాంత్రిక జీవనంలో పరుగెడుతున్న ఈ కాలంలో, కుటుంబాలలో ఉండే అంశాలను వాళ్ళకి తెలియచేసి, సంబంధ బాంధవ్యాలు సన్నగిల్లకుండా, తల్లిదండ్రుల మీద ప్రేమాభిమానాలు కలిగే విధంగా, విచ్ఛిన్నమైన కుటుంబా లను ఒక్కటి చేసే విధానాలు వీరి కథలలో చాలా స్పష్టంగా మనకు కనిపిస్తాయి అనటంలో ఏమాత్రం సందేహం లేదు. అటువంటి అమూల్యమైన వీరి కలం నుండి జాలువారిన "ఒకరికి ఒకరై" కథాసంపుటి నుండి కొన్నింటిని ప్రస్థావిస్తాను.

తల్లిదండ్రుల నుండి కేవలం ఆస్థిపాస్తులనే వార సత్వంగా తీసుకోకుండా వారి అనుభవాలని ఆస్థిగా తీసుకుంటే భవిష్యత్‌కి మంచి బాటలు పడతాయని, కాలాలు మారినా, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినా పెద్దవాళ్ళ ఆలోచనలు తప్పనిసరిగా పిల్లలకి కావాలి, పాదుపు మీద అవగాహన ఉండాలి. పెద్దలు కుటుంబా లతో కలిసి ఉండాలి. అటువంటప్పుడు కుటుంబాలు సంతోషంగా ఎటువంటి ఆర్థిక బాధలు లేకుండా సుఖ సంతోషాలతో ముందుకు వెళతారని చెప్పే కథ "బిందువే సింధువు".

కైలాసం, విమల భార్యాభర్తలు. చక్కని కుటుంబం. విమల ఇంట్లో అన్ని పనులు బాధ్యతగా చూస్తుంటుంది. కైలాసం విమల మేనత్త కొడుకు కావడంతో భర్త దగ్గర కొంచెం చనువు ఎక్కువగానే ఉంటుంది. కైలాసం స్వశక్తితో మంచి ఉద్యోగం సంపాదించాడు. ఒక అన్న కూడా ఉన్నాడు. కైలాసం మంచివాడే కానీ కొంచెం ఖర్చు మనిషి. రేపు అనేది ఒకటి ఉంటుందని తెలియని మనిషి.

అంతకు ముందు అందరూ కలిసి ఉన్న కుటుంబాన్ని కైలాసం నాన్నగారు పరిస్థితులు గమనించి కొడుకులిద్దరికీ బాధ్యతలు తెలియాలని వేరు కాపురం పెట్టించి ప్రతి నెలా ఇద్దరూ అతనికి రూ.500/-లు ఇవ్వాలి అనే ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఐదు సంవత్సరాల నుండి అదే జరుగుతూ వస్తుంది.

ఒకరోజు నెల జీతం రావడంతో రోజువారీ ఖర్చులు లెక్కవేస్తూ విమలతో మాట్లాడుతున్నాడు కైలాసం. మాటల్లో ఈ నెల మీ నాన్నగారికి మామూలుగానే రూ.500/-లు ఇవ్వాలి కదా అంటుంది విమల. ఆ మాట విన్నకైలాసం నీరసంగా మా నాన్నకు రూ.500/-లు పెన్షన్ వస్తుంది కదా! రూ.500/-లు ఎందుకు ఇవ్వాలి అంటాడు. అయినప్పటికీ తండ్రిమీద గౌరవంతో సరే ఇస్తాలే, నా పాట్లు నేను పడతాలే అంటాడు. విమల మాత్రం భర్తతో మనం ఎంత సంపాదిస్తున్నా అందులో ఎంతో కొంత పొదుపు చెయ్యాలి అని చెప్తూ ఉండేది. కానీ కైలాసం అవేవీ పట్టించుకునేవాడు కాడు.

కైలాసం తన స్నేహితులకు ఏదైనా అవసరం ఏర్పడితే లేదనకుండా సహాయం చేసి వాళ్ళ అవసరాలు తీర్చేవాడు. ఒకరోజు ఎందుకో తనకు బాగా డబ్బులు అవసర మయ్యాయి. స్నేహితులను అడిగాడు. ఆ సమయంలో ఎవరూ తనకు సహాయం చేయలేదు సరికదా డబ్బు లున్నప్పుడు కొంత జాగ్రత్త పడాలి అని ఉచిత సలహాలు ఇచ్చారు. అది విన్న కైలాసానికి కనువిప్పు కలిగి ఆలోచనలో పడ్డాడు. ఒకరోజు కైలాసం "చినుకు చినుకు కలిస్తే జాలువారు ధారలు, ధారలన్నీ ఏకమైతే నదులు తీయును పరుగులు" అంటూ పాడుతూ వస్తున్నాడు ఇంటి లోపలికి. అది గమనించిన భార్య ఏంటీ? ఈ రోజు చాలా హుషారుగా ఉన్నారు అని అడిగింది. అప్పుడు కైలాసం తను పోస్టాఫీసులో ఆర్.డి. (రికరింగ్ డిపాజిట్) కట్టిన విషయం చెప్పి, ఇప్పుడు నాకు ఎంత ఆనందంగా ఉందో తెలుసా అంటాడు. ఇంతలో వెనుక నుండి ఓ గొంతు ఓరేయ్ కైలాసం! నీకు మరో ఆనందకరమైన విషయం చెబుతాను విను అని కైలాసం వెనుకకు తిరిగి ఏంటి నాన్నా అది అని అడుగుతాడు. నువ్వు ఆర్.డి. (రికరింగ్ డిపాజిట్) రూ.50,000/-లు దాస్తే నీ దగ్గర ప్రతి నెలా రూ.500/-లు తీసుకుని నేను ఒక లక్ష రూపాయలు దాచాను. అవి నాకోసం కాదు నాన్నా నీ కోసమేరా అంటూ తండ్రి చెప్పిన మాటలకు కైలాసం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి ఆనందంతో కూడిన ప్రేమతో. ఇది సంక్షిప్త కథ.

ఈ కథలో రచయిత కుటుంబ సంబంధాల గురించి, ఒకరికొకరు సహాయం చేసుకునే తత్వం గురించి, పొదుపు చేస్తే భవిష్యత్ బంగారుమయం అవుతుందనే సందేశాత్మకం, పూర్తిగా విలువలు కోల్పోతున్న ఈ తరుణంలో ఎవరు నిజమైన స్నేహితులు అనే కనువిప్పు కూడా రచయిత సమాజానికి తెలియజేశాడు.

అయ్యగారి శ్రీనివాసరావు గారి కథా సంపుటిలో నుండి మరొక కథ ఓ ఇం(టి)తి కథ.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మంచిదే. కానీ అందరూ అన్ని పనులూ సహకరిస్తేనే కుటుంబంలో ఎటువంటి లోపాలు ఉండవు. జీవనదిలా సాగిపోతుంది. అలా కాకుండా పని మొత్తం ఒకరి మీద వదిలేసి పెత్తనం చేసే వాళ్ళుంటే ఆ కుటుంబం ఎడారిలా మారిపోతుంది.

పేరు సావిత్రి. ఇంటి పెద్ద కోడలు. సహజంగానే పెద్ద కోడలుకి పెత్తనంతో పాటు బాధ్యతలు కూడా ఎక్కువే. కానీ ఇక్కడ పెత్తనం కంటే పనే ఎక్కువ. సావిత్రి చాలా సహనపరురాలు. ఎవరికీ ఎదురు చెప్పేది కాదు. అత్త, మామల సేవతో పాటు భర్త పనులు, పిల్లల పనులు, ఇంట్లో మిగిలి ఉన్న పనులు తనే చూసేది. మిగతా వాళ్ళు కూడా సావిత్రికే అన్ని పనులు చెప్పడం అలవాటయింది.

ఒకరోజు సావిత్రి మామ గారికి ఆరోగ్యం సరిగా లేక మంచాన పడ్డారు. అప్పటి నుండి సావిత్రికి కష్టాలు ఇంకా ఎక్కువయ్యాయి. ఇంకేముంది అతనిని చూడటానికి

చుట్టాల తాకిడి ఎక్కువయ్యింది. వచ్చిన వాళ్ళు చూసి వెళ్ళకుండా రోజుల తరబడి అక్కడే స్థిరపడి ఉండే వాళ్ళు. ఉన్నవాళ్ళు పనులలో కొంచెం సాయం చేస్తారంటే అదీ లేదు. ఒక్కోసారి తన భర్తకు కూడా పనులు చేసే స్థితిలో లేకుండా వచ్చిన వాళ్ళకే పనులు చేసే అంత స్థితిలోకి వెళ్ళిపోయింది సావిత్రి.

ఇంటికి పెద్ద కోడలు కావడమో, ఆపై నెమ్మదస్తురాలు కావడం దేని నుండి తప్పించుకోలేక తనలో తానే కృంగి పోయేది. తన మామ గారికి వచ్చిన జబ్బుకు డబ్బు చాలానే ఖర్చు అయింది. డబ్బంటే అప్పో సొప్పో చేస్తారు గానీ, వచ్చిన చిక్కల్లా చుట్టాలతోటే వస్తుంది. మామ గారికి బాగోలేదని తెలిసినప్పటినుండి మరదళ్ళు, ఆడపడుచులు, వాళ్ళ భర్తలు, అత్తగారి వైపు, మామగారి వైపు చుట్టాలు తాకిడి ఎక్కువైంది. వీరందరి అవసరం తీర్చడం కొండంత పనవుతుంది సావిత్రికి. ఒకరోజు జరిగిన విషయం అంతకుముందు రెండు రోజులనుండి కుళాయి రాలేదు. ఆ రోజు వచ్చింది. అదికూడా ఒక అరగంట మాత్రమే వస్తాయి. సావిత్రి ఊపిరి సలపని పనిలో ఉండటంతో తన ఆడపడుచు సుశీలతో కొంచెం నాలుగు బిందెలు నీళ్ళు పట్టమ్మా అనింది. అంతే కస్సుమని పైకి లేచింది ఆడపడుచు. మేమేమీ మీ ఇంట్లో ఉండటానికి రాలేదు వదినా! మా నాన్నకి బాగోలేకపోతే చూడటానికి వచ్చాము. మీ ఇంట్లో చాకిరీ చేయడానికి కాదు. నీకంత కష్టంగా ఉంటే చెప్పు. ఇప్పుడే వెళ్ళిపోతా. అంతేకానీ ఇటువంటి పనులు చెప్పి మమ్మల్ని చిన్నబుచ్చడం మంచిది కాదు అని అంది కోపంగా. ఆ మాట వినగానే అత్తగారు కూడా కూతురు వైపు మాట్లాడి సావిత్రి మీద విరుచుకు పడింది. ఇదంతా చూస్తున్న వాళ్ళంతా ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయారు తన తోడి కోడళ్ళతో సహా. సావిత్రికి చాలా బాధ అనిపించింది.

కొన్ని రోజుల తర్వాత చుట్టాలు ఒక్కొక్కరూ వెళ్ళి పోయారు. ఇల్లంతా బోసిపోయింది. తను, భర్త, అత్త గారు, మామగారు. రేషన్‌కు చుట్టాలకోసం 12 వేలు దాటింది. మందుల ఖర్చు 25 వేలు పైనే. అదీకాకుండా ఆడపిల్లలు వచ్చి వెళ్ళేటప్పుడు వాళ్ళ మర్యాదలలకు రూ.5 వేలు, ఇంకా అందరూ కలిసి ఎలా పడితే అలా టి.వి. ని ఉపయోగించటం వలన రిపేరు, మంచాల రిపేరు, టెలీఫోను రిపేరు అన్నీ నష్టాలే. ఇంతలో మామ గారు మరునటి రోజే కాలం చెందడం సావిత్రికి ఒక రకమైన భయం పట్టుకుంది. అయినప్పటికీ బాధను పంటి క్రింద ఉంచుకుని భూమాత లాగా భరించిందే కానీ, బయటకు వ్యక్తపరచలేదు. ఆ దేవుడ్ని ఒకటే కోరుకుంది. బంధువులు వచ్చినా రాబందుల్లా మాత్రం ప్రవర్తించకుండా సద్బుద్ధి వాళ్ళకు ప్రసాదించమని.

ముగింపు :

ఈ కథలో రచయిత మధ్యతరగతి కుటుంబంలో ఉన్నటువంటి స్థితిగతులు, పెద్దకోడలి కష్టాలు, అన్నీ తెలిసినా ఎటూ మాట్లాడలేని భర్త పరిస్థితి, కావాలని ఏదో వంకబెట్టుకుని ఇంటికి వచ్చి వాళ్ళ స్థితిగతులతో సంబంధం లేకుండా ప్రవర్తించే చుట్టాల ప్రవర్తనలు. ఇంటికి రావడం తప్పు కాదు, ఇచ్చి పుచ్చుకోవడంలో తప్పు లేదు. కానీ పరిస్థితులను అర్థం చేసుకుని వెళ్ళమని రచయిత ఈ కథలో ఇచ్చిన సందేశం ఎందరినో ఖచ్చితంగా ఆలోచింపజేస్తుంది.

ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియల్లో కథ ఉన్నత శిఖరాలు అధిరోహించింది అనడంలో ఏమాత్రం సందేహం లేదు. ''ఒకరికి ఒకరై'' కథా సంపుటిలో రచయిత సామాజిక పరిస్థితులను కథావస్తువులుగా తీసుకుని సందేశాన్నివ్వడం, పరిమిత పాత్రలతో క్లుప్తంగా వివరణ ఇవ్వడం ఆయన రచనా శైలికి నిదర్శనం.

ఆధార గ్రంథాలు : -

1. ఒకరికి ఒకరై (కథల సంపుటి) - శ్రీ అయ్యగారి శ్రీనివాసరావు 2. కథలెలా రాస్తారు (అనుభవాల సంపుటి)
3. విశాలాంధ్ర - తెలుగు కథ (1910-2000) 4. తొలిమలితరం - తెలుగు కథలు (డా॥ అక్కిరాజు రమాపతిరావు)

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దాశరథి రంగాచార్య నవలలు – వామపక్ష భావాలు

- పి. రమేష

నైజాం రాజ్యంలో నిజాం పాలనా కాలంలో జన్మించిన దాశరథి రంగాచార్య మొదట ఆంధ్ర మహాసభ, ఆర్య సమాజాలు వేర్వేరుగా నిజాం పాలనలోని లోపాలను ఎదుర్కొంటున్న తీరుకు ఆకర్షితులయ్యారు. తండ్రి సనాతనవాది ఐనా అన్న దాశరథి కృష్ణమాచార్యులు ప్రఖ్యాత అభ్యుదయ కవి. "ఆయన సాంగత్యంలో అభ్యుదయ భావాలను, విప్లవ భావాలను అలవర్చు కున్నారు రంగాచార్య. చిన్నతనం నుండి అన్యాయ మనిపించినదాన్ని వ్యతిరేకించడం ఆయన నైజం. తెలంగాణ సాయుధ పోరాటం నాటి స్థితిగతులు, ఆ కాలంలోని దారుణమైన బానిస పద్ధతులను దాశరథి రంగాచార్య చిల్లరదేవుళ్ళు, మోదుగుపూలు, జనపదం నవలల్లో కళ్లకు కట్టినట్టు చూపించారు. చిల్లర దేవుళ్లు నవలలో సాయుధపోరాటం ముందు స్థితిగతులు, మొదుగుపూలు నవలలో తెలంగాణ సాయుధ పోరాట కాలం నాటి పరిస్థితులు, అనంతర పరిస్థితులను 'జనపదం'లో చిత్రించారు.

మానవ శ్రేయస్సె అంతిమ లక్ష్యంగా గల మార్క్సిజం, విశ్వమానవ శ్రేయస్సును, వసుదైక కుటుంబాన్ని కాంక్షించే భారతీయ తాత్వికతలను ఆలంబనగా చేసుకుని తనదైన శైలిలో రచనయాత్ర కొనసాగిస్తున్నారు. తెలంగాణా జన జీవితాలను చిత్రించే నవలలు, కథలు, కవితలు, అను వాదాలు, రామాయణ, భారత, భాగవతాలు, వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు ఇలా భిన్నంగా ఆయన అక్షర సృష్టి సాగింది.

రంగాచార్యులు తెలంగాణాలో అంగ్రేజిపాలకుల అనర్థపాలనను ఎదిరించె జాతీయోద్యమంలో స్వయంగా పాల్గన్నారు. అంతేకాక నిజాం నిరంకుశ పాలనను తెగింపుతో ఢీకొన్నారు. ఉద్యమాలలో పాల్గన్నారు. ఈ ప్రాంతం ఉద్యమాలకు కారణభూతాలైన అనేక విషయా లను రికార్డు చేసె విధానంలో భాగంగా తెలుగు సాహితీ ప్రక్రియల్లో నవలను ఎంచుకుని చిల్లర దేవుళ్ళు, మోదుగుపూలు, జనపదం, మాయజలతారు, రానున్నది వంటి నవలలు వ్రాశారు. దాశరథి, రంగాచార్య నవల్లో ప్రధానంగా తెలంగాణా సామాజికాంశాలె యితివృత్తా లైనాయి. స్వయంగా చూసిన పరిణామాలు, అనుభ వించిన కష్టనష్టాలు, సంఘటనలు, పరిసరాలు. అన్నీ వారి నవలలకు కేంద్ర బిందువులు అయ్యాయి. పాశవిక ప్యూడల్ వ్యవస్థలోనె అసాంఘిక ఆచారమైన 'ఆడబాప' విధానం బాల్యంలోనె దాశరథి రంగాచార్యుల్ని కలచి వేసింది. వారి చిల్లరదేవుళ్ళు నవల్లో ఆ ఆడబాప విధానం. ప్రవేశపెట్టడం జరిగింది. చిన గూడూరులో వారి ఇంటి పక్కన అమృతపాణి అనే ఆడబాప కూతురు ప్యూడల్ పాశవికానికి బలి అవ్వడం మరచిపోలేక చిల్లరదేవుళ్ళు నవల్లో 'వనజ' పాత్రగా తెలియజేశారు. ఆ పిల్లతల్లి పేరుతో 'అమృతపాణి'గా జనపదంలో చోటు చేసుకుంది. దాశరథి గారు పుట్టిన వరంగల్ జిల్లా 'చినగూడూరు' గ్రామం చిల్లరదేవుళ్ళు నవలా తెలంగాణా సమాజంలో గ్రామీణ ప్యూడల్ శక్తులు, దొరలయిష్టా రాజ్యాలు, ప్రజల భూమి హక్కు పోరాటాలు, వెట్టి నిర్మూలన, నిజాం వ్యతిరేక పోరాటాలు అన్నీ దాశరథి రంగాచార్యులు గారి నవలల్లో జీవం పోసుకున్నాయి. ప్యూడల్ సమాజంలో 'మతం' ఒక అభివ్యక్తిగానూ, స్వార్థ చింతనగానూ, ఒక దుర్మార్గంగానూ, ఒక విశ్వాసం గానూ, అందించిన విషయాల పరంగా తెలంగాణా గ్రామీణ సమాజం ఏ విధంగా బలైంది 'చిల్లరదేవుళ్ళు' నవల్లో దాశరథి రంగా చార్యులు గారు దర్శనీయం చేశారు.

రంగాచార్యులు గారు 'పావని' నవల్లో 1960-70 దశకంలో తెలంగాణా గ్రామాల్లోని ప్రాథమిక విద్యారంగం

పరిస్థితులను పాత్రలు, సంఘటనలతో ముడివేసి తెలియ జేశారు. అంపశయ్య నవీన్‌గారు ముళ్ళపాదలు నవల్లో యువకుల్లో విద్యానంతర పరిస్థితులు, ఉద్యోగాల వేట దాని తాలూకు పరిస్థితులను అయిదుగురు కథా నాయకుల ద్వారా తెలియజేశారు. ఈ నవల్లో వేణుపాత్ర ద్వారా తెలియజేసిన ప్రాంతీయాభిమానం తాలూకు అంశంలో తెలంగాణా సామాజిక జీవన పరిస్థితులు, విశాలాంధ్రలో తెలంగాణా ప్రజల దుస్థితిని సమగ్రంగా తెలియజేశారు. అంతె కాకుండా 1969 నాటి తెలంగాణా ఉద్యమాన్ని అనేక కోణాల్లో నిశితంగా పరిశిలించారు. దోపిడీ వ్యవస్థను గర్హించె విద్యార్థులు పోరాటంవైపు ఎలా ప్రభావితమైందీ కళ్ళకు కట్టినట్లు దర్శింపచేశారు.

దాశరథి రంగాచార్యులు గారు చిల్లరదేవుళ్ళు, మోదుగుపూలు జనపదం నవలల్లో తెలంగాణా పోరాట చరిత్ర నేపధ్యంగా రచించారు. స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం పాలనలో నిదమననీతి, జల అసంతృప్తి తెలం గాణా గ్రామీణ సమాజం బలహీన స్థితి, నిస్సహాయత లను 1938-41 మధ్య కాలంలో తెలంగాణా సమాజాన్ని, సామాజికాంశాలను స్పష్టంగా తెలియజేశారు. నిజాంపై ప్రజల వ్యతిరేకపోరాటంలోని రెండడవ దశను 1942-48 కాలాన్ని మోదుగుపూలు నవల్లో తెలియజేశారు. జనపదం నవల్లో 1948-67 మధ్యకాలంలోని తెలంగాణా సామాజి కాంశాలను తెలియజేశారు. 1938 నాటి నుండి తెలం గాణా పల్లెల సామాజిక, ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక వెనుకబాటుతనాన్ని దాశరథి రంగాచార్య చిల్లరదేవుళ్ళు, మోదుగపూలు, జనపదం, పావని, మాయజలతరు, రానున్నది ఏది నిజం నవలల్లో స్పష్టంగా తెలియజేశారు. మానవ సంబంధాలు, మతమార్పిడులు, ఆర్థిక సంబం ధాలు, రాజకీయ సంబంధాలు మొదలైన సామాజిక వాస్తవాంశాలు స్పష్టంగా విశదపరిచారు. ప్రాథమిక విద్య దాని అవసరం, గ్రంథాలయోద్యమం మొదలైన సంస్క రణాత్మక అంశాలను కొన్ని ప్రయోగాత్మక పరిష్కారాలతో తెలియజెప్పి మార్పు తప్పనిసరి అని తేల్చారు. తెలంగాణా 20వ శతబ్ది ఏ విధంగా ఉద్యమాలు చేపట్టింది. వాటి వెనుకవున్న కారణాలను స్పష్టంగా తెలియజేశారు.

స్వాతంత్ర్యానంతర కాలంలో స్వాతంత్ర్య సమర యోధులుగా గుర్తింపును పొందే ప్రయత్నాలు ఆరంభ మయ్యాయి. ఇటువంటి ప్రయత్నాలు చేసిన వారిలో నిజమైన వారున్నారు. వారితో పాటు నకిలీ యోధులు కూడా సిద్ధమయ్యారు. వీరు రాయితీలు, పారితోషికాల కోసం పైరవీలు ముమ్మరం చేశారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో గ్రామాల్ని విడిచివెళ్ళిన కొంతమంది భూస్వాములు కొత్తగా గాంధేయ వాదులయ్యారు. స్వాతంత్ర్య సమరయోధులుగా కొత్త గుర్తింపు కోసం ఆరాట పడ్డారు. బలరామయ్యకు గాంధీ గురించి తెలియదు. ఖద్దరు దుస్తుల్ని ఎందుకు ధరిస్తారన్నది కూడా ఆయన అవగాహనలో లేదు. గాంధీతత్వాన్ని ఏ మాత్రం అర్థం చేసుకోలేని బలరామయ్య స్వభావాన్ని 'జనపదం' నవలలో ఆయన మాటల ద్వారా రచయిత వ్యక్తీకరించారు.

'మనం ఖద్దరు కట్టుకోవాల్నయా తప్పదా రామల్ల ఆ గాంధీగారు చెప్పి ఓయిండంటాంటివి. నిజంగ చెప్పిండో లేదో తెల్వదాయె. ఆయన్ననే చూడనైతి. చెప్పింది వినినైతి. అది మనోండ్లు చెప్పిరి. మనమేమొ ఇనాల్నాయె. నలుగురు చూసెటందుకు కట్టుకున్నామనుకో అయ్య గారు అందరికి చెప్పి ఉల్లిగడ్డతినొద్దని తానేం తినకుండు న్నారు. మొగోళ్లం మనమెట్లనన్న ఏడస్తం. ఆడోళ్ళ కెందుకయా అది ఆ సుందరావు కాడికి పోయొచ్చింది. మనిషి పూర మారిపోయిందనుకో, చూస్తున్నవుగద, ఇల్లంతా ఖద్దరు చేసింది. ఈ ముతక బట్టలెందుకయ్యా మనకు, మా తాతలు కట్టిన్రు, తండ్రులు కట్టిన్రు ఆ మాటంటె కోపమొస్తది. ఇగ కిర్రు కిర్రుమని రాట్నం తిప్పుతు కూచుంటది అంటాడు బలరామయ్య. గాంధీ గురించిన అవగాహన లేని వ్యక్తి గాంధేయవాదిగా చెలా మణిలోకి వచ్చి అధికారాన్ని అనుభవించడం వైచిత్రిగానే కన్పిస్తుంది. బలరామయ్యకు అమృత పాణికి జన్మించిన రామయ్య 'జనపదం' గ్రామంలో కొత్త దొరగా అవతరిం

చాడు. అతడు ఒకప్పుడు సాయుధపోరాటం చేసినరోజుల్లో వీరభద్రం శిష్యుడు. కాలంతోపాటు రంగుమార్చుకున్నాడు. రామయ్య ఊరిలో కొత్త దొరగా అవతరించాడు. తెలంగాణ గ్రామసీమల్లో ఆవిర్భవించిన కొత్తదొరల సంస్కృతిని గురించి శాసనసభలో వీరభద్రం చేసిన ప్రసంగం ఆనాటి పరిస్థితుల్ని వాస్తవికంగా చిత్రించింది.

'కొత్త దొరలు ఊరురా వెలిశారు. సారాయి, గూండాలు వారి రాజకీయాలైనాయి. ఈ కొత్త దొరలకు నడమంత్రపు సిరి వచ్చింది. డబ్బు కోసం వారు తలలు తీయటానికి సైతం వెనుకాడటంలేదు. గుండెలు తీసిన బంట్లయినారు. ప్రభుత్వయంత్రాంగం వారికి అన్ని విధాలా సహకరిస్తుంది. అసలు ప్రభుత్వం చేస్తున్నది కొత్త దొరలా? ఎన్నికైన శాసన సభ్యులా? అనే విషయం అర్థం కాకుండా ఉంది. ప్రజలు విసిగిపోయారు. న్యాయం అనేది మందులోకి సైతం దొరకడం లేదు. ప్రభుత్వం ఈ విషయంలో గట్టి సూచనలు తీసుకోకుంటే పరిస్థితులు విషమించే సూచనలున్నాయి. అక్షరాక్షర సత్యంగా వీరభద్రం పలికిన మాటలు అనంతర కాలంలో వాస్తవాలుగా మారాయి. కొత్త దొరల ప్రాబల్యం నానాటికీ పెరిగింది. రెండవ శాసనసభ ఎన్నికల్లో ప్రజల మనిషి వీరభద్రం ఓడిపోయాడు. కొత్త దొర రామయ్య విజయదుందుభి మోగించాడు. మంత్రి పదవిని సాధించుకున్నాడు. గ్రామాల్లో పాతుకొనిపోయిన అసలు దొరల్ని సాయుధ పోరాటం ద్వారా బయటకు తరిమిన వీరతెలంగాణలో కొత్త దొరల ఆవిర్భావం విస్మయకరమైన రాజకీయ పరిణామం. దీన్ని 'జనపదం' నవల ఎంతో స్పష్టంగా చిత్రించింది.

తెలంగాణ రాజకీయాలకు ఇక్కడి భూవసతికి దగ్గరి సంబంధం ఉంది. భూయాజమాన్యం వ్యక్తుల సామాజిక గౌరవాన్ని పెంచింది. భూస్వాములకు ఎటువంటి పెట్టుబడులు అవసరంకాని మిగులు ధనాన్ని ఇది సమకూర్చి ఇచ్చింది. ఈ మిగులు ధనం రాజకీయ రంగంలో పెట్టుబడిగా వారికి ఉపయోగపడింది. విస్తారమైన భూ కమతాల్లో పనిచేసే పాలేర్లు రైతు కూలీలు. గుమాస్తా యంత్రాంగం యావత్తు అనివార్యంగా భూస్వామి కనుసైగల్లో ఉండవలసివస్తుంది. దీనితో సహజంగానే భూస్వామి పలుకుబడి పెరిగిపోయింది. తెలంగాణ ప్రాంత రాజకీయాల్ని భూస్వాములు దాదాపుగా శాసించగలిగారు. దాశరథి రంగాచార్య రచించిన 'పావని' నవలలోని శివయ్య భూపరిమితి చట్టం పట్ల ఆందోళనతో పట్నం చేరుకున్నాడు. అతడు ఒక పెద్ద నాయకుడిని కలుసుకున్నాడు. 'భూసంస్కరణలు ప్రవేశపెట్టారు. ముందు భూమి దక్కించుకో తరువాత మిగతాది చూసుకోవచ్చు. మనకు బలం భూమి. అది లేకపోతే మనం పోతాం. సుభద్రమ్మకు విడాకులివ్వు. ఆమెకోపాలు దక్కుతుంది.'21 అని ఆ అధినేత శివయ్యకు హితబోధ చేస్తాడు. అతడి సలహాను పాటించి తన భార్య సుభద్రమ్మకు విడాకులు ఇచ్చేందుకు శివయ్య సిద్ధమవుతాడు.

తెలంగాణ ప్రాంతంలో భూమికీ రాజకీయాలకూ మధ్య ఉన్న సంబంధాలు ఇక్కడ స్పష్టపడుతున్నాయి. అయితే 1980వ దశాబ్ది తర్వాత పరిస్థితులు మారాయి. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో వామపక్ష తీవ్రవాదం విజృంభించింది. ఈ పరిస్థితుల్లో వామపక్ష తీవ్రవాదానికి భయపడిన భూస్వాములు నగరాల్లో కొత్త వ్యాపారాన్ని ఆరంభించారు. అక్కడి భూములు బీళ్ళుగా మారాయి. భూస్వాముల వ్యాపార సంస్కృతి నగరాల్లో ప్రస్తుతం తన ప్రభావాన్ని చూపుతోంది. అయితే రంగాచార్య 1980 తర్వాత రచించిన ప్రముఖమైన నవలలులేవు. అందువల్ల ఇటీవలి కాలపు స్థితిగతుల చిత్రీకరణ ఆయన నవలల్లో దొరకదు. ఎన్నికల ప్రక్రియల కారణంగా స్వతంత్ర భారతదేశంలో సమూలమైన మార్పులు రావడం సాధ్యం కాదనే అభిప్రాయంతో యువతరం సాయుధ పోరాటం వైపు సిద్ధంకావడం రంగాచార్య 'జనపదం' నవలలో సమర్థవంతంగా చిత్రించబడింది.

శ్రీకాకుళం జిల్లాలో అక్కడి రైతులు గిరిజనులు

ఆరంభించిన 1970 నాటి పోరాటం అప్పటి తెలంగాణ లోని విద్యావంతులైన యువతరానికి స్ఫూర్తి నిచ్చింది. 'జనపదం' నవలలో ప్రకాశం పాత్ర తీవ్రవాద వామపక్ష భావనలకు ప్రతినిధి. ప్రకాశం జననం వెనుక ఒక నేపథ్యం ఉంది. కొత్త దొరగా అవతరించిన రామయ్యకు, తెలంగాణ సాయుధపోరాట సందర్భంగా భర్తను కోల్పోయిన మంగమ్మకూ జన్మించిన వాడు ప్రకాశం. మంగమ్మను వీరభద్రం వివాహం చేసుకున్నాడు. ఇందులో గొప్ప త్యాగం ఉంది. అందులో ప్రకాశంకు ఒక సామాజిక స్థాయిని కల్పించాలనే సంకల్పం ఉంది. ప్రకాశం చదువు సంధ్యల బాధ్యతలన్నీ వీరభద్రం స్వీకరించాడు. ప్రకాశం ఆయనను కక్కయ్య అని పిలిచేవాడు. ప్రకాశం ఎంతో చురుకైనవాడు. చిన్ననాటి నుంచి తన చుట్టూ ఉన్న సమాజాన్ని, సమకాలీన పరిస్థితుల్ని గమనించినవాడు. రామయ్యవంటి దుర్మార్గులు, అవినీతి పరులు అంతకంతకూ ఎదిగిపోతూ ఉండడం, మిగతాబీదవర్గాల జీవితాల్లో ఎటువంటి మార్పులు రాకపోవడం ప్రకాశంలో కొత్త ఆలోచనల్ని కలిగించింది. ప్రస్తుత వ్యవస్థ పట్ల ఇది అతడి ఆగ్రహానికి కారణమైంది. ఇరవై ఏళ్ళు నిండీ నిండని వయసులో ప్రకాశం హృదయం నిండా విప్లవ భావాలు నిండిపోయాయి. వీరభద్రం మితవాదవామపక్షభావాలు కలవాడు. అతడు అన్ని సందర్భాలలోనూ అతివాద వామపక్ష దుందుడుకు వైఖరుల్ని ఖండించాడు. ఈ సమాజం మారాలి, ఈ విధానం మారాలి, దీన్ని కూకటి వేళ్ళతో పెళ్ళగించి వేయాలి. ఈ కుళ్ళులో మీరు ఒక భాగంగా కన్పిస్తున్నారు' అన్న ప్రకాశం మాటలు ఆనాటి వామపక్ష తీవ్రవాద భావజాల ప్రతిధ్వనులు.

ఓట్లతోనే సామాజం మారదు. ప్రజల్ని నమ్ముకున్న వాండ్లకు ఓట్లు రావటంలేదు. డబ్బును నమ్ముకున్న వాండ్లకు ఓట్లు వస్తున్నాయి. ఇది ధనస్వామ్యం దీన్ని కూకటి వేళ్ళతో పెరికివేయాలి. అందుకు విప్లవం రావాలె. అది మాటలతోనీ ఓట్లతోనీ రాదు..' అన్నది ప్రకాశం నిశ్చితాభిప్రాయం. ప్రకాశం విప్లవ ధోరణి ఆసాంతం అదేస్థాయిలో ఉండేటట్లు రచయిత పాత్ర కల్పన చేశారు. ఒక పోలీసు అధికారితో వాదించిన సందర్భంలో ప్రకాశం చేసిన ఉద్రేక పూరిత ప్రసంగం దీన్ని స్పష్టపరుస్తోంది.

'భారతదేశం ఎర్రగా కనిపించింది. ఎరుపు ఎరుపు, ఎరుపు కార్మికులు వస్తున్నారు. కష్టం చేసేవారు వస్తున్నారు. డాక్టర్లు, లాయర్లు, సైంటిస్టులు, గుమస్తాలు, టీచర్లు, జనం కార్మికులు కర్షకులు మేధావులు కదలాడసాగారు. ముందు పెద్ద జెండా పట్టుకుంది గీత. పక్కనే తాను ప్రకాశం. తన పక్కనెవరు మంగమ్మ, మంగమ్మ చేతిలో జెండా ఉంది. ఎర్రజెండా. అటుపక్కనెవరు? వీరభద్రం. వీరభద్రం చేతిలోనూ అదే జెండా ఎర్రజెండా'25 అంటూ ప్రకాశం ప్రాణం పోతున్న దశలోనూ పలవరించాడు. 'విప్లవం వర్ధిల్లాలి' అని రాస్తునే ప్రకాశం చేయపడిపోయింది. గ్రామస్థాయిలో కొత్త పెత్తందారులు, రాష్ట్ర స్థాయిలో అవినీతివంతులైన రాజకీయవేత్తలు, వీరిని వారిని ఆశ్రయించుకొని బతుకుతున్న లంచగొండి గుమస్తాలు, అధికార వర్గం, ఎంత కష్టపడినా ఫలితం దక్కని సన్నకారు రైతాంగం ప్రజా ప్రభుత్వంలోనూ ఎన్నో బాధలు పడుతున్న ప్రజలు ఈ దృశ్యాలన్నీ ప్రకాశంవంటి నవయువ తరాన్ని విప్లవాదంవైపు మళ్ళించాయి.

'జనపదం' నవలలో వీరభద్రం పాత్ర ద్వారా తన అభిప్రాయాలు పలికిస్తాడు. వీరభద్రం మితవాద వామపక్ష ప్రతినిధి. తీవ్రవాద మితవాద వామపక్షాల మధ్య నిరంతర సైద్ధాంతిక సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. తెలంగాణలో విప్లవ వామపక్ష రాజకీయ పరిణామాల్ని గమనించిన వారికి వీరభద్రం మితవాద వాదన సబబైనదేనని అర్థమవుతుంది. వీరభద్రం విప్లవ వ్యతిరేకి కాడు, అతడు ఉద్యమ సంస్కృతిని ప్రేమించిన వ్యక్తి, విప్లవమనే పేరుతో సాగే దుందుడుకు తనానికి, కార్యాచరణకూ, ఉద్యమ నిర్మాణానికీ మధ్య ఉండే తారతమ్యం వీరభద్రానికి తెలుసు. ప్రకాశం తల్లి మంగమ్మతో వీరభద్రం మాట్లాడిన తీరు అతడి సంయమనశీలతను, సమగ్ర అవగాహనను పరిచయం చేస్తోంది.

తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చండ్ర పుల్లారెడ్డి ఆంధ్రప్రదేశ్ వామపక్షవాదుల్లో మేధావులుగా, ఉద్యమ నిర్మాతలుగా గుర్తింపును పొందారు. వీరు తొలుత అవిభక్త కమ్యూనిస్టు పార్టీలో నిరంతరం శ్రమించిన వారే. అయితే, వామపక్ష వాదులు అతి మిత వాదంతో వ్యవహరించడం వీరికి నచ్చలేదు. దీనితో 1970వ దశకంలో వీరు విప్లవ కార్యాచరణ వాదులుగా వేరయ్యారు. సైద్ధాంతిక స్థాయిలో వీరు వామపక్ష మితవాదులతో విభేదించారు. అయితే మితవాద వామపక్షనేతల మనోగతాలు, వారు వేసుకున్న అంచనాలు మరో విధంగా ఉన్నాయి. అనాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం సామ్యవాద ధోరణిని ప్రకటించింది. సన్న కారు రైతుల అభివృద్ధి, భూసంస్కరణల అమలు, రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయీకరణ, ప్రభుత్వపు సామ్యవాద ధోరణికి సూచికలు అయ్యాయి. సహజంగానే మితవాద వామపక్ష వాదుల్ని ఈ ధోరణి బాగా ఆకట్టుకున్నది. దీనితో వారు విప్లవ కార్యాచరణ పట్ల వైముఖ్యతను ప్రకటించారు. తరిమెల, దేవులపల్లి, చండ్ర వర్గంతో మితవాదులు పూర్తిగా విభేదించారు. ఇక్కడ ప్రస్తావించబడిన వీరభద్రం అభిప్రాయంలో నాటి ఇందిరాగాంధీ సర్కారు సామ్యవాద తరహా ధోరణిని సమర్థించిన తీరును గుర్తించవచ్చు. అయితే, సామ్యవాద ధోరణులు చివరకు కాగితాలకే పరిమితమవుతాయనే అభిప్రాయంతో విప్లవ వామపక్ష శిబిరం, అందులోనికి ఆకర్షితులైన విద్యార్థి లోకం వాటిని విశ్వసించలేదు. ఇటువంటి విప్లవ విద్యార్థులకు ప్రకాశం బృందం ప్రతినిధివంటిది. అయితే సమాజంలో నిజమైన సామ్యవాదం ఆవిర్భవించాలనే విషయంలో రచయిత రాజీలేని నమ్మకాన్ని ప్రకటించారు. 'రానున్నది ఏది నిజం' నవలలోని వాక్యాలు దీనికి చక్కని ఉదాహరణలు.

తెలుగు సాహిత్యంలో చెరగని ముద్రను వేసిన రంగాచార్య 'చిల్లరదేవుళ్లు' నవలకుగాను ఆంధ్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. వేదాలను, మహాభారతాన్ని అనువదించినందుకుగాను అభినవ వ్యాసుడు బిరుదును పొందారు. 1994 ఖమ్మంలో సాహితీ హారతి ఆధ్వర్యంలో వెండి కిరీటం పెట్టి రంగాచార్య దంపతులను సత్కరించారు. తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారం అందించింది. ఇలా ఆయన 60 ఏళ్ల సాహిత్య ప్రస్థానం లెక్కకు మిక్కిలిగా సత్కారాలు అందుకున్నారు. తెలంగాణ జనజీవితాలను ప్రతిబింబించే రచనలతోనూ, ఇతర రచనలతోనూ రచయితగా ఒక ప్రత్యేక గుర్తింపును పొందిన ఈ దాశరథి రంగాచార్య తన 2015, జూన్ 8న తన 86ఏట కన్ను మూశారు.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ధార్మికకేంద్రాలు – దేవాలయాలు

– ఐ. ఖిండ్యవోనీ దేఖి, తెలుగు అధ్యాపకురాలు, కె.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వ.ప్ర), కర్నూలు.

దేవాలయాలు - ప్రశస్థి :

దేవాలయాలు మానవాళికి రక్షణ కేంద్రాలు. మానవ జన్మనెత్తిన వారు తమ జీవనయానంలో మంచి పనులు, చెడుపనులు, హింస, లాంటివి చేస్తుంటారు. తాము చేసిన పనులు తప్పని, తమ నడవడిక తప్పని, చివరకు దేవాలయాలను ఆశ్రయిస్తారు. ఆ దేవాలయాలలో కొలువై ఉన్న దేవతామూర్తులు వారి, ఆర్తిని గ్రహించి మంచిని ప్రసాదిస్తారు. అలాగే దయ్యము, భూతము, పిశాచము లాంటి వాటి వల్ల కూడా మానవుడు భయపడుతూ చివరికి దేవాలయాలనే ఆశ్రయించారు.

''దేవాలయాలు భారతీయ సనాతన ధర్మానికి, సంస్కృతికి ప్రతి రూపాలుశిల్పం, చిత్రలేఖనం, సంగీతం, సాహిత్యం, నాట్యం వంటి శాస్త్ర కళా సమ్మిళితమైన దేవాలయాలను సర్వజన సంక్షేమం కోసం లోక కళ్యాణార్థం నిర్మించారు.'' దేహమే దేవాలయం అని అంటారు. దేవో దేవాలయ: జీవోదేవో సనాతన: అని ఆది శంకరాచార్యులు మానవుని శరీర ప్రముఖ్యతను నిర్వచించాడు. దేవాము దేవుడు సృష్టించినది ,ఆధ్యాత్మిక సాధనము ద్వారా అది మోక్షాన్ని పొందుతుంది. అందుకే దేహం ఉన్న మనిషిని శివ ఖతీవ ఖ్ వఎజూశ్రీవ శీట స్త్రశీన అంటారు. మానవుడు కారణజన్ముడు. భగవంతుడుని ఆత్మందే దర్శిస్తాడు కాని విగ్రహాలయందు కాదు. అయితే విగ్రహాలు దేవుని ప్రతిరూపాలు విగ్రహారాధనవల్ల మానవుడు దేవుని కృపకు పాత్రుడవుతున్నాడు.

అందుకే పూర్వికులు లోకహితం కోసం దేవాలయాలు కట్టించి, దేవతామూర్తుల విగ్రహాలు ప్రతిష్టించి పూజలు చేస్తూ మానవ శ్రేయస్సును ఆశించారు. ఈ దేవాలయంలో దట్టమైన అడవులలోనూ, నదీతీర ప్రదేశాలలోను, విశాలమైన ప్రదేశాలలోను శిలలతో నిర్మించారు. జీవనదులు దేవుళ్లపాదాలు కడిగే విధంగా, సూర్య కిరణాలు దేవుని విగ్రహల దర్శించేవిధంగా కూడా దేవాలయాలు నిర్మించబడిన్నాయి.

దేవాలయాల ప్రాంగణంలో శిలా శాసనాలను చెక్కారు. వాటివల్ల ఆయా సమాజకాలంలో మానవుడు అనుసరించిన జీవనవిధానం, కళలు, సంస్కృతి, భాష, సాహిత్యాల గురించి. పాలకుల గురించి తెలుస్తుంది. రాజులు తమ తమ పాలనా కాలంలో సంస్కృతీ సంప్రదాయాలకు దేవళం లేదా దేవాలయం, గుడి అని పిలుస్తాం. దేవర అంటే దేవుడు లేదా దేవత వీళ్లు కొలువై, నెలువై ఉన్నదే దేవాలయాలు. దేవాలయాలు సంప్రదాయబద్ధంగా, శాస్త్రయుక్తంగా నిర్మించబడుతాయి. శిల్పసౌందర్యంతో శోభాయమానంగా కనిపిస్తుంది. చాలా మటుకు దేవాలయాలు శిలలతో నిర్మించబడినవే. శ్రీ వైఖానస శాస్త్రప్రకారం భక్త జనుల సౌకర్యార్థం ప్రతి దేవాలయంలో దావర పాలకులు, పరివారం, దేవతలు ప్రాకార దేవతలు ఆయా స్థానాలలో ఆవాహన చేబడి ఉంటారు. కనుక పురాతన దేవాలయాలు సమూహంగా ఉంటాయి. ఆ దేవాలయాలపై అనేక మంది దేవత..... పాలు దర్శనమిస్తాయి.

ఆలయాలు రకాలు :

ప్రధానంగా దేవాలయాలు ఐదు రకాలు

1. స్వయభూహులు - భగవంతుడు స్వయంగా అవతరించినవి
2. దివ్యస్థలాలు - దేవతలచే ప్రతిష్ట చేయబడినవి
3. సిద్ధ స్థలాలు - మహర్షులు, తపస్సు చేసి సిద్ధి పొందిన స్వాములు ప్రతిష్టించినవి
4. పౌరాణిక స్థలాలు - పురాణ కాలంలో చెప్పబడి ప్రసిద్ధిపొందినవి

5. మానవ సృష్టి స్థలాలు - అంటే రాజులు, పాలకులు, భక్తుల చేత సృష్టించబడినవి.

దేవాలయాల నిర్మాణంలో ప్రధానంగా గాలిగోపురం, ప్రధానద్వారం, ద్వార పాలకులు, వైకుంఠ ద్వారం, ధ్వజ స్తంభం, గర్భగుడి, కోనేరు, వంటశాల, భజన మందిరం లాంటివి ఉంటాయి.

భారతదేశంలోని హిందూ దేవాలయాలు చారిత్రక నేపథ్యం :

భారతదేశం సనాతన సంప్రదాలయాలకు పుట్టినిల్లు, సనాతన ధర్మానికి ప్రతీక. లక్షలకోట్ల సంవత్సరాలుగా భారతదేశం ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతుంది. వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, శాస్త్రాలు, నిగమ, ఆగమ, వేదాంత గ్రంథాలు 'భారతీయ సంస్కృతికి పట్టు కొమ్మలుగా ఉన్నాయి.

ఈ భూమిపైన మానవుడు ఉద్భవించిన తర్వాత దైవారాధనను ఎంచుకోవడం, ఆ తర్వాత దైవాన్ని నాలుగు గోడల మధ్య ప్రతిష్ఠించటం జరిగింది. వీటినే గుడులు, గోపురాలను, దేవాలయాలని పిలుస్తారు.

ఈ దేశంలో 'హిందూమతంగా పిలుస్తున్న మతంలో శైవ వైష్ణవం అనే రెండు పాయలు ఉన్నాయి. శివున్ని ఆరాధించేవారు శైవులు, విష్ణువును ఆరాధించేవారు వైష్ణవులు. శైవులు, వైష్ణవుల ఆహార్యాలలోను తేడా ఉంటుంది. శైవులు నొసటిపై అడ్డనామాలు, వైష్ణవులు నిలువు నామాలు పెట్టుకుంటారు. భారతదేశంలో హిందూ మత నేపథ్యంగా శైవ, వైష్ణవ దేవాలయాలు ఉన్నాయి.

దేవాలయాలు - వ్యాప్తి చరిత్ర :

దేవుడు నివసించిన ఆలయం దేవాలయం అని అంటారు. అవి క్షేత్రంగా, పుణ్యక్షేత్రంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా పిలవబడుతున్నాయి. దేశంలో ప్రస్తుతం 29 రాష్ట్రాలు ఉన్నాయి. ఈ రాష్ట్రలు భౌగోళికంగా చారిత్రక గుర్తింపును పొందడమే కాక గొప్ప సాంస్కృతిక నేపథ్యాన్ని కలిగి ఉన్నాయి. పురాతనమైన దేవాలయాలను కలిగి ఉన్నాయి. వీటితోపాటు యాత్రా స్థలాలను కటిగి ఉన్నాయి. ప్రపంచం నలుమూలల నుంచి ఎంతోమంది పర్యాటకులుగా ఇక్కడి దేవాలయాలను యాత్రా స్థలాలను దర్శిస్తున్నారు అందువల్ల దేవాలయాలకు ఆదాయం కూడా వస్తుంది.

దేవాలయాలు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను చరిత్రను, కళారాధనను వెల్లడిచేస్తున్నాయి కూడా దేవాలయాలు నయనానందభరితమైన ఆహ్లదమైన శోభను కల్గి వుంటాయి. వాటిని దర్శించినపుడు మానవునికి ప్రశాంతమైన ఉల్లాభరితమైన తన్మయత్వాన్ని పొందుతాడు.

భారతదేశంలో దేవాలయాలు :

భారతదేశంకు విశాలమైన ప్రదేశం కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు విస్తరించిన భౌగోళిక సముదాయం ఎత్తైనకొండలు, పర్వాతాలు శిఖరాలు, గుహలున్నాయి. వీటికి తోడు భయంకరమైన అడవులు విస్తరించి ఉన్నాయి. అత్యంత పొడవైన విశాలమైన జీవవనరులు పారుతున్నాయి. సింధు, గంగ, మయున, సరస్వతి, బ్రహ్మ పుత్ర, సరయు, గోదావరి, కృష్ణ మొదలైనవి భారతదేశానికి తలమానికంగా నిలుస్తున్నాయి.

భారతదేశానికి రెండు భాగాలుగా విభజిస్తే దేవాలయాల గురించి పూర్తిగా తెలుసుకోవచ్చు. 1. ఉత్తర భారతదేశం 2. దక్షిణభారతదేశం, ఉత్తర, దక్షిణ భారతదేశాలకు ఆచార్య వ్యవహారాలకును, ఆహార్య వ్యవహారాల్లోనూ, భాష, సాహిత్యాలలోను భిన్న విలక్షణత కనిపిస్తుంది.

కొన్నిచోట్ల దేవాలయాల్లోనూ, పూజా పురస్కారాల్లోను విలక్షణత కనిపిస్తుంది. ఉత్తర, దక్షిణ భారతదేశంలో కొన్ని వేయిల దేవాలయాలు చారిత్రక గుర్తింపును కల్గి ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన దేవాలయాలు ఇమ్మిడి ఉన్నాయి. యునెస్కో జాబితాలో ఎన్నో దర్శనీయ తీర్థ పుణ్య క్షేత్రాలు ఉన్నాయి. భారతదేశాన్ని పాలించిన వివిధ రాజవంశాలు భారతీయ సంస్కృతికి వెల్లసిన్నాయి. దేవాలయాలను నిర్మించారు. ప్రాచీన వైదిక కాలం అనవాళ్ళను దేవాలయాలు మనకు అందిస్తున్నాయి.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బోయి జంగయ్య రచనల్లో – తాత్వికత దృక్పథం

- మమత కురెళ్ల

రచయిత స్వీకరించిన కథావస్తువును క్రమపద్ధతిలో వికసింపజేయటాన్ని ఇతివృత్తం అంటారు. ఇతివృత్తంలో ప్రారంభం, వికాసం, ముగింపు వుంటాయి. సంఘటనల మధ్య క్రమబద్ధత, పాత్రల మధ్య సహసంబంధం వల్ల ఇతివృత్తానికి ఐక్యత చేకూరుతుంది. 'మానవ జీవితంలోని చిత్రవిచిత్ర పరిణామాలకు కారణాలయిన విశిష్ట ఘట్టాలను సన్నివేశాలనవచ్చు. సహేతుకమైన సన్నివేశ విశిష్ట కథావస్తువునే ఇతివృత్తమని అనవచ్చు.

'ఇతివృత్తం కావ్యానికి శరీరం' అని భరతుడు చెప్పాడు. సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భావాన్ని వస్తువు లేదా ఇతివృత్తం అంటారు. రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు. "కథకు ఇతివృత్తమంటూ ఒకటి ఉండడం తప్పనిసరి. ఇతివృత్తం కోసం ప్రత్యేకంగా వెదనవసరం లేదు. ప్రతి మనిషికి కదలికలోనూ కథకు కావలసిన ఇతివృత్తం ఉంటుంది. తనను, తన చుట్టూ వున్న సమాజాన్ని, మనుషులనూ పరికించి చూడగలిగితే ప్రతి కన్నీటి బొట్టూలోనూ, కంటి పాప మెరుపులోనూ, కథకు కావలసిన ముడిసరుకు దొరుకుతుంది. అయితే, రచయిత తనకు గల అభిరుచు లను బట్టి, ఆలోచనాధోరణిని బట్టి, తనకు కావలసిన వస్తువును ఎంచుకుంటాడు. తన సామర్థ్యాన్ని బట్టి కథగా మలచుకోగలుగుతాడు. బోయ జంగయ్య దళిత ఇతి వృత్తాన్ని ఎన్నుకొని రచనలు చేసాడు. ఆయన రచనల్లో ఎక్కువ భావం తత్వికత దృక్పథం కన్పిస్తుంది.

తాత్విక చింతన మెట్ట వేదాంతం కాదు. కేవలం ఆధ్యాత్మిక చింతనే కాదు అదొక సత్యశోధన. వ్యక్తిగతమైన అనుభూతికి సంబంధించిన మానవతా భావనకు, సమాజ పరమైన మానవతాభావనకూ స్పందించడం, వాటి మూలాలను అన్వేషించటం, విప్లవవాది రచనలోనూ, భావకవి సౌందర్యారాధనలోనూ దాగివున్న అంతఃకరణకు మూలభావాన్ని సాధారణీకరించేదే తాత్వికత. నీ జ్ఞాపకంలో ఇంకా నిలిచి వుండి కలవర పెట్టిన కథలన్నీ తాత్విక దృష్టితో కూడినవే అయివుండాలి. ఒక ఉపనిషద్ వాక్యం వుంది: 'నా వాక్కు మనస్సునందు ప్రతిష్ఠితమగు గాక! నా మనస్సు వాక్కునందు ప్రతిష్ఠితమగు గాక!!' తాత్వికత అంటే అదే !

ఒక రచన రాద్దామని ప్రయత్నించాడు. ప్రయత్నిస్తు న్నాడు. ఎన్నటికో దాని స్వరూపం వస్తుంది. అది తాత్విక స్వరూపం అవుతుంది.

తాత్విక చింతకుడిది - ఒంటరితనం.
ఏ కారణం లేకపోయినా ఏదో ఆందోళన.
చిత్తక్షోభ - అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు.

సామాన్యలవుకిక యాత్రగా కనిపించే జీవిత నేపధ్యంలో విస్మయపూరితమైన నగ్నసత్యాలు, కంటికి కనిపించే దృశ్యాల వెనక దాగివున్న అంతర్ జగత్ పరిశీలన - ఏదో ఒకనాడు ఒక కథగా, ఒక పాటగా, ఒక పద్యంగా వెలికివస్తుంది. మనం చెప్పుకొనే గొప్ప కథకులందరూ ఈ విషాదాన్ని అనుభవించినవారే.

తెలుగు వారు బౌద్ధ తాత్వికులు సమత, మమత, సౌజన్యం సుహృద్ భావాల్ని కోసం దళిత కవులు కంకణ బద్ధులైనారు. ఆధునిక బౌద్ధ వాదంలో ప్రధానంగా కులనిర్మూలనను అంబేద్కర్ ప్రతిపాదించాడు. ఈ మార్గంలో బోయ జంగయ్య తన రచనలతో సామాజిక తాత్వికత బోధ చేయగలిగాడు. ఈనాటి వచన కవిత రాస్తున్న దళిత యువకవులందరికి బోయ జంగయ్య కవితాశిల్పం, ఆర్ద్రత మానవతా దృక్పథం ఆదర్శం. భారతదేశంలో ఎన్నో తాత్విక ఉద్యమాలు దళితుల కోసం నడిచాడు. బోయ జంగయ్య తాత్విక జ్ఞానానికి సంబంధిం

చిన అనేక ప్రయోగాలు తన రచనల్లో చేశారు. బోజ తత్వం అనుభవైక వేద్యమైనది. అందులోంచే ఆయన రచనలు పుట్టాయి. దళిత తత్వశాస్త్రం చార్వాకుల నుండి నేటి వరకు దాని తాత్విక నేపథ్యాన్ని, దాని వ్యక్తిత్వాన్ని చాటుతుంది. ఎందరో తత్వశాస్త్ర రచయితలు అభివృద్ధి చెందారు. ఎన్నో అధ్యయన తరగతులు జరిగాయి. అంబేద్కర్, మహాత్మాపూలే, పెరియార్ నారాయణగురు, బుద్ధునితో తత్వశాస్త్రం చర్చించబడింది. దళితుల విముక్తికి మార్గం స్పష్టమైంది.

దళిత వాడల్లో పుట్టి
పేదరికంలో పెరిగి
బడిలో చివరన
గుడికి దూరంగా
కులతత్వపు అడ్డుగీతలు
కోటి ప్రశ్నలు లేవనెత్తగ
ఎటు చూసినా అజ్ఞానం
చుట్టూరా అంధకారం
బాధలు-ఈసడింపులు
బానిస బ్రతుకుల విముక్తి కోసం
దేశాలెన్నో తిరిగి తిరిగి
శాస్త్రాలెన్నో చదివి చదివి
మానవత్వపు విలువలు పెంచి
మతతత్వానికి హద్దులు చెరిపి
నీవు కూర్చిన రాజ్యాంగం
జాతి జనులు కరదీపం
దీనులకు నిరుపేదలకు
బతుకునిచ్చిన అంబేద్కర్
ఋణపడ్డది నీకు భారతజాతి

నేటి కవులలో భావచిత్రాలను, ప్రతీకలను శక్తి మంతంగా వాడుతున్న వారిలో శ్రీ బోయ జంగయ్య మొదటి వరుసలో ఉన్నారు. సంక్షిప్తత, వ్యంగ్యం, సృష్టత, సౌందర్యం జంగయ్య కవితకు సహజాలంకారాలు, కవిగా కవితలకే కాక కథకుడుగా, నవలా కర్తగా ఆయా ప్రక్రియలకు కూడా ఈ లక్షణాలను సంప్రదిస్తూ భావచిత్రాల నందించే శీర్షికలు పెట్టటం, శిల్పాలు తీర్చటం జంగయ్య ప్రత్యేకత. సామాజిక స్పృహతో పాటు సాహిత్య స్పృహను సాహిత్యానికి ఊపిరితిత్తులుగా నిల్పిన రచయిత శ్రీ బోయ జంగయ్య.

స్వరాజ్యం వచ్చి ఏండ్లయినా
మమత లేదు సమత లేదు
సోషలిజం సిద్ధాంతాలు
ఎన్నికల్లో నినాదాలు
శాసన సభలోని వాగ్ధానాలు
పత్రికలో పతాక శీర్షికలు
అడుగడుగునా దగా మోసం
చుట్టూ వున్న ఈ చీకటి
చెల్లచెదరై పోవడానికి
వెలుతురు కావాలి.

అంటాడు. ఆ వెలుతురు అంబేద్కరిజం ఇస్తుందన్న నమ్మకమూ కవిలో వుంది. అందుకే దళిత బహుజన ఆశాజ్యోతి అంబేద్కర్ చూపిన దారే శరణ్యమని చెబుతాడు కవి.

జోగినీ వ్యవస్థ మీద జంగయ్య చేతులు అనే ఆలోచనాత్మక కవిత రాసాడు.

వసంతానికి పులకించి పుష్పించి
బతుకు పండించుకోవలసిన
రంగు రంగుల పూరేకులను
ఒక్కొక్కటిగా వొలుచుకున్నాయి చేతులు
దైవం పేర అందమైన బతుకులు
అర్ధాయుష్షుతోనే వాడిపోగా
పూజకు పనికిరాని పూలని
విసిరిపారేస్తునై

అని చెబుతూ అయినా బొమ్మలను నమ్ముకుంటే బతుకు బజారుపాలు కాదూ? అని ప్రశ్నిస్తారు.

ఏ ప్రక్రియలో రాసినా పీడిత, దళిత వర్గాల జీవితపు

లోతుల్ని, వారి ప్రతిఘటన తత్వాన్ని పునాదిగా చేసు కున్నవారు.

'నిజం', 'హోలీ', 'కర్మ', 'ఏడుకొండల వాడా', 'వల' మొదలైన ఖండికలు దళితుల తాత్వికత, దైన్యస్థితిని ప్రతిబింబిస్తాయి.

దళితుడు భరతమాత పుత్రుడు. అతని భార్య భరతమాత కోడలు, ఆమె అత్తిల్లు భరతభూమి. అత్తింట్లో దళితులు హీనంగా, నీచంగా, శ్రమ దోపిడికి గురై బ్రతుకుతున్నారని కలతచెందారు. పంటలను పండించే దళితులు పస్తులుంటున్నారని బాధ్యను వ్యక్తం చేశారు. దళితులు పంటను పండించినట్టే జీవితాన్ని పండించు కోవాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. 'హోలీ' కవితలో

'పత్తి ఏరిన చేతులకే
పయిట కరువైంది
పుట్లు పండించచే మాకే
పూటగడవడం లేదు
మా అత్త పుణ్యభూమి
నా భర్త జైకిసాన్ అంటూ వ్యగ్యంగా చురక లేసారు.

'అంబేడ్కర్' కవితలో అంబేడ్కర్‌ను ఉద్దేశిస్తూ కుల మతాలను కూల్చిన నీవు ఇంకా పదేళ్లు బతికుంటే భారతదేశ వ్యవస్థ సంపూర్ణంగా మారేదన్నారు. అంబేడ్కర్ మన మధ్యలేకపోయినా అతని ఆశయాలు బతికే ఉన్నాయని, ఆ ఆశయాలతో మనం వ్యవస్థను మార్చాలని దళితులకు పిలుపునిచ్చారు.

ఒక్క చూపుడు వేలుతోనే
కుల రక్కసిని కూల్చినావు
ఒక్క కలం పోటుతోనే
మా నుదిటి రాతలు మార్చినావు
ఉన్నవాళ్లకు - లేని వాళ్ళ
ఊడిగం యిక ముగియనుంది
బాబా, యింకా పదేళ్ళు
నీవు బతికి వుంటే
భారతావని బతుకంతా మారిపోయేది

నిప్పు, నీటి కన్నా ఆవిరి శక్తివంతమైంది. కులం, ధనం కంటే ఆలోచన బలవత్తరమైంది. భవిష్యత్తును సమగ్రంగా దర్శించి దరికి చేర్చగల ఆలోచన దళితులకిప్పుడు కావాలని 'శక్తి' కవితలో అభిప్రాయపడ్డారు.

నివురు గప్పిన నిప్పులా ఉన్న దళితులు చైతన్య వంతులైతే? ఆలోచించుకోమని సమాజాన్ని సూటిగా ప్రశ్నించారు.

'వాళ్ళని వాళ్ళ బతుకుల్ని మార్చాలి మనం
లేకుంటే మన బతుకులే - మారుట నిజం'

దళితులను హీనకులస్తులని నమ్మించి, వారిని కర్మ సిద్ధాంతానికి కట్టేసే రోజులు పోయాయన్నారు. వర్త మానంలో అందరూ సమానమే అనే సమతాభావాన్ని పంచుకుందాం అని భారత సమాజానికి సందేశమిచ్చారు. ఈ సంపుటిలో సమాజం మారాలంటే మార్క్సిజం అవసర మని, అక్కడక్కడ అంబేడ్కరిజం తప్పదన్నారు. మార్క్సిజం, అంబేడ్కరిజం సమన్వయంతో దళిత విముక్తిని, సమసమాజ నిర్మాణాన్ని ఆశించారు.

బోయి జంగయ్య తాత్వికత :

జంగయ్య తత్వశాస్త్రం దళితుని ప్రయోజనాల్ని సమాజ ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని నడిచింది. ఆయన మౌలిక తాత్విక దృక్పథం స్వేచ్ఛ సమానత్వం, సౌభ్రాతృత్వం మానవ సంబంధాలను పెంచి ఒక మనిషి పట్ల మరొక మనిషికి ప్రేమ, గౌరవం ఉద్దేపింపచేయడం లక్ష్యంగా తన తాత్విక భూమికను విశదీకరించారు. బోయి జంగయ్య సోక్రటీస్ దగ్గర నుండి జాన్‌డ్యూయి వరకు, చార్వాకుల నుండి పూలే, అంబేద్కర్ వరకు తాత్విక దార్శనికులను వారి సిద్ధాంతాలను బోధనలను అధ్య యనం చేసి వాటిలో మేలైన వాటిని తన రచనల ద్వారా సమాజానికి అందించిన దార్శనికుడు.

'ఆడంబరమైన శైలిని రాయటం చాలా సులభం. కాని తేలికైన శైలిని రాయటం చాలా కష్టం. సోమర్సెట్ మామ్. 'ఏళ్లు గడిస్తే దెయ్యం దేవుడయ్యే లోకంలో' - అతి

మామూలు విషయాన్ని మూఢనమ్మకం మనిషిని ఎలా ఎడ్డివాణ్ణి, గుడ్డివాణ్ణి చేస్తుందో 'జాతర' నవల ద్వారా లోకానికి తెలియజెప్పారు. ప్రతి కథకూ ఒక నేపథ్య ముంటుంది. అది భౌగోళికమైంది. సామాజికమైంది. ఈ భౌగోళిక, సామాజిక నేపథ్యం నుండి రచయిత ఇతివృత్తాన్నీ, పాత్రలనూ ఎంపిక చేసుకుంటాడు. భౌగోళికం అంటున్నప్పుడు తన భాష సమాజంలోని ఏదో ఒక ప్రాంతం కావచ్చు. సామాజికం అంటున్నప్పుడు తన అనుభవంలోకి వచ్చిన సమాజంలోని ఏదో ఒక వర్గం కావచ్చు. ఈ వర్గం కులపరమైంది కావచ్చు. స్త్రీ పురుషభేద పరమైంది కావచ్చు. అక్షర నిరక్షరాస్య సముదాయపరమైంది కావచ్చు. ఆర్థిక తారతమ్యపరమైంది కూడా కావచ్చు. కథారచయితలందరూ నేపథ్యాన్ని గుర్తించకపోవచ్చు. వాళ్ళ అనుభవాలు వేరయినప్పుడు, స్వభావాలు భిన్నమై నప్పుడు, జీవిత దృక్పథాల్లో తేడా ఉన్నప్పుడు వాళ్ళు గుర్తించకపోవచ్చు కానీ, వాస్తవికతావాదాన్ని నమ్మే రచ యితలు జీవితంలోని అంతరువుల్నీ, భాషలోని వైవిధ్యాన్నీ తప్పక గుర్తిస్తారు. గుర్తించి భిన్న శైలుల్ని కథా రచనలో వాడుకుంటారు. కథానికల్లో భాషావైవిధ్యాన్ని రచయితలు పట్టుబట్టి సాధించారు. ఇది జరిగింది 1961 తర్వాతనే. 1961 తర్వాతనే ఉత్తర దక్షిణాంధ్ర ప్రాంతాల నుండి, వివిధ సామాజిక వర్గాల నుండి కథా రచయితలు వచ్చారు. అరు సారా కథలలో పూర్వాంధ్ర పాత్రలే కన్పి స్తాయి. వాటి సామాజిక స్వభావం మాత్రం తెలుగు కథను ఒక గట్టి కుదుపు కుదిపింది. ఆ తర్వాత మనం పేర్కొన వలసినవి కాళీపట్నం రామారావు యజ్ఞం కథలు. ఈ కథల్లో గ్రామీణ భాషా సామాజినికి తెలుగుకథలో గతం కంటే భిన్నంగా చోటు లభించింది. గ్రామీణ, పట్టణ, నగర మాండలిక భాషా వైవిధ్యాన్ని గుర్తింపచేయటంలో పేర్వాంధ్ర రచయితలు గురజాడ నుంచి ప్రముఖ చారిత్రక పాత్రను నిర్వహించారు. మాండలికాలను సాహిత్య భాషలో కీలకమైన శిల్పాంశంగా గుర్తింప చేయటంలోనూ, ఉమ్మడి పద సంపదలో ప్రాంతీయవర్గ మాండలిక పదాలు ఒక విడదీయరాని భాగమని గ్రహింప చేయటంలో పూర్వాంధ్ర రచయితల కృషి గణనీయ మైంది. ఈ కృషిని వామపక్ష రచయితల సంఘాలు వేగవంతం చేశాయి.

దళిత స్త్రీవాదాలు సైతం మాండలిక ప్రయోగానికి చేయూతనిచ్చాయి. గత రెండు దశాబ్దాల్లో వచ్చిన తెలుగు కథలు తెలుగు రచయితల భాషానుభవ చైతన్యానికి సంకేతమని చెప్పవచ్చు. వాళ్ళ జీవితానుభవ ఫలితమే భాషానుభవం కూడా. ఈ అనుభవాల వల్ల తెలుగు కథా సాహిత్యంలో గతంలో కన్పించని 'జనం' కన్పిస్తున్నారు. భాషాయాసా కన్పిస్తున్నాయి. కథ దగ్గరికి వచ్చేసరికి, గురజాడ అప్పారావుగారు 'దిద్దుబాటు' కథలో రావుఁడు పాత్రచేత ఉచితమయిన మాండలికంలో మాట్లాడిం చారు. ఇది తరువాతి రచయితలకు వరవడి పెట్టింది. క్రమక్రమంగా కథాకథనం ప్రమాణ భాషలోనూ, పాత్రల సంభాషణలూ - స్వగతాలూ పాత్రోచిత మాండలిక భాషల్లోనూ సాగుతూ వచ్చాయి. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే - కథ, నవల, రూపకం వంటి ప్రక్రియల్లో పాత్రోచితంగా మాండలికం ప్రవేశ పెట్టినంత మాత్రాన అవి పూర్తిగా మాండలిక నవలలు, మాండలిక రూపకాలు అయిపోలేదు. రచయిత చెప్పేది కూడా పూర్తిగా మాండలికంలో ఉన్నప్పుడు మాత్రం మాండలిక రచనగా పరిగణనకు వస్తుంది. రచయిత కథన శైలీ ప్రక్రియా మాండలికతకు నిరూపక ప్రమాణ మన్నది సారాంశం.

మాండలికాల్లో నడిచిన కథలవల్ల మనకు ఆయా ప్రాంతాల్లో, ఆయా వర్గాల్లో సహజంగా వాడుకలో ఉన్న పలుకుబడులు బాగా తెలుస్తాయి. మాండలికాల్లోంచి ప్రమాణ భాషలోకి ఎక్కవలసిన పదజాలం పరిచయ మవుతుంది. మనిషి ఎప్పుడు, ఎక్కడ ఉన్నా తన కష్టసుఖాల్నీ, జీవనస్థితిగతుల్నీ, వ్యవహార సరళినీ తన గుండెలో నుంచి వేరుగా వెలువరిచినప్పుడు సహజత్వం ముమ్మూర్తులా ఉట్టిపడుతుంది. దానివల్ల భాషలో

ఉన్న వైవిధ్యం, విస్తృతి తెలుస్తాయి. భాష జీవనాడి ఎక్కడ ఉందో తెలుస్తుంది. అన్ని ప్రాంతాలూ, అన్ని వర్గాలూ మనలోనే ఉన్నాయి. కాబట్టి, అన్ని మాండలికాలూ మనవే. అన్నీ సమాన గౌరవం, ఆదరం పొందదగినవే. సాహిత్య రచనల్లో వాటికి ఉచితమయిన ప్రాతినిధ్యం తప్పకుండా ఉంటుంది.

నవలల్లో, కథానికల్లో రచయితలు వాడే భాషపట్ల చాలా మందికి చాలా రకాలైన అభిప్రాయాలున్నాయి. వాటిల్లో కావ్యభాషను వాడాలనుకునే వాళ్ళు ఇప్పటికీ ఉన్నారు. పౌరాణిక, చారిత్రక ఇతివృత్తాలు తీసుకున్నప్పుడు కావ్యభాషలో వాటిని రాస్తే, వాటికేదో ఔన్నత్యం వస్తుందని భ్రమడేవాళ్ళు వీళ్ళు - తెలుగు చలనచిత్ర నిర్మాతల లాగా. తెలుగు చలన చిత్ర నిర్మాతలకు కృత్రిమ నటన ద్వారా కృత్రిమ భాష కావాలి; కృత్రిమ భాష ద్వారా కృత్రిమ నటన సాధించాలి. మరొక రకం, కథలు రాసే వాళ్ళకు భాష పెద్దగా రావాలా అనేవాళ్ళూ! అనుకునే వాళ్ళు. ఇంకొక రకం కథలు రాసేవాళ్ళకు భాషమీద అధికారం లేదు అని గొణిగేవాళ్ళూ, అరిచేవాళ్ళూ. ఈ అర్ధ సత్యకాముల అభిప్రాయాలు తప్పని తెలుగులోని వాస్తవికతావాదులైన మంచి కథకులందరూ గత 85 ఏళ్ళుగా నిరూపిస్తూనే ఉన్నారు; ఆధునిక తెలుగులోని వివిధ భాషాశైలుల ప్రయోగ ప్రయోజనాన్ని అవగాహన చేసుకొని కథలు రాస్తూనే ఉన్నారు.

ఆధునిక తెలుగులో ప్రధానమైన రెండు రకాల శైలుల్ని కథా రచయితలు గుర్తించారు. అవి :

ఆధునిక ప్రమాణ భాషాశైలి, మాండలిక శైలీ భేదాలు:

మధ్య మాండలికం నుండి ఏర్పడిన ఆధునిక ప్రమాణశైలిని విద్యావంతులందరూ రాసే భాషలో ఉపయోగిస్తున్నారు. కథా రచయితలు తమ కథల్లో ఈ శైలిని రెండు పద్ధతుల్లో వాడుకుంటున్నారు. ఒక పద్ధతి ప్రకారం కథనం, పాత్రలు మాట్లాడే భాషా ఆధునిక ప్రమాణ శైలిలోనే ఉంటాయి. మరొక పద్ధతి ప్రకారం కథనం ఆధునిక ప్రమాణభాషలో ఉంటుంది, పాత్రలు మాట్లాడే భాష మాండలికాల్లో ఉంటుంది.

జంగయ్యది సరళమైన కవిత్వం. సామాజిక స్పృహ ఉన్న కవిత్వం.

> అమ్మా! కుంటోన్ని/ 'పోయిరా'
> తల్లీ గుడ్డోన్ని/ 'వెళ్లిరా'
> మా తల్లీ ముసలోన్ని / 'పో పో'
> ఏడు కొండలవాడా వెంకటరమణా / 'వస్తున్న ఉండు.

మినీ కవితా ఉద్యమం బలంగా సాగిన కాలంలో అందరినోటా వినిపించిన బోజ కవిత ఇది. సరళంగా వ్యంగ్యంగా చురకలు పెట్టటం, సమాజంలోని అవసరాలను తూర్పారపట్టటం ఆయన విలక్షణత. నడుస్తున్న చరిత్ర, వెలుతురు. బోజ కవితలు, హెచ్చరిక, పావురాలు పేరిట ఆయన కవితా సంకలనాలు వెలువడ్డాయి. కష్ట సుఖాలు, దేశం కోసం, కొత్తబాటలు వంటి నాటకాలు వచ్చాయి. పిల్లలకోసం బడిలో చెప్పని పాఠాలు, గుజ్జన గూళ్లు, ఆటలు - పాటలు, మాటలు-ఆటలు, చిలుక పలుకులు, మన నేతలు, టీవీ ముచ్చట్లు వంటి రచనలు వెలువరించారు. వయోజనులకు ఉపయోగపడేలా స్వయం నిర్ణయం, నిమోనియా వంటి రచనలలో భాష సరళముగా ఉంది.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category


సురభి చరిత్ర – సాంప్రదాయ ప్రదర్శకులు నటన పద్ధతులు – బహుముఖ ప్రజ్ఞ

– గుంతేటి నవీన్, థియేటర్ ఆర్ట్స్, సెంట్రల్ యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

తెలుగునాట రంగస్థల సంస్థలలో ప్రఖ్యాత సంస్థగా పేరుగాంచినది సురభి నాటక సమాజం. సురభికి భారతీయ నాటక చరిత్రలో ప్రముఖ స్థానం ఉంది. ఈ బృందం హిందూ పురాణాలు, ఇతిహాసాల కథల ఆధారంగా నాటకాలను ప్రదర్శిస్తుంది. 135 సంవత్సరాల చరిత్ర గల ఒక గౌరవ ప్రథమైన, సామర్థ్యవంతమైన, సాంకేతికపరమైన రంగస్థల సంస్థకు ఇది ఒక ఉదాహరణ. ఈ ప్రత్యేకమైన ఖ్యాతి కేవలం సురభి కుటుంబం వారికే దక్కుతుందనడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు. ఇంతటి చరిత్ర మరి ఏ కుటుంబ రంగస్థల సంస్థకి ఉన్నట్టు మరెక్కడా లేదు కాబోలు. వారి నాటకాలు యాక్షన్, కామెడీ, మ్యూజిక్, డైలాగ్స్, డ్యాన్స్ మొదలైన అనేకానేక ఆశ్చర్యాలతో అధునాతన సాంకేతికాలతో కూడిన వినోద భరితమైన ప్రదర్శనలు ఎన్నో వచ్చాయి.

సురభి నాటక సమాజ చరిత్రను తిరిగెస్తే, యుగపు జానపద సంస్కృతి, పార్సీ నాటక సమాజ ప్రభావాలతో కలిసిన నటన పద్ధతులు/ శక్తివంతమైన సిద్ధాంతాలను కనుగొనడం ఖచ్చితంగా కష్టం. మౌఖిక సంప్రదాయం, పరిశీలన కంటే శిక్షణా విధానాలు(ప్రదర్శనలకు ముందు అభ్యాసాలు) తక్కువ ప్రాముఖ్యత కలిగివుంటాయి. పనితీరు, ప్రదర్శన శైలులకు సంబంధించిన విశేషాలు తగిన మార్పులతో ఒక తరం నుండి మరొక తరానికి బదిలీ చేయబడ్డాయి. సురభి చరిత్ర గురించి, నటీనటుల పద ఉచ్చారణ, సంభాషణ, భావోద్వేగ వ్యక్తీకరణ, రంగస్థల కదలికలు ఎలా జాగ్రత్తగా సాధన చేయబడతాయి మరియు సంశ్లేషణ చేయబడతాయి అనే దాని గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఈ వ్యాసం

ఉద్దేశ్యం నటుడి సంక్లిష్ట పరిస్థితి, అంగికాభినయం లోకి ఎలా మిళితమవుతుందో? ఇవేకాకా నటన పద్ధతుల సహకారంతో మొదలైనటువంటి ప్రక్రియలు, ఇతర 1850కి ముందు మరాఠ రాజ్యం అప్పటి ఆంగ్లో - మరాఠ



రెండవ(1803-1805), మూడవ (1817-1818) యుద్ధాలలో బ్రిటిష్ ఇస్ట్ ఇండియా కంపెనీ వరుస విజయాలు సాధించింది. తత్ఫలితంగా 1858లో పూర్తి స్థాయి అధికారంలోకి వచ్చింది. మరాఠ ప్రాంత విభజన కారణంగా అక్కడి సైనికులు దేశంలోని వివిధ ప్రాంతాలకు వలస వెళ్లారు. అదే విధంగా 1850 ప్రాంతంలో కొంతమంది సైనికులు దత్త మండలాల(రాయలసీమ)కు వలసవచ్చారు. వాళ్ళు చేసే వృత్తులపరంగా కొన్నివర్గాలుగా ఏర్పడ్డారు. వారిలో కొందరు తోలుబొమ్మల ప్రదర్శించే కళాకారులుగా, వీధి నాటకాలు ప్రదర్శించే వారిగా వివిధ వృత్తులను ఎంచుకున్నారు. మరికొంత మంది వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకున్నారు. ఈ సైనికులను రాయలసీమ ప్రాంతంలో అరె మరాఠిలు, అరె కాపులుగా పిలిచేవారు. ఆ ప్రాంతాల్లో బంధిపోటు దొంగలు ఎక్కువగా ఉండేవారు. బంధిపోటు దొంగలను అణచి వేయడానికి బ్రిటిష్ ప్రభుత్వానికి ఈ సైనికులు సహకరించారు. దాని వలన బ్రిటిష్ ప్రభుత్వం కొంత భూమిని వీరికి ఇచ్చి స్థిరనివాసం ఏర్పరుచుకోవడానికి సహకరించింది.


సురభి నాటక సమాజ ఆవిర్భవం :

1870 చివరలో, సొరుగు గ్రామం (ఇప్పుడు సురభి అని పిలుస్తారు). ఇప్పటి కడప జిల్లాలో మొట్టమొదటి సురభి కుటుంబ చెక్క బొమ్మల ప్రదర్శకులుగా ప్రారంభమయింది. తదుపరి స్థానిక జంగాలతో కలిసి తోలు బొమ్మల ప్రదర్శకులుగా ప్రావీణ్యం సంపాదించారు. దానినే చాలా కాలం పాటు ఒక వృత్తిగా కొనసాగించారు.

1880, వనరాస గోవిందరావు కుటుంబంలో చిన్న వాడు. తాను తోలుబొమ్మల వృత్తితో నిరాశ చెందాడు. రంగస్థల రీతులు, సాంకేతికతల గురించి మరింత తెలుసు కోవడానికి కుటుంబాన్ని విడిచిపెట్టాడు. అతను జ్యోతి సుబ్బమ్మ సంస్థలో చేరాడు. రంగస్థలలోని విభిన్న అంశాల ప్రత్యేకతలను నేర్చుకున్నాడు.

అతను 1885లో సురభి గ్రామానికి తిరిగి వచ్చాడు. అతని మార్గదర్శకత్వంలో రంగస్థలంపై మొట్టమొదటి ప్రదర్శన కీచకవధ.


శ్రీ వనారస గోవిందరావు - జీవిత చరిత్ర




** బాల్యంలో తల్లిదండ్రులను కొల్పోయాడు. బెస్త రోషన్న(వంటవాడు) పకిరన్నకు ఆశ్రయం కల్పించాడు. వంట పనిలో, పచారి దుకాణంలో సహాయకుడిగా నియమించుకున్నాడు.

వనారస కుటుంబీకులు వివిధ ప్రాంతాలలో సంచారం చేస్తు తోలుబొమ్మలాటల ప్రదర్శనలు చేస్తుండే వారు. దానిలో భాగంగా 1877లో, కడప జిల్లా హనుమద్గుండంలో దొరవారి దేవిడిని ప్రదర్శన స్థలంగా ఎంచుకున్నారు. వనారస కుటుంబంలోని కృష్ణజిరావు, వెంకోజిరావు, రామయ్యతో పాటు తల్లి చెన్నమ్మ తోలుబొమ్మలాట ప్రదర్శించినారు. అది పకిరన్న(వనారస గోవిందరావు) జన్మస్థలం.

వనారస కుటుంబం మూలాలు





వనారస చెన్నమ్మ తోలుబొమ్మలాట ప్రదర్శనలో పకిరన్నాను అక్కున చేర్చుకున్నారు. వెంకోజి రావు, సుంతమ్మలు దత్తత తీసుకోవడం వలన పకిరన్న కాస్త వనారస కుటుంబంలో ఒక సభ్యుడైయ్యాడు. తరువాత పకిరన్న వనారస గోవిందరావుగా పిలవబడ్డాడు. అప్పటికే వెంకోజిరావు సంగీతంలో, ఫిడేల్ వాయిద్యంలో, చెక్క బొమ్మలకు రంగులు అద్దడంలో నేర్పరి అయిఉండడం వలన గోవిందరావు పగటిపూట పశువుల కాపరిగా ఉంటూనే రాత్రిళ్ళు వారిదగ్గరే తెలుగు చదవడం, రాయడం నేర్చుకొన్నాడు. వాటితోపాటు సంగీతం, ఫిడేలు వాయిద్యాలలో తర్ఫీదయ్యాడు.

సురభి కుటుంబ సభ్యులకు, సురభి నాటక సమాజానికి ఒక గమ్యస్థానాన్ని ఏర్పాటు చేసిన మొదటి వ్యక్తి గోవింద రావు. సురభి నాటక సమాజాన్ని స్థాపించిన ఘనత గోవిందరావుకే చెందుతుంది. ఇతను సురభి వంశాన్ని నాటక సమాజంలోకి తీసుకురావడమే కాకుండ, సురభి సంస్థాగతమైన ప్రదర్శన శాఖలను వంటిచేత్తో క్రమబద్ధీకరించాడు. తన పెద్దవాళ్ళ కంటే గోవిందరావు బాహ్య ప్రపంచానికి బాగా పరిచయం అయ్యాడు. ఎందుకంటే ఇతను అనేక పార్సీ నాటక సమాజ కంపెనీలను ఆంధ్రాలో పర్యటిస్తున్నప్పుడు చూశాడు. వారి సాంకేతిక పరిపూర్ణతకు బాగా ప్రభావితుడైయ్యాడు. సురభి నాటక సమాజాన్ని తన భుజాలపై వేసుకున్నాడు. సురభి నాటక రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్ళాడు.

రాప్తాటి సుబ్బదాసు ఒక ప్రసిద్ధ రచయిత, దర్శకుడు. సురభి నాటక సమాజంలో ఆస్థాన రచయితగా చేరి వారికి పేరు, ప్రఖ్యాతలే కాకుండా మంచి గుర్తింపును తీసుకొచ్చారు. అంతేకాకుండా వారికి అవసరమైన నాటక శిక్షణని ఇచ్చారు. ఒక ఇరవై ఏళ్ల యుక్త వయస్సు గల యువకుడు వచ్చి భవిష్యత్తులో విజయవంతమైన సంస్థ గమ్య స్థానాలను రూపొందించాలని తనని కోరాడు. దానిని సుబ్బదాసు ఒక సవాలుగా తీసుకొని తనను తాను విజయవంతం చేసుకున్నాడు. ఎం.ఎన్.శర్మ ప్రకారం "Raptati subbadas was in Surabhi for four years during which time he trained the actors in modern verse drama style and wrote plays in this style for them and donned the major roles in all the plays. By the end of the four years, Surabhi theatre became a consolidated team of youthful entrepreneurs, full of enthusiasm and energy. while the elders were active, it was the youngsters who took pains to learn the art thoroughly. Govinda Rao led the team of youngsters. Papabai, Chinnaramaiah, Ammannamma, chinna Subbamma and others followed. Raptati Subbadas a prolific actor-director, wrote three plays for the company- Harischandra, Sarangadhara, Sakuntala and each one was a great success in the entire region." (The surabhi theatre of Andra : A living legend. P.no. 43.)

వారి కోసం వచన రూపంలో పద్య నాటకాలు రాశారు. అంతే కాకుండా వారికి సంగీతం, సంభాషణల ఉచ్చారణలోనూ (డిక్షన్) రంగస్థలంపై నటులు వ్యవహార తీరులోను రాప్తాటి సుబ్బదాసు శిక్షణ ఇచ్చాడు. తద్వారా సురభి వారిని ప్రజల్లో ఆమోదయోగ్యంగా మలిచిన ఘనత అతనికే దక్కుతుంది.

సురభి కుటుంబం శ్రీగిరికపర్తి కొట్టయ్య దేవరపంతుల నుండి కర్ణాటక సంగీతం నేర్చుకోవడానికి బందరులో ఐదు సంవత్సరాలు గడిపారు. ఈ కాల వ్యవధిలో సురభి వారు అభ్యాసంతోపాటు దేశంలో ఒక ప్రముఖ ప్రదర్శన బృందంగా తమను తాము నిరుపించుకొన్నారు. దేశ, విదేశాల్లో సంచార నాటక ప్రదర్శనలు పుష్కలంగా చేశారు. అక్కడ నుండి సురభి కుటుంబ విద్యా విధానం వారి కుటుంబంలోనే ప్రత్యేకంగా జరిగింది. వారు సంపాదించిన అనుభవం, శిక్షణ, ప్రదర్శన పద్ధతులను తరువాతి తరానికి వారసత్వంగా అందజేశారు. అలా ప్రతి తరంవారికి సురభివారి పద్ధతులను పరిశీలించడం, మౌఖిక సంప్రదాయం ద్వారా సంరక్షించుకున్నారు. సురభి గత 135 సంవత్సరాల్లో వారి విభిన్న కళా పద్ధతులు, నటన సామర్థ్యాలతో అద్భుతంగా ఉన్న ప్రదర్శనకారుల్ని,

దర్శకులను పుష్కలంగా నాటక ప్రపంచానికి అందించింది. ఈనాటికి సురభి వారి ప్రజాదరణ, వారి నైపుణ్యం, అనుసరించే అనేక వ్యూహాలపైనే ఎక్కువ ఆధారపడి ఉంటుంది. శీఘ్రంగా మారుతున్న దృశ్యాలు, తగిన విధంగా రంగస్థల విభజన(స్టేజ్ డివిజన్), ఆశ్చర్య-అద్భుతాలు కలిగించే దృశ్యాలు, అనుసంధాన దృశ్యాలు సాంకేతిక పరివూర్ణతలో దాని సామర్థ్యాలను ప్రతిబింబిస్తాయి. యం.యన్. శర్మ "The broad structure of surabhi performance is now largely limited to quick changes of scenes, rhetorical dialogue delivery, glittering costumes, appearance and participation of a large number of actors from a two year old child to an eighty year old person, cinematic dances "special effects", fights and comic buffoonery. (The surabhi theatre of Andra : A living legend. P.no. 143) విధంగా పేర్కొన్నారు.

సురభివారు ప్రదర్శించిన చాలా నాటకాలు నైతిక భావనతో ఉన్నవే. కావునా అవి మంచి, చెడుల మధ్య సంఘర్షణ అనివార్యమవుతుంది. దైవాన్ని కేంద్రీకృతంగా చేసి ఆడే అన్ని నాటకాలు దీనికి ఉదాహరణ. రాక్షసులు, దేవతల పాత్రలను పోషించేప్పుడు శ్రావ్యమైన సంభాషణలు వాటిని బిగ్గరగా ప్రతిధ్వనించడం, అలంకారికంగా చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సురభి నటులు, ఇతర విభాగాల కళాకారులు కలిసి ప్రేక్షకులను ఉత్సాహపరిచేందుకు బహుముఖ సౌలభ్యం, ఒకే దృక్పథంతో పనిచేస్తారు.

ఎటువంటి క్రమబద్ధమైన శిక్షణా వ్యవస్థ లేకుండానే నటనలో నటీనటులు ప్రదర్శించే బహుముఖ ప్రజ్ఞ ప్రతిసారీ ప్రత్యేకంగా విజయవంతమవుతూ వస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. జయప్రభ, నాలుగో గోడ, చరిత ప్రచురణలు మొదటి ముద్రణ,హైదరాబాదు. 1993.
2. అప్పారావు, పి.ఎస్.అర్., ఉత్తమాంగాభినయం, చారీ మరియు కంపెనీ, హైదరాబాదు, 1993.
3. సురభి సప్తతి స్వర్ణ ఉత్సవ సంచికశ్రీ రామ పవర్ ప్రెస్, గుంటూరు, 1960.
4. Rama Sastri. P, Surabhi Theaters, A.P Sangeetha Nataka Akademi. First Edition1975.
5. Naagabhushanasharma, Modali. The Surabhi Theatre of Andra; Karshak Prints, 2009.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జానపద కళారూపాలు – ప్రార్థన గీతాలు

– డా॥. శ్రీమంతుల దొమోదర్

తెలుగు సంస్కృతి సంప్రదాయాలు జానపద కళా రూపాల మీదనే ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. ఇవన్నీ పూరణ, ఇతిహాసాలను నేపథ్యంగా తీసుకొని తమకు అనుగుణంగా, సామాజిక పరిస్థితులను బట్టి కళారూపా లను మూలకథకు భంగం కలగకుండా మార్పు చేసు కుంటూ జానపద కళారూపాలు తమ అస్తిత్వాన్ని కాపాడు కుంటూ వస్తున్నాయి.

ప్రతి కళారూపం ఆధ్యాత్మిక భావనలతోను, విజ్ఞాన వినోదాలతోను ప్రేక్షకుల్లా ఆనందానుభూతిలోకి తీసుక వెళ్ళడమే వీటి ముఖ్య ఉద్దేశ్యం. అలాంటి జానపద కళారూపాలు, సంప్రదాయపరమైనవి, ఆశ్రితపరమైనవి, వినోదపరమైనవి మరియు ఇంద్రజాలపరమైనటులవంటి వైవిధ్యభరితమైన అంశాలతో మన ముందు ప్రదర్శిస్తారు. ప్రతి కళారూపం ప్రదర్శనకు ముందు దైవస్తుతితో ప్రారంభమై మంగళ హారతితో ముగింపు పలకండం వీరి భక్తి భావనకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఇలాంటి జానపద కళారూపాలు తెలుగు రాష్ట్రాల్లో నూటయాభైకి పైగా ఉన్నాయి. వీటిలో తెలంగాణా రాష్ట్రంలో ఆశ్రిత కళా రూపాల సంఖ్య ఎక్కువ. ఇవన్నీ దాతృకులం యొక్క కుల పురాణాలను మాత్రమే ప్రదర్శిస్తారు. ఆ కులాల యొక్క సహాయ సహకారాలతో మనుగడ సాధిస్తున్నాయి. మరికొన్ని సంప్రదాయ కళారూపాలు అన్ని కులాలవారికి రామాయణ - భారత కథలను ప్రదర్శిస్తారు.

ఒగ్గుకథను కురుమ కులస్థులకు కాటమరాజు కథలతో పాటు ముప్పయి కథలను ప్రదర్శిస్తారు. వీరు ఒగ్గు డోలు, నపేరా, తాళాలు, కాళ్లగజ్జెలు, మద్దెల, హార్మోనియం వంటి వాద్యాలను ఉపయోగిస్తారు. వేషధారణతో మగవారు స్త్రీ పాత్రలు పోషిస్తారు. ఈ కథకులు కథ ప్రారంభంలో..

శరణు శరణు మాయంభారాణీ
శాంభావి రాణి శాంబావి రాణి ॥ 2 ॥
కరుణ చూడు కన్న తల్లీ గంగాభవానీ
గంగాభవానీ ॥ 2 ॥
ముందు మాయాదులకు మూలదేవత
మూలదేవత
మందలోన నెలకొన్న మంద చౌడమ్మ దేవి చైడమ్మ
॥శరణు॥
గంగా వచ్చె చూడరమ్మా గాలి మేఘునా గాలిమేఘునా
తను వంత ముత్యాల పేరు ఒళ్ళంత మెరువా
ఒళ్ళంతా మెరవ
అంబా.. గంగనిన్ను గొలిచేటి గణులెవ్వరమ్మా
గణులెవ్వరమ్మా
గణమైన మట్టెవాడ గణుడు చెలికాడు
కాటమరాజు ॥శరణు॥

..అంటూ గంగదేవిని ప్రార్థిస్తారు.

గంగ అందరిని కరుణిస్తేనే లోకం సుభిక్షంగా ఉంటుందనే నేపథ్యమే ఈ ప్రార్థన గీతం. వీరు కుల కథలతో పాటు ఇతర కథలు చెపుతారు.

గొల్లవారికి ఆశ్రితులుగా ఉంటూ కాటమరాజు కథలతోపాటు ముప్పయికిపైగా కథలను ప్రదర్శించే మందెచ్చులవారు. వీరినే "పొడపాత్రపువారని" కూడా పిలుస్తారు. వీరు తెలంగాణలో వరంగల్, కరీంనగర్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉన్నారు.

ఈ మందెచ్చుల కళాకారులు డోలు, నపేరా, చేతికర్ర, మద్దెల, హార్మోనియం, కాళ్ళగజ్జెలు, వాద్యాలు మెడలో వెండి దండలు, చేతి పొంచి ధరించి ఉంటారు. వీరు చెప్పే కథలను నకాశి వారిచేత తయారుచేసిన బొమ్మలను చూపిస్తూ కథలను చెపుతారు.

కథ ప్రారంభంలో గంగ భావానీని స్తుతిస్తారు.

శరణు శరణు మా కన్నతల్లి శంభావిరాణి
శంభావిరాణీ
శరణు చూడు మా కన్నతల్లీ గంగభవానీ
దేవి భవానీ

అంటూ కథను మొదలు పెడతారు.

పెద్దేవరను కొలిచే పూజారిగా వ్యవహరించే "దుబ్బులవారు" అన్ని కులాలకు పెద్దేవరను (కనకదుర్గ) పూజిస్తారు. వీరి కొలుపును వారివారి ఇండ్లల్లో చేస్తారు ప్రారంభంలో..

ధనం ధాన్య తల్లి బహుపుత్ర లాభం
ముట్టిం ముత్యం తల్లి ఎములాడ రాజన్న
కొండగట్టు అంజన్న తిరుపతి ఎంకన్న
యాదగిరి నర్సింహస్వామి కనకదుర్గమ్మ
(..... దుబ్బశబ్దం)
ఏలోని మల్లన్న ఊరి పోచమ్మ
సమ్మక్క సారలమ్మ... (దుబ్బు శబ్దం)

అంటూ దేవతలందరిని స్తుతిస్తూ ఇంటి వారిని చల్లగా చూడమని వేడుకుంటారు.

ఈ కళారూపం దుబ్బువాద్యం, కాళ్ళ గజ్జెలతో ఒకరు, ఇద్దరు మాత్రమే ప్రదర్శన ఇస్తారు. దుబ్బు వాద్యం 'ఢమరుకం' లాగా పెద్ద ఆకారంలో ఉంటుంది. దీనికి గజ్జెలు కట్టి కుడికాలు పాదం మీద పెట్టుకొని వాయిస్తారు.

గౌడ జెట్టిలు గౌండ్ల వారికి ఆశ్రితులుగా ఉంటూ గౌడ పురాణాన్ని పటం ఆధారంగా కథ చెపుతారు. వీరి చెప్పే కథ ప్రారంభంలో...

"రిక్షంచు జనని మహంకాళీ
నీకు సేవ చేసెద గుణశాలీ ॥రక్షించు॥
జగదాంబ మమ్మేలు రావా
తల్లి జగములు సవరించలేవా
జగదాంబ రక్షించు - జననీ నీ సత్కాల
భతవతీ నీ పాటి - బాల చంద్రుడు లేడు.
॥జగదాంబ॥

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావ వీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అట్టాడ అప్పల్నాయుడు ఉత్తరాంధ్ర కథా సాహిత్యం – ప్రజల జీవన విధానం

– మునకాల ధనలక్ష్మి, పరిశోధక విద్యార్థిని, తెలుగు అధ్యయనశాఖ, శ్రీపద్మావతి విశ్వవిద్యాలయం, తిరుపతి.

సమకాలీన ఉత్తరాంధ్ర కథా రచయితలలో అట్టాడి అప్పల్నాయుడు ఒక ప్రముఖ రచయిత. వీరు 'వరీనియా' అనే కలం పేరుతో తెలుగు కథా సాహిత్యానికి సుపరిచితుడు. నవల, కథ, నాటకం, కవిత్వం మొదలగు సాహితీ ప్రక్రియలకు విశేష కృషి చేస్తున్న వీరు సదా చిరస్మరణీయులు. వీరు శ్రీకాకుళం సాయుధ పోరాటం స్ఫూర్తితో గిరిజన జాతుల సాంస్కృతిక జీవన విధానానికి ఎన్నో రచనలు చేసిన రచయిత. జన నాట్యమండలితో గల సంబంధాల వల్ల మొదటి కథ ముద్రితం కాకముందే ఆయన ప్రభుత్వం అరెస్టు చేసింది. ప్రభుత్వ దోపిడీకి గిరిజనుల అమాయకత్వానికి సంబంధించిన ఎన్నో కథలు వ్రాశారు. అంతేకాకుండా ఉత్తరాంధ్ర ప్రజల జీవన విధానాలను ఎంతో అద్భుతంగా రచయిత తన కథలలో స్పష్టంగా తెలియపరిచారు.

అట్టాడి అప్పల్నాయుడు విజయనగరం జిల్లా కొమరాడ దగ్గరలోని గుమడ గ్రామంలో అల్లాడ సూరి నాయుడు, నారాయణమ్మ దంపతులకు 1953 ఆగస్టు 23వ తేదీన జన్మించారు. వీరిది సాధారణ వ్యవసాయ కుటుంబం. వీరు కోటిపాం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి చదివి, తర్వాత పార్వతీపురంలో ఇంటర్మీడియట్‌లో చేరాడు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడ్డాడు. ఆ బాధల వల్లే ఆయన శ్రీకాకుళ పోరాటం ప్రజానాట్య మండలి వైపు ఆకర్షితులయ్యారు. బ్రతుకు దెరువు కోసం కొంతకాలం నాగావళి పత్రికలో పనిచేశాడు. తరువాత అంచలంచలుగా ఎదిగి చివరకు ఉద్యోగిగా స్థిరపడ్డారు. దాదాపు 30 సంవత్సరాల పాటు ఉద్యోగం చేశారు. ఆ సమయంలోనే రచనా వ్యాసంగం వైపు ఆకర్షితులయ్యారు. అట్టాడి వారు 1979 సంవత్సరంలో ఆయన రచనలు మొదలుపెట్టారు. వీరు దాదాపు 100కు పైగా కథలు, 4 నవలలు, నాటికలు రచించారు. వీరి మొదటి కథ "పువ్వుల కొరడా". వీరు శ్రీశ్రీ గారి అడుగుజాడలలో నడిచి విప్లవ కథకుడిగా మంచిపేరు తెచ్చుకున్నారు. వీరి కథా సాహిత్యంలో అంతర్జాతీయ బహుళ కంపెనీలు ఉత్తరాంధ్ర మారుమూల పల్లెలో సైతం ప్రవేశించి వివిధమైన ఆర్థిక దోపిడీ చేశారో చక్కగా వివరించారు. అంటేకాకుండా వీరి రచనలలో ఉత్తరాంధ్ర ప్రజల జీవన విధానాన్ని ఎంతో స్పష్టంగా వివరించారు. నిరుపేద గిరిజనులు పడుతున్న ఎన్నో కష్టాలను చాలా చక్కగా వివరించారు.

అట్టాడి అప్పల్నాయుడు గారు 100కు పైగా కథలు వ్రాశారు. కథలన్నీ ఐదు కథా సంపుటాలుగా వెలువడ్డాయి. 3 నాటకాలు, 5 నాటికలు వీరి కలం నుండి జాలువారినవే. 'మడిసెక్క' నాటకానికి ఆలిండియా రేడియో వారి జాతీయ నాటికల పోటీలో ప్రథమ బహుమతిని గెలుచుకుంది. మరో నవల సూర్యదినపత్రికలో సంవత్సరం పాటు 'నేస్త ఊసులు' పేరిట శీర్షిక వెలువడింది. అంతేగాకుండా అట్టాడి వారి కథలు తెలుగు భాషలోనే కాకుండా ఇంగ్లీషు, హిందీ, తమిళం, కన్నడం, బెంగాలీ భాషల్లోనే అనువదించబడ్డాయి. తన వైవిధ్య భరితమైన రచనల ద్వారా శ్రీకాకుళంలోని సిక్కోలు సార్ధక బాధలను తన రచనల ద్వారా ఎందరో భారతీయ అభిమానులను సంపాదించుకున్నారు.

అట్టాడ అప్పల్నాయుడు గారు తన కథలలో ఇతివృత్తాలు కేవలం ఆయన ఊహించి వ్రాసినవి కావు. సమాజంలో ప్రతినిత్యం మనచుట్టూ జరిగే సంఘటనలు ఆయ కథా వస్తువులు ముఖ్యంగా మధ్య తరగతి, నిరుపేద వర్గాల ప్రజల నిత్యజీవితంలో జరిగే వారి కుటుంబ సమస్యలు చూసి మనసు చలించి ఎన్నో అద్భుతమైన కథలు రాశారు. మారుతున్న పరిస్థితులకు

అనుగుణంగా రచనలు చేసి సామాజిక జీవనం కోసం కృషి చేస్తున్నారు. మధ్య తరగతి ప్రజల జీవన విధానంలో వచ్చే అనేక కష్టాలను తన కథల రూపంలో తెలియజేయడం జరిగింది.

రచయితలు మనుషులందరి లాగా సమాజంలోనే బ్రతికేవారు కాబట్టి తన చుట్టూ ఉన్న పరిసరాలను, పరిస్థితు లను, సంఘటనలను, పరిణామాలను నిశితంగా పరి శీలిస్తారు. వాటిని ఆధారంగా చేసుకొని ఇతివృత్తంను ఎంచుకుంటారు వాటి సహేతుకరమైన పద్ధతిలో అర్థ వంతంగా తీర్చిదిద్దుతారు. అదేవిధంగా సాహిత్యానికి మానవ జీవితం ప్రాణం దాన్ని వివిధ స్థితుల్లో, వివిధ స్థాయిల్లో, వివిధ కోనాల్లో దర్శించడమన్నది రచయిత విధి. కవి పోరంకి దక్షిణామూర్తి గారు చెప్పినట్లుగా అట్టాడ అప్పల్నాయుడు గారు కూడా రచనలలో ఉత్తరాంధ్ర ప్రజల జీవన విధానాన్ని అత్యత్భుతంగా చిత్రించడం జరిగింది. సమకాలీన ప్రపంచాన్ని విస్మరించిన ఏ రచ యిత మనుగడ సాధించలేదు. సామాజిక చిత్రణ అంటే మానవ జీవిత చిత్రణే. ఇది వ్యక్తిగతంగా ఉండవచ్చు, సామాజికముగానైనా కావచ్చు. కాని రచయిత ఎంచుకున్న కథా వస్తువు ఒక కాలానికి కాని, ఒక స్థాయికి గాని, ఒక వర్గంకు గాని, ఒక సమస్యకు గాని పరిమితమైనప్పటికి సమగ్రమైన సామాజిక స్పృహ ఉన్నప్పుడు రచయిత మహా గొప్పగా రాణిస్తారు. ఈ కోవకు చెందినవారే మన అట్టాడ వారు. వారికి సామాజిక స్పృహ ఎక్కువే అని చెప్పాలి. వారి కథా వస్తువులన్నీ ఉత్తరాంధ్ర ప్రజల జీవన విధాన శైలి వివిధ కోణాలతో నిశితంగా పరిశీలించిన స్వానుభవంతో మంచి కథలు వ్రాశారు. దీనికి కారణం వీరికి సమాజం పట్ల కొంత బాధ్యత ఉంది. కావున రచయిత వాస్తవాన్ని విస్మరించడం గాని, వక్రభాష్యం చేయకూడదు. సమాజంలో ఉన్న సమస్యలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని వాటిని యధార్థంగా చిత్రించాలి.

అట్టాడ అప్పల్నాయుడు స్వయంగా కూలీ పనులు చేసిన అనుభవం ఉంది. కాబట్టి ఆ అనుభవంతో ప్రజల జీవన విధానాలను చాలా దగ్గరనుండి గమనించారు. కావున వారి రచనలలో వాస్తవ పరిస్థితులు మనకు కనబడతాయి. అందుకే ఆయన రచనలు అశేష జనాంగమును ఆకర్షించబడతాయి. వారు వ్రాసిన 'ఎంపిక' కథలో రచనలు అశేష జనాంగమును ఆకర్షించగలిగాయి. వారు వ్రాసిన 'ఎంపిక' కథలో శంధాన సారయ్య జీవన విధానం ఎంతో చక్కగా వివరించాను. నాగావళి నదీ ఒడ్డున ఒక ఎకరం భూమి కౌలికి తీసికొని కూరగాయలు పండించి జీవనం సాగించే ఈ నగటు రైతు జీవన విధానాన్ని కౌలు రైతులు ఎదుర్కొనే ఆర్థిక సమస్యలను ఎంతో అద్భుతంగా వివరించారు మన అట్టాడ వారు. నాగావళీ నదీ ఒడ్డున ఓండ్రు మట్టిలో ఎండన సారవంతమైన భూమిలో కందమూలం, తేగదుంపలు, పొత్తుకూరదుంపలూ, ఉర్లవంగ, అనప, బెండ లాంటి కూరలు పండించేవారు. వారానికి ఒకసారి ఊరి సంతలో కూరగాయలు అమ్మి జీవనం సాగించే నిష్కళంకమైన అమాయకుల జీవన విధానాలను ఎంతో అద్భుతంగా కళ్ళకు కట్టినట్లు వివరించాడు రచయిత. ఉత్తరాంధ్ర గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు నిర్మలమైన, స్వచ్ఛమైన మనస్సును కలిగి ఉండి, ఎలాంటి పగ ప్రతీకారం, రాగద్వేషాలు లేకుండా ఎంతో చక్కగా కలిసి మెలసి జీవిస్తారు.

స్వార్థపరులైన రాజకీయ నాయకులు భూస్వాముల చేతిలో మోసపోయిన దాలప్పడు దీనగాథ 'కొలతలు' కథలో ఎంతో అద్భుతంగా చిత్రించాడు రచయిత. ఉత్తరాంధ్రలో పెత్తందార్లు బడుగు జీవుల బతుకులతో ఎలా ఆడుకుంటున్నారు భూస్వామి జోగినాయుడు, రాజకీయ నేత కన్నంనాయుడుల ద్వారా మనకు చాలా స్పష్టంగా అర్థమవుతుంది. ఇలాంటి స్వార్థపరుల వల్ల పేద రైతుల జీవితాలు ఏ విధంగా పతనమైపోతున్నాయో అర్థమవుతున్నాయి. దాలప్పడుకి రాయితీ చెరువు క్రింది పట్టాలు యిచ్చారు. ఆకొద్ది భూమిని సాగు చేసుకుంటూ జీవం సాధిస్తున్నాడు. వాళ్ళ కాళ్ళు వీళ్ల కాళ్ళు పట్టుకుని

పట్టా తెచ్చుకుని సాగు చేసుకుంటున్న ఆ భూమిపై భూస్వామి జోగినాయుడు కన్ను పడింది. యంఆర్ఓకి లంచాలు యిచ్చి ఆ పేదవాడి భూమి లాక్కున్నాడు రాజకీయ పలుకుబడి ఉండి ఏ అండ ఆధారంలేని దాలప్పడు ఏమి చెయ్యని నిస్సహాయస్థితిలో ఉన్నాడు. ఫలితంగా ఆ కాపురంలో కలతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుత సమాజంలో ఇలాంటి పరిస్థితులే లేకున్నాయి. ఈవినీతి, లంచగొండితనంతో స్వార్థ రాజకీయ నాయకులు, భూస్వాముల చేతిలో దాలప్పడు లాంటి ఎందరో పేద రైతులు జీవితాలు భుగ్గిపాలైపోతున్నాయని రచయిత ఈ సమాజాన్ని సున్నితంగా హెచ్చరించారు. ప్రజలకు కష్ట సుఖాల్లో అండదండలుగా ఉండాల్సిన బాధ్యత గల ఉద్యోగులు, రాజకీయ నాయకులు తన స్వార్థం చూసు కున్నప్పుడు పేదవాడికి దిక్కెవరు. ఇక ఆ దేవుడే దిక్కు.

అట్టాడి వారు ఉత్తరాంధ్ర గ్రామీణ స్త్రీల అంద చందాలను ఎంతో చక్కగా 'గయిరమ్మ' కథలో వివరించాడు. ఏరువాక తరువాత నాట్లు ప్రారంభానికి వరి చేళ్ళకు స్త్రీలు గౌరీ పౌర్ణమి ఉత్సవాలు చేస్తారు. పళ్ళెంలో వరి దుబ్బు పెట్టి పూజ చేసి, పసుపు, కుంకుమ రాసిన పళ్ళెంలో పెట్టి దాన్ని పొలం ముందు గల గట్టు మీద పెడతారు. గౌరీ దేవత పూజ కోసం ముడుపుల రోజులు ఇలా దక్షిణలు పెడతారు. ఈ దక్షిణ డబ్బులతో గౌరీ పౌర్ణమి నోము ఎంతో విశిష్టమైనది. ఆ అమాయకపు స్త్రీలు ఎంతో నమ్మకంతో, నిష్టతో పౌర్ణమి చెస్తారు. ఐదు రాత్రులు గౌరమ్మ పాటలు పాడి, పౌర్ణమి తెల్లవారి గౌరమ్మ విగ్రహాన్ని నాగావరి నదిలో కలుపుతారు. ఈ విధంగా ఉత్తరాంధ్ర ప్రజలలో దాన్ని వారి జీవన విధానాలు, వారి విశ్వాసాలను రచయిత ఎంతో చక్కగా అద్భుతంగా చిత్రించడం జరిగింది. రచయిత ఉత్తరాంధ్ర ప్రాంతం వారు కావడం వారి స్వానుభవాన్ని పాఠకుల కళ్ళకు కట్టినట్లు వర్ణించడం వారికి వెన్నతో పెట్టిన విద్య. ఇది ఊహించి వ్రాయడం కాదు కాని మనస్సులోని భావాలను చక్కగా వ్యక్తపరచడం పగ, ప్రతికారం, ద్వేషాలతో రగిలి పోయేవారు కాదు. ప్రేమ, ఆప్యాయతలు అను రాగాలతో చక్కగా కలసిమెలసి ఉండే గొప్ప సంస్కృతి 'ఓ తొటకథ'లో తోట యజమాని జగన్నాథం నాయుడు తన తోటలోకి వచ్చిన ఏ మనిషిని కూడా ఒట్టి చేతులతో పంపించేవాడు. 'నాశింజో, చిత్తయో, మామిడో, సపోటాయో యేదో ఒక ఫలం ఇచ్చి పంపేవాడు'. ఆ తోట అంతే జగన్నాథం నాయుడుకి ఎంతో ఇష్టం. ప్రకృతి అన్న పచ్చని చెట్లన్నా ఆయన వల్లమాలిన అభిమానం. తన కన్నబిడ్డలతో సమానంగా చూసుకొనే గొప్ప సంస్కార వంతుడు నాయుడు గారు.

అట్టాడివారి కథా సాహిత్యంలో, ఉత్తరాంధ్రలో పేదవారు, బడుగు బలహీన వర్గాల పట్ల భూస్వాములు, పెత్తందార్లు దౌర్జన్యాలు, దోపిడీలను గురించి ఆయన ఎన్నో మంచి కథలను రచించడమే కాకుండా, ఎన్నో అద్భుతమైన పాత్రలను సృష్టించారు. తరతరాలుగా గ్రామాల్లో చాకలి, మంగలి, చారిక లాంటి జాతులు భూమి లేని కూలీ రైతాంగం కంటే హీనస్థితిలో మగ్గుతూ భూస్వాములకు ఊడిగం చేస్తున్నారు. వాడి కాడి మోస్తున్నారు. 'పువ్వుల కొరడా' కథలో కూడా అసిరిసెట్టి తమ్ములపాలెం నాయుడు గారె సాబేదు. బంగారంపేట జమిందారు జగ్గునాయుడు తమ్ములపాలెం జమిందారుల వియ్యంకుడు. వారికి పంపిన సారెలో నాలుగు అరిచెలు తగ్గినవి. అందుకై అసిరిసెట్టిని రాయుడు గారు పువ్వుల కొరడాతో పశువుని కొట్టినట్లు కొడుతున్నారు. వీపు మీద కొరడా దెబ్బలకు చర్మం పగిలిపోతుంది. దెబ్బ దెబ్బకు నరాలు తెగిపోతున్నాయి. పువ్వుల కొరడా ఎర్రటి కొరడాగా మారింది. ఆ చిత్రహింసలు భరించలేని 'అరిసెట్టి కదిలాడు.. నిటారుగా నిప్పులా లేచాడు.. కొరడా కంటే వేంగా.. కత్తికంటే పదునుగా.. నాయుడు కంటే బలంగా భూస్వామ్య, ఫ్యూడల్ నిరంకుశంపై ఎర్రసూరీడయ్యాడు...' నిరంకుశ దాస్య శృంఖాలను తెంపేశాడు. పీడిత ప్రజలకు విముక్తిని ప్రసాదించాడు.

అట్టాడి అప్పల్నాయుడు ఉత్తరాంధ్ర ప్రజల జీవన విధానాన్ని ఆలోచన విధానాలను, వారి జీవితాలలో సంభంవించిన ఎన్నో మార్పులను ఎంతో అద్భుతంగా రచించాడు. వారు సృష్టించిన పాత్రలు సమకాలీన సమజానికి ఎంతో ఆదర్శం. ఎందరో మేధావులను సైతం ఆలోచింప చేసిన పాత్రలు. కావున ఇలాంటి ఆదర్శ వంతమైన రచయితలు చాలా అరుదు. వారిలో ఒకరు అట్టాడి అప్పల్నాయుడు గారు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - ప్రొ॥. వెలమల సిమ్మన్న.
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥. ద్వా.నా. శాస్త్రి.
3. కథానిక స్వరూప స్వభావాలు - డా॥. పోరంకి దక్షిణామూర్తి.
4. ఆంధ్రుల చరిత్ర - డా॥ బి.యస్.యల్. హనుమంతరావు.
5. సమాజం సాహిత్యం - ఆర్.ఎస్. సుదర్శనం.
6. ఎంపిక - అట్టాడి అప్పల్నాయుడు, ఇండియాటుడే 16 జూన్ 1996.
7. కొలతలు ఆంధ్రప్రభ ఆదివారం 10-12-1993 - అట్టాడి అప్పల్నాయుడు.
8. గయిరమ్మ ఆంధ్రప్రభ 29/12/1993 - అట్టాడి అప్పల్నాయుడు.
9. ఓ తోటకథ ఆంధ్రజ్యోతి ఆదివారం 13 ఫిబ్రవరి 1992 - అట్టాడి అప్పల్నాయుడు.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావ వీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గ్రామ దేవత కలికిరి ఎల్లమ్మ తిరునాళ్ళు

– డా॥ పి. కుమారి నీరజ, తెలుగు సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ పిజి కళాశాల, పుత్తూరు.

గ్రామ దేవతలు గ్రామాలను కాపాడుతుంటారు. ప్రజల కోర్కెలను నెరవేరుస్తూ దొంగలనుండి, రోగాల బారినుండి ప్రజలను, పంటలను, పశుసంపదను కంటికి రెప్పలా కాపాడుతూ ప్రజలకు పెద్దదిక్కై పూజలందు కుంటుంటారు. వీరు ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలవబడుతుంటారు.

ఎల్లమ్మ, గంగమ్మ, పోలేరమ్మ, చౌడమ్మ, ముత్యాలమ్మ,పెద్దింటమ్మ, మూలస్థానమ్మ, కావమ్మ, మాతమ్మ ఇలా ఎందరో దేవతలు వివిధ ప్రాంతాల్లో గ్రామ దేవతలుగా ఆరాధింపబడుతున్నారు. గ్రామ రక్షణకోసం పోతరాజు, వీరభద్రుడు వంటి పురుష దేవుళ్ళు ఉన్నారు. వీరందరినీ ప్రసన్నం చేసుకోవడానికి గ్రామ ప్రజలు గ్రామ దేవతలకు ఉత్సవాలు చేస్తారు. వాటినే జాతరలని, సంబరాలని, తిరునాళ్ళని పిలుస్తారు.

చిత్తూరు జిల్లాలో తిరుపతి మదనపల్లె జాతీయ రహదారి మధ్యలో తిరుపతికి 75 కిలోమీటర్ల దూరంలో 'కలికిరి' అనే ఊరుంది. ఆ గ్రామ దేవత 'ఎల్లమ్మ'. ఇక్కడ ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా తిరనాల జరుగుతుంది. ఈ దేవత చాలా మహిమగలదని ప్రజల నమ్మకం. అందుకు నిదర్శనం ఈ గుడి అభివృద్ధేనంటారు.

కలికిరి అంటే కలికి నిలయం. ఈ గ్రామ నామం అనేకార్థాలను సూచిస్తోంది. నల్లని స్త్రీలు ఉండే పల్లె అనీ, అందమైన ఆడవారున్న గ్రామమనీ, అడవి పందులు (కిరి అంటే పంది అని అర్థం) తిరిగే స్థలమని, నెమళ్ళు నివసించే ప్రాంతమనీ, సంపదలకు నిలయమనీ, సామర్థ్యానికీ, శూరత్వానికీ పేరు పొందిన ప్రాంతమనీ అనేకార్థాలు. కల్లు అంటే రాళ్ళు. ఈ ప్రాంతంలో రాళ్ళు ఎక్కువగా ఉండటం వల్ల ఈ పేరు వచ్చివుండవచ్చు.

ఒక కథ ప్రచారంలో వుంది. కలికమ్మ, మలికమ్మ అనే అక్కచెల్లెండ్లైన భోగం స్త్రీల పేరుమీద కలికిరి వచ్చిందని గ్రామస్థుల కథనం. వీరిద్దరూ తమ దగ్గరున్న ధనంతో గ్రామం చుట్టూ కోట కట్టించి కట్టడి చేశారు. అంతేకాదు గ్రామంలో పొలాలను సస్యశ్యామలం చేయడానికి ఒక పెద్ద చెరువును త్రవ్వించారు. దానికే కలికిరి చెరువని పేరు.

3వ శతాబ్దంలో పల్లవరాజులు, ఆ తర్వాత చోళ రాజులు ఈ ప్రాంతాన్ని పాలించారు. 13 వ శతాబ్దంలో చోళరాజ్యం పతనమవడంతో సాళువ రాజులు, యాదవ రాజులు ఈ ప్రాంతాన్ని ఏలారు.1324వ సంవత్సరంలో ఢిల్లీ సుల్తాన్ అల్లాఉద్దీన్ ఖిల్జీ ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాడు కానీ చాలా కాలం అతని పాలన జరగలేదు. 1326కు ఈ ప్రాంతం విజయనగర సామ్రాజ్యంలో కలిసిపోయింది. తర్వాత 330 సంవత్సరాలకు అంటే 1656లో గోల్కొండ నవాబుల పాలనలోకి వచ్చింది. 1801లో ఈ ప్రాంతం ఇంగ్లీషువారి పాలనలోకి వచ్చింది. 1911 ఏప్రెల్ ఒకటిన చిత్తూరు జిల్లాను ఏర్పరిచారు బ్రిటిష్ వారు. కలికిరి గ్రామం అలా చిత్తూరు జిల్లా వాయల్పాడు తాలూగా మేడికుర్తి ఫిర్కాకు చెందినది. ప్రస్తుతం కలికిరి మండల కేంద్రం.

జానపదులు ఎల్లమ్మగా కొలిచే ఈ దేవత రేణుకాదేవి. ఈమె జమదగ్ని మహర్షి భార్య. పరశురాముని తల్లి. ఈ ఎల్లమ్మ అనే మాట అచ్చ తెలుగు. మహారాష్ట్ర, కన్నడ, తమిళ, మలయాళ ప్రాంతాల్లోనూ ఎల్లమ్మ అనే గ్రామ దేవత ఉన్నట్లు తెలుస్తోంది.

ఆంధ్ర ప్రాంతాన్ని పాలించిన కాకతీయుల కులదేవత ఎల్లమ్మ. విజయనగర రాజుల గ్రామదేవత పట్టణం ఎల్లమ్మ.

కలికిరి ఎల్లమ్మ ఆ ప్రాంతానికి ఎలా వచ్చిందనడానికి కథనాలు ప్రచారంలో ఉన్నాయి. కలికిరి గ్రామంనుండి

జంగం కులస్థులు ముత్యాలు, పగడాల వ్యాపార నిమిత్తం పై దేశం అంటే కర్ణాటక పోయేవారు. ఇప్పటికీ వెళ్తున్నారు. కర్ణాటకలో జంగమకులం వారిని లింగా యతులు అంటారు. బళ్ళారి, బెల్గాం, ధార్వాడ జిల్లాల్లో వారి వ్యాపారం బాగా జరిగేది. అందులో ధార్వాడ జిల్లాలోని 'సమదుత్తి' అనే గ్రామంలో తరచూ బస చేసేవారు. వీరు అసిమి సంచి (రెండు అరలుగా వుండే కావడి సంచి)ని భుజానికి తగిలించుకుని తిరిగేవారు. ఇందులో వ్యాపార సామగ్రి, నిత్యావసర వస్తువులు భద్రపరచుకునేవారు.

ఎల్లమ్మ జంగమలను చేరడం :

ఒకసారి కలికిరి చెరువుముందర పల్లెలోని కొందరు జంగమలు ముత్యాలు, పగడాలు, విలువైన రాళ్ళు తీసు కుని పైదేశానికి వ్యాపారనిమిత్తం వెళ్లి ధార్వాడ జిల్లాలోని సమదుత్తి గ్రామంలోని శివాలయంలో బస చేశారు.

వ్యాపారంలో బాగా లాభం రావటంవల్ల హాయిగా నిద్రపోయి మరునటిరోజు ఉదయమే ఊరికి తిరుగు ప్రయాణమయ్యారు. కొంతదూరం వెళ్ళగానే శివయ్య అసిమి సంచి బరువుగా తోచి కిందికి దించాడు. నా సంచిలో నా గుడ్డలు తప్ప ఏమీ లేవే. ఇంత బరువుగా ఎందుకుంది? అని లోపల చూశాడు. నాలుగైదు వీసెల బరువున్న గుండ్రాయిని బయటికి తీసి, నిరేయ్! మన వాళ్ళెవరో ఆట పట్టించడానికి నా సంచిలో ఈ గుండ్రాయిని వేశారు అని దాన్ని విసిరేశాడు. అందరూ ప్రయాణం సాగించారు. మళ్ళీ కొద్ది దూరం వెళ్ళేసరికి శివయ్యకు అదే పరిస్థితి. రాయి సంచిలో చేరింది.

సాయంత్రమైంది. రాత్రి అందరూ దారిలోని ఒక గ్రామంలో ఉన్న చిన్న గుడిలో విశ్రమించారు. శివయ్య తమవారిలోని పెద్దాయనతో "అన్నా! ఈ గుండ్రాయి సమదుత్తి నుండి నన్ను వెన్నాడుతూనే వుంది. ఎంతగా వదిలించుకోవాలనుకున్నా వదలడంలేదు. ఇదేమైనా భూతమా? దయ్యమా?" అని భయపడుతూ చెప్పాడు.

అందరూ ఆ గుండ్రాయిని తడిమి చూశారు. పెద్దాయన నిమనం పరమ శివుని భక్తులం. నిత్యం ఆయన్ను తలుచుకుంటుంటాం. శివుడు భూతనాథుడు. భూత పిశాచాలేమైనా మన దేవర పేరు వింటేనే ఆమడ దూరం పారిపోతాయి. ఈ గుండ్రాయి ఏ దేవతో అయి వుంటుంది. ఏదో కారణం వల్ల మన వెంటబడుతూంది. మనల్ని పీడించడానికైతే కాదు. ఎవరూ భయపడద్దు అని అందరికీ ధైర్యం చెప్పాడు.

అందరూ శివనామ స్మరణ చేస్తూ నిద్రపోయారు. తెల్లవారుజామున శివయ్యకు ఒక కల వచ్చింది. ఆ కలలో శివయ్య కళ్ళముందు వెలుగులతో ఒక దేవత ప్రత్యక్ష మైంది. నిశివయ్యా! మీరంతా గుండ్రాయి రూపంలోని నన్ను చూచి భయకంపితులవుతున్నారు. మీకెలాంటి భయమూలేదు. నేను పురాతన కాలంనుండీ గ్రామస్థ లందరిచేతా నిత్యపూజలందుకునే దాన్ని. ఆ గ్రామంలోకి ఏ దుష్ట శక్తీ ప్రవేశించకుండా వారిని కాపాడేదాన్ని. రాను రాను ఆ గ్రామంలోకి మీలాంటి లింగాయతులు వచ్చి చేరారు. వారందరూ నా తండ్రైన పరమ శివునికి ఆలయం నిర్మించుకున్నారు. లింగాకారంలోని ఆయన్ను పూజిస్తూ నన్ను విస్మరించారు. నేను పరాయిదాన్ని కదా! నాది దిగువదేశం. తూర్పు కొండల్లో వుంది. నా తండ్రి దండు గిరిరాజు. నేను శివభక్తురాలిని. ఎల్లవేళలా శివుని తలంపే నాకు. నా తండ్రి నన్ను మార్చాలని చూచాడు. వీలుగాక నన్ను పట్టించుకోవడం మానేశాడు. ఇటువైపు ఒక శివభక్తి బృందం వస్తూ వుంటే వారివెంట వచ్చేశాను. సమదుత్తి నచ్చడంతో ఇక్కడే ఉండిపోయాను. కానీ ఇప్పుడు నేను దిగువ దేశం వెళ్ళి నాకు నచ్చినచోట స్థిరపడుదామని అనుకున్నాను. మీరు నా తండ్రికి పరమ భక్తులు కాబట్టి మీ వెంట వస్తే నాకు మంచి చోటు దొరుకుతుందనే నమ్మకంతో మీ వెంటబడ్డాను.ఎల్లలు కాపాడే దేవతను నేను అందుకే నన్ను ఎల్లమ్మ అంటారు. మీరెవరూ భయపడాల్సిన పనిలేదు. మిమ్మల్ని వెన్నంటి కాపాడు తాను. అని చెప్పింది.

శివయ్య నితల్లీ! నీకిష్టమైనచోటుకి నిన్ను తీసుకుని పోతాను. ఐతే నేను వ్యాపారంకోసం ఇట్లావచ్చి చానారోజు లైంది. నా భార్యా బిడ్డలు నాకోసం ఎదురు చూస్తూ వుంటారు. అక్కడికి పోయిన తర్వాత నీకు నచ్చినచోటుకు నిన్ను చేర్చే బాధ్యత నాది అన్నాడు. ఎల్లమ్మ మంద హాసంతో అదృశ్యమైంది.

శివయ్య కలవరింతలకు మెలకువ వచ్చిన పెద్దాయన నిశివయ్యా! శివయ్యా!ు అని తట్టి లేపాడు. శివయ్య తన కల గురించి అందరికీ చెప్పాడు. అందరూ ఆనందంతో ఊరికి బయలుదేరారు. కొన్ని రోజులకు స్వగ్రామం చేరారు.

శివయ్య భక్తితో తన వెంట వచ్చిన గుండ్రాయిని పూజగదిలో పెట్టాడు. అతని కుటుంబ సభ్యులూ, చెరువుముందర పల్లెలోని జంగమలందరూ నిత్యం ఆ గుండ్రాంయిరూపంలోని ఎల్లమ్మ దేవతను పూజించ సాగారు. ఎల్లమ్మ తల్లి తమ అదృష్టంవల్ల ఆడపడుచుగా తమయింట చేరిందని అపురూపంగా చూసుకున్నారు.

ఆలయ నిర్మాణం :

మళ్ళీ ఒకరోజు శివయ్యకు ఎల్లమ్మ దేవత కలలో కనిపించి నిశివయ్యా! ఈ ప్రాంతం నాకు నచ్చింది. ఇక్కడి స్త్రీల మనస్సు శరీరమూ చాలా అందంగా కనబడు తున్నాయి. పురుషులు కూడా ధర్మం, నీతి తెలుసుకుని మెలుగుతున్నారు. నాకీ ప్రాంతం బాగా నచ్చింది. నా కోసం ఎవరైనా గుడి కట్టిస్తే నేను ఇక్కడే నిలిచిపోతాను అని చెప్పింది.

తెల్లవారుజామునే శివయ్య ఈ విషయం అందరికీ చెప్పాడు. గ్రామ పెద్దలు ఈ విషయం ఆలోచించారు. మనం తాత ముత్తాతల కాలంనుండి పరమశివున్నే ఇల వేల్పుగా కొలుస్తున్నాము. మరో దేవత ఆలయాన్ని మన పల్లెలో నిర్మించడంవల్ల, ఆ శివుడికి ఆగ్రహం కలుగు తుందేమో అని భయపడ్డారు.

పెద్దాయన "శివయ్యా! ఎల్లమ్మ తల్లి నీ వెంట వచ్చింది. ఆమె నీకు సాకుడు బిడ్డతో సమానం. మన యింటి ఆడబిడ్డను మన యింటిలోనే పెట్టుకో కూడదు కదా. ఆమెను మరోచోటుకు చేర్చాలి. మన బిడ్డ మనకు దగ్గరలోనే ఉండేటట్లు కలికిరికి ఆమెను చేరిస్తే బాగుం టుంది" అన్నాడు.

ఊరందరికీ పెద్దాయన చెప్పింది నచ్చింది. ఐతే గుడి కట్టాలంటే భక్తితో పాటు డబ్బూ కావాలి కదా అట్లాం టోళ్ళు కలికిరిలో ఎవరున్నారో కనుక్కుందాం అంతా ఆ ఎల్లమ్మ తల్లే చూసుకుంటుందన్నారు గ్రామ పెద్దలు.

కలికిరిలో భూకామందులూ, ధనవంతులూ కొందరే ఉన్నారు. వారిలో భక్తితత్పరత, ధర్మగుణం, న్యాయ మార్గాన్ని అనుసరించేవారెవరా అని వెతికారు. చివరకు ఊరందరూ నిబంగారు పిచ్చుకు అని ముద్దుగా పిలుచు కునే భూకామందు, ధర్మ తత్పరుడు, గొప్ప దాత సాదా సీదాగా కనిపించే రెడ్డివారి గంగిరెడ్డివారు ఇందుకు తగిన వ్యక్తి అని నిశ్చయించుకున్నారు.

జంగమలందరూ ఆయన వద్దకెళ్లి విషయమంతా వివరించారు. ఆయన నిఇది నా అదృష్టమని వెంటనే ఆమెను దర్శించుకుని ఆనంద పరవశుడై ఎల్లమ్మ తల్లి గుడి కట్టడానికి పూనుకున్నాడు. జంగమలతో కలిసి పురోహితుని వద్దకెళ్లి విషయం చెప్పారు. ఎల్లమ్మ తల్లి శక్తి రూపిణి. అంటే అపర కాళికాదేవి. ఆమె రాక్షసుల నెందరినో చంపి, ఉగ్రరూపిణిగా మారింది. ఆమెను శాంతింపజేయాలంటే బలులివ్వాలని, అందుకు బ్రాహ్మ ణులు ఒప్పుకోరని, శూద్రులనే పూజారులుగా పెట్టు కోమని, కాకతీయులు కూడా అలానే చేశారని సెలవిచ్చాడు పురోహితుడు.

మంత్రతంత్రాలు తెలిసిన కంసల కృష్ణమాచారిని ఇందుకు తగినవాడిగా నిర్ణయించుకున్నారు. అందరూ కలిసి కలికిరికి దక్షిణానున్న గంగిరెడ్డి చేన్లో తూర్పు ముఖంగా ఎల్లమ్మ గుడిని నిర్మించాలని నిశ్చయించు కున్నారు.

బ్రాహ్మణులు, వైశ్యులు వీరిలో కలవరు. క్షత్రియులు అప్పటికి కలికిరిలో లేరు. తక్కిన అన్ని కులాలవారూ

గుడి నిర్మాణానికి పూనుకున్నారు. జంగమలు ఊరూరా తిరిగి ప్రచారం చేస్తూనే, రైతులవద్దనుండి ధాన్యం సేకరించారు. తుమ్మలపేట, చింతమాకుల పల్లెలనుండి వడ్డెర కులస్థులు రాళ్లు కొట్టే పనికి పూనుకున్నారు. అలా అన్ని కులాలవాళ్ళూ కలిసి ఈ ఆలయాన్ని నిర్మించారు.

విగ్రహ ప్రతిష్ట :

అమ్మవారిని ఎలా ప్రతిష్టించాలనే సందేహం. మళ్ళీ ఎల్లమ్మ తల్లి శివయ్య కలలో కనబడి నివచ్చిన రూపం లోనే ప్రతిష్టిస్తే తానే అసలు రూపంతో వెలుస్తానని, తనకు ఏడుపడగల నాగేంద్రుడున్న కిరీటం తయారు చేసి పెట్టమని చెప్పిందట. అంతేకాదు అసలు రూపంతో వెలిసిన తర్వాత అందరితో మాట్లాడుతాననికూడా చెప్పిందట.

ఒక శుభముహూర్తాన విగ్రహ ప్రతిష్ఠ జరుగగా లింగాకృతిలోని ఎల్లమ్మ చెప్పినట్లే ఉగ్రరూపాన్ని చూసి భయపడతారని శిరస్సు మాత్రమే ఉండేటట్లు నిజ రూపంలోకి మారిందట. ఏడుపడగల నాగేంద్రుడు కిరీటమై అమ్మవారి శిరస్సును అలంకరించగా, అత్యంత సుందరమైన చిరునవ్వు ముఖంతో, భూమిపైనుండి అప్పుడే తలపైకెత్తినట్లు అందరికీ దర్శనమిచ్చిందట.

అమ్మవారికి గంగిరెడ్డివారు నూతన పట్టు వస్త్రాలు సమర్పించగా, కృష్ణమాచారి తమ కులవర్గంతో ఏడు తలల కిరీటాన్ని అమ్మ వారికి అలంకరించగా, శివయ్య పుట్టింటి సారె సమర్పించాడు.

గ్రామస్థుల కోరికమేరకు శివయ్య అడగ్గా అమ్మవారు మాట్లాడి తనకు చాలా ఆనందంగా వుందని, గ్రామాన్ని కాపాడుతానని, ధర్మంగా అడిగిన వారి కోరికలు తీరుస్తానని, సంతాన భాగ్యం కలిగిస్తానని, సత్యం పలికే వారిని రక్షిస్తూ, అసత్యం పలికే వారిని శిక్షిస్తానని పలికిందట.

అప్పటినుండీ గ్రామస్థులు తగాదాలను అమ్మవారి వద్దే తీర్చుకునేవారు. సత్యం పలుకుతూ, సత్యం పలికించే ఎల్లమ్మను అందరూ సత్తెమ్మ అని కూడా పిలుస్తారు. సత్యం పలికించడమే కాదూ అడిగిన వారికి భూత భవిష్యత్ వర్తమానాలను కూడా చెపుతుండేది. అయితే దీని వల్ల మంచికంటే చెడే ఎక్కువ జరగడంతో పూజారి కృష్ణమాచారి అమ్మవారి నోటిని కట్టేశాడని అందరూ చెప్పుకుంటారు. అప్పటినుండి ఆమె పిలిస్తే పలకదు కానీ ప్రజల కోర్కెలను మాత్రం నెరవేర్చేది.

తిరునాళ్ళు :

అప్పటినుండి ప్రతి సంవత్సరం ఆషాడమాసంలో శుక్లఏకాదశి సమీపఘడియలో వచ్చే శనివారం నుండి ఎల్లమ్మ దేవత ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉత్సవాలు జరగడానికి రెండుమూడు వారాలముందే చాటింపు వేస్తారు. ఆ చాటింపును ఇక్కడ సోలిం అంటారు. దీన్నే ఎల్లమ్మ తల్లి గ్రామ పర్యటనగా భావిస్తారు. సంవత్సరానికొకసారి ప్రజల క్షేమ సమాచారాలను విచారించడానికి, తనకు తిరునాళ్ళు జరిపితే శుభం కలుగుతుందని గుర్తు చేయడానికి, అన్ని కులాలవారూ గుడివద్దకు చేరి వారి వారి విధులు నిర్వర్తించాలని గుర్తు చేస్తూ గ్రామ పర్యటన చేస్తుంది.

ఎల్లమ్మకు అక్క చెల్లెండ్లు ఆరుమంది. వీరందరికీ పోతలరాజు తమ్ముడు. అక్క అంకాళమ్మ, తమ్ముడు పోతరాజు అంగరక్షకుడుగా వెంటరాగా పల్లకిలో నలుగురు వ్యక్తులు మోస్తూ ఉంటే, మేళతాళాలతో ఎల్లమ్మ తల్లి సోలిం తిరిగివస్తుంది.

ముందుగా ఎల్లమ్మ పుట్టినిల్లు చెరువు ముందర పల్లెకు వెళ్లి అక్కడ ఒక రాత్రి బస చేస్తారు. మరుసటిరోజు ఎల్లమ్మ అక్క అంకాళమ్మ పుట్టినిల్లు తుమ్మలపేట పల్లెకు వెళ్తారు. ఇలా శుక్రవారం వరకు 21 రోజులు గ్రామ పర్యటన చేసి శుక్రవారం రాత్రికి గుడికి చేరుకుంటారు. శనివారం మధ్యాహ్నం జాతర ప్రారంభమౌతుంది.

తిరునాళ్ళలో మొదటి రోజు కార్యక్రమాలను జాగారం అని పిలుస్తారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి గుడిని శుభ్రపరుస్తారు. గంగిరెడ్డివారి వంశస్థులు పట్టువస్త్రాలు తీసుకుని వస్తారు. కంసల గుడాచారి అంటే

తండా కృష్ణమాచారి వంశీకులు ఆభరణాలు తీసుకుని వస్తారు. పుట్టింటి వారు చెరువు ముందర పల్లెలోని పత్రి ఇంటిపేరుగల జంగమలు పసుపు కుంకుమలు తీసుకుని వస్తారు. ఇలా ఎల్లమ్మ, అంకాళమ్మలకు సాయంత్రం ఆరు గంటలకు అభిషేకం చేసి అలంకరించడంతో తిరునాళ్ళకు అంకురార్పణ జరుగుతుంది.

రాత్రి 9.30 నుండి 12.00 గంటలవరకు ఆసాది ఎల్లమ్మ కథను విన్పిస్తాడు.

అర్ధరాత్రి పాలపొంగు ప్రారంభమవుతుంది. పుట్ట నుండి తెచ్చిన మట్టితో పొయ్యి ఏర్పాటు చేసి, కొత్త కుండలో పాలుపోసి, అందులో 5 లేదా 11 రూకలేసి ఎండిన ఉత్తరేణి పుల్లలతో మండిస్తారు. పాలు కాగు తుండగా ఆ రూకలను వట్టి చేతులతో బయట తీస్తారు. పాలు ఎటువైపు పొంగితే ఆ వైపునున్న ఊరు పైరు పచ్చలతో కళకళలాడుతుందని ప్రజల విశ్వాసం. ఆ కుండలో బియ్యం, బెల్లం వేసి నైవేద్యాన్ని సిద్ధం చేయడానికి పూనుకుంటారు. పాలకుండపైనున్న మూకుడులో మంచినూనె, ఆముదమూ పోసి, పెద్ద దూదివత్తి పెట్టి వెలిగిస్తారు. అది నాలుగు రోజులవరకూ వెలిగే అఖండదీపం. చివరిరోజు ఆ నైవేద్యాన్ని సిద్ధల బావి వద్ద అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి తర్వాత భక్తులకు పంచుతారు. అది అప్పటికప్పుడే చేసినట్లుం డటం విశేషం.

పాలపొంగు తర్వాత ఆ రాత్రి రెండున్నర మూడున్నర గంటలప్పుడు బిడ్డలులేని స్త్రీలు సంతానంకోసం వరపడు తారు. వరపడే స్త్రీలు కలికిరి పెద్దచెరువులోని సిద్ధల బావిలో మునిగి తడి బట్టలతో ఎల్లమ్మ గుడిముందు సాష్టాంగ నమస్కారం చేస్తూ పొర్లు దండాలు పెడతారు.

3.30 గంటలకు బలిహారం ప్రారంభమౌతుంది. అష్టదిక్పాలకులను సంతృప్తి పరచడానికి విజయకేతన మైన ధ్వజస్తంభానికి దిష్టి తగలకుండా ఉండటానికి బలిహారం ముద్దలను పెడతారు. మేకపోతును నరికి, దాని రక్తాన్ని అప్పుడే వండిన అన్నంలో కలిపి ఆ అన్నాన్ని తొమ్మిది ముద్దలుగా చేస్తారు. ఆ ముద్దలను ఎనిమిది దిక్కుల్లో ఎనిమిది, గుడి ముందున్న బలిపీఠం దగ్గర ఒకటి పెడతారు.

ఈ కార్యక్రమమంతా సూర్యోదయం లోపలే జరిగి పోవాలి.

ఎల్లమ్మ తిరునాళ్ళలో రెండవ రోజు ఆదివారం చాలా విశేషమైంది. అందరూ కోరుకున్నది జరుగుతుంది. బోనాల పండుగ దినంగా ఈ దినం ప్రసిద్ధం.

మద్ది, వేప కలపలతో తయారు చేసిన తేరుపై ఉదయం అమ్మవారి మెరవణి ప్రారంభమౌతుంది. పూర్వం నిర్దేశించిన వీధులగుండా అమ్మవారి ఊరేగింపు జరుగుతూంటే వారివారి ఇళ్ళముందుకు రాగానే భక్తులు అమ్మవారికి పూజా సామగ్రి సమర్పించి హారతులందు కుంటారు. మధ్యాహ్నం వరకూ ఈ రథోత్సవం జరుగు తుంది.

తర్వాత సిద్ధపూజ జరుగుతుంది. ఎల్లమ్మ తండ్రి సత్యగిరిరాజు లేదా దండుగిరిరాజుకు రాక్షసులతో యుద్ధం జరిగేటప్పుడు తండ్రికి సహాయంగా ఎల్లమ్మ వెళ్తుంటే ఆదిసిద్ధులవారు ఆమె వెంట తన పరివారంతో వెళ్లి రాక్షసుల్ని సంహరిస్తాడు.అందుకు కృతజ్ఞతగా ఎల్లమ్మ గుడిముందు సిద్ధపూజ జరుగుతుంది.

కలికిరి పెద్దచెరువులోని జీవ పుష్కరిణిలాంటి బావే సిద్ధలబావి. ఆదివారం మధ్యాహ్నం భవిష్యత్తు బాగుండా లని బాలురు, యువకులు, సంతానంలేని వారు, ఇతర కోర్కెలతో పురుషులు ఉదయంనుండి ఉపవాస దీక్షతో సిద్ధల బావిలో స్నానం చేసి, విబూధి ధరించి, రకరకాల చెట్ల ఆకులను సిద్ధలబావి నీటిలో తడిపి గుడిలోకి తీసుకొస్తారు. ఆ ఆకుల కట్టను ఉత్సవమూర్తుల ఎదుట చప్పిడి గుగ్గిళ్ళు, పానకం పాత్రల్లో పెట్టి నైవేద్యంగా సమర్పిస్తారు.

సిద్ధుల మండపంలో అమ్మవారు ఉయ్యాల ఊగు తుండగా రాయచోటినుండి వచ్చిన కథకులు సిద్ధుల

కథలను గానం చేస్తారు. మూడున్నర గంటలకు కథ పూర్తికాగానే సిద్ధులకు చప్పిడి గుగ్గిళ్లు, పానకంతోపాటు ఆకులుకొన్ని తుంచి దీక్షాపరుని జోలెలో వేస్తారు. ఇంతటితో వీరి ఉపవాసం ముగుస్తుంది.

తర్వాత సిళ్ళు బోనాల కార్యక్రమం ప్రారంభమౌతుంది. కలికిరి చుట్టుపక్కల ప్రాంతాల్లోని స్త్రీలు మేళతాళాలతో బోనం తెస్తారు. ఇత్తడి పళ్లెంలో బియ్యం బెల్లంతో చేసిన సలిబిండి ముద్ద పెట్టి అందులో దీపం వెలిగించి చుట్టూ దూది పుల్లలు అందంగా అలంకరిస్తారు వీటినే రాగ దీలు అంటారు. నగరి (నాయుని వారి పల్లె) బోనం ముందుగా సమర్పిస్తారు. అమ్మవారి గుడిని దోచుకోవడానికి వస్తున్న దొంగలను నగరిలోని ఏకిల దొరలు ఎదుర్కొన్నందుకు వారికీ గౌరవం దక్కింది.

మొదటి బోనం అమ్మవారి గుడిని చేరగానే ఒకప్పటి కలికిరి కోట బురుజు స్థానంలోని పెద్దవేపమానునుండి మంటలు వచ్చి చుట్టుపక్కల ప్రాంతాలను సువాసనా భరితం చేసి తర్వాత అవే ఆరిపోతాయని, చెట్టుకు ఎలాంటి హానీ జరుగదని చెప్తారు.

స్త్రీలు బోనాలతో వస్తే, పురుషులు వారివారి శక్తిమేరా కోళ్ళు, పొట్టేళ్ళను బలివ్వడానికి తీసుకొస్తారు. ఈ జంతుబలులు ఇప్పుడు తగ్గాయి. ఇదంతా అర్ధరాత్రి వరకూ జరుగుతుండగా చాందినీ బళ్ళు ఊరేగింపుగా వస్తాయి. కోర్కెలు తీరిన భక్తులు ఎద్దులను, బండ్లను టెంకాయ మట్టలు, వేప కొమ్మలు, పూలతో అలంకరించి మేళతాళాలతో వస్తారు. ఈ బండ్లకు ముందు కళాకారులు వివిధ కళారూపాలను ప్రదర్శిస్తుంటారు. ఇప్పుడు ఎద్దుల బండ్ల స్థానంలో విద్యుద్దీపాలంకరణతో ట్రాక్టర్లు దర్శన మిస్తున్నాయి.

సోమవారం ఉదయంనుండి అమ్మవారి సర్వదర్శనం వుంటుంది. రాత్రి ఏడు గంటలకు లంకాదహనం జరుగుతుంది. తొమ్మిది గంటలకు అమ్మవారి పుష్పపల్లకి ఊరేగింపు జరుగుతుంది.

ఉత్సవాల్లో అలిసిపోయిన ఉత్సవ మూర్తులకు చివరి రోజైన మంగళవారం స్నానం చేయిస్తారు. దీన్నే పాగేట అంటారు. కలికిరి ప్రాంతంలో నదులు లేనందున నాలుగు ఏర్ల నీళ్లు కలిసే బావిలో అమ్మవార్ల విగ్రహాలకు సంపూర్ణ స్నానం చేయించి, గుడికి తీసుకెళ్ళి కొత్తబట్టలతో అలంకరించి అర్చనలు చేస్తారు.

మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో కల్లిపాటు ప్రారంభమవుతుంది. రాయచోటి ప్రాంత కథకులు అమ్మవారి మహిమలను కథలరూపంలో విన్పిస్తారు. దీన్నే కల్లిపాటు అంటారు.

రాత్రి ఏడెనిమిది గంటలకు గావు మొదలౌతుంది. అమ్మవారిని సంతృప్తి పరచడానికి అనువంశికంగా కుటుంబంలోని ఒక వ్యక్తి మేక పిల్లను గొంతుకొరికి, ఆ మాంసాన్ని పచ్చిగానే తినేస్తాడు. ఇదిప్పుడు చాటుమాటుగా జరుగుతోందని, మాంసమంతా తినకుండా గొంతు కొరికిన ప్రాంతంలోని కొద్దిమాంసాన్ని మాత్రమే తింటారని చెప్తారు.

గావు తర్వాత శాంతి కార్యక్రమం జరుగుతుంది. కల్లిపాటులో పాల్గొన్నవారు అమ్మవార్ల మీద పసుపు నీళ్ళలో వేపాకు మండలు ముంచి చల్లి శాంతపరుస్తారు.

ముగింపు :

సోలింలో తన ఆహ్వానం మేరకు తన గుడికి వచ్చి, తన తిరునాళ్ళలో పాల్గొని, నిర్విఘ్నంగా సంబరాలు నెర వేర్చినందుకు అక్కగార్లకు ముత్తయిదువ వాయనాలిచ్చి వీడ్కోలు పలుకుతుంది. ఈ కార్యక్రమం అర్ధరాత్రి జరుగు తుంది. దీన్ని గ్రామస్థులెవరూ చూడకూడదని నియమం.

ఈ ఉత్సవాల్లో వివిధ రకాల తినుబండారాలు, వ్యవసాయానికి, వంటకు పనికొచ్చే వస్తువులు, పిల్లల వినోదం కోసం వివిధ యంత్రాలు నెలరోజులపాటు ఉంటాయి. ఇలా ఈ తిరునాళ్ళు పెద్దలు నిర్ణయించి నట్లుగా సుమారు రెండు శతాబ్దాలనుండి రంగ రంగ వైభవంగా జరుగుతున్నాయి.

ఉపయుక్తాలు :

1. కలికిరి గ్రామ దేవత ఎల్లమ్మ కథ - అల్దీ రామకృష్ణ - 2007
2. ఉమ్మడి శెట్టి మణి - ఆలయ పూజారి
3. అశోకరెడ్డి - ఆలయ ధర్మకర్త
4. ఊరి ప్రజలు

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

క్రీడాభిరామం – సమకాలీన సాంఘిక జీవనం

– డా॥. వి. రవళి, సహాయాచార్యులు, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

క్రీడాభిరామంలోని సాంఘిక జీవనం విశ్లేషించటం అంటే కాకతీయుల కాలంనాటి సాంఘిక జీవితాన్ని వివరించడమే. పింగళి లక్ష్మీకాంతం గారన్నట్లు,

"ఈ గ్రంథమే లేనిచో మనకు కాకతీయ సామ్రాజ్య రాజధాని నాగరికతను చదువుకొనియైనను కన్నీరు నించుచు ఆనందించెడి భాగ్యముండెడిది కాదు" (సా.శి.సమీక్ష-పి.ఎల్.కాంతం.)

క్రీడాభిరామం వీథి అనే ఏకాంక రూపక ప్రభేదం. రావిపాటి త్రిపురాంతకుడు రాసిన ప్రేమాభిరామం కావ్యానికి ఇది అనుకరణ. ఇందులోని కథ చాలా చిన్నది. ఇందులో ప్రధాన పాత్రలైన కాసలనాటి గోవింద మంచన శర్మ, టిట్టిభ సెట్టి వేకువజామున ఓరుగల్లు నగరంలో ప్రవేశించి రాత్రి వరకు నగరంలో సంచరించడం ఇందులో ప్రధాన ఇతివృత్తం. కాకతీయుల కాలంనాటి వృత్తులు, కులాలు, క్రీడలు, ఆహారపుటలవాట్లు, ఆచార వ్యవహారాలు, కవితాత్మకదృష్టితో కూడిన స్త్రీ సౌందర్యం క్రీడాభిరామంలో నిండుగా, మెండుగా దర్శనమిస్తాయి.

కాకతీయుల కాలంనాడు మహా వైభవంతో వెలుగొందిన ఓరుగల్లు నగరం నేడు పాడుబడి కనిపిస్తున్నది. ప్రాకారాలు, నేల శంభుని గుడి, కేశవ స్వయంభూ దేవాలయము పూర్తిగా శిథిలమై పోయాయి. క్రీడాభిరామం నాటి ఓరుగల్లు వైభవాన్ని మరొక్కమారు మన కనుల ముందు సాక్షాత్కరింప చేస్తుంది. నాటి సాంఘిక జీవనాన్ని మన ఎదుట నిలబెడుతున్నది.

ఓరుగల్లు కోటకు వెలుపల పెద్ద అగడ్త (పరిఖ) ఉండేది. ఈ అగడ్త నిండా నీరు ఉండేది. తక్కువ జాతుల వాళ్లు నివసించే వాడలన్నీ ఈ అగడ్త చుట్టూ ఉండేవి. ఈ ప్రాంతాన్ని 'వెలిపాళెం' అని పిలిచేవారు. కోటలోపల బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, వేశ్యలు నివసించే 'లోపాళెం' ఉండేది.

"వెలిపాళెంబు కట్ట కడపట గటకార కుటీర వాటిక" ఉండేది. (క్రీడాభిరామం - 67)

అగడ్తకు ఒకవైపు ఈ మేదరవాడ ఉండేది. మరి కొంత ముందుకు పోతే చండాల వాటిక ఉండేది. వెలిపాళెంలో నివసించేవారికి అవసరమైన చేపలు మాంసం 'మైల సంత' లో దొరికేవి. 'లోపాళెం' లో నివసించేవారికి అవసరమైనవి కోట లోపల నిర్వహించే 'మడి సంత' లో దొరికేవి కావచ్చు. వెలి పాళెం నడుమన రైతులు నివసించే 'హాలిక వాటి' ఉండేది.

ఓరుగల్లు నగరంలోని ప్రధాన రాజ మార్గం
"వారణఘటా ఘోటక
శకటికాభటకోటి సంకులంబు
ధరణీ స్థలీ రజస్తరేణు బహుళంబు"గా ఉండేది.
(క్రీడాభిరామం - 114)

విశ్వాసాలు :

క్రీడాభిరామం కాలం నాటి ప్రజల్లో అనేక విశ్వాసాలు కనిపిస్తాయి. ప్రయాణానికి అనువైన కాలాన్ని నిర్దేశిస్తూ,

"గోధూళి లగ్నంబున బురంబు ప్రవేశింప వలయు
విశేషించి యుషః కాలంబు సర్వ
ప్రయోజనారంభంబులకు ప్రశస్తంబు"
(క్రీడాభిరామం - 65)

అన్న మాట కనిపిస్తున్నది. దీన్నిబట్టి సకల కార్యాలకు ఉషః కాలంలో ప్రయాణం ప్రశస్తం గా ఉంటుందన్న నమ్మకం వారికి ఉండేది.

అలాగే, ప్రయాణ సమయంలో అనేక శకునాలను కూడా పరిగణించేవారు.

"చుక్క యొకింత నిక్కి బల
సూదను దిక్కున రాయుచుండుట...."

అనే పద్యంలో అనేక శకునాలను కవి వెల్లడించాడు.

"మా గిలి మా గిలి వృక్షము
పూ గొమ్మున నుండి షడ్జము ప్రకాశింపన్
లేగొదమ నెమలి పల్కెడు
గేగోయని వైశ్య మనకు గెలుపగు జుమ్మీ"

(క్రీడాభిరామం - 51)

నెమలి 'గేగోయ్' అని అరిస్తే కార్యం సిద్ధిస్తుందని నమ్మేవారు.

అలాగే "కొనకొనం గోడి, యేట్రింత, కొంక నక్క, నమలి" ఇది నాలుగు కనిపిస్తే కొంగుబంగారం అవుతుందని శాకనిక వరులు నిర్దేశించేవారు. అంతే కాకుండా ఈ శకునాలను గణించే సిద్ధాంతాల గురించి కూడా క్రింది పద్యం ద్వారా చెప్పాడు.

"గార్గ్య సిద్ధాంతమత ముషః కాల కలన
శకున మూనుట యది బృహస్పతి మతంబు
వ్యాస మతము మనః ప్రసాదాతిశయము
విప్రజన వాక్యమరయంగ విష్ణు మతము"

(క్రీడాభిరామం - 66)

ఆహారపుటలవాట్లు :

క్రీడాభిరామం కాలం నాటి భోజనాన్ని కవి రెండు చోట్ల ప్రస్తావించాడు. శీతాకాలంలో పొద్దున్నే ధనవంతులు కొత్తబియ్యంతో వండిన అన్నాన్ని ఇగురావ కూరతో, మరిగిన నేయి,పెరుగుతో తినేవారట.

"శీతకాలంబు కడి మాడ సేయ గుడుచు
భాగ్యవంతుండు ఱేపాడి పల్లె పట్ల
గ్రొత్త యొరెంబు నిగురావకూర తోడ
బిచ్చలం బైన నేతితో బెరుగు తోడ"
తినే వారని తెలుస్తున్నది.

(క్రీడాభిరామం - 55)

ఓరుగల్లు నగరంలో "పూట వంటకంబు వెట్టు బాడబుల వాడ" ఉండేది. అక్కడ గంధము, సామ్రాణి సుగంధం వ్యాపించి ఉండేది.

ఓరుగల్లులో కేవలం ఆహారానికే కాకుండా ఆహార విహారాలకు కూడా అనువుగా ఉండే భోజనశాలలు ఉండేవి. మధ్యాహ్నం లక్ష్మణ వజల యింట ఒక రూకకు

"కప్పుర భోగి వంటకము
కమ్మని గోధుమపిండి వంటయన్
గుప్పెడు పంచదారయును
గ్రొత్తగా కాచిన యాలనే పెన
ర్పప్పను గొమ్మునల్లనటి
పండ్లను నాలుగు నైదు నంజులున్
లప్పల తోడ గ్రొంబెరుంగు" దొరికేవి.

(క్రీడాభిరామం - 166)

కప్పురభోగి అనేది సన్నబియ్యంలోని ఒక రకం. మధ్యాహ్న భోజనంలో పంచదార వడ్డించడం ఆన వాయితీగా ఉండేదేమో. ఈ రోజుల్లో కూడా పెరుగులో పంచదార కలుపుకొని తినడం ఉంది.కొత్తగా కాచిన ఆవు నెయ్యి క్రొంబెరుంగు అంటే పొద్దున్న చేమిరి వేసిన కమ్మని పెరుగు. ఉష్ణ మండల వాసులమైన మనకు పెరుగు, పెసరపప్పు, అరటిపండు భోజనంలోఉండేవిధంగా జాగ్రత్త తీసుకున్నారనిపిస్తుంది.అయితే, ఈ కథాకాలం శీతాకాలం. దీన్నిబట్టి ఆరుగాలాలూ పప్పు, పెరుగు, పండ్లతో భోజనం ఆరగించడం కనిపిస్తున్నది.

ఇతర మతాలు :

కాకతీయ సామ్రాజ్యంలో అన్ని రకాల మతాలు వర్ధిల్లుతూ ఉండేవి. ఇందుకు నిదర్శనంగా క్రీడాభిరామంలో అన్ని మతాలకు సంబంధించిన ప్రస్తావన కనిపిస్తుంది.

"ఆదియుగంబునందావిర్భవించిన జిననాథ దేవుని
శిరసు వోలె"

(క్రీడాభిరామం-80)

"వీరభద్రేశ్వరాగార మంటప మదె
యదె బౌద్ధదేవు విహార భూమి
అదే పాండవుల గుడి యట దక్షిణంబున
గర్తారు డుండు తుర్కుల మసీదు"

(క్రీడాభిరామం - 149)

జైన, బౌద్ధ, ఇస్లాం మతాలవారు కాకతీయుల కాలంలో కలసి ఉండడం మన తెలుగు రాజుల పరమత సహనానికి నిదర్శనం.

మన దేవతలు - దేవుళ్ళు :

కాకతీయుల కాలం నాడు కొలువై ఉన్న అనేకమంది దేవతలు క్రీడాభిరామంలో కనిపిస్తారు. వారిలో ఏకవీరా దేవి సాక్షాత్తు జగదాంబిక. ఈమెనే కాకతీయ ప్రభువులు రేణుకాదేవిగా కొలిచేవారు. సాధారణ ప్రజలు ఈమెను జమదగ్ని పత్నిగా, పరశురాముని తల్లిగా భావించి కొలిచే వారు. ఈమెకే కాకతీయుల కాలంలో మాహురమ్మ అని కూడా పేరు. నిజానికి రేణుకాదేవి ఆధ్యాత్మ విద్యలోని దశమహా విద్యల్లో అరవ విద్య అయిన ప్రచండ చండిక. శాసన శక్తి అయిన ఈమెకే చిన్నమస్త అని, రేణుక అని పేరు. ఈ శక్తి సుషుమ్న లోని పశ్చాన్నాడిని ఆశ్రయించి ఉంటుంది. ఇడా, పింగళ నాడులతో అనుబంధాన్ని కలిగి, తేజస్సును రేణువులుగా విభజించే శక్తి కాబట్టి ప్రచండ చండికను తాంత్రికులు రేణుక అని పిలుస్తారు. మహచ్ఛక్తిని, అప్రతిహత శాసనాన్ని ఈ శక్తి ప్రసాదిస్తుంది. అందుచేతనే, కాకతీయ ప్రభువులు రేణుకాదేవి ఆరాధించి ఉంటారని భావించవచ్చు. రేణుక ఓరుగల్లులో నివసించే కాకతమ్మకు సై దోడు. (కాకతీయ సామ్రాజ్యాధి నేతలకు కాకతీ దేవి ఇలవేల్పు). నేడు కూడా ఎర్రగొల్లలు ఏకవీరాదేవి కథను పాడుతూ కనిపిస్తారని తెలుస్తోంది.

మరొక దేవత కామవల్లీ మహాలక్ష్మి. ఈ దేవతను గురించి కుల పురంధ్రి పాడుతూ కనిపిస్తుంది. ఈమె ఏడుగురు అక్క చెల్లెళ్లలో కడపటిది. కానీ, ముఖ్యమైనది. ఈ ఏడు మంది దేవతలకు అక్కలని పేరు. ఈ అక్క దేవతలను శుభకార్యాల్లో ప్రస్తుతిస్తూ పాడుతారు. ఆ వాయిద్యాల ఘోషకు ఉద్రేకపూరితమైన పాటలకు కొందరు స్త్రీలకు దేవతలు ఆవహిస్తారు.

"మహారభటి జగద్ఘుంకృత స్వన
న్మురళి విమిశ్రితాంక రవ
మూర్ఛల జిత్తములుబ్బి యక్క లే
డ్వురు నదె యాడ జొచ్చిరి క
డుంగడు వేడ్క ..."

(క్రీడాభిరామం - 138)

దశ మహావిద్యల్లో పదవ విద్య అయిన కమలాత్మిక సంపదలను ప్రసాదించే మహాలక్ష్మి. ఈమెనే కాకతీయ ప్రభువులు కామవల్లిగా ఆరాధించినట్లు తెలుస్తున్నది.

మరొక ముఖ్యమైన దైవం మైలార దేవుడు. మైలార దేవుడు సాక్షాత్తు శివుడే. వీరశైవులైన గొరవయ్యలకు ఇష్టదైవం. మణి మాలాసురులనే రాక్షసుల్ని సంహరించ డానికి శివుడు విచిత్రమైన వేషంలో వచ్చాడని గొరవయ్యల విశ్వాసం. గొరవయ్యలు ఈ వేషాన్నే ధరి స్తారు.

"భైరవుని తోడి జోడు మైలార దేవుడోరు గంటి నివాసి"

(క్రీడాభిరామం - 145)

మైలార దేవుని భక్తులైన మైలార భటులు భక్త్యావేశంతో చేసే సాహసకృత్యాలు చూస్తే ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

"అవ అవ మండు ఎఱ్ఱని చండ్ర మల్లెల
చోద్యంపు గుండాలు చొచ్చు వారు
కరవాడి యలుగుల గనప పాతర్లలో
నుట్టి చెరువులు గోసి యుఱుకువారు
గాలంపు గొంకి గంకాళ చర్మము గ్రుచ్చి యుడువీధి
నుయ్యాల లూగువారు
కటికి హొన్నాళంబు గండ కత్తెర పట్టి మిసి
మింతులును గాక మ్రింగు వారు"

(క్రీడాభిరామం - 142)

ఇంకా కాలభైరవుడు, చమడేశ్వరి అను మహా శక్తి,

వీరభద్రేశ్వర స్వామి, కొమరసామి (కుమారస్వామి), నేల శంభుడు, స్వయంభూ కేశవ స్వామి వంటి దైవాలను ఆరాధించడం కనిపిస్తున్నది. అలాగే, పాండవులకు, పల్నాటి వీరులకు గుడులు నిర్మించి ఆరాధించడం గమనిస్తే వీర పూజ సంప్రదాయమేమోననిపిస్తుంది.

భోగ జీవనం :

నిజానికి క్రీడాభిరామంలో మనకు ప్రధానంగా దర్శనమిచ్చేది నాటి భోగజీవనమే. శీతాకాలంలో చలి తీవ్రతను ఎదుర్కోడానికి, శీతోపద్రవం లేకుండా సుఖ నిద్రను పొందడానికి భోగ జీవన కాముకుడయిన మంచన శర్మ ద్వారా కవి ఇలా చెప్పించాడు.

ఎడతెగని ధూపోపచారములు,
కాలాగుర్వును లేపనములు,
వధూ గాఢోపగూహనములు

(కొగిలింతలు),

కేళీగర్భ నికేతనము, అనగా రసకేళికి అనువైన ఇల్లు లేకుంటే చలి తీవ్రతను తట్టుకోవడం ఎలా? అని మంచన శర్మ తన మిత్రుడైన టిట్టిభ సెట్టితో అంటాడు. (క్రీడాభిరామం - 48)

నాటి స్త్రీలు రవికలను కుట్రపు పనివాడు దగ్గర అందంగా కుట్టించుకొని తొడిగేవారు. కరణ బ్రాహ్మణులు మలక వాళ్లు కుట్టే కిర్రు చెప్పులు ధరించేవారు. (క్రీడాభిరామం - 162)

ఆనాడు పూటకూటి ఇళ్ళు కూడా విటులు, వేశ్యల మధ్య రాయబారం నడిపేవని తెలుస్తున్నది. భోజనానంతరం తాంబూల సేవనం అతి సాధారణంగా ఉండేది అలాగే తాంబూలానికి తమలపాకులు వాడేవారు తాంబూలం గొప్ప ఔషధ విలువలు కలిగి ఉండేది జాజికాయ జాపత్రి పచ్చ కర్పూరం లవంగాలు యాలకలు వంటి అనేక ఔషధ విలువలున్న వస్తువుల్ని తాంబూలంలో వాడేవారు.

ఇక పూటకూళ్ళ ఇళ్ళలో కూడా ఆహారానికి మాత్రమే పనికి వచ్చేవి, విహారానికి అంటే వేశ్యల వివరాల్ని అందించేవి వేరుగా ఉండేవి. వేశ్య వాటికలు భోగ జీవనానికి చిరునామాగా ఉండేవి. అక్కడ కలువలతో తోరణాలు కట్టి, చందనపు కల్లాపి చల్లి, కుంకుమ పువ్వుతోను, ఇందు రజంతోను ముగ్గులు వేసేవారు (క్రీడాభిరామం - 178). ఇందు రజం అంటే బహుశా ముగ్గు పొడిగాని, బియ్యం పిండిగాని అయి ఉండొచ్చు. జ్యోతిష శాస్త్రంలో చంద్రునికి బియ్యం కారక ధాన్యం. కాబట్టి ఇందు రజం అంటే బియ్యం పిండి కావడానికి కూడా అవకాశం ఉంది. ఇంకా వార వనితలు శృంగార భావ చోదితాలైన చిత్రాలతో చిత్రశాలల్ని ఏర్పాటు చేసుకునేవారు.

వేశ్యలు ముకుర వీక్షణ అనే ఉత్సవాన్ని నిర్వహించే వారు. తమ సంతానాన్ని వేశ్య వృత్తిలో ప్రవేశపెట్టే సందర్భంలో ఈ ఉత్సవాన్ని చేసేవారు. ముకుర వీక్షణం అంటే అద్దంలో చూసుకోవడం. అద్దాన్ని వేశ్యలు మహాలక్ష్మిగా భావించేవారు(క్రీడాభిరామం - 196,197). వేశ్యలతో ధనవంతులు, అగ్రకులాల వాళ్లు సహజీవనం చేస్తూ, వేశ్యల సంతానాన్ని తమ సంతానంగా బహిరంగంగా ప్రకటించుకోవడం కనిపిస్తుంది.

"అత్రి సమాన ! నేటి యప
రాహ్ణసమాగమ వేళఉబుష్యన
క్షత్రమునందు నీయనుఉగు
గాదిలి కూఉతురు చూచు నద్దమున్"

(క్రీడాభిరామం - 194)

ఓరుగల్లు కోటలో అక్కలవాడ అందమైన వేశ్యలకు నిలయంగా ఉండేది. మధ్యాహ్న సమయంలో అక్కల వాడకు వెళ్లడం వేడుకగా ఉంటుందట. (క్రీడాభిరామం - 114). ఇక్కడ నివసించే వెలయాండ్రకు ఉన్న మేని పసలు మరెవరికీ ఉండవట.

అనాచారాలు :

క్రీడాభిరామం నాటి ఆచారాలను వ్యంగ్యంగా సునిశితంగా విమర్శించింది కూడా. శ్రీకాకుళ ఆంధ్ర

మహావిష్ణువు తిరునాళ్ళలో జరిగే సంగతులు గురించి విస్తారమైన వర్ణనలు ఉన్నాయి. ఈ వర్ణనలన్నీ కవి స్వరంతో హేళన చేసినట్లు స్పష్టంగా తెలుస్తుంది. తిరునాళ్ళు జరిగే కాలంలో 12 క్రోసుల చుట్టుకొలత కలిగిన శ్రీకాకుళం క్షేత్ర పరిధిలో పరనారీ సంగమాదులు చేసినా కూడా పాపం అంటదట. (క్రీడాభిరామం - 208)

ఈ తిరునాళ్ళలో కామాంధలైన వెలనాటి కోడె విధవలు హేలా రతితో క్రీడిస్తారని, దీనిని భరించడం భీమసేనునికి తప్ప వేరొకరికి సాధ్యం కాదని చెప్పడం చూస్తే విధవల కోసం ప్రత్యేకంగా ఇటువంటి పద్ధతులు ఏర్పాటు చేశారనిపిస్తుంది. మంచన శర్మ" ముంజెపద నైనశంబర భంజను గేహములు గలుగు బ్రాహ్మణ విధవా పుంజములు " వస్తారని అని కాబట్టి వేశ్యలతో పనిలేదని అంటాడు.(క్రీడాభిరామం - 211) దీన్నిబట్టి విటులు, వేశ్యలు, విధవలు ఈ తిరునాళ్లను తమ కోర్కెలు తీర్చుకోవడానికి ఉపయోగించుకునే వారని సులభంగా అర్థమవుతుంది. మొత్తమ్మీద ఆనాటి తిరునాళ్ళలో ఇటువంటి అకృత్యాలు సర్వసాధారణంగా కనిపిస్తున్నాయి.

ఇక, విటులు వేశ్యల మధ్య తగాదాల పరిష్కారానికి జార ధర్మాసనం ఉండేది. తప్పులు చేసిన విటులు వేశ్యలను విచారించి తీర్పులు చెప్పేది. ఓరుగల్లు కోట లోని భైరవ ఆలయ ద్వారం దగ్గర జార ధర్మాసనం కొలువు తీరేది. మోసం చేసే వేశ్య మాతలకు కందర్ప శాస్త్రంలో చెప్పిన విధంగా తల గొరిగించడం, ముక్కు చెవులు కోయించడం, పళ్ళు ఊడగొట్టించడం చేసేవారు. (క్రీడాభిరామం - 270) ఆనాటి సమాజంలో వేశ్యా వృత్తి ఎంత బలంగా ఉండేదో దీన్ని బట్టి తెలుస్తున్నది. తప్పులు చేసిన వేశ్యలు, వేశ్య మాతలను అవమానించి వారిని వెలివేసినట్లు చూడడం కూడా చేసేవారు. మొత్తం మీద ఆనాటి సమాజంలో విటులదే పైచేయిగా ఉండేది. (క్రీడాభిరామం - 271)

వినోదాలు :

ప్రజల వినోదాలు కూడా పలు రకాలుగా ఉండేవి. ఈ వినోదాల్లో పాములాట, గడియాట, పొట్టేళ్లు కోళ్ల పందాలు ప్రధానంగా ఉండేవి. గెలిచిన కోళ్లతో బాటు ఓడిన పుంజుల్ని కూడా గొప్పగా గౌరవించేవారు. పోటీలో మరణించిన పుంజులు వీరస్వర్గం చేరి రంభ మేనక తిలోత్తమలతో రమిస్తాయని నమ్మేవారు.

క్రీడాభిరామం ఆనాటి శృంగార భోగ జీవనాన్ని కళ్ళకు కడుతున్నది. సమాజంలో శృంగార జీవనాన్ని వాంఛించే వారి జీవితాలను హాస్యస్ఫోరకంగా ఆవిష్కరిస్తున్నది. మొత్తంగా కాకతీయుల కాలంనాటి సాంఘిక జీవనాన్ని తెలుసుకోవడానికి క్రీడాభిరామం ఒక మంచి ఆధారమని చెప్పడం సహేతుకమే.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆదివాసీల ఆహారపు పానీయాలు

– డా॥. పెండ్యాల లావణ్య
తెలుగు అధ్యాపకులు, డా॥. కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల, దుగ్గిరాల.

– డా॥. పి. శాంతి
పరిశోధక విద్యార్థిని, తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఆదివాసీలు అడవినే నమ్ముకున్న అడవి తల్లి బిడ్డలు. వీరి పుట్టుకైన, చావైన, కష్టమైన, సుఖమైన అంతా అడవి తల్లి ఒడిలోనే. అడవి తల్లి అందించే వనరులను ఆస్వాదిస్తూ అడవి బిడ్డలు ఆనందంగా కాలం గడుపు తున్నారు. ఋతువుల ఆధారంగా లభించే ఆహార పదార్థాలను సేవిస్తారు. వీరు రకరకాల చిరు ధాన్యాలను ఆహారంగా ఉపయోగిస్తారు. అందులో ప్రధానమైనవి సోళ్ళు, సామలు, కొర్రలు, గంట్లు, బుడమలు, జొన్నలు, సజ్జలు, రాగులు, జనములు, ఊడలు, శనగ, బొబ్బర్లు మొదలైనవి. వీటితోపాటు ఎవరి ఇంటి ముందు వాళ్ళు చిక్కుడు, గుమ్మడి, అనపకాయ, బీరకాయ, వంగ, బెండ, దోస, కాకర, పొట్లకాయ, అరటి, అల్లం, చిట్టి మిరప, కందమూలాలు, చిలకడ దుపం, కర్రపెండలం, చేమదుంప, గోంగూర వగైరా పండిస్తారు. అవేకాక చింత పండు, విప్పపువ్వు, సారపప్పు, పనసకాయ, కరక్కాయలు, ఇంద్రపు కాయలు, ఉసిరి, ఈతపళ్ళు, తాటికాయలు, సీతాఫలం, బొబ్బాయి వంటివి కూడా ఆహారంగా తీసుకుంటారు.

మాలకంద, పంది ముక్కులు, తివ్వ తేగలు, పిండి తేగలు, కస తేగలు మొదలగు దుంపలను ఇష్టంగా తింటారు. గోంగూరతోపాటు బోదంటం కూర, పుల్లేరు, బొద్దకూర వంటి ఆకు కూరల్ని తింటారు. ఆకు కూరలతోపాటు మాంసాహారం కూడా ఎక్కువగా తీసు కుంటారు. వేటాడిన జంతు మాంసాల్ని పెంపుడు జంతువుల మాంసాన్ని తింటూనే ఉంటారు. వీళ్ళకి సంవత్సరం పొడుగునా ఒకే రకమైన ఆహారం దొరకుదు. పండించుకున్న ధాన్యపు గింజలు కొద్ది నెలలకే సరి పోతాయి. అప్పులు తీర్చగా మిగిలిన ధాన్యమే వీళ్ళకు ఆహారం. మూడు పూటలా అన్నమే తింటారు. అన్నంతో పాటు రకరకాల జావలను కాచుకుని తాగుతారు. కూరగాయల్ని గాని, మాంసాన్ని గాని ఉప్పువేసి నీళ్ళల్లో ఉడకబెడతారు. ఒక్కొక్కసారి మిరకపాక వేస్తారు. వంటల్లో నూనె వాడకం లేదు. అన్నంలో కలుపుకోవడానికి పుల్లటి చింతపండు చారు వేసుకుంటారు.

పండించిన ధాన్యపు గింజలు అయిపోయిన తరువాత కందులు, ఉలవలు వస్తాయి. వాటిని రోజు ఉడక బెట్టుకుని తింటారు. వీళ్ళు పండించుకున్న ధాన్యపు గింజలు సుమారు ఆగష్టు నుండి ఫిబ్రవరి వరకు తింటారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండబెట్టిన జీలుగ చెట్టు కాండాన్ని ఎండబెట్టి పొడి చేసి ఆ పొడితో జావ కాచుకుని తాగుతారు. మే, జూన్ నెలల్లో మామిడి పండ్లు తింటారు. వాటి టెంకలను భద్రంగా దాచుకుని ఎండబెట్టి జీడిని పొడి చేస్తారు. జీడిలో ఉండే వగరు పోవటానికి ఆ పిండిని గుడ్డలో చుట్టి పారే సెలయేరులో మూడు రోజులపాటు ఉంచుతారు. ఈ విధంగా ఉంచడం వలన వగరు మొత్తం పోయి పిండి తినడానికి ఉపయోగపడు తుంది. ఈ విధంగా సంవత్సరం పొడుగునా కాలాల వారీగా రకరకాల ఆహారం తీసుకుంటారు.

గిరిజనుల్లో కుటుంబమంతా ఒకేసారి భోజనానికి కూర్చుంటారు. వంటలను మట్టి కుండల్లోనే చేసు కుంటారు. భోజనం పచ్చటి ఆకుల్లోనే తింటారు. వడ్డనకి కర్ర తెడ్డునో, అనపకాయ డోకినో, కొబ్బరి చిప్పనో వాడ తారు. వీళ్ళు దినుసులగా ఉప్పు, మిరపకాయలు, పసుపు లను ఉపయోగిస్తారు. గిరిజనులకి పచ్చళ్ళు చేసే

అలవాటు లేదు. ఆహారం నిల్వ చేయాలంటే ఎండలో ఎండబెట్టి నిల్వ చేసుకుంటారు. వీటితోపాటు మామిడి బద్దలు, మామిడిరనం, ఈతపళ్ళు, చివిడి పళ్ళు ఎండబెట్టి దాచుకుంటారు. అడవుల్లో దొరికే రకరకాల పక్షి గుడ్లను తింటారు. నెమలి గుడ్లను ఇష్టంగా తింటారు.

ఆకు కూరలు :

గిరిజనులు ఆకుకూరల్ని ఎక్కువగా తింటారు. సారు కూరు, పెయ్యసారు, డబ్బసారు, పెద్దచారు, గొడ్డుకూర, వాసుకూర, బెచ్చెలికూర, గురువుకూర, గుమ్మడాకు కూర, చెంచెలుకూర, పచ్చకూర, సీకాయ కూర, దొగ్గురు కూర, దూలకూర, గాజుకూర, మురికూర, కాకరికూర, ఇలియాకు మొదలగు ఆకు కూరల్ని ఎక్కువగా తింటారు. అలాగే వర్షాకాలంలో వచ్చే పుట్ట గొడుగుల్ని ప్రత్యేకంగా తింటారు. వీరు రకరకాల మామిడి టెంకెల అంబలి, జీలుగు అంబలి, చోడంబలి మొదలగు అంబళ్ళు తాగుతారు.

పండుల సమయాల్లో రకరకాల పిండి వంటలు తయారు చేసుకుంటారు.

1. ఉపవాస వంటలు :

ఇవి కోడి తల, రెక్కలు, కాళ్ళు అన్నింటినీ మూడు దారులు కలిసే చోట దండెంగా వేలాడదీస్తారు. ఒక రోజంతా ఉపవాసం ఉండి గ్రామ దేవతకు కోడిని బలి ఇచ్చి కోడి మాంసంలో మిగిలిపోయిన తల, రెక్కలు, కాళ్లను దిష్టిగా వేస్తారు.

2. చప్పిడి వంటలు :

దసర, గంగానమ్మ పండుగ, గ్రామ దేవత కొండ రాజుల పండుగలప్పుడు చప్పిడి వంటలు చేస్తారు. ఈ వండుగ దినాల్లో వంటల్లో ఉప్పు వేయకుండా వండుతారు. ఈ పండుగని జరుపుకోవడానికి ఒక ప్రత్యేకత ఉంది. మనిషి రుచులకి లొంగిపోకుండా సంతృప్తిగా జీవించాలనే పరమ సత్యాన్ని తెలియజేస్తాయి. ఉన్న దానితోనే సంతృప్తి పడడం అలవాటు చేసుకోవడానికి ఇటువంటి పండుగలకు వంటలు దోహదం చేస్తాయి.

3. పిండి వంటలు :

కుడుముల పండుగ, కనుమ పండుగ, పెళ్ళిళ్ళపుడు ఈ వంటలు చేస్తారు. కుడుముల పండుగ రోజున చోడి పిండితో కుడుములు చేసి పశువుల మెడకు కడతారు. చోడి పిండితో రొట్టెలు తయారు చేస్తారు. పచ్చి అడ్డాకులల్లో ప్రసాదాన్ని వండి దైవానికి నైవేద్యంగా పెట్టి తింటారు.

4. బోనం వంటలు :

దుష్టశక్తుల సంచారం గ్రామాల్లో ఎక్కువైనప్పుడు వాటిని శాంతింప చేయడానికి పూజారి 'దోష పరిహారం' చేస్తాడు. నైవేద్యపు వంటలు అన్ని పూజారి కఠిక ఉప వాసముండి చేయాలి. పూజారికి సాయం చేసేవాళ్ళు కూడా కఠిన ఉపవాసం ఉండి శ్రద్ధంగా చేయాలి.

5. లొగ్గొడొంట :

భూదేవి పండుగ, కందిపంట పండుగ మొదలైన పంటలప్పుడు ఈ పండుగను చేస్తారు. లొగ్గొడొంట అంటే ఉపవాసం లేనివాళ్ళకి చేసే వంట అని అర్థం. ఈ వంటలన్నింటిని పూజార్లే స్వయంగా ఉపవాసముండి చేయాలి. ఉపవాసం లేని వాళ్ళకి వంట చేయడమన్న మాట.

గిరిజనులకు ఉపాహారాలు (టిఫిన్స్) తెలియవు. ఉదయం, సాయంత్రం అన్నమే తింటారు. నిల్వ చేసుకున్న ధాన్యాన్ని రోజువారీగా రోటిలో వేసి దంచుతారు. దంచిన ధాన్యాల్ని పొట్టు తీసి అన్నంగా వండుకుంటారు. ఉదయం సాయంత్రం అన్నం తిన్నా మధ్యాహ్నం మాత్రం అంబలి (గంజన్నం) తాగుతారు.

ఆదివాసీల కల్లు పానీయాలు :

ఆదివాసులు రెక్కాడితే గాని డొక్కాడని వాళ్ళు. వాళ్ళకి పంచభక్ష్య పరమాన్నాలు అవసరంలేదు. ప్రకృతి సహజంగా లభించే ఆహారాన్ని పరమాన్నంగా స్వీకరిస్తారు. దొరికిన

ఆహారంతోనే తృప్తిపడుతుంటారు. ప్రకృతి పరంగా దొరికిన ఆహారాన్ని తీసుకోవడం వలన వీళ్ళు ధృడంగా ఉంటారు.

వీరు పండుగలు, జాతర్ల సమయాల్లో కల్లు పానీయాలు తాగుతారు. తాటిచెట్టు, ఈతచెట్టు, జీలుగ, ఇప్పపువ్వు, సారపప్పు, పనస తొనలు, నూకల జావ, బెల్లం, అన్నంతోను, మామిడిపండ్లు మొదలగు వాటితో సారాయి కాస్తారు. సారాయి కాయడానికి పైన పేర్కొన్నవి 5 రోజులపాటు కుండలో అమ్మోనియం, రెళ్ళ చెక్క కలిపి మరగబెడతారు. మరగబెట్టంగా వచ్చిన రసాన్ని నిల్వచేసి సారాయిగా తాగుతారు.

గిరిజన సుఖ, దుఃఖాల్లో సారాయిదే పైచేయి. తిండిలేకపోయినా బతుక గలుగుతారు కాని సారాయి లేకుండా బతకలేరు. చిన్నా, పెద్దా, ఆడ, మగా తేడా లేకుండా కల్లు సారాయి తాగుతారు. గిరిజనులు ప్రకృతిలో సహజంగా దొరికిన ప్రతి వస్తువుని తమ అవసరాలకు వినియోగించుకుంటారు. అన్నింటికంటే ఎంతో ఇష్టంగా చింతపండుతో చేసిన కల్లుని తాగుతారు. అనారోగ్యంతో ఉన్న పిల్లలకి ఈ కల్లు తాగించడం వలన జబ్బు నయమౌతుందని విశ్వసిస్తారు.

గిరిజనుల వంట సామాగ్రి :

గిరిజనులు మట్టితో తయారు చేసిన రకరకాల కుండల్ని వాడతారు. అంబలి కాచుకోవాలన్నా, మాంసం వండుకోవాలన్నా కుండల్నే ఉపయోగిస్తారు. నేటికి అనేక గ్రామాల్లో గ్యాస్ పొయ్యిలు వచ్చిన గిరిజనులు బతుకుల్లో గ్యాస్ వెలుగు లేదనే చెప్పాలి. ఎందుకంటే వీరు పాత పద్ధతుల్నే ఇష్టపడతారు కాని కొత్త పద్ధతులను దరి దాపుల్లోకి కూడా రానివ్వరు. పండుగలు, జాతర్ల సమయంలో మాంసం వాడకం అధికం ఉంటుంది. తాము తినగా మిగిలింది ఇంటికి తీసుకువచ్చి పొయ్యిపై తాడుకు మాంసం ముక్కలు చుట్టి ఆరబెడతారు. పొయ్యిలోని వేడి పొగ సెగకు మాంసం ఎండిపోతుంది. వాటి నిల్వ చేసుకుని అప్పుడప్పుడు తింటుంటారు. ఇంకో విషయం మనం ఇక్కడ గమనించాలి. పొయ్యిలేని పొగ కమ్మి మసిగా మారుతుంది. ఆ మసిని కూడా మందుగా ఉపయోగిస్తారు. బాలింతకు మందుగా పొగ మసిని బొటన వ్రేలితో తీసి గ్లాసు నీళ్ళల్లో కలిపి తాపిస్తారు. ఇలా తాపించటం వలన బాలింత జబ్బులు రావని ఆది వాసులు నమ్ముతారు.

ఎండిన డొప్పకాయను ఎండబెట్టి కాయను గుండ్రంగా రంధ్రం చేసి లోపలి గుజ్జంతా తీసి నీటిలో కొన్ని రోజులు నానబెడతారు. అలా నానబెట్టిన దాన్ని వాడుకోవడానికి సిద్ధం చేస్తారు. కొబ్బరి చిప్పకు వెదురు పుల్లను దూర్చి గరిటెగా ఉపయోగిస్తారు. అడ్డాకుల్లో మాంసాన్ని కాల్చుకుని తింటారు. అలాగే వెదురు బొంగుల్లో మాంసాన్ని దూర్చి నిప్పుల్లో కాల్చుకుని తింటారు. మనం నేడు అన్ని రెస్టారెంట్లలో ఇవి చూస్తూనే ఉన్నాం. 'బొంగులో చికెన్' అంటున్నాము.

అడ్డాకులతో కుట్టిన విస్తళ్ళల్లో ఆహారం అరగిస్తారు. వీటితో పాటు వెదురును సన్నని పుల్లలుగా చీల్చి వాటిని నునుపుగా చేసి వాటితో విస్తళ్ళు కుడతారు. విస్తళ్ళతో చిన్న చిన్న గిన్నెలను తయారు చేసుకుని జావ, అంబలి, కల్లు, సారాయి తాగుతారు. అడవిలో దొరికే టేకు ఆకులు, మోదుకు ఆకులు, టేకు కర్రలకు ఆ ఆకుల్ని వరుసగా గుచ్చి గొడుగులా తయారు చేసుకుంటారు. దాన్ని వర్షాకాలంలో గొడుగులా వాడుకుంటారు. దీన్నే 'ఎర్కు' అంటారు.

గిరిజనుల్లోనే కొన్ని తెగలు ప్రత్యేకమైన సంప్రదాయాలు ఆచరిస్తారు. తినే ఆహారంలో కూడా తేడా గమనించవచ్చు. తోటి తెగలు జొన్న గడక, జొన్న రొట్టె, పచ్చకూర, గోంగూర, పొయిలికూర, చేపలు, తౌడుతో చేసిన రొట్టె, తౌడు పచ్చడి, తాడి పండ్లను కాల్చి కాని ఉడకబెట్టి కాని తింటారు. వీళ్ళు అంబలితోపాటు పాలాల్లో రేగడి మట్టి మీద పేరుకుపోయిన పై ఊటను (మెగ) తాగుతారు.

బాలింతకు పాలు పడకపోతే 'వానపాములు' తెచ్చి పెనం మీద వేయించి, తౌడులో వేసి మెత్తగా నూరి చిన్న, చిన్న గుళికలుగా చేసి తినిపిస్తారు. అలా తినిపిస్తే పాలు పడతాయని నమ్ముతారు.

ఈ విధంగా గిరిజనులు తమ పరిధి మేర ఏర్పర్చుకున్న సంప్రదాయాలకి ఆచారాలకి కట్టుబడి జీవనం సాగిస్తున్నారు. ప్రకృతిలో లభించే ఆహార పానీయాలను తీసుకుంటూ ఆనందంగా ఆరోగ్యంగా జీవనం సాగిస్తున్నారు. వీళ్ళు తినే సహజ సిద్ధ ఆహార పదార్థాల వలన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. డాక్టర్‌తో పనిలేకుండా ఆరోగ్యంగా ఉన్నారు. ఒకవేళ అనారోగ్యం సంభవిస్తే మంత్రగాడ్ని ఆశ్రయిస్తారు. మంత్రగాళ్ళను 'యజ్జోడు' అంటారు. యజ్జోడు వ్యాధిగ్రస్తుడి నాడి పట్టి చూసి పసరు మందు ఇస్తాడు. పద్యపు ఆహార పదార్థాలు పసరు వాడే సమయంలో తీసుకోమంటారు.

పెళ్ళిలోను, చనిపోయిన వాళ్ళ కర్మకాండలకు మాంసం, సారాయి తప్పనిసరి.

ఆదివాసీల చిరుధాన్యాలు - రకాలు :

ఆదివాసీలు రకరకాల ధాన్యాలను ఆహారంగా ఉపయోగిస్తారు. అందులో ప్రధానమైనవి సోళ్ళు, సామలు, కొర్రలు, గంట్లు, బుడమలు, జొన్నలు మొదలగునవి వాడతారు. వీళ్ళు ఆయా కాలాలవారీగా దొరికిన ధాన్యాలతో పొట్టపోసుకుంటారు. వరి అన్నం చాలా తక్కువగా వాడతారు.

సోళ్ళు :

ఒక విధమైన ధాన్యం. ఇవి ఆవాల మాదిరిగా చిన్నవిగా, ఎర్రరంగు కలిగి ఉంటాయి. వీటిని ఎండలో ఎండబెట్టి దంచి పొడి చేస్తారు. పొడితో అంబలి, పిట్టు, రొట్టెలు మొదలగునవి తయారు చేసుకుంటారు.

సోడంబలి :

సోళ్ళు విసిరి పిండి చేస్తారు. ఒక కుండలో పిండి వేసి నీళ్ళు పోసి కలుపుతారు. దాన్ని ఎండలో లేదా వేడి ప్రదేశంలో, లేదా పొయ్యి పైన ఉట్టికట్టి వేడి తగిలేటట్లు పెడతారు. వేడికి పిండి బాగా పులుస్తుంది. ఉదయం ఎండలో పెట్టిన పిండిని మరుసటి రోజు బయటికి తీస్తారు. ఒక కుండలో ఎసరుపెట్టి, ఎసరు బాగా మరిగాక పులిసిన పిండిని వేస్తారు. పిండి గడ్డలు కట్టకుండా తెడ్డుతో పిండిని బాగా కలిపి దగ్గర పడేంత వరకు ఉంచుతారు. అంబలి తయారౌతుంది. అంబలి తాగేప్పుడు ఉప్పు వేసుకుని తాగుతారు. వేసవి కాలంలో అంబలి తాగడం వలన ఎండదెబ్బ తగలదని నమ్ముతారు.

సోడిపిట్టు :

సోడిపిట్టు సోడిపిండితో తయారు చేస్తారు. ఒక కుండలో చెంబు నీళ్ళు పోసి పొయ్యి మీద పెట్టి వేడి చేస్తారు. బాగా కాగిన తర్వాత రెండు చెంబుల పిండి కొంచెం ఉప్పు వేసి కలిపి సోడిపిట్టు తయారు చేస్తారు. దీన్ని పిల్లలకు పెట్టడం వలన అజీర్తి చెయ్యదని జీర్ణశక్తి బాగుంటుందని విశ్వసిస్తారు.

సోడిరొట్టె :

సోడిపిండికి కొద్దిగా ఉప్పు కలిపి నీళ్లు పోసి ముద్దగా చేస్తారు. అనగా చపాతి పిండిలా కలుపుతారు. కలిపిన పిండిని అడ్డాకు మీద రొట్టె మాదిరిగా ఒత్తి పైన మరొక అడ్డాకు వేస్తారు. పొయ్యిపై పెంకు పెట్టి దానిమీద అడ్డాకులతో సహా రొట్టెను వేసి రెండు వైపులా కాలుస్తారు. బాగా మాడినాక ఆకును తీసి రొట్టెను తింటారు.

నిట్ట సామలు :

నిట్ట సామలు చిన్నగా, తెల్లగా ఉండే ధాన్యాలు. వీటికి నాలుగు పొరలు పొట్టు ఉంటుంది. వీటిని బాగా విసిరి ఎండలో ఎండ బెడతారు. ఎండిన తర్వాత నాలుగుసార్లు దంచి చెరిగితే పొట్టంతా పోయి బియ్యం వస్తాయి. వీటినే నిట్టసామలంటారు. నిట్ట సామల్ని తినడం వలన శారీరక శక్తి పెరుగుతుంది.

సామకూడు :

సామ బియ్యం గోధుమ రవ్వ మాదిరిగా ఉంటాయి.

కుండలో ఎసరుపెట్టి, కాగిన తర్వాత సామ బియ్యం వేసి అన్నం వండుతారు.

సామ జావ :

ఒక చెంబుడు సామ బియ్యానికి ఐదు చెంబుల నీళ్ళు పోసి కుండలో ఎసరు పెట్టి మరుగుతుండగా బియ్యం, ఉప్పు వేస్తారు. జావ దగ్గర పడ్డాక దింపేస్తారు. సామ జావ తయారౌతుంది. తోటకూర, చేనుకూర, వెదురుకొమ్ములు, గురుగూర మొదలగు ఆకుకూరలు నంజుకుంటూ తాగుతారు.

కొర్ర కూడు :

కొర్రలను రెండుసార్లు దంచి ఎండబెట్టి, మళ్ళీ మూడోసారి ఎసరుపెట్టి బాగా ఉడికించి గంజి వంపక పోతే జావ తయారవుతుంది. గంజిలో తగినంత ఉప్పు కలుపుకుని త్రాగుతారు.

గంట్లు :

సామలకన్నా పెద్దగా ఉండి తెల్లగా ఉంటాయి. వీటిని దంచి పొట్టు చెరిగి బియ్యంతో గంటికూడు, పలుచని జావ చేసుకుంటారు.

జీలుగు అంబలి :

జీలుగు చెట్టు కొమ్ములు (గెలలు) నరికి బెరడు తీస్తే లోపలిభాగం తెల్లగా వుంటుంది. దాన్ని మెత్తగా దంచి కుండలో వేసి నీళ్ళుపోసి కలుపుతారు. ఒకరోజు ఎండలో ఎండ బెడితే పులుస్తుంది. వేరొక కుండలో ఎసరు పెట్టి మరిగేటప్పుడు పులిసిన జీలుగు పిండిని వేసి బాగా కలుపుతారు. ఇది అంబలిగా తయారౌతుంది. ఈ అంబలిలో నాటుకోడి ముక్కల్ని నంజుకుంటారు.

మామిడి టెంకల రొట్టె :

మామిడి టెంకలను ఎండబెట్టి పగులగొట్టి జీడిని బయటకు తీస్తారు. జీడిలన్నింటిని బయటకు తీసి ఎండలో ఎండబెడతారు. ఎండబెట్టిన జీడీలను పొడిచేసి పొడిగుడ్డలో మూటకట్టి పెద్ద వెదురు బుట్టలో ఉంచుతారు. వెదురుబుట్టలో పిండి మూటకు సన్నని రంధ్రాలు చేసి పారే నీటిలో నాలుగైదు రోజులు ఉంచుతారు. అలా ఉంచడం వలన పారే నీటి ఒరవడికి పిండిలోని చేదంతా పోతుందని ఉంచుతారు. ఐదవరోజు పిండిని బయటకి తీసి పిండిని బాగాకలిపి కొంచెం ఉప్పు చేర్చి రొట్టెలుగా చేస్తారు. పెనంపై రొట్టెల్ని చపాతిలా కాల్చుకుని తింటారు. రొట్టెల్లోకి ఏ కూర వేసుకుని తిన్నా కమ్మగా ఉంటుంది.

మామిడి టెంకల అంబలి :

మామిడి టెంకల అంబలిని మామిడి టెంకల రొట్టెకు మాదిరిగానే పారే నీటిలో పిండిని నాలుగైదు రోజులు ఉంచుతారు. తినే ముందు బయటికి తీసి పిండితో అంబలి కాస్తారు. కుండలో ఎసరుపెట్టి మరుగుతుండతా పిండి, ఉప్పువేసి కలిపితే మామిడి టెంకల అంబలి తయారౌతుంది. ఈ అంబలిలో నాటుకోడి మాంసాన్ని నంజుకుంటారు.

మొక్కజొన్న అంబలి :

మొక్కజొన్న గింజల్ని ఒక కుండలో పోసి నానబెడ తారు. నానిన గింజల్ని మెత్తగా దంచి పిండి చేస్తారు. పిండిని నీళ్ళలో కలిపి ఎండలో ఆరబెట్టాలి. ఒక రోజంతా పిండిని పులవనివ్వాలి. వేరొక కుండలో ఎసరుపెట్టి మరుగుతుండగా పులిసిన పిండి పోసి బాగాకలిపి దించితే మొక్కజొన్న అంబలి తయారౌతుంది.

పరమాన్నం :

ఒక కుండలో పాలు, నీళ్ళు పోసి కలిపి పొయ్యిపై ఎసరు పెడతారు. ఎసరు మరుగుతుండతా నానబెట్టిన బియ్యం వేసి, ఉడికేప్పుడు బెల్లం వేస్తారు. బెల్లం వేసి కొంచెంసేపు అన్నాన్ని మగ్గనివ్వాలి. పండుగలు, జాతర్ల సమయాల్లో ఈ వంటకాన్ని విరివిగా తయారు చేసు కుంటారు.

ఆకుకూరలు :

గిరిజనులు ఎక్కువగా వాడే ఆకుకూరల్లో అడవిసేమ,

ఉడుపుసీమ, సీకాయ కూర, గురుగ్గూర, తోటకూర, వెదురు కొమ్ములు మొదలైనవి ఇష్టంగా తింటారు.

సేమకూర :

సేమకూర ఆకు చాలా పెద్దగా, దళసరిగా ఉంటుంది. దాన్ని సన్నగా తరిగి, ఉడకబెట్టి నీళ్ళు వార్చుతారు. మరొక గిన్నెలో నూనె పోసి, పచ్చిమిరపకాయ, ఉల్లిపాయ వేసి పోపు వేస్తారు. దానిలో కారం, ఉప్పు తగినంత వేసి ఉడికించి దింపేస్తారు. సేమకూరలోకి రాగి సంకటి, రొట్టె, అంబలి మొదలైన వాటితో తింటారు.

వెదురు కొమ్ముల కూర :

లేత వెదురు కొమ్ములను ఉడకపెట్టి నీళ్ళు వార్చి పోపు పెడతారు. అందులో కారం, ఉప్పు వేసి ఉడకబెడతారు. దీనిని అంబలిలో నంజుకుని తింటారు.

గురుగ్గూర :

గురుగ్గూర ఆకులను ముక్కలుగా తరిగి కుండలో వేసి ఉడకబెడతారు. నీళ్ళు వార్చి నూనెలో పోపు పెట్టి కారం, ఉప్పు తగినంత వేసి దించుతారు. అదేవిధంగా కొండ మామిడి ఆకులు కూరగా చేసుకుంటారు.

పప్పు దినుసులు :

కొండ కందులు, పెసలు, మినుములు, అలసందలు వేయించి పప్పు చేస్తారు. విసరని పప్పును నిట్టపప్పంటారు. ఈ పప్పులతో కూరలు, చారు చేసుకుంటారు. వీటిని ఉడకబెట్టి తగినంత ఉప్పు వేసి పోపు పెడితే గుగ్గిళ్ళు తయారుచేస్తారు. పిల్లలు పెద్దలు వీటిని ఇష్టంగా తింటారు. కూరల్లో పోపులు పెట్టేందుకు నువ్వులనూనె, ఆముదం నూనె వాడతారు.

మినపప్పు కూర :

పప్పును మెత్తగా ఉడికించి తగినంత కారం, ఉప్పు, ఉల్లిపాయ మసాలా వేసి నూనెతో పోపు పెడతారు. ఈ కూరని సంక్రాంతి పండుగకు ఎక్కువగా వండుకుంటారు.

మసాల :

మసాల అంటే అల్లం, వెల్లుల్లి రెబ్బలను కలిపి దంచి కూరల్లో వేసుకుంటారు.

కందిపప్పుచారు :

కందులను ఎండలో ఎండబెట్టి విసురుతారు. కండిపప్పు చారుని తయారు చేసుకుంటారు. కందిపప్పును మెత్తగా ఉడకబెట్టి తగినంత కారం, ఉప్పు వేసి తెడ్డుతో కలిపి చింతపండు పులుసు పోసి బాగా మరగబెడతారు. తర్వాత నూనెతో పోపు పెట్టి చారు తయారుచేస్తారు.

లక్ష్మీచారు :

ఒక కుండలో నీళ్ళుపోసి చింతపండు నానబెట్టి రసం తీసి పిప్పి పారేస్తారు. రసంలో కారం, ఉల్లిపాయ, నువ్వులు, ఉప్పు వేసి మరిగిస్తారు. బాగా మరిగించాక దింపేసి నూనెతో తాళింపు పెడతారు.

చీకం చిగురు :

చింత చిగురునే చీకం చిగురంటారు. దీన్ని పప్పులో గాని గుమ్మడికాయ కూరలో గాని వేసుకుంటారు.

కూరగాయలు :

గుమ్మడి కాయలు, పనస కాయలు, ఆనప కాయలు, సీరాములు, చిక్కుడు కాయలు వీళ్ళు వాడే కూరగాయల్లో ముఖ్యమైనవి.

గుమ్మడి కాయలు :

వీళ్ళు వాడే కూరగాయల్లో గుమ్మడి వాడకం ఎక్కువగా ఉంటుంది. లేత గుమ్మడి కాయలను ఉడకబెట్టుకొని తింటారు. పండిన కాయల్ని పై పొచ్చెలు తీసి లోపల గుజ్జును ముక్కలుగా కోసి కూర వండుతారు.

జొలకె :

గుమ్మడి కాయను జొలకె చేసుకుని ఆరగిస్తారు. ఒక పెద్ద తపాలలో కొంచెం నీరు పోసి చుట్టూ అడ్డాకులు వేసి లేత గుమ్మడికాయ పెడతారు. దానిమీద మరో తపాలను మూతపెట్టి ఉడకపెడితే లోపల గుమ్మడి కాయ బాగా ఉడుకుతుంది. ఉడికిన ముక్కల్ని నేరుగా తీనేస్తారు. దీన్నే జొలకె అంటారు.

ఆనపకాయ కూర :

ఆనపకాయల్ని పులుసు కూరగా చేసుకుని రాగి సంగటి లేదా రొట్టెలలోకి అనుపాకంగా వాడుకుంటారు.

సీరామలు కూర :

సీరామలు కాయలను తొక్కితీసి పిక్కలను పులుసు కూరగా చేసుకుంటారు.

పనస పొట్టుకూర :

పచ్చి పనసకాయపై ఉన్న పొల్లులను (పొట్టును) కత్తితో చెక్కి వచ్చిన పొట్టును తపాలలో ఉడకబెట్టి వేపుడు కూరగా తయారుచేసుకుంటారు. ముదిరిన పనస కాయపైన గరుకు తీసి లోపల ఉన్న తొనలను గుజ్జుగా చేసి ఉడకబెట్టి కారం, నూనె, ఉప్పు కలుపుకుని తింటారు.

దుంపలు :

వైము దుంప, నారదుంప, పిడుదుంప, సీమదుంప, చివిడీలు, కంద, మాడుగు మొదలైన వానిని ఎక్కువగా వాడుతుంటారు. వీటిలో ఎక్కువభాగం ఉడకబెట్టి తింటారు. కొన్ని రకాల దుంపల్ని కూరగా వాడతారు. దుంప కూరల్లో పులుసు కూరలే ఎక్కువ. వేపుళ్ళు చాలా తక్కువ.

పండుగలు - ఆహారం :

సామలు, సోళ్ళు, గంట్లు, పప్పుధాన్యాలు, చిక్కుడు కాయ, గుమ్మడికాయ, పనసకాయ, బుడమలు పంట పండగానే వాటికి పండుగ చేస్తారు. పండుగ చేసిన తర్వాతనే వాటిని తినటం ఇక్కడ ఆచారం. పండుగ చేసుకోకుండా వండుకొని తింటే ఇంట్లో ఎవరికైనా జబ్బు చేస్తుందని, అడవికి వెళితే జంతుభయం ఉంటుందని, ఏదైనా కీడు జరుగుతుందని వీళ్ళ నమ్మకం.

మాంసం కూరలు :

నాటుకోడి, మేక, గొర్రె, పంది, చెవులపిల్లి, కణుసు మొదలైన మాంసాల్ని ఇష్టంగా తింటారు. మాంసాన్ని ముక్కలుగా తరిగి గిన్నెలో నూనె పోసి ఉల్లిపాయ, పచ్చిమిర్చి వేసి వేగిస్తారు. మసాల వేసి కలిపి కారం, ఉప్పు తగినంత వేసి నీరు పోసి మాంసం ఉడికిన తరువాత దింపేస్తారు. ఐతే చెవులపిల్లి మాంసం మగ వాళ్ళు మాత్రమే వండుతారు. ఆడవాళ్ళు వండరు, తినరు. ఒకవేళ తింటే ఏదైనా జబ్బు చేస్తుందని, కీడు జరుగుతుందని బలంగా నమ్ముతారు.

పొటేలు, మేక మొదలైన మాంసపు ముక్కల్ని చిన్న చిన్నగా కోసి ఉప్పు, పసుపు, కారం పూసి ఎండలో ఎండబెడతారు. జాతర్లు, పండుగల్లో జంతుబలి ఇస్తారు. బలిచ్చిన జంతుమాంసాన్ని అందరు కలిపి వండుకుంటారు. తినగా మిగిలిన మాంసాన్ని అందరు పంచుకుని ఇంటికి తెచ్చుకుని ఎండబెట్టి నిల్వ చేసుకుంటారు. నిల్వ చేసిన ఎండు మాంసపు ముక్కల్ని వండుకునే ముందురోజే నీళ్ళలో నానబెడతారు. నానిన మాంసాన్ని వండుకుని తింటారు.

అడ్డాకుల్లో మాంసం కాల్చడం :

కోడి మాంసానికి తగినంత కారం, ఉప్పు కలిపి అడ్డాకుల్లో పెడతారు. రెండు మూడు మడతాలుగా అడ్డాకులు చుట్టి నిప్పుల్లో వేస్తారు. పైన ఆకు మాడిన తర్వాత ఆకు తీసి, లోపలి మాంసాన్ని తింటారు.

మాంసాన్ని వెదురు బొంగులో కాల్చడం :

పచ్చి వెదురు బొంగు లోపల తగినంత ఉప్పు, కారం కలిపిన మాంసాన్ని పెట్టి రంధ్రాన్ని మూస్తారు. బొంగులను మంటల్లో వేస్తారు. బొంగు కాలాక లోపల మాంసం ఉడుకుతుంది. తర్వాత చిన్న కత్తితో మాంసాన్ని బయటికి తీసి తింటారు.

మామిడికాయ పచ్చడి :

మామిడి కాయల్ని ముక్కలుగా చేసి ఒక కుండలో వేస్తారు. అందులో నీళ్ళు పోసి పొయ్యి మీద అరగంట ఉడకబెడతారు. ఆరిన ముక్కల్ని కొత్త కుండలో వేసి నూనె, ఆవపిండి, కారం, ఉప్పు కలిపి పచ్చడి తయారు చేస్తారు.

గిరిజనులు అడవుల్లో లభించే ఆహార సంపదను ప్రకృతి దేవత తమకు వరంగా ప్రసాదంగా ఇస్తుందని బలంగా నమ్ముతారు. అందుకే ప్రకృతిని ప్రతి ఒక్క గిరిజనుడు ఆరాధ్య దైవంగా కొలుస్తుంటాడు. ఈ

సమాజం ఎంత ఎదిగినా ప్రాచీన సంప్రదాయం ఏదో ఒక రూపంలో ఉందని తెలుస్తుంది. ఒకసారి బేరీజు వేస్తే గిరిజనుల అలవాట్లు పద్ధతులు మన జీవితంలోను కన్పిస్తాయి అనటంలో సందేహం లేదు.

ఆధార గ్రంథాలు :

1. జానపద గిరిజన విజ్ఞాన పీఠం కొండరెడ్డి గిరిజనుల జీవన విధానం (బొడ్లంక).
2. గిరిజన సంస్కృతి మాసపత్రిక 01-01-2008.
3. బంజార చరిత్ర, సంస్కృతి - ప్రగతి - బి. చీనియా నాయక్.

BHAVAVEENA
Vol. 18, Issue. 1, January 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కాళోజీ కవిత్వం – సామాజిక దృక్పథం

– డా॥. భూక్య తిరుపతి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు & అనువాద అధ్యయన శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ప్రజాకవి, తెలంగాణా వైతాళికుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి కాళోజీ నారాయణరావు. రచయిత, ఉద్యమ కారుడు, అన్యాయంపై పోరాటం చేసే నిత్య చైతన్యశాలి. జీవితమే ఉద్యమంగా ఉద్యమమే ఊపిరిగా జీవించిన మనిషి కాళోజీ, కాళోజీ బాల్యం నుంచే అత్యంత సాహస వంతుడు, స్వతంత్రుడు, అతను మృత్యువుతో పోరాడి గెలిచిన మనిషి, ప్రజలకోసం, ప్రజల పక్షాన, ప్రజాస్వామ్య పునరుద్ధరణకోసం, మానవ హక్కుల పరిరక్షణ కోసం గళం విప్పి కలం పట్టే స్వభావం ఆయన స్వంతం. అందుకే నిరంతరం సమాజపు వ్యవస్థతో గొడవపడటం ఆయన ప్రాణప్రదమైన అంశం. తన సుదీర్ఘమైన ఎనభై ఏండ్ల జీవితం ఒక మహత్తర ఉద్యమ కావ్యం. కొన్ని తరాల్ని ప్రభావితం చేసిన వ్యక్తి కాళోజీ నారాయణరావు. ఇరవయ్యో శతాబ్దపు తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక చరిత్రలో కాళోజీ జీవితం ఒక అద్భుత అధ్యాయం. కాళోజీ జీవిత చరిత్రే - ఇరవయ్యవ శతాబ్దపు తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక చరిత్ర అని చెప్పేటంతగా తెలంగాణతో కాళోజీ జీవితం పెనవేసుకుపోయింది.

కాళోజీ జీవితం గురించి తెలుసుకునే ముందు అతని గురించి అతడే చెప్పుకున్న, రాసుకున్న ఒక కవితను ఒకసారి స్పృశించి అతని జీవితంలోని ముఖ్య ఘట్టాలను రేఖామాత్రంగా అర్థం చేసుకోవచ్చు,

"అతిథివోలె వుండి అవని విడిచి వెళ్ళుతాను
పల్లెపట్టణంబులనక పల్లేరై తిరిగినాను-
మురికినీటి నడుమ వున్న ఇరుకులలో ఇరికినాను
కూటి పేద తన కబళము నోటికీయ తింటి నేను
పూల వాసనలు నిండిన పాలరాతి మేడలలో
ఆయాసము కలిగించెడి పాయసాలు మెక్కి నాను
వాయువుతో పోటీపడు వాహనాలు ఎక్కినాను
కంటకాల మధ్య నేను కాలినడక నడిచినాను
గుట్టలపై ఎక్కి గట్టుల దిగజారినాను
లోయలలో దూకి దూకి లోతులెన్నో చూసినాను
ఈగ వోలె దోమవోలె వాగుచు తిరుగాడినాను" -

అని తెలంగాణ కోసం ఇంతగా పోరాటం చేసిన కాళోజీ వాస్తవానికి ఈ ప్రాంతంవాడు కాదు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే కాళోజీ పూర్వీకులు మహారాష్ట్ర నుంచి తెలంగాణాకు వలసవచ్చిన వాళ్ళు. నిజాం రాజు బకాయి పడ్డ సుంకం వసూలు చేయడానికి పీష్వాల సైనిక సిబ్బందితో పాటు కాళోజీ కుటుంబం నిజాం సంస్థానానికి వచ్చింది. ఆ విధంగా కాళోజీ కుటుంబం ఇక్కడే స్థిరపడి పోయింది. కాళోజీ అనే ఇంటిపేరు తెలంగాణా ప్రాంతంలో ఏ కుటుంబానికి ఉండదు. ఇది మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన కుటుంబాల ఇంటిపేరు. కాళోజీ అనే ఇంటిపేరు మహారాష్ట్రలోని 'కాళే'శబ్దానికి రూపాంతరం. కాలక్రమేణా ఈ వలస కుటుంబాలలోని వారి పేర్ల చివర ఉండే 'పంత్' శబ్దం కనుమరుగై, తెలంగాణాలో స్థానికంగా వాడబడే 'రావు' అనే శబ్దం వచ్చి చేరింది. అందుకనే కాళోజీ పేరు - కాళోజీ నారాయణ్ పంత్ కాకుండా 'కాళోజీ నారాయణరావు'గా మారింది.

కాళోజీకి జీవితంలో జైలుకు వెళ్ళడం, అరెస్టులు కావడం కొత్తకాదు. కాళోజీ బాల్యం నుంచే చైతన్యవంతుడు. విద్యార్థి సంఘం నాయకుడు. సోషల్ యాక్టివిస్టు. పోరాట పటిమ ఉన్న అద్భుతమైన కార్యకర్త. ఆత్మవిశ్వాసానికి, ధైర్యానికి, సాహసానికి కొదవలేదు. భయపడే రకం కాదు. అన్యాయం జరిగితే తరతమ భేదాల్ని పక్కన పెట్టి ముందుకు దూకుతాడు. అధికార దుర్వినియోగం చేసే వాళ్ళను నిలువుగా పాతిపెట్టాలనే మనస్తత్వం ఆయనది. తగువుల వల్ల తనకేమైనా ప్రమాదం ముందు ముందు ఉంటుందేమోనని వెనకా ముందు ఆలోచించడు. అన్యాయం అని మనసుకు అనిపిస్తే చాలు

తనవెంట ఒక్కరు లేకపోయినా ముందడుగు వేసే మనస్తత్వం ఆయనది. చిన్న వయస్సులోనే గణేశ్ ఉత్సవాలు, దసరా ఉత్సవాల్లో చురుగ్గా పాల్గొనే మనస్తత్వం ఆయనది. ఉత్సవాల్లో హిందూ ముస్లింల మధ్య గొడవ వచ్చినప్పుడల్లా ముందే ఉన్నాడు.

ముస్లింల పండుగను తన పండుగలుగా భావించే వాడు. మొహర్రం పండుగను దసరా పండుగలాగే ఆహ్వానించాడు. నిబద్ధ ఆర్య సమాజ కార్యకర్తగా ఆయన జీవితం ప్రారంభమైనప్పటికీ జీవితాంతం ఆర్య సమాజ కార్యకర్తగా కొనసాగలేదు. ఆయన అభ్యుదయం, విప్లవం వైపు కూడా అడుగులు వేశాడు. పౌరహక్కులు, మానవ హక్కుల సంఘాలతో కలిసి పనిచేశాడు. నిజాం రాజ్యం ఎన్నికల సంఘ సంస్కరణలు ప్రవేశపెట్టినా అది ప్రజల విషయంలో బాధ్యతాయుత ప్రభుత్వం కాదని వివిధ రకాలుగా ఉద్యమ కారులతో చేతులు కలిపి ప్రభుత్వ సంస్కరణలను బహిష్కరించాడు. పౌరహక్కుల్ని కాపాడడం తన జీవిత ధర్మంగా భావించేవాడు కాళోజీ. మత, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక విషయాలలో పౌర హక్కులకు భంగం కలిగితే ఏమాత్రం సహించేవాడు కాదు. పౌరహక్కుల రక్షణ కోసం జరిగే పోరాటంలో కాళోజీ ముందువరుసలో ఉండేవ్యక్తి.

కాళోజీ చేపట్టిన ఉద్యమాలలో గ్రంథాలయోద్యమం మరువరానిది. హనుమకొండలో 'రాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయం' ఉత్సవాల్లో పాల్గొన్నాడు. ఆయన పని తనాన్ని చూసి గాడిచర్ల హరిసర్వోత్తమరావు వంటివాళ్ళు ఎంతోమంది ప్రశంసించారు. ఆంధ్ర మహాసభ, కర్ణాటక పరిషత్తు, స్టేట్ కాంగ్రెస్ ఇవన్నీ జాతీయ సంస్థలు వీటిలో రాజకీయ భేదాలు ఉండేవి. నిజాం సంస్థానంలో మొదట్లో 'ఆంధ్రజనసంఘం' అనే సంస్థ ఉండేది. నిజాం రాజ్యంలోని తెలుగు ప్రజలలో సాంఘిక, సాంస్కృతిక వికాసం పెంపొందడానికి ఈ సంస్థ అనేక విధాలుగా కృషి చేసింది. తరువాత సామాజిక రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా విస్తృతమైన ప్రాతిపదిక మీద పనిచేయడానికి ఈ ఆంధ్ర జనసంఘమే కాలక్రమేణా 'ఆంధ్రమహాసభ'గా రూపొందింది. ఈ సంస్థ తెలంగాణ ప్రజల్లో చైతన్యం రగిలించడమే కాకుండా, గొప్ప ప్రజాదరణ పొందింది. 1935లో షాద్‌నగర్‌లో జరిగిన 5వ ఆంధ్ర మహాసభలో కాళోజీగారు పాల్గొన్నారు. 1944లో ఆంధ్ర మహాసభ రెండుగా చీలిపోయింది. అందులో ఒకటి కమ్యూనిస్టుల ఆంధ్ర మహాసభ మరొకటి జాతీయ ఆంధ్ర మహాసభ అని రెండుగా ఏర్పడ్డాయి.

కాళోజీలో సమరశీలత ఎక్కువ. దేనికీ కట్టుబడి ఉండని స్వభావం కూడా ఎక్కువే. ఎవరు ఏమనుకున్నా ఆయన లెక్క చేయలేదు. ఒక సంఘానికో, సంస్థకో కట్టుబడి ఉండలేదు. వ్యక్తిత్వంలోని మరో విషయం పైకి సరదాగా ఉన్నా లోపల వ్యంగ్యం దట్టించినా, ఆలోచన వ్యక్తిత్వానికి నిలువెత్తు సంతకంగా నిలుస్తాడు. 'నాగొడవ'లో కాళోజీ భావోద్వేగాలు వ్యక్తిత్వం, నడవడి, దయ, జాలి, ప్రేమ, కోపం, క్రోధం, అభిమానం, నింద, వ్యంగ్యం, వెటకారం వంటివి పాటించినవి, ఆచరించి చూపినవి, నిర్మొహమాటంగా చెప్పినవి ఎన్నో ఉన్నాయి. కాళోజీ తనకు తానే లొంగిపోడు. సహజంగా వచ్చిందది. లోపల ఏదైనా అనిపిస్తే చాలు తన - పరభేదం లేకుండా, ముందు వెనకా లేకుండా, ఇది నేనంటే నాకే అపకారం చేస్తుందనేది కూడా ఆలోచించడు. కాళోజీ కపటంలేని మనిషి.

